
విషయానుక్రమణిక

చిత్రములు



చెన్నపట్టణము అక్టోబరు ౧౯౨౫

సంపుటము ౨. క్రోధన సంవత్సరము, ఆశ్వయుజమాసము సంఖ్య ౧౦.

ప్రాఁత యిల్లు

ఓలేటి వేంకటరామశాస్త్రి గారు

ప్రౌడవు మసలిన యిల్లోట విడువలేక, మరల వచ్చితి విచ్చోట నిరవుకొనఁగఁ
జెలువరో! నీతలంచిన తలఁపు వట్టి, పొల్లుసుమ్మింక విడనాడిపొమ్ము దీని.

చ. ఉడుగక పెక్కునాళ్లిచట నున్నకతంబున దీని నింతలో
విడువఁగలేకయుంటి; వది వింతయుఁగాదు తలంప; నిద్దియి
ప్పుడు చెడిపోయెఁగాన విడిపోవుట మంచిది; నీ వెడందలోఁ
దడఁబడఁబోకు మించుకయుఁ; దప్పనికర్జము మాను టొప్పనే?

సీ. సన్నసున్నపుబిగి సడలి బెత్తికలూడ, గోడలు నిలువెల్లఁ జౌడు దుల్లెఁ
గుసులపట్టులు దప్పి కొమరుగొయ్యలుగూల, వెన్నువాసమువంగి విఱుగుసూపెఁ
బెణకలఁ దడకలు ప్రిదిలి క్రిందికిఁ గ్రుంగఁ, బైనున్న పెంకులు పగిలిపోయెఁ
జీలలు త్రుప్పుచేఁ జివికి బింకముసెడఁ, జూరుపట్టియులెల్ల జాఱుచుండెఁ

దలుపులును గుమ్మములు వానఁదడిసి, యెండ, నెండి చెదపట్టి పొలుపఱియుండెఁ; సకటా!
పనికిరా దింక నీయిల్లు పాడువడియె, వెఱ్ఱవేషం జూచె దేమట్లు వెఱ్ఱిపడుచ!

క. అలికిన ముగ్గులు పెట్టిన, బాలపంబుగ వెల్లఁదెచ్చి పూసిన నీఁకనా
చెలువంబు జిగియు బిగియును, జెలువా! రాదిప్పు డెన్ని సేసిన యేనిన్.

గీ. చవుడు పట్టినగోడలు సక్కఁజేసి, విఱుగుదూలమ్ములకు బోట్లుపెట్టి మరల
నిలువఁబెట్టిన నెన్నాళ్లు నిలుచు, మగువ? ప్రాఁతయిల్లిది కూల కెప్పగిదినుండు?

చ. చిరిఁగినబట్టయున్ ముదిమిఁజెందిన మేనును బ్రాఁతయిల్లు నె
ప్పరుసునఁ జక్కఁ జేయనగుఁ? బల్మరు సెప్పిన నాలకింప కి
త్తెఱఁగునఁ బూనుకొంటివిగదే యిది వెండియు బాగుచేసి యిం
దిరవుకొనంగ నీకుఁదరమే? విరిబోఁడి! తలంచిచూడుమా.

క. ఏపనివాఁ డిదికట్టెనొ, చూపఱకెల్లరకు వింతసొబగుగ, నిదిపా
డైపోయె నింక నిచ్చటఁ, గాఁపురమేలాగు సేయఁగలవే గఱితా!

ఆ. గీ. ప్రాఁతకొంపయిద్ది పడిపోవు; మఱికొ్రొత్త, యిల్లుగాదుసుమ్మి యెన్నఁటికిని
జివుకుదూలములకుఁ జేవ యెట్టులువచ్చుఁ? బ్రిదులుతడక కెట్లు బిగువు కలుగు?

క. అందముసెడి ప్రాఁబడియే, చందంబుననైన నింకఁజక్కఁబడని దీ
నిం దలఁచి కుందఁబోయెద, వెందుల కీతవులు? విడువుమీ పూఁబోఁడీ!

క. తపులము చెడ్డది; దానిం, దవిలినచో నెపుడుఁగీడు దలకొనుఁ గానన్
దివిరితి నీకిటు తెలుపఁగ, నువిదా! వినుమిద్ది పీనులాడ్డి కడంకన్.

క. చెడియున్న కొంపయైనను, విడువఁగ లేకిట్లు మిగుల వెడఁగుఁ దనముతోఁ
బడిదొర్లుచుంటి వౌరా! మడఁతీ! నీ కింత వెఱ్ఱిమరు లేమిటి కే?

క. ఎండయు వానయు లోఁజొర, కుండఁగఁ గాపాడఁగలుగునో ముచ్చులు రా
కుండఁగఁ గాచునొ యీయి, ల్లుండిన నీకేమిగలుగు నువిదా! చెపుమా!


మ. ఎపుడో తొల్లిసుగంబు లీ విచట నెన్నేఁగంటి నిక్కంబె; నీ
కిపు డట్లియ్యెడ నిమ్ములన్నిలువరా దెప్పట్ల; నీ వట్టులా

స పడంబోవకు మిల్లుకూలిపడినం జూవెట్లునుం దప్పఁబో
దు; పడంతీ! వినునాదుపల్కు లివి; యెందుఁగానీకు లగ్గయ్యెడుఁగ.

చ. పొలుపుగఁ బూవుఁదీవలకు బోదులు సేయుచుఁ బంజరంబులఁగ
బలికెడు చిల్కబోదలకుఁ బాటలు సెప్పుచు బొంఘుమల్లి పం
దిలికడఁ బూలసెజ్జపయిఁ దెర్లుచుఁ దొల్లిటియట్ల యుండఁగాఁ
దలఁచితె ముద్దుగుమ్మ? తఱితప్పెఁ దలంపకుమట్లు వెఱ్ఱివై.

సీ. అలనాఁటి పాలగచ్చుల యరంగులు పొల్పు, చెడకుండునని యెంచి చేరినావు
మునుపటి పడకింటి మురువు లెప్పటియట్లె, వఱలునంచుఁ దలంచి వచ్చినావు
వెనుకటి చలువఱాపని వసారాచెక్కు, చెదరఁబోదని యెంచి చేరినావు
తొల్లింటియాటల యిల్లుపాడ్వడకట్లె, వఱలునంచుఁ దలంచి వచ్చినావు
పెద్దతడవయ్యె నిదికట్టి ముద్దరాల! యెంతవఱకుండు నీప్రాఁతయిల్లు రూపు
సెడక? వలవని తవులమ్ము సెంది యేల, ప్రాఁకులాడెదవే వెఱ్ఱిపడుచ! యింక?

సీ. లోఁతుపాఁతులుగల్గు ఱాతిగోడలకట్టడము లెన్నొ నేల మట్టంబుగాఁగ
వేవేలరూకలు వెచ్చించికట్టిన, మేడలెన్నియొ నేలమీఁదఁగూల
మేల్మిబంగారంబు మెత్తినిల్పినదొడ్డ, గీములెన్నొ బోరగిల్లి వ్రాల
రతనాలుతాఁపిన రచ్చపట్టులమాడు, వులు పెక్కు మట్టిలోఁగలిసిపోవ
పడఁతిరో! చూడలేదె? నీపాడుకొంప, వానికన్నను మిన్నగా వగచుచుంటె?
విడువుమీ యింకనైన నీవెడఁగుఁదనము, పడకమానదు చుమ్మి నీప్రాఁతయిల్లు.



శాకుంతల నాయకుఁడు

గొల్లపూడి శ్రీరామశాస్త్రి గారు

(భారతి ౭-వ సంపుటము, ౫-వ సంచిక తరువాయి)

శృంగారీ కవిశ్చేత్, కావ్యం రసమయం జగత్.

దుష్యంతుని రసజ్ఞత

భారత శకుంతలా దుష్యంతులు కల్లకపటము లెఱుంగనివారు. అదురు బెదురు అనునవి వారికిఁ జాలదూరము. తిరుగుడుమాటలసలే వారికిఁ బనికిరావు. దుష్యంతుఁడు గనఁబడినతోడనే శకుంతల పూజ్యుఁడగు నతిథి వచ్చినాఁడను సంతసముతో నెదుర్కొని యనామయపూర్వకముగఁ గుశలప్రశ్నఁ గావించి, యర్ఘ్యాదికముసఁ బూజించి, 'మీ రెవర'ని యడిగినది. 'నేను ఫలానా' అని యొకటిరెండుమాటలు చెప్పి, యావల మీ వృత్తాంతమేమని దుష్యంతుఁ డడిగెను. ఆమెయు నడిగినదే చాలునని తన చరిత్రము నానుపూర్వికముగ నొప్పఁజెప్పినది. పదంపడి దుష్యంతుఁడు తానడుగఁదలఁచినది ముందుగ మనస్సులోనైన ననుకొనెనో లేదో కాని పిడుగడచినట్లు "వ్యక్తం త్వాముద్వహ సుశ్రోణి! దుష్యంతో వరవర్ణిని" యని తన మనోగతమును వెల్లడించుటయేకాక, తనచరిత్రమును విస్తరించి నుడివి నేనంతవాఁడ నింతవాఁడనని, ప్రగల్భములు గొట్టుచు నీవు నాకు భార్యవైన నా సర్వస్వమునకు నీవే బాధ్యురాల వయ్యెద వని యూరించెను. అంత నామెయు 'నట్లైన చాలసంతోషము. మా తండ్రిగారిని రానీ'యని యన్నది. 'మన మిద్దఱ మొప్పుకొనిన నాయనతోఁ బనిలేదు. నిన్నిచ్చుటకు నీవే స్వతంత్రురాలవు' అని వ్యవహారరీతిగఁ గొంతవడి ముచ్చటించి, రెండవకంటివాని కెఱుకపడనీక తుదకట్లో యంగీకరింపఁజేసెను.

ఈ శకుంతలాదుష్యంతులనే మనమహాకవి సుశిక్షితులఁగావించి,రసికశిఖామణులనుగ నొనర్చియున్నాఁడు.

దుష్యంతుఁ డొకవిధముగ శకుంతల క్షత్రపరిగ్రహార్హయే యగునని మనసులో నెప్పుడు నిర్ధారణ చేసికొనెనో, యప్పుడే యాతని యోచనలు మారసాగినవి. ఇప్పుడీతఁ డాదుష్యంతుఁ డనుటకు వీలులేదు. ఏ నెపముతో వారిని సమీపించుట? తనమనోరథసిద్ధికిమార్గ మెద్ది? అని యాతఁడు మిన్నుపాఱఁజూచుచుండ, నంతలో భ్రమరబాధ నపనయించుకొంటె సఖులు మంచియవకాశ మాతనికిఁ గల్పించిరి. అంతనాతఁ డిదే సమయ మనుకొనెను. తాను ప్రవేశించుటకు. 'ఎవరక్కడ'అని యనఁబోవునంతలో నతనిమనసున కొకసంశయము తట్టినది. తన యథార్థస్థితి యెఱుకపడిన పిమ్మట విస్రంభాలాపమున కవకాశముండదేమో యని. ఎట్టి విషమావస్థలోనైన నధర్మభీరువనధర్మభీరువే కదా. అబద్ధమాడిన దోషముగాదా యని యనుకొనసాగె. అంతలో భారతములోని ధర్మరాజుమాట జ్ఞాపకమునకువచ్చినదికాబోలు. అటు ఇటు గాకుండ జెప్ప నిశ్చయించినాఁడు.

శ్లో. కః పౌరవే వసుమతీం శాసతి శాసితరి దుర్వినీతానామ్;
అయ మాచరత్యవినయం ముగ్ధాసు తపస్వికన్యాసు.

(దుష్టశిక్షణ మొనర్చు పౌరవుఁడు వసుమతిని శాసించుచుండ, అప్రగల్భలు, నందును, తపస్వికన్యకలు నగు వీరియెడ నవినయ మాచరించువా రెవరు!) అని యనుచు నేమో పడఁబోవుచువానివలె వారి యెదుటఁ బడెను. మన యదృష్టము మంచిదికాన నీ పుణ్యాత్ముఁడు

దేవునివలె నెచటినుండియో సమయమునకు రాఁబట్టి సరిపోయినది కాని లేనిచో నాపాపిష్ఠి తుమ్మెద మన శకుంతల ముక్కుమొగము పెటికివేసి పోకపోయినదా? యని యాచెలులనుకొను నంతటి యార్భాట మొనరించినాఁడని విదితమయ్యెడి. ఈవడబడల మనుష్యునిఁ జూచునప్పటికిఁ దొలుత వారు నివ్వెరపోయినను, పదంపడి ధైర్య మవలంబించిరి. వారిలో ననసూయయను నామె 'ఆర్య! ఏమంత యుపద్రవము లేదు. ఈమాప్రియసఖి శకుంతల తుమ్మెద వలన కలఁతనొందినది' యని చెప్పినది. కావలయునని చేసిన యార్భాటము గాన నందీతని కేమి యాశ్చర్యమొదవును? వెళ్లినతోడనే నోటారమాటాడిన యనసూయ యెదుట నిలువఁబడియుండ, నామె మోమైనఁజూడక శకుంతలాభిముఖుఁడై 'అపినామ తపోవర్ధతే' (మీ తపస్సు నిర్విఘ్నముగ జరుగుచున్నదా?) అని కుశలప్రశ్నఁ గావించెను. ముక్కాఁకలు దీరినవాఁడు మనదుష్యంతుఁడు. పాపమా చిన్నది యింకను నంతవఱకుఁ జదువుకొనలేదు గదా! అంతియకాక తుమ్మెదపాటువలనఁ గలిగిన గుండెదడ యింకను దీరినదో లేదో! యింతలో నింత యార్భాటముతో నిదివఱకుఁ గలలోనైనఁ గని విని యెఱుంగని క్రొత్తమనుష్యుఁ డొకఁడు జమాజట్టివంటివాఁ డెదుట నిలిచి, ప్రసంగమున కారంభించిన నామె బదులు చెప్పఁజాలినదా?

ఈమాత్రపు లోకజ్ఞానము లేనివాఁ డనుకొంటిరా మనరాజు? వ్రేలు వంక పెట్టనిది వెన్న రాదన్నట్లు ఏదో విధముగ నంకురార్పణ మొనరింపవలయుఁగదా! ఇంతలో అనసూయ శకుంతలనుజూచి పర్ణశాలకేగి 'ఫలమిశ్రమగు నర్ఘ్యమును గొనిరమ్మ'ని చెప్పినది. అనసూయనోట నామాట వెడలినదో లేదో, యంతలో దుష్యంతుఁ డందుకొని 'భవతు భవతీనాం సూనృతైవ గిరా కృత మాతిథ్యం' (చాలు; సూనృతవాక్కుచేతనే యాతిథ్యమీయఁబడినది.) చాల సంతోషమనెను. 'అట్లయిన నీసప్తపర్ణ వేదికనలంకరించి శ్రమపరిహార మొనర్చుకొనుఁ'డని చెప్పినది ప్రియంవద. 'సరి, మీరును నీకర్మచే శ్రమనొందియున్నారు గదా' యని యాతఁడు సూచించెను. అనసూయ శకుంతలతో 'నతిథివచనమును బహూకరించుట మనకుచితము గానఁ గూర్చుండెద' మనినది. ఆవలనంతయును నచట నుపవిష్టులగుదురు. దుష్యంతుఁ డాడుచున్న నాటకములో నింతటితో ప్రథమాంకము ముగిసినది. ఇక ద్వితీయాంకమారంభము గావలసియున్నది.

తాను వారితో మాటలాడఁ దగిన మాటయొకటి యడిగియైనది. ఇఁకవారికివలెనే యీతనికిని సంభాషింపఁదగిన దేదియుఁ గాన్పింపదు. వారు కలియవేసికొని యేదైన మాటాడుదురనుట యసంభవము. గనుక కొంతవడి చింతించి యాతఁ డందఱి నొకపర్యాయము గలయం బరికించి, 'అహో సమవయోరూపరమణీయం సౌహార్దం భవతీనాం' (సవయస్కత, సమానరూపము, లోనగువానిచే మీస్నేహ మెంతయు మనోజ్ఞముగ నున్నది.) అని యప్రస్తుత ప్రశంసకు దిగెను. తపోవనమందు వసించుచున్నను దుష్యంతునికంటె ప్రియంవద రెండాకు లధికముగనే చదివినదని చెప్పవచ్చును. దుష్యంతునినోటనుండి మాటవచ్చినతోడనే 'చతురగంభీరాకృతి గల యీయన తియ్యనిమాటల నుడువుచు ప్రభువువలెఁ గన్పట్టెడి' అని యనసూయ చెవిలో నూదినది. అనసూయ వెఱ్ఱిబాగులది. 'నాకును నదిమనసులోఁ బట్టినది. ఉండుండు. ఆయన నే యడిగి తెలిసికొనెద'నని యట్లొనరించినది. ప్రథమప్రవేశసమయములోఁ దనయథార్థస్థితిఁ దెలుపకుండ నొకవిధముగఁ దప్పించుకొనఁ గలిగినాఁడు. అట్టి విషమావస్థయే మరల నిప్పుడు తటస్థించినది. యథార్థస్థితిఁ దెలిపినచో నాటకము పైనసాగదు. అందులకే యాతఁడిన్ని పాట్లకు లోనగుట. తత్త్వ మెరుకపడఁగూడదు. అనృత మాడఁగూడదని యాతనిసంకల్పమై యున్నది. గనుక నిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. 'పౌరవునిచే ధర్మాధికారపదమందు నియోగింపఁబడుటచే నిచటికిఁ దపోవనవాసుల క్షేమమరసి పోవచ్చితిని.' ఈ మాటలవలన వారికిఁ దత్త్వము బోధపడలే దనుటకు వీలులేదు. రాజాడినమాటకు బదులుగ ననసూయ 'మే మిప్పుడు సనాథల' మనినది. ఈమాటకు శకుంతలకు సిగ్గువచ్చి తలవంచుకొనినది. అంచిపెట్టిన యావిర్లుపొరుసఖు లూరకుందురా? అప్పుడే రాజునకుఁ దెలియకుండ శకుంతలను బరిహాసముచేయ నారంభించిరి. ఆ సందుకట్ల 'వయమపి భవత్యో సఖీగతం కించిత్పృచ్ఛామః' (మేమును మీసఖిని గుఱించి యించుక నడుగవలసి యున్నది) యని దుష్యంతుఁ డనెను. ఈ ప్రార్థన మా కనుగ్రహ మనినారు వారు. అంత వారిని శకుంతలజన్మవృత్తాంతమును గుఱించి తరిచి

తరిచి యడిగి తెలిసికొని, కొంతవఱకు కాతను మనస్సును కుదుటపఱుచుకొనెను. కాని యింకను నాతని నొకసంశయము విడిచినది కాదు. అడిగిన వారేమైన ననుకొందురేమోయని సందేహము. అట్టితఱి నింగితజ్ఞ యగు ప్రియంవద చిఱునవ్వుతో శకుంతలఁగాంచుచు రాజుతో 'తామేమో యడుగఁదలఁచినట్లు తోఁచెడి' అని యనినది. అంతరాజు 'అవునవును. నీవుచక్కఁగఁ గనిపెట్టితివి. మఱేమియులేదు. మీసఖి వివాహమువఱకే యిట్లు తాపసవృత్తి నవలంబించియుండునా! లేక యావజ్జీవము నిట్లేహరిణీగణసాంగత్యముచే కాలక్షేపము చేయునా!' అని యడుగఁ దలఁచితి నని కొంతగీర్వాణముగ నుగ్గడించెను. 'అనురూపవరున కొసంగవలయునని తండ్రిగారియుద్దేశ' మని ప్రియంవద పలికినది.

ఈతఁడు శకుంతల క్షత్త్రియార్హ యనియే పృథమైన విశ్వాసము గలిగి, యిన్నిపోకడలు పోవుచున్నను, మనసులో నొకవైపున నంకుశమువలె నధర్మభీతి బాధింపక పోలేదని తెల్లమయ్యెడి. తనమానసములోని సంశయము లన్నియు నిర్వర్తించినతోడనే నిట్టూర్పువిడుచుటఁ గనుఁడు. "ఆశంకసే యదగ్నిం తదిదం స్పర్శక్షమం రత్నం" (హృదయమా! నీవెద్దాని నగ్నియని శంకించుచుంటివో యయ్యది స్పర్శార్హమగు రత్నముసుమా).

ఇట్లుండ శకుంతల సఖులొనరించు పరిహాసమునకుఁ గోపము నటించి, వారు నిర్బంధించుచున్నను వెడలిపోసాగినది. అంతరాజు ఆమె కడ్డముపోయి తటాలున పట్టుకొన నుంకించియుఁ దన్నుఁదానిల్పుకొని 'యేమాశ్చర్యము? కామిజనమనోవృత్తి చేష్టాప్రతిరూపకము గదా!'

శ్లో. అనుయాస్య న్మునితనయాం
    సహసా వినయేన వారితప్రసరః;
  స్థానా దనుచ్చలన్నపి గత్వేవ
    పునః ప్రతినివృత్తః.

(నేను సాహసముతో మునితనయ వెన్నంటఁ బోఁదలఁచియు, వినయముచే వారింపఁబడితిని. అయినను నేనిచటినుండి కదలకుండినను బోయి మరలినట్లే భావింతును) అనియనుకొనుచుండెఁ. సూత్రధారత్వము వహించిన ప్రియంవద నాటకముయొక్క మధ్యలో నుపేక్ష వహించునా యేమి! నాయప్పుదీర్చి మఱిపొమ్మని బలాత్కారముగ శకుంతలను లాగికొనివచ్చినది. ఏమాయప్పు? తొలుత ననుకొనినమాటప్రకారము శకుంతల యింకను రెండుచెట్లకు నీరు పోయవలసియున్నదట. నూఱాలైనను దుష్యంతుఁడింకను నామెచెట్లకు నీరుపోయుటఁ గని సహించునా? ప్రియంవదను జూచి 'భద్రే! వృక్షసేచనాదేవ పరిశ్రాంతామత్రభవతీం లక్షయే' (కల్యాణి! చూడుము. ఈమె వృక్షసేచనముచేతనే చాలడస్సినదని తలఁచెదను.) అని యామెకు దయగలుగునట్లు శకుంతలయప్పటిస్థితిని వర్ణించి చెప్పి యామెఋణమును నేనుదీర్చెదనని నుడువుచుఁ దన యంగుళీయకమునుదీసి 'యిద్దాని నీయప్పునకు బదులుగఁ గైకొను' మని యిచ్చెను. పాప మాతఁడప్పటి భావోద్రేకములోఁ దనదొంగతనము బయటఁబడునని యైన నూహించినవాఁడుగాఁడు. ఆ యుంగరములోని యక్షరములను జదువుకొని సఖు లొకరి నొకరు చూచుకొనుతఱి, తన పొరపాటునకు నొచ్చుకొనుచు, సమర్థించుట గనుఁడు. 'అల మన్యథా మాం సంభావ్య, రాజ్ఞః పరిగ్రహోయం' (నన్ను వేఱువిధముగఁ దలంపఁజనదు. నేను రాజకీయుఁడను) 'అట్లైన నీయుంగరము తమవ్రేలికె యుండఁదగినది. మీమాటచేతనే యీమె ఋణవిముక్తయైనది' యని నుడువును, 'సఖి శకుంతల! దయాళువగు నార్యునిచే కాదు. మహారాజుచే విడిపింపఁబడితివి. ఇఁకవెళ్లవచ్చును.' అని ప్రియంవద తనపాండిత్యమును గొంతవఱకుఁ జూపినది. ఇంతలో నొకగజము బెదరి తపోవనములోఁ బ్రవేశించిన దని వినఁబడుటచే వారురాజునొద్ద సెలవు గైకొని వెడలిపోయిరి. శకుంతలనే స్మరించుచు రాజును నిష్క్రమించెను.

ఈప్రథమాంకమునఁ బరిశీలించిన మన నాయకుని లోకోత్తరరసికత సువ్యక్తమై హృదయంగమమగుచుండుటలేదా? ఇఁక నాతనికర్తవ్యనిష్ఠను గుఱించి యించుక ముచ్చటించెదము గాక.

దుష్యంతుని కర్తవ్యనిష్ఠ

మహాత్ము లెట్టి విషమావస్థలోను కర్తవ్యాంశముల నుల్లంఘింపరనుట నీనాయకుని ముఖముగ మహాకవి తెలియఁజేయనెంచినాఁడేమో యని తోఁచెడి.

మోహావేశితుఁడై యున్నను శకుంతలనుగాంధర్వ విధిఁ బరిణయమాడఁదలఁచుట యాతని కర్తవ్యపరాయణత్వమునకుఁ బ్రబలసూచకము.

మఱియు (ద్వితీయాంకము తుద) సారథిద్వితీయుఁడవై కొన్నిదినము లిచటనుండి రాక్షసబాధ నివారణ చేయవలసినదని మునులు వేఁడికొందురు. అద్దాని నాయకుఁడు శిరసావహించును. పదంపడి యంతఃపుర పరిచారకుఁడువచ్చి, 'నేఁటికి నాల్గవనాఁడుపవాసదీక్ష ముగియును. గాన నానాఁడు చిరంజీవి తప్పకిచట నుండవలయును అని తల్లిగారియాజ్ఞ' యనిచెప్పును. ఈ సందర్భమున రాజునకు గొప్పచిక్కు తటస్థించినది. ఒకవైపున ఋషులయాజ్ఞ; మఱియొకవైపున మాతాజ్ఞ. రెండును ననతిక్రమణీయములే. ఇట్టితఱి నాతఁడుచేసిన యుపాయమును నరయుఁడు: తనవయస్యునిఁబిలిచి 'మిత్రమా! నీవు తల్లులచేఁ బుత్రభావముచేతనే గ్రహింపఁబడుచుండువుగదా! గనుక నీవుపోయి తల్లులకుఁ బుత్రకృత్యమును నిర్వర్తింపుము నిచటి నాతపస్వి కార్యవ్యగ్రతను గుఱించి వారితో విన్నవింపుము' అని చెప్పిపంపుట యాతని కార్యదీక్షకుఁ దార్కాణముగదా!

దుష్యంతుఁడు కేవల తపస్వికార్యనిర్వహణమునకే వనమునందు వసింపనుద్దేశించెనా? శకుంతలతో సంభాషించుటకును అయియున్నది అనియెందురేమో? శకుంతలాపరిచయ మచట నదివఱకు లేకపోయినను, ఋషుల యాజ్ఞను దుష్యంతుఁడు మీఱుననుట సాహసము. ఆతని చరిత్రమును బట్టి, యాలోచించినచో శకుంతలా మోహితుఁడై యుండియు నీయవకాశము తటస్థింపకపోయి యుండెనేని, గ్రుడ్లనీరు గ్రుక్కుకొనుచు నాతఁడు నిజపురాభిముఖుఁ డగుట తథ్యమని యవగతమగుచున్నది.

వయస్యుని పురంబునకనుపునపు డాతని చాంచల్యము స్మృతికిరా నచటజరిగిన విషయమును నంతఃపుర స్త్రీలకుఁజెప్పునేమోయని జంకి 'పరిహాసవిజల్పితం సఖే! పరమార్థేన నగృహ్యతా మిదమ్' (స్నేహితుఁడా? నేనిదివఱకు నుడివిన శకుంతలా వృత్తాంతము పరిహాసమునకై చెప్పఁబడినది. అద్దాని యథార్థమని తలంచెదవు సుమా!) అని పలికినబొంకు దుష్యంతునివంటి సార్వభౌమున కుచితమని యనఁజాలము. ఒకటిరెండుచోట్ల నిట్టి యసత్యమునుండి నాయకుని గాపాడిన కవికులతిలకుఁ డీచోట నిట్లుపేక్షించుటకు హేతువేమో తెలిసినది కాదు.

తాను చక్రవర్తి యగుటచేఁ దన్నడ్డుపెట్టువారు లేకపోయినను నిట్టి కార్యాచరణమునఁ బట్టమహిషికి నాగ్రహము జనించునేమోయని జంకుటయు, నట్టిది గలుగకుండ నుపాయాన్వేషణ మొనరించుటయు, నాతని కోమలహృదయమునకు నిదర్శనము గాకపోదు. బహుభార్యావల్లభున కిట్టిపట్టున సత్యవాదిత్వము చెల్లునా? సత్యముపై నాధారపడి యుండఁదలఁచినచో, నద్దానికి రాజీనామా పెట్టవలసియుండును. రెంటికిని ఏకాశ్రయత్వము గగన కుసుమము.

మఱియు, కవిచంద్రుఁడు, ఒక రాజచరిత్రమును లోకోత్తరముగను, రసవంతముగనుఁ జిత్రింపనెంచినవాఁడగుటచే, నావేశము గుణపుంజములో లెక్కకురాదనియైనఁదలంచియుండును. లేదా, శృంగారనాయకున కిట్టిపట్టున నిట్లుచెప్పుట శోభాకరమనియైనఁ దలంచి యుండును.

మఱియు మనకవీశ్వరుని యుద్దేశము దననాటకమునకు నాయకునిగ భారతదుష్యంతునే కైకొని గుణవిరాజితునిఁ జేయఁబూనుటయే యైనందునఁ జెక్కుమార్పులనుజేయ సాహసింపకపోవుటయు దోషావహము గాదని తోఁచెడి. అతఁ డట్లుచేసియుండిన నీ దుష్యంతుఁ డన్యుఁడుగావలసి యుండును. అట్లైన చరిత్రచిత్రణము శోభాకరముగ నుండకపోవునేమో?

(పంచమాంకములో) దుష్యంతుఁడు మధ్యాహ్నమగునంతవఱకు రాజ్యకార్య పర్యాలోచనముచే శ్రమమొంది, విశ్రాంతికై యంతఃపురమున కేగ నుంకించుతఱి కంచుకివచ్చి, కణ్వశిష్యాగమనమును దెలుపును. అంత రాజు మునుల నర్హావిధమున సత్కరించి సబహుమానముగఁ దపస్విజనదర్శనయోగ్యమగు స్థలమునకుఁ దోడ్కొని వచ్చుటకై పురోహితుఁడగు సోమరాతుని కాజ్ఞనొసఁగి, తద్దర్శనార్థ మగ్నిశాల కేగుచుఁ, దనస్థితిని గుఱించి తలంచుట నాకర్ణింపుఁడు.

“(అధికారఖేదం నిరూప్య,) సర్వః ప్రార్థిత మర్థ మధిగమ్య సుఖీ సంపద్యతే జంతుః, రాజ్ఞాంతుచరితార్థతా దుఃఖోత్తరైవ; కుతః:

శ్లో. "ఔత్సుక్యమాత్ర మవసాదయతి ప్రతిష్ఠా
క్లిశ్నాతి లబ్ధ పరిపాలనవృత్తి రేనమ్;
నాతిశ్రమాపనయనాయ నచ శ్రమాయ
రాజ్యం స్వహస్తధృతదండ మివాతపత్రమ్.

(అధికార ఖేదము నభినయించి) లోకములోనొక్కొక్కఁడును నభీప్సితార్థమునుబొంది సుఖియగును. రాజులకైన నభీప్సితలాభము దుఃఖోత్తరమే యగును. ఎట్లన! రాజ్యలాభము పదార్థములయందలి యుత్కంఠను బోఁగొట్టును. రాజ్యపాలనవ్యాపార మిట్లుశ్రమను గలుగఁజేసెడి. స్వహస్తముచేఁ బట్టుకొనఁబడిన గొడుగు వలె రాజ్యమును నతిశ్రమకారిగాని, శ్రమవిరహితము గాని కాఁజాలదు.)

ఈమాటలనుబట్టి దుష్యంతుఁడు నాకేమి రాజును అని యనుకొనక తానొక ప్రజాసేవకుఁడుగ భావించి, కష్టసుఖములకుఁ బాల్పడుచున్నాఁడనిస్పష్టమగుచున్నది. ఆతనికర్తవ్య నిష్ఠ కిది యొక్కటియే చాలునని తలఁచెద.

మఱియు, ప్రియవియోగ మొనఁగూడినపుడు మనోవ్యథఁజెందుట లోకసహజము. అందును ప్రేయసీ వియోగ మెట్టివానికిఁగాని దుస్సహము గాకపోదు. కాని మన నాయకుని వియోగవ్యథ సర్వసామాన్యము గాదు. ఈతఁడు బుద్ధిపూర్వకముగ వివాహమాడిన ధర్మపత్నిని దైవోపహతుఁడై, యామెయెదుటనిలువఁబడి యెంతదీనముతో వేఁడుకొన్న నునిరాకరించినవాఁడగుటచేనావలతత్త్వ మెఱిఁగినతఱి నాతని కుద్భవించు పశ్చాత్తాపము ననన్యసాధారణముగనె యుండునుగదా. ఆతని హృదయతాపమరయుట కిదిచాలును:

*శ్లో. 'ఇతః ప్రత్యాదేశాత్ స్వజనమనుగంతుం వ్యవసితా,
తత స్తిష్ఠే త్యుచ్చై ర్వదతి గురుశిష్యే గురుసమే;
పునర్దృష్టిం బాష్పప్రసరకలుషా మర్పితవతీ,
మయి క్రూరే యత్త త్సవిషమివ శల్యం దహతిమామ్,

(ఆమె నాచే నిరాకరింపఁబడి, తనతోఁగూడ) వచ్చిన శిష్యుల ననుసరింపఁ బ్రయత్నించినదో లేదో; యంతలో, నాగురుశిష్యుఁడు; 'తిష్ఠ! ఆఃపురో భాగిని!' యని కసరగా నాసమయమున, బాష్పాకులితమగుదృష్టిని క్రూరుఁడనగు నాపైఁ బ్రసరింపఁజేయుట స్మృతికిరా నది విషసక్తమగు శల్యమువలె, నాసర్వాంగములను దహించుచున్నది.

ఇట్టి యసాధారణవ్యథయందును కర్తవ్యనిష్ఠగలిగియుండెనేని యాతఁడు లోకోత్తరుఁ డనుటకేమి సంశయము? కనుఁడు మననాయకుని ధర్మాచరణతత్పరత:

ఆతఁడు శకుంతలావిరహానల దోదూయమానాంతఃకరణుఁడై యుండియు, రాజకీయ వ్యవహారమును గుఱించి మంత్రిపంపిన పత్రికను వీక్షించి, యందలి యంశమును గుఱించి పర్యాలోచనము చేసి యనపత్యుఁడై మృతినొందిన ధనగుప్తుని ద్రవ్యమును, నాతని భార్యలలో గర్భవతిగనెవరైన నున్నచో నాద్రవ్యమును గర్భస్థశిశువున కావల నందఁజేయు మని యానతిచ్చెను. అత్తఱి ననపత్యతావిషయము మనస్సునకురాఁ దానెంతయుఁ జింతించి తనరాజ్యములో నెవరెవరికిఁ బ్రియతమ బంధువియోగము వాటిల్లునో వారివారి కాయారూపముతో దుష్యంతుఁడే యగును పాపవిషయమున మాత్ర ముగాదు. (అనగా భర్తలేని స్త్రీలకు భర్తగా నేరఁడని భావము) అని చాటఁబంచెను.

"యేనయేన వియుజ్యంతే ప్రజా స్స్నిగ్ధేన బంధునా,
ననపాపా దృతే తాసాందుష్యంతఇతిఘుష్యతామ్."

పైమాటలలో నాతనికర్తవ్యపరాయణత్వమేకాక యాతని దయార్ద్రహృదయమును సువ్యక్తమగుచున్నది.

మఱియు, శకుంతలావిరహఖిన్నుఁడైయుండు సమయముననే మాతలివచ్చి యింద్రుని యాహ్వానమును దెల్ప,

అనుగృహీతో౽హమనయా మఘవత్సంభావనయా,
వయస్య! అనతిక్రమణీయా దివస్పతే రాజ్ఞా,
తదత్ర పరిగతార్థంకృత్వా మద్వచనాత్ అమాత్య
పిశునం బ్రూహి.

శ్లో. త్వన్మతిః కేవలా తావత్ పరిపాలయతు ప్రజాః,
అధిజ్య మిద మన్యస్మిన్ కర్మణి వ్యాపృతం ధనుః.

(ఇంద్రునియొక్క యీసంభావనచే నేననుగ్రహింపఁబడితిని) అని వయస్యునిఁజూచి, 'వయస్య!

* మహాకవి రమణీయమగు నెట్టి చిత్రమును బ్రదర్శించియున్నాఁడో చూడుఁడు.

ఇంద్రుని యానతి యుల్లంఘింపఁదగినదికాదు. గనుక నా మాటగ నమాత్యపిశునుతోఁ జెప్పుము. నేను రాక్షస బాధానివారణార్థము స్వర్గమున కేగుచున్నాను. నేను వచ్చునంతకు నీబుద్ధియే ప్రజలను కన్నబిడ్డలను వలెఁ గాపాడుఁగాక.)

ఇట్లు నాయకునియందే పై గుణరత్నములు సహజములుగను, హృదయంగమములుగను జిత్రించుటచేతనే 'నాటకేషు శకుంతలా; కవిః కాళిదాసః,' అనువచనములు సర్వసమ్మతములైనవి. పర్యాలోచనచేసినచో నీశాకుంతల నాటకమునందు ఒక్కొక్కకల్పనయు సహజమును సార్థకమునునై విలసిల్లుచుండును. మన ప్రాచీన పండితవర్యులే కాక, పాశ్చాత్యపండితాగ్రేసరులును దృశ్యకావ్యమున కే యేలక్షణములు శోభాకరములని నుడువుచున్నారో యాలక్షణములన్నియు నీ నాటకరాజమునందు విరాజిల్లుచున్నవనుటలో నతిశయోక్తి లేశమును లేదని నాయాశయము. ఈనాటకమందలి యితరపాత్రకల్పనాచాతుర్యమును గుఱించి మఱొక పర్యాయము ముచ్చటింతము గాక!

చా టు శ త క ము

[నే నీమధ్య నెల్లూరుజిల్లాగ్రామములకు వెళ్లినప్పుడు చాటుపద్యముల శతకమొకటి దొరికినది. ఇందు 107 పద్యములును ఒక చిన్న భాషీయదండకమును (చంద్రశేఖర శతకమువంటి భాష) గలవు. ఇదివరకు తెలుగులో భాషీయదండకములు రెండున్నవి. గుణ్ణూరి సుబ్బరాయశాస్త్రి యహోబిల తిరునాలవర్ణనము ప్రాచీనము. కంచి దండకము నవీనము. కార్వేటినగర రాజున కంకితము.

ఈ చాటుశతకములోని పద్యములకర్తలపేర్లు తెలియవు. సామాన్యనీతి, రాజనీతి, దండనీతి, పురవర్ణనము క్షేత్రమహిమ, రామాయణచాటువు, రాజులు, మంత్రులు మొదలగువిషయములనుగూర్చిన పద్యము లిందు గలవు. ఇందులో కొన్నిపద్యములుమాత్రమే యిదివరకు ప్రచురితమైనవి. మిగిలినవన్నియు క్రొత్తవే. అందుచేత రాజులను గురించివ్రాసిన చాటువులనుమాత్ర మిందు ముందుగ ప్రచురించెదను.—వే. వి. శర్మ.]

అరవీటిబుక్క—

తనభవ్యధామంబు తనభవ్యధామంబు, కరణి మిత్రోన్మేషకరముగాఁగ
దనధర్మగుణములు తనధర్మగుణముల, ట్లతులితశ్రుతిమార్గగతుల నెసఁగఁ
తనమహాహవదీక్ష తనమహాహవదీక్ష, పగిది నానావనీపకులు బెంప
తనయంబకంబులు తనయంబకములట్లు, పరభీరువిముఖత పరిఢవిల్లఁ
గీ. బరగు కఠినాద్రిజడలుఠజ్జరఠకమఠ, కూటకిటిగూఢచరణ దిక్కోటికరటి
కుటిలతాసహాభూసౌఖ్యఘటనభూరి, భుజబలవిహారి యార్వీటిబుక్కశౌరి.

కుమారవేంకటపతి—

సీ. శేషాచలేంద్రవిశేషధామంబున, నెలకొన్నవిఖ్యాతి నెరపువాఁడు
బాలార్కరుచి గన్నపద్మరాగంబున, గనుపట్టునెరచేయి గలుగువాఁడు

లలితహారంబుల యలమేలుజిగిగూడి, తళుకుమీరిన యురస్స్థలమువాఁడు
విబుధకంటకరాజి గబళించుచాయల, డాకొన్న పసిడికపారివాఁడు

గీ. ధరణిదేవతలన ప్రసాదమునఁదనిపి, సంతతానంద మొనఁగూర్పఁ జాలువాఁడు
వెంకటస్వామిగతి రాయవిభుకుమార, వెంకటస్వామి దిక్కుల వెలయుచుండు.

సీ. కలిమియేమిఘటించు కమలేందుఁ గూడిన, రమణికి నుదకపారణమె కాక
యేవిశేషముగల్గు నుభరాజులవరించు, కాంతకు పర్ణభక్షణమె కాక
పుణ్యమేమిభరించు భుజగవల్లభుఁగోరు, వనితకు ననిలభోజనమెగాక
యేఫలంబాదవు గిటీశునంటినయంగ, నకును ముస్తాచర్వణంబె గాక

గీ. యనుచు వారల నిరసించి యవనికాంత, సిరుల రంజిల్లు రాయభూవరకుమార
వెంకటాధిపలోమృగాంకుఁగూడి, యనవరతభోగభాగ్యంబు లనుభవించు.

సర్వజ్ఞసింగ—

సీ. ఏమహాసేనాని యిద్ధతేజోరాసి, హతధనుంజయజయోన్నతి వహించు
ఏభోగిభూషణుహేలాద్యతిగుణంబు, తుహినాద్రిజాతసంస్థితి ధరించు
ఏహస్తిబలహారిబాహువిక్రమలీల, గర్వాంధకచ్ఛేదకలనఁదాల్చు
ఏమహీంధరధర్మసామోపయత్నంబు, సిద్ధసంకల్పరాజీవి మెలఁగు

గీ. ఏసమాశ్రితవిద్యార్థకేంద్రశక్తి, సుగుణగణపాలనార్జితస్ఫూర్తిఁ గాంచు
నట్టిసర్వజ్ఞమూర్తినా నలరుచుండు, చిత్రకలమీరి సర్వజ్ఞసింగశౌరి.

సీ. ఎంత లెస్సగనున్న నంతవేడుకెగాని, ప్రజలకల్మి కసూయబడుట లేదు
తనుఁ గొల్వవలె నందరను ప్రియంబేకాని, మానిసివెగటించుటైన లేదు
నిచ్చ వేడిన నర్థి కిచ్చుచిత్తమెకాని, మును పింతయిచ్చితి ననుట లేదు
రేఁబగల్ ధర్మ మార్జించుచిత్తమెకాని, న్యాయంబుదప్పిన నడక లేదు

గీ. కలడె యిటువంటిరాజు లోకమున నెందు, జలధివలయితవసుమతీచక్రమెల్ల
నేలవలె శాశ్వతముగాగ నీఘనుండె, యేలవలె నన్యులన నానృపాలుఁ డలరె.

సీ. ప్రతిపాదితార్థానుభవ పూర్ణహర్ష లోకత్రయంబగు రహస్యత్రయంబు
ప్రాకృత రవిగ్రహీకాంతిమూర్ధన్య, భూషణం బగు వచోభూషణంబు
వికలచిత్తధురీణ సకలజీవకళింక, పంచకం బగు నర్థపంచకంబు
విదురవైష్ణవజాల హృదయ మత్తతమూల, మానసం బగు గురుమానసంబు
నాదిగాఁగల రహస్యములు భక్తి, నధికరించి శఠారి దివ్యప్రబంధ
ముఖరితాష్టాదశరహస్య ముఖ్యపఠన,రమ్యుఁ డన మీరె వెలుఁగోటి రాయశౌరి.

సీ. ఘనజయ శ్రీభామకలిమి, నెవ్వని వీర,నారణాంకమున్నతి వహించు
హితమహాసంస్థిత చింతతఁదాల్చి నెవ్వాని, గండగోపాలకాంకంబు మెరయు
తత సింహ్వాజలసముద్ధతిచేత నెవ్వాని, యాహవభీమాంక మతిశయిల్లు
సకలార్థసంధానచాతురి నెవ్వాని, యర్థి మందారాంక మమరియుండు
నతడు నుతిగాంచు రాయచౌహత్తమల్ల,రాయవేశ్యాభుజంగ ధరావరాహ
గాయగోవాళికేళాదిరాయబిరుద, రమ్యగుణహారి వెలుగోటిరాయశౌరి.

వెలుగోటికొండ—

సీ. కలధౌత కలధౌత కలధౌతనిలయుండు, ఘనసార ఘనసార గంధయుతుఁడు
నరసింహ నరసింహ నరసింహశౌర్యుండు, భారతి భారతి పాటవుండు
వాహిని వాహినీ వాహినీశ్వరు మంత్రి, సుకుమార సుకుమారశోభితుండు
మణిరాజ మణిరాజ మణిరాజతేజుండు, కళ్యాణ కళ్యాణ కలిత తేజుఁ
డనుచు జగములు బొగడఁగ నలరుచుండు, సమదవిమతవసుంధరారమణసింధు
మంథ జగతిధరేంద్రాయమాన బాహు, దండబలహారి వెలుగోటికొండశౌరి.

బంగరుయాచ—

సీ. చతురంగబలతుంగ జలరాశి యెడబాసి, వియరాతి తమిహేతి రయతి ద్రుంచి
సుతురంగమఖురంగణతరంగ దరుణాంగ, రణధూళి పరమాళి మణులఁగప్పి
కలవాల రుచిజాలములలీలలను విప,క్షతరువేక్షణచకోరదరము గొల్చి
నరబృందములడెంద మరవిందములచంద,మున నొందు నగుగందు ముదము నొంది
అరుణకిరణోరుమైత్రిసాంద్రము వహించి, మించి యుదయించు వెలుగోటివిమలవంశ
తిలక బంగరు యాచ క్షితీంద్రచంద్ర, చండతరమహోగ్ర ప్రతాపాఖ్యతపనుఁడెలమి.

సీ. ధర సుధారసుధాసుధాధామకదళికా,దళికాళికాకారకలిత మగుచు
భవ రమానరమారమామానుజ లవలీ,లవలీవలీలీల లమరి మరయ
శరతుషారతుషాతుషాపా—లవళితా,వళితాసితాతారమణిసమంబు
శరద శారదశావశాశాంసధవళిత,భగణభాగణభానభాభరంబు
ఖగముఖాగముఖాముఖాఖాగమగుచు, హరిపురారిపురాపురారాతినెలయ
హాకర సభారసభా సభాభావ్యమగుచు, యశము శము ముదము నొదవునుయాచనృపతి.

ఏకాంత సేవ-విమర్శనము

పోలవరపు రామబ్రహ్మంగారు, బి. ఏ.

శ్రీ వేంకటపార్వతీశ్వర కవు లాంధ్రపాఠక మహాశయులకుఁ జిరపరిచితులు కావున ప్రత్యేకించి వారి కవితాప్రాశస్త్యము నభినుతింప నక్కఱలేదు. ఆంధ్రభాషాయోష నభినవాలంకార భూషితఁ జేసి, కవితాప్రపంచమున నూతనమార్గములఁ గనుగొని యాధునికాంధ్రసారస్వతమున నవశకకర్తలైరి. ప్రాచ్యపాశ్చాత్యవిజ్ఞాన సమ్మేళనఫలితమే వీరి కవిత్వమునఁ గల యాధిక్యము. దేశీయుల యభిరుచులు, మహదాశయములు, మార్పునెందుటకు వీరే చాలవఱకుఁ దోడ్పడి రనవచ్చును. నేఁడేవంకఁ జూచినను నూత్నశోభ భావగోచరమగుచున్నది. ప్రాచీనకవితాసాంప్రదాయము లడుగంటుచున్నవి. అచిరకాలముననే యడుగంటనున్న ఇయ్యది శుభసూచకమో యశుభసూచకమో మన మిదమిత్థమని నేఁడు నిర్ణయింపఁజాలము. స్వాతంత్ర్యము ప్రబలుచున్నది. సనాతన సిద్ధాంతములు సన్నగిలు చున్నవి. మానసిక స్వాతంత్ర్యమునకై పెనఁగులాడుచున్నాము. రచయితలుప్రాతమార్గములవదలివైచి వింతలకై పర్విడుచున్నవారు. పాఠకుల భావనాశక్తియు నూత్నపథాన్వేషణమునందే నిమగ్నమైయున్నది. అభిరుచులు మార్పునెందుటకు, మానసికవిప్లవముఁ గల్గించుటకుఁ గవీంద్రులే తోడ్పడుచుందురు. నేఁడు మన విద్యార్థికుల యాదర్శములు, దృక్పథము అపూర్వగతిఁ బరిణమించినది. ఇందలి యోగ్యతాయోగ్యతలఁ బరిశీలించుట యప్రస్తుతము. భవిష్యద్విమర్శకులు చేయవలసినపని యది.

కవితాప్రపంచమున స్వాతంత్ర్యవాతావరణము ప్రభవించిన దంటిమికదా, ఇది యెట్టిస్వాతంత్ర్యము? నిజమగుస్వాతంత్ర్యమునకుఁ గట్టుబాట్లు, నియమములు, నుండక తప్పదు. గణయతిప్రాసలఁ ద్రోసిపుచ్చినంత మాత్రమున స్వేచ్ఛ కానేరదు. అష్టాదశవర్ణనములని యవసరమున్నను లేకున్నను అప్రస్తుత ప్రశంసలతో గ్రంథపూరణ మొనర్చినంతమాత్రమున మహాకావ్యము కానేరదు. గ్రామ్యవాదులతోపాటు తొట్టిమొట్టిపదములఁ గూర్చి రసాభాస మొనరించుటలో లేదు. రవీంద్రమహాకవి, కవి కర్తవ్యము నిట్లు నిర్వచించుచున్నాఁడు.......

"Therefore the true poets, they, who are seekers, seek to express the universe in terms of mus'c and reflect the infinite"

సత్యాన్వేషణమే కావ్యపరమావధి. విశ్వగర్భమున మాటుమణఁగియున్న పరమాత్మస్వరూపమును, విశ్వవ్యాప్తమైన దివ్యగాన

మును శ్రవణానందకరముగ సత్కవులు వినుపింతురు.......

My Song will transport your heart to the verge of the unknown—

హృదయమును కలంచివేయుటే కాదు; పవిత్ర భావమును గల్గింపవలయును; అనిర్వాచనీయానందమును వెదచల్లవలయును. పరవశత్వమున మంత్రముగ్ధులమై యానందముద్రితులమై పోవునట్లు చేయునదే సత్కవిత్వము.

It will be like the faithful star overhead when dark night is over your road—

జీవయాత్ర దుర్ఘటమైనది. విశ్వసంరంభమున దరిగానక విపదంధకారమున మునింగియున్నపుడు దివ్యజ్యోత్స్నవోలె మానసికాంధకారమును పోగొట్టి గమ్యస్థానముం జేర్చుటకుం గవితయే సాధనభూతమట.

My song will sit in the pupils of your eyes and will carry your sight into the heart of things—

పరమార్థమును గ్రహించుటే—గ్రహించుశక్తి ననుగ్రహించుటే—సర్వ సామాన్యములగు వస్తువులందే విశ్వస్వరూపముం జూచునట్లు అనుగ్రహించుటకుం గవితయే తోడ్పడం గలదు. ఇట్టి కవిత్వమే సుస్థిరమై భాసిల్లుచుండును.

And when my voice is silent in death my song will speak in your living heart—

మహాకవులును బుట్టుచున్నారు; గిట్టుచున్నారు. ప్రపంచ మున్నంతవఱకు— ఆచంద్రతారకము వర్ధిల్లునది సత్కవిత్వ మొక్కటేకదా! విజ్ఞానవంతమై, విజ్ఞానప్రేరకమై, విశ్వశ్రేయము నాశించుకావ్యమే మహాకావ్యము.

ఆంధ్రభాషాయోష నవనవాలంకారభూషితయై యపూర్వరమ్యవనవీథుల విహరించుచున్నదని గర్వించుచున్నారము. సకలవిధముల సారస్వత మభివృద్ధిఁ జెందుచున్నదని యుప్పొంగుచున్నారము. లెక్కించి చూచినచోఁ గడచిన పదిపదునైదు వత్సరములలో నూఱులకొలఁది నవలలు, నాటకములు వెలువడినవి. ఇంకను వెలువడుచున్నవి. లెక్కలేని గ్రంథకర్తలు! ఇఁక సాహిత్యము దినదిన ప్రవర్ధమాన మగుట కేమికొదువయున్నది? చూడుఁడు! మనసాహిత్యమున నేఁడు ప్రాణము లేదు. సత్యము లేదు! గ్రంథసంఖ్య యధికమగుచున్నదే కాని నిజమగు సాహిత్యము పెరుఁగుటలేదు. భావకవిత్వమని కాపుకన్నెపై నొకఁ డేవో నాల్గుపాటలు వ్రాయఁగనే వందమంది భావకవులు చర్వితచర్వణ మొనరింపుచున్నారు. "రైల్వేసాహిత్య" మధికమై పోవుచున్నది. చిరకాలము నిలువఁగల యుత్తమసాహిత్య మడుగంటుచున్నది. పోతనాది మహాకవులు దివ్యములగు జాతిరత్నముల నార్జించి మన కొసఁగిపోయిరి. మన మీ కృత్రిమరత్నములఁ బ్రోవొనర్చి భవిష్య దాంధ్రసంతతి కొసఁగనున్నాము. ఆంధ్రభాషావధూటి కియ్యవి నూత్నాలంకారములఁట; విలాసములఁట! లేదు; మన సాహిత్యమున నేఁడు సౌందర్యము లేదు. జీవము లేదు.

"డిటెక్టివునవలలు" సత్యముఁ జూపఁజాలవు. ఉత్తమగ్రంథములు ... ఉత్కృష్టభావములు, జనసామాన్యమునకు రుచింపనిచో నభిరుచిఁ బుట్టించుట రచయితల కర్తవ్యము. మహాకవు లట్లు చేయనేర్తురు. కావుననే ఆర్నాల్డు "కవిత యనంతమైన" దని పల్కినాఁడు.

ఉత్తమసాహిత్యమును పెంపొందుచునే యున్నది. "ఏకాంత సేవ" సర్వజన సమాదరణీయమగు కావ్యము. అర్థజ్ఞానము లేక యూరక చదువువాఁడును నానంద పరవశుఁడవుననుటకు సంశయములేదు. భాషాసౌష్ఠవమున నేమి, భావసౌకుమార్యమున నేమి, పదలాలిత్యమున నేమి, భావగాంభీర్యమున నేమి, యర్థసంపదయందేమి నేఁడు వెలువడు లలితకావ్యములలో నిది సర్వోత్తమమై కవుల భావనాబలిమిని, కల్పనాశక్తిని, గానమాధురిమను వేనోళ్లఁ జాటుచున్నది. చదువఁజదువఁ జవులూరుచుండును. నవనవానందసంధాయకమై, నవ్యవిలాసభాసురమై నవ్యభావకుసుమసంశోభితమై యాంధ్రకవితాలత వేంకటపార్వతీశ్వరుల యారామవనమధ్యమున మనోహరమై యొప్పుచున్నదనుట కీ చిన్నికావ్యమాలికయే తార్కాణము.

ఇయ్యది గీతాంజలివంటి దనుటకు వీలులేదు. వీరికవిత్వమున ధ్వనియే ప్రధానము. భావపరవశులై, భావోద్రేకమున బ్రకృతిసౌందర్యమును వీక్షింపుచున్నారు. ప్రకృతిఁ గల సౌందర్యమాధుర్యములుమాత్రమే చూపింపఁగల్గుచున్నారు. గంభీరప్రకృతిగర్భమున నణఁగియున్న రహస్యముల కొక క్రొత్తయర్థమును స్ఫురింపఁజేయుచున్నారు. ఇఁక గీతాంజలియందన్ననో భక్తునియంతరంగమునఁ గల వివిధభావములు, మహదాశయములు, వివిధరీతుల, నిరాటంకముగ, భావతరంగకల్లోలినియగు హృదయసముద్రమునుండి ప్రవహించుచున్నవి. విచారతరంగిణి, ఆనందలహరీతరంగముల నైక్యమొందినది. రవీంద్రుఁడు జీవితసమస్యలనెల్ల నైవేద్యము సల్పినాఁడు. మనుజస్వభావములు పరస్పరవిరుద్ధములుకదా! అనఁగా భిన్నభావసమన్వితములని దుర్జనసజ్జనసమ్మిశ్రితము ప్రపంచము. అనుక్షణమును క్లిష్టపరిస్థితు లేర్పడుచున్నవి. సనాతనధర్మములు, ఆచారములు...స్వాతంత్ర్యసంరంభమున నుఱ్ఱూఁత లూఁగింపఁబడుచున్నవి.నిర్మూలమైపోవుచున్నవి. మానసిక, ఆధ్యాత్మిక విప్లవకాంక్ష కార్చిచ్చువలె వ్యాపించుచున్నది. భారతదేశవిముక్తి యెటువోయిన లభించునని రవీంద్రుఁడు వెదకుచున్నాఁడు. సత్యాన్వేషణమే ... ధర్మోద్ధరణమే పరమపథమని విశ్వసించినాఁడు. అల్పాధిక వివక్షలేక, ప్రతివాని హృదయకుహరము నుండియు నార్తత్రాణ పరాయణుఁడగు పరమేశ్వరుఁగూర్చి వెల్వడు నార్తధ్వను లిందుఁ బ్రతిధ్వనించుచున్నవి. రవీంద్రుని, మానసిక,ఆధ్యాత్మిక, నైతిక, రాజకీయ, సాంఘిక, మహదాశయములెల్ల గీతాంజలియందుమూర్తీభవించినవి. ఇది యొకవిధమైన స్వీయచరిత్ర మనవచ్చును. భక్తుఁడు భక్త్యావేశమునఁ బరమాత్మఁ జేరఁగోరి; ప్రాపంచిక బంధవిముక్తిఁ జెందఁగోరిఁ పవిత్రుఁడై, నిర్మలచిత్తుఁడై, తదేక

ధ్యానమున నంతరాత్మ ప్రబోధము నాలించి హృదయకలుషముల నెల్లఁ బరిత్యజించి దివ్య తేజము నాశించుచుఁ బరితపించుచుఁ బరమాత్మ సాన్నిధ్యమున నాత్మార్పణ మొనర్చి వినుతించునప్పుడు బహిర్గతంబగు నీశ్వర స్తవమే గీతాంజలి. విశ్వమోహనుఁడును, విశ్వవ్యాపియు, విశ్వస్వరూపియు నగు విశ్వేశ్వరు మ్రోల నంజలిబద్ధుఁడై, రవీంద్ర కవీంద్రుఁడు, విశ్వపతి సాక్షాత్కారమునకై విశ్వమోహనసంగీతము నారంభించినాఁడు. ఆగానలహరీ తరంగముల మైమఱచినప్పుడే హృదయకమలము సంపూర్ణ వికాసముఁ జెందినది. సహస్ర భావ దళములు సహస్ర రాగముల విశ్వగానమున నైక్యమొందినవి. ఏకాంత సేవయందు సహస్ర రాగములు లేవు. లేకున్నను గీతాంజలితో సరితూఁగఁగల దనుటకు సంశయములేదు. గీతాంజలియందు భావవైశాల్య మఖండము. జీవిత తత్త్వము క్రోడీకరింపఁబడినది. దుర్భరమనఁదగు మానవ జీవిత మానందప్రదమని నిరూపింపఁబడినది. దీనినే కాఁబోలు నాంగ్లమున

(Robust optimism, a sound and mature philosophy of life")

అని పిలుతురు. ఇదియే కావ్యపరమావధియఁట; ఉత్తమకావ్యలక్షణమఁట. ఇదియే సత్యమఁట—సౌందర్యమఁట—

Poetic truth and poetie beauty high seriousuess and a philosophy of Life.

తేటతెనుగున నీభావము వెల్లడించుట దుస్సాధ్యము. కావున నీవిషయములందు మాత్రము మన 'ఏకాంత సేవ' గీతాంజలి యనుకరణ మైనను పరిపక్వము చెందలేదు. ఐనను గవులయభిప్రాయ మంతదూరము పోనట్లు తోఁచుచున్నది. సృష్టిఁగలసౌందర్యమును నిరూపించినారు. అందలి యంతరార్థమును జాలవఱకు వ్యక్తపఱిచినారు. వీరిగానము నిత్యనిర్మలమై నిత్యానందసంధాయకమై మనోజ్ఞమై పరగుచున్నది. ఈ సందర్భమున గీతాంజలితోఁ బోల్చినపుడు నాహృదయ భావములఁ దెలుఁగున వ్యక్తీకరించుటకు మనకు వలసినపరిభాష లేనందున నా యభిప్రాయము సుబోధకము కాదని భీతి జనించుచున్నది. "ఏకాంత సేవ"

(A highly poetic interpretation of the best and the most beautiful aspects of nature where the poets read a deeper meaning and significance and discern the mysterious working of the divine Hand)

యిట్టి యుత్కృష్టకావ్యము. భావోద్రేక జనితమగు భక్త్యావేశమున నిర్మలనిశ్చల భక్తవరుని హృదయపరితాపమును భక్తిప్రబోధకముగ వర్ణించియున్నారు. భక్తుఁడు భగవానుని 'ప్రియా' యని సంబోధించుచున్నాఁడు. ప్రియాప్రియుల కుండు పరస్పర ప్రణయ సంబంధమే—ప్రవిమలానురాగమే—భక్తునకును యీశ్వరునకును గల సంబంధము. నిర్మలానురాగ పూరితమై ప్రియాన్వేషణ మొనరించుచు విరహాభరమ్మున ప్రియతముఁ జూచు కోర్కెతో సతీమణి యెట్లు ప్రయాసఁ జెందునో యట్లే భక్తుఁడును పరమేశ్వరసాక్షాత్కారమునకై హృదయపీఠము నాయత్తపరచుచుండును. ఈసంబంధమునే ఏకాంత సేవయందు

సమన్వయ మొనరించు టెంతయు సమంజసముగ నున్నది.

ఇకఁ గథాభాగమునించుక పరిశీలింతము. సుబోధక మగునట్లు వివరించినఁగాని యిందలి భావసౌందర్యము ప్రస్ఫుటము కానేరదు. నాయికానాయకుల విరహగానమును, ఈశ్వర సాక్షాత్కారమునకై భక్తుని యనుతాపమును, రెండును ప్రేమైకప్రేరితములే కావున నిర్వ్యరగమ్యస్థానము నొక్కటే కదా.

భక్తుఁడు ప్రభాతసంగీతము నారంభించినాఁడు. దివ్యతేజోలేశము లభించుటకై భక్తుని హృదయాంతరాళమునుండి వెడలు ప్రణయగానము—తేజోమయదివ్యసందర్శనాపేక్షచే జీవుఁడు పరమాత్మను సందర్శింపుటకై యనురాగాతిరేకమున నుదయగానముఁ—జేయుటతో గ్రంథ మారంభమైనది.

'ప్రకృతి యదియేమొ రాగసంపన్నమయ్యె
భావ మదియేమొ యానందభరిత మయ్యె
చిత్త మదియేమొ ప్రేమసంసిక్తమయ్యె—'

ఏకాంతసేవాసమయము ప్రశాంతసుప్రభాతము. శ్రీపాదములఁ గొల్చువేళ కావుననే ప్రకృతి రాగసంపన్నమైనది. హృదయ మానందపూరిత మైనది. ఔను. కల్మషరహితమై, నిశ్చలమై, పవిత్రమై ప్రశాంత మనోహరమై యున్ననే కదా పరమేశ్వ రారాధన కనువుపడును. పైఁగా, భావసహకారమునఁ బ్రేమ పల్లవించినది. అట్టి మానసికావస్థయందే నిర్మలప్రేమతరంగము లుప్పతిల్లును. అట్టిప్రేమయే ఫలసిద్ధికి ముఖ్యమార్గము. ఆరాధనసమయమైనది. నిర్మలానురాగపూరితుఁడై భక్తుఁడు (ప్రియురాలు ప్రియుఁజేరఁగోరి) భక్తిరసావేశమునఁ దన్మయుఁడై ప్రకృతిసౌందర్యముద్రితుఁడై యుండఁగ వాని "యాత్మ కేమేమొ యుద్బోధమగుచునుండె" ను. ఇదియే యంతర్వాణియై యుండనోపు (Voice within) లేదా ప్రకృతిఁ బ్రతిధ్వనించు దివ్యవాణి (The divine voice in Nature)యై యుండనోపు. సృష్టి యెల్లెడలను, సర్వాంతర్యామియగు పరమేశ్వరుని కృపాకటాక్షమునే, యవ్యాజప్రేమనే ప్రకటించుచుండును కదా! చరాచరజంతుజాలమెల్ల నేకగ్రీవముగ పరమేశ్వరు నభినుతించుచున్నవి. లేనిచో వాటికి నిలుకడయే లేదు. ఆనందమయుఁడును, ఆనందసముద్రుఁడును, సౌందర్యఖనియు నగు పరాత్పరు తేజోలేశము నొదల ధరించియే ప్రకృతిగణమెల్ల యుప్పొంగిపోవుచున్నది. అందుకనియే "ఘనతరంబైన యుదయరాగంబుతోడ, నాత్మరాగప్రభాపుంజ మైక్య" మొందినది_'భావవిద్యుల్లతాప్రదీపంబుతోడ భానుదివ్యప్రభారాశిలీన' మైనది. అందందు డాఁగియున్న దివ్యస్వరూపము, అందలి మధుర వీణాస్వరము, దివ్యవాణి మనబోంట్లకు వినరాదు. ప్రకృతితత్త్వమును గ్రహించువారికే_ మహాకవులకే_గోచరించును. ఈ యుద్బోధనయు భక్తులకే కల్గును. ప్రేమాంతరంగులకే విననగును. అప్పుడేయీశ్వరసంకీర్తనమున మగ్నుఁడై పోవును. అందు మానవుఁడే కాదు; ప్రకృతియంతయు దివ్యజ్యోత్స్నాపులకితమై, ప్రేమభరితమై, సంతోషముద్రితమై చలించిపోవును.

భువనేశ్వరు మాహాత్మ్యమును వెల్లడించుచుండును. కాకున్నచో "నప్పుడే వింతగాఁ బురివిప్పుకొనుచు, నెమ్మినెఱజాణ నృత్యంబు నెఱపనేల? గోరవంకకులుకులాడి, వింత యొయ్యారమునఁ జెవిచెంతఁ జేరి, చిలుకచెలితోడ నేమేమొ చెప్ప"చుండ నేల? ఈశ్వరసాన్నిధ్యముఁ జేర్చుటకు, మనుజహృదయము నీశ్వరునివంకకు మరల్చుటకుఁ బ్రకృతియే తోడ్పడుచుండును. అనంతమైన యమ్మహా ప్రభావమునే ప్రకృతి ప్రతిబింబింపఁ జేయుచున్నది. కావుననే భక్తుఁడు 'వరమనోహర పంచమస్వరము నెత్తి, మధురముగ మార్దవంబుగా మంజులముగ, మానసానందకరముగా మంగళముగ' కోకిల పాడుచుండఁగా 'ప్రాణవిభు నామమంత్ర జపంబునందు—మగ్నుఁడై, మేను మఱచినాఁడు. కళ్యాణగీతిలో కలకంఠి చొక్కియున్నది. ప్రణయగానములో భ్రమరిక చిక్కినది. ఆనందవార్ధిలో భక్తుఁ డవశుఁడై యున్నాఁడు. కళ్యాణమూర్తి సుప్రసన్నుఁడు కానున్నాఁడు'

ఆనందవార్ధిలో నవశుఁడై యుండఁగా విభ్రాంతితో మున్గి పరమేశ్వరుని లీలావిహారముఁ జూచి ముగ్ధుఁ డయ్యెను. భక్తుఁ డట్లు సమ్మోహితుఁడై యుండఁగాఁ గళ్యాణమూర్తి యదృశ్యుఁ డయ్యెను. తేజోలేశము మాత్రము కంటఁబడినది. జ్యోత్స్నామయుని సందర్శన భాగ్యము సులభసాధ్యము కాదుగదా! భక్తపరాధీనుఁ డయ్యును, భక్తుఁ బరీక్షించుచుండును. సర్వాంతర్యామియయ్యును, సర్వతోముఖుఁ డయ్యును "సదమలకోకిల కుహూస్వరములలోన భావంబు చిగురించు పాటలు పాడి — లలితమోహనశుకాలాపంబులందుఁ బ్రణయంబు దొలుకాడుపాటలు పాడి...మెలదేఁటినాదంబులోనఁ బ్రణయమంత్రంబును బొరంబు సెప్పి—అంటఁగా ముట్టఁగా నందఁగారాక, ఆసలఁ గొల్పుచు నలయింపు"చుండును. ఈశ్వరార్చన సల్పుచు, మంత్రజపంబు సేయుచు, ధ్యానించుచు, నెంతయుఁ బరితపించుచునే యున్నను భక్తులతో మంతనమాడుచుండును. వారిని బరీక్షించుటకు—ఎప్పుడేని సాక్షాత్కారము లభించినను ఛాయామాత్రమే. ఆదివ్యమంగళసుస్వరూపము సుస్థిరముగ హృదయకమలమునఁ బాదుకొన్నపుడే యీప్సితార్థసిద్ధి; లేనిచో నింకను బరితాపమే. భక్త్యనురాగములు పెంపొందుచుండును. గమ్యస్థానము సమీపించుచుండును. విద్యుత్ప్రభాపుంజము కనులఁబడును. అదృశ్యమగుచుండును. కర్మపరిపాకమైననేకాని సాక్షాత్కారము, ఆత్మపరిజ్ఞానము లభింపదు కదా! ఈలోపుగ నెన్నియవస్థలు మారవలయును? ఎంత శ్రమ కోర్వవలయును? రవీంద్రుఁ డీభావమునే యిట్లు వ్యక్తీకరించుచున్నాఁడు......

"He came and sat by my side but I woke not. What a cursed sleep it was, O, miserable me! He came when the night was still, he had his hart in his hands, and my dreams became resonant with its melodies. Alas! why are my nights all thus lost; Ah! why do lever miss his sight whose breath touches my sleep?"

కళ్యాణమూర్తి సర్వకాల సర్వావస్థలందును మనలఁ గాపాడుచునే మనయొద్ద కేతెం

చుచునే యున్నాఁడు. అజ్ఞానతమ మావరించి యుండఁగా మన మెట్లు చూడఁగలము? అందు కనియే యమూల్యావకాశములు చేయిజారి పోవుచున్నవి. కావుననే మనభక్తుఁడు "అవశనైయుండుటే యపరాధమనుచు, మది నెంచి యీరీతి మాయలు సేయ, భావ్యమై తోచెనా" యని మొఱపెట్టుచున్నాఁడు. "ఎఱిఁగియో యెఱుఁగకో యేఁజేసినట్టి తప్పులమన్నించి... దరిసెనం బీవయ్య తత్త్వస్వరూప!" యని పిలుచుచున్నాఁడు?

విశ్వమొక ప్రణయసామ్రాజ్యము. విశ్వమోహనమూర్తియు సుధామధురమూర్తియు నగు విశ్వనాథుఁడే ప్రణయసామ్రాజ్యాధినాథుఁడు. సృష్టిఁగల జీవసంతతులెల్ల ప్రేమపాశములచే నొండొంటితోఁగట్టువడియున్నవి ప్రేమబంధము లెల్లెడల నల్లిబిల్లిగఁ బెనవైచికొనిపోయినవి. అట్లే కాకున్నచో పద్మాలయముఁజూచినంతనే రాయంచ పరువెత్తనేల? విశ్వమోహనమూర్తి యందున్నవాఁడు కావుననే!

"సహకారవనములో సఖుఁ డుండఁబోలు
భావించి కీరంబు పలుకాడుచుండె.
అలరుఁగొమ్మల మనోహరుఁ డుండఁబోలు
పేరెత్తి కలకంఠ పిలుచుచు నుండె......
మయూరంబు పురివిప్పుచుండె ...."

కావున విశ్వమంతటఁ జూచి వెదకంగ వలయును. ప్రణయదేవతాలయము లెవ్వియో ప్రేమైకమూర్తికి ఉనికిప ట్లెవ్వియో విచారించి యందందు జాడలఁబట్టి వెదకవలయును కదా! "శృంగార సరసిలో శ్రీమంటపమున, గుసుమ పీఠంబుపైఁ గొలువుండెనేమొ?— అనురాగ జలధిలో సమ్మృతవీచికల, విరిదమ్మి దోనెపై విహరించునేమొ?— శాంత వనంబులో స్వర్గ సౌధమునఁ, బరువంపు విరిశయ్యఁ బవళించెనేమొ?— చిద్రూపనగరిలో శృంగాటకమున, నిండువెన్నెలబైట నిదురించెనేమొ?"- చూచి వెదకి తేవలయునని భక్తుఁడు పయనమయ్యె. ఇకఁ బ్రణయస్వరూపుఁ జూచినను గుర్తించి పట్టికట్టుట కానవాళ్లు లేవా? ఉన్నవి!

"నెఱచూపు జూడ వన్నెలు గుల్కునమ్మ
నెఱనవ్వు నవ్వ వెన్నెల చిల్కునమ్మ
నెఱపల్కు పల్క తేనియ లొల్కునమ్మ"

భక్తున కాత్మేశుఁడే లోకమై పరగుచుండును. ప్రియాప్రియుల వియోగసమయమునఁ బ్రకృతియెల్లఁ బులకరించును. వారి విరహగానము నాలకించి ప్రకృతిఁగల జంతుజాలమెల్ల సానుభూతిఁ జూపుననుట కవుల మనోజ్ఞభావస్ఫురణముఁ జాటుచున్నది... భక్తుఁడు సఫలీకృతమనోరథుఁ డయ్యె. హృదయతాపము శమించినది. హృదయోద్వేగము నణఁచిపెట్టి ఈశ్వరసందర్శనోత్సుకుఁడై అన్యచింతలఁ బారఁద్రోలి యేకాగ్రచిత్తుఁడై పరంధాముఁ గనుఁగొనుచున్నవాఁడు. ప్రణయదేవతాసాక్షాత్కార మైనది. ప్రణయసుందరి తపంబు ఫలించినట. సంతోష మొనగూర్చు శకునంబు లైనవి. సౌభాగ్యము ఫలించుసమయ మేతెంచినది. "ఉన్నతాసనము పైనుండి నావిభుఁడు, పేరెత్తి చేయెత్తి పిలుచుచున్నాఁడు" తిరుగఁ బ్రకృతియంతయు నా

నందమయమై కన్పట్టుచున్నది. "జగమెల్ల నవసుధాసారం బైనది. భువనమంతయు గంధపూరం బైనది... వెదకి వెదకి ప్రణయాధినాథుని యునికిపట్టెఱిఁగి వానిసన్నిధి కేగుచున్నాఁడు......ఇప్పట్టున మనోహరకవితామృతరసము చిప్పిలుచున్నది—

ప్రణయపురంబులో ప్రాసాదవీథి
వేణుగానరవంబు వినవచ్చుచుండె
కళ్యాణనగరిలో కమలాలయమున
వీణాస్వనంబులు వినవచ్చుచుండె
విశ్వగీతరవంబు వినవచ్చుచుండె
వేదసాధురవంబు వినవచ్చుచుండె
పదిలంబు పదిలంబు! పాణిద్వయంబ!
అవధాన మవధాన మంతరంగంబ!
వేదాంతమయుఁ జేరువేళ యేతెంచె
భద్రంబు - భద్రంబు!—

హృదయేశ్వరునితో నైక్య మొందినంతనే పరవశమయ్యెనే ప్రకృతియంతయును...ఆనందమయమూర్తి పొడసూపినంతనే "మధురహాసంబులో మాధురీ ప్రకృతి యానంద ముద్రితం బైనట్టు లుండెను."

"ప్రణయాతిథేయుని భావనామయుని
దర్శనంబు లభించె... నెమ్మేను పులకించె."

తుద కెందుఁ బరమాత్మ సాక్షాత్కారము లభించినది? ప్రియురాలుహృదయేశ్వరు నెందుఁ బొడగాంచినది?

"మాణిక్యమయమూర్తి మనపజ్జనుండ
సంజకెంజాయలోఁ జరియింపనేల
సిద్ధాపథము మనచెంతనే యుండ
ఘోరాటవులలోనఁ గ్రుమ్మరనేల?
విజ్ఞానధన మాత్మవీథినే యుండ
మంత్రకోశములలో మసలంగ నేల?
భ్రాంతిలోఁబడి వెఱ్ఱిపడ నేటికమ్మ!
చిత్తమా! నాతోడఁ జేరి రావమ్మ!

విశ్వమంతయు వెదకినది. తనలో నున్న పరమాత్మ నెఱుఁగఁజాలక భ్రాంతిలోఁ బడిపోయినది. తుదకాత్మపరిజ్ఞానము Self realisation)లభించినంతనే బ్రహ్మానంద మబ్బినది. దీని నేరవీంద్రనాథుఁడు—

Leave this chanting and singing and telling of beads! whom dost thou worship in this lovely dark Corner of a temple with doors all shut; Open thine eye and see thy God is not before thee.

మంత్రతంత్రములేల? రుద్రాక్షమాలలేల? నీయెదుట సాక్షాత్కరించినభగవానుఁ జూడుము! ఛాయవలె నిన్నంటియే యున్నాఁడు. నిన్నావరించియున్నాఁడు,—

I came out alone to my tryst. But who is it that follows me? I move aside to avoid his presence but I escape him not ....He is my own little self—my lord!

మనోరథము సిద్ధించినది. శ్రీపుష్ప యోగ సంసిద్ధి చేకూరినది...భక్తుఁ డేమికోరుచున్నాఁడు?

హృదయేశ! నినుఁగోరితిని చరితార్థనైతిని. నీ విచ్ఛ్రయింపనినాఁడు 'బంగారువీణతోఁ బనియేమినాకు?'...భక్తుఁ డేమికోరఁగలఁడు. ఐశ్వర్యములా? కాదు?

"ఈశైలవాహిని యింకిపోకుండ
నమృతార్ణవముఁ జేరె నంతియే చాలు
ఈమల్లెవిరిదండ యెండిపోకుండ
నమృతమూర్తి వహించె నంతియేచాలు
నాపుణ్యమునఁ జేసి నాజీవితేశ !
నీదర్శనముఁ జేసి నే ధన్యనైతి !...
కన్నులు చల్లగాఁ గనుఁగొనఁగంటి
......నాభాగ్యమే భాగ్యమయ్య ! !"

రవీంద్రుఁ డిట్లు ధ్యానింపుచున్నాఁడు,

This is my prayer to thee, my lord! give me the strength to surrender my strength to thy will with love...That I want thee--only thee--let my heart repeat without end. All desires that distract me are empty.

ఐహికసుఖములు బుద్బుదప్రాయములు. భగవానుఁడా! నీ సేవామృతమే నాకుఁ గావలసినది! భక్తులప్రార్థన మిట్టిదే కదా!

"ఆగమాంతోక్తుల కందఁగారాని
అఖిలంబునకు నంటియుంటక యున్న
నిర్వికారుని నిన్ను నేఁ బొందఁగంటి
నన్నుద్ధరింపవే!"

యని మొరవెట్టుచు భక్తుఁడు శ్రీధామమున కొట్టులో చేరినాఁడు.

"ఆయాసము ఫలించె నాసలుతీరె
కనుఁగొంటిఁ గైకొంటిఁ గైవల్య పదము"

నిర్మలాత్మ ప్రేమపూరితమై తపించి తపించి తుదకుఁ గైవల్యపదముఁ జేరినది. 'బుద్ధిమంతులకైన, బోద్ధలకైన...సాధ్యముకానిపదవి కేవలము భక్త్యనురాగములచే లభింపఁ గల్గినది. గమ్యస్థానముఁ జేరినది. విశ్వమంతయు ప్రేమభరితమై కన్పట్టుచున్నది——

"నవ మనోజ్ఞైకవీణాగానలహరి
నొక్కింతసుఖలేశ ముండునుగాక
గీర్వాణకాంతల గీతామృతమున
నొక్కింత యానంద ముండునుగాక
దివ్యతేజంబుతో దీటుసేయుటకు
ప్రకృతిసౌందర్య మేపాటిది నాథ !!!"

అని స్తుతింపుచున్నాఁడు...ఇంకఁ గోరఁదగిన దేమున్నది ?

'సర్వలోకేశ ! యీసాలభంజికను
నీకేళిగృహమందు నిలువఁగానిమ్ము
భువనసంత్రాణ! యీపుష్పవల్లికను
నీపూలతోఁటలో నిలువగానిమ్ము.
దయతోడఁ దిలకించి దాస్యం బొసంగి
నన్నేలుకొనుమయ్య !——.........! !

ఔను! భక్తమందారుఁడు ప్రత్యక్షమైన చోఁ గోర్కె లుండునా ? ఆదివ్యసందర్శనమే చాలును !

"In one salutation to thee, my God! let all my senses spread out and touch this world at thy feet. Like a rain-cloud of July hung low with its burden of unshed showers let all my mind bend down at thy door in one salutation to thee. Let all my songs gather together their diverse strains and flow to a sea of silence in one salutation to thee .... Let all my life take its voyage to its eternal home in one salutation to thee."

" అను రవీంద్రునిధ్యానమే...భక్తవరుని నోట వెల్వడుచుండును. ఏకాంతసేవఁ జదివిన

కొలఁది యానంద ముప్పతిలుచుండును. ఇంత కన్న విపులముగ నాసంతోషమును, నాకుఁ దోఁచిన భావమును బాఠకోత్తములకు వెల్లడింపవలయునని కోర్కె జనించినను అనుభవజ్ఞులును, బండితోత్తములును, గవీంద్రులును బలువురుండగా అల్పజ్ఞుఁడనగు నావిమర్శన మంతగా రుచింప దను సధైర్యమునను...నా హృదయభావముల నుచితగతి నాంధ్రమున వెల్లడింపఁజాలననియు నమ్మి శ్రీవేంకటపార్వతీశ్వరులయందు నాకుఁ గల భక్తియు, గౌరవమును, బురికొల్పఁగా నిట్లు వారి యుత్తమోత్తమగ్రంథ మగు 'ఏకాంతసేవ'పై నీచిన్నివ్యాసమును రచించి మద్గురుసమానులగు వారికే యుపాయనముగ సమర్పించుచున్నాను. ఈ కావ్యమున నల్పజ్ఞుఁడనగు నాకుఁ దోఁచినయర్థమునే సమన్వయించితిని. వేదాంతులకుఁ, బండితులకుఁ నిందుఁ బ్రతిపాదింపఁబడిన యంతరార్థ మేదేని తెలిసియున్నచోఁ బ్రకటింతురేని పాఠకలోకమున కెంతయు మేలుచేసినవా రయ్యెదరు.


ఇంద్రచాపము

సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి గారు

శ్రీయుత! మీఁ దే దేశము?
నీయట్టి మనోజ్ఞమూర్తినింగనె నెవరా
మీయమ్మ? యెందుఁ గొన్నా
వోయీ, యీదినుసు దుస్తు లొయ్యన
చెపుమా !

గీ. కార్మొగులునాఁగ నల్లఁగాఁగానిపించు
పెట్టియనుబెట్టి దాఁచినయట్టివేమి ?
వానరాఁబోవుచున్నది దాననీదు
రంగుబట్టలుదడిసి హొరంగుతగ్గు.

గీ. నాదుమందసమునఁ దటిన్మయములైన
కాంచికాలత, ముద్రికల్, కంకణములు,
హారములు,నూపురములు,చీనాంబరములు
కలవు; నాప్రియ ప్రావృడంగన; తదర్థ
మరుగుచుంటి; వాల్మీకిమహర్షి సోద
రుఁడను; విశ్వకల్యాణకారుఁడను నేను.



కాళిదాస భవభూతులు

ప్రథమ పరిచ్ఛేదము

ఏ. వి. సుబ్బారావు గారు, బి. ఏ., యల్. టి.,

(వెనుకటి సంచిక తరువాయి)

ఈనీతి ననుసరించియే కాళిదాసు తననాటకాంతమున శకుంతలాదుష్యంతుల పున స్సమ్మేళన మొనర్చెను. భవభూతియు నట్లే యొనరించెను గాని కాళిదాసామార్పునొందించుటలో మూలకథాభాగమును మార్పునొందించలేదు. భవభూతిమాత్ర మీకథాభాగమున గొప్పచిక్కులలో బడెను.

ఉత్తరరామచరిత్రమందలి సప్తమాంకమున, రామలక్ష్మణులను, పౌరజానపదులను, వాల్మీకివిరచిత సీతానిర్వాసాభినయమును జూతురు. ఆయభినయమున లక్ష్మణుడు సీతను వనమున విడిచిరాగా సీత గంగాప్రవేశ మొనరించినది మొదలు పాతాళప్రవేశ మొనరించువఱకు నం దభినయింపబడును. అయ్యది మిగుల నసమంజసము.

రాముడు—

"క్షుభిత బాష్పోత్పీడ నిర్భరప్రముగ్ధ"—అనగా

[పొరలివచ్చు నశ్రుప్రవాహముచేత నాకులుడును మోహప్రాప్తుడును] నై యాయభినయమును దర్శించెను. సీత రసాతలప్రవేశ మొనరించినపుడు "హా దేవి, దండకారణ్యవాసప్రియసఖి, చారిత్రదేవతే, లోకాంతరం గతాఽసి." అనగా [హా! దేవీ! దండకారణ్యవాసప్రియసఖీ! చారిత్రదేవతా! నీవు లోకాంతరము నొందితివే!] యని మూర్ఛితు డాయెను.

లక్ష్మణుడు—

"భగవన్ వాల్మీకే, పరిత్రాయస్వ, పరిత్రాయస్వ, ఏష కిమ్ తే కావ్యార్థః" [పూజ్యుడ వగు నో వాల్మీకీ! రక్షింపుము. రక్షింపుము. ఈనీకావ్యమున కర్థ మిదియేనా?] యనెను.

ఆసమయమున నేపథ్యమున దైవవాణి "భోభోః సజంగమస్థావరాః ప్రాణభృతో మర్త్యామర్త్యాః! పశ్యత భగవతా వాల్మీకినానుజ్ఞాతం పవిత్ర మాశ్చర్యమ్."

[ఓ చరాచరములారా, మర్త్యామర్త్యులారా! పూజనీయుడగు వాల్మీకిచే ననుష్ఠింపబడిన ఆశ్చర్యమును గనుగొనుడు] అనగా

లక్ష్మణుడు చూచి—

"మంథాదివ క్షుభ్యతి గాంగ మంభో
వ్యాప్తంచ దేవర్షిభి రంతరిక్షమ్;
ఆశ్చర్య మార్యాసహ దేవతాభ్యాం
గంగా మహీభ్యాం సలిలా దుదేతి".

[మథించినట్లు గంగాజలము క్షోభించగా నంతరిక్షమున దేవర్షిగణము నిండియుండ నార్యయగు జానకి గంగాపృథ్వులతో జలావతరణ మొనరించెను. మహాశ్చర్య] మని యనుకొనెను.

మరల నేపథ్యమున—

"అరుంధతీ జగద్వంద్యే గంగాపృథ్వ్యౌ భజస్వ నౌ;
అర్పితేయం తవాభ్యాసే సీతా పుణ్యవ్రతా వధూః"

[పూజ్యురాల వగు నో యరుంధతీదేవీ! మేము గంగాపృథ్వులము. పవిత్రచరిత్రయై పతివ్రతామణి యగు సీతను నీకర్పించుచున్నాము] అని నధ్వని యయ్యెను.

అప్పుడు లక్ష్మణుడు "ఆశ్చర్య మాశ్చర్యమ్" అని రామునితో— "ఆర్య! పశ్యపశ్య" అని చెప్పెను. కాని రామచంద్రు డంతవఱకును మూర్ఛావిముక్తుడు కాలేదు.

తరువాత సీత యరుంధతితో రాముని యొద్దకు బోయి యాతని స్పృశించి సచేతనునిగావించెను. రాముడు

లేచి గురుజనమును గాంచెను. అరుంధతీదేవి గంగా ప్రభృతులతో బరిచయ మొనరించెను.

రాముడు—

"కథం కృత మహాపరాధో భగవతీభ్యా మనుకంపితః."

[ఇట్టిమహాపాపినగు నేను మీచేనెట్లు లనుగ్రహింపబడితిని.] అని ప్రణమిల్లెను.

తర్వాత నరుంధతి ప్రజామండలితో—

"భోభోః పౌరజానపదాః, ఇయ మధునా భగవతీభ్యాం జాహ్నవీవసుంధరాభ్యా మేవం ప్రశస్య మమారుంధత్యాః సమర్పితా పూర్వంచ భగవతా వైశ్వానరేణ నిర్ణీతపుణ్యాచారిత్రా సబ్రహ్మకైశ్చ దేవైః సంస్తుతా సవితృకులవధూ ర్దేవయజనసంభవా సీతాదేవీ పరిగృహ్యత ఇతి కథం భవంతో మన్యంతే"

[ఓ పౌరజానపదులారా! వసుంధరా భాగీరథులు వైశ్వానరునిచేతను, బ్రహ్మాదిదేవతలచేతను, బొగడ్తగనిన దేవయజనసంభవయగు సూర్యకులవధువును ప్రశంసాపూర్వకముగ నిచ్చిరి. ఈమె నిపుడు రాముడు పరిగ్రహించుచున్నాడు. ఇది మీ మనస్సమ్మతమేకదా?] అనియనెను.

అప్పుడు లక్ష్మణుడు—

"ఏవ మార్యయారుంధత్యా నిర్భర్త్సితాః ప్రజాః. కృత్స్నశ్చ భూతగ్రామ ఆర్యాం నమస్కరోతి. లోకపాలాశ్చ సప్తర్షయశ్చ పుష్పవృష్టిభి రుపతిష్ఠంతే."

[పూజ్యురాలగు నరుంధతి సీతాపవాదులగు ప్రజలను భయపెట్టెను. ప్రాణిసమూహమంతయు నార్యయగు సీతకు ప్రణమిల్లుచున్నది. లోకపాలురును ఋషిగణములును బుష్పవృష్టిని వర్షించుచున్నారు.]

అరుంధతియాజ్ఞచే రాముడు సీతను బరిగ్రహించెను. ఆసమయమునసే కుశలవులు ప్రవేశించిరి. అభ్యర్థనాలింగనాశీర్వాదములు జరిగెను. యవనికాపతన మయ్యెను. ఒకయంకమునసే యభినయమున వియోగమును యథార్థసీతారామసమ్మేళనమును నొనరించెను. కాని నిజముగ కథ యడ్డముగ దిరిగెను. వాస్తవమున వియోగము, అభినయమున సంయోగము కలిగెను. సీత రసాతలప్రవేశానంతరకథ కేవలము కవికౌశల్యమును వెలితిచేయుచున్నది. అభినయమున జూపబడిన యీ గంభీరకరుణాదృశ్యానంతరము, ఈకల్పితసమ్మేళనము పీనుగుపై జేసిన పిచ్చివానిహాస్యమువలెను బాదుపల్లెయందలి ప్రాతఃకాలసూర్యకిరణములవలెను, శోకార్తునిపై వ్యంగ్యమువలెనుగనబడుచున్నది. కాని పాపము కవి యేమి చేయ గలడు? సమ్మేళన మొనరించియే తీఱవలెను. అందుచేతనే యాతడు కావ్యకళను హత్యగావించి యలంకారశాస్త్రమును రక్షించెను.

కాళిదాసు బుద్ధిమంతు డగుటచే గావ్యకళకు గాని, అలంకారశాస్త్రమునకుగాని, ఎట్టికష్టమును వాటిల్లనికథనే ఏర్పఱుచుకొనియెను. భవభూతి అలంకారశాస్త్రమును క్షుణ్ణముగావించి తన నాటకమును జక్కగ రచించుటకు వీలులేని గాథ నేర్పఱచికొనెను.

భవభూతి తననాటకము నీవిధముగ సమాప్తినొందించి కేవలము కావ్యకళను జంపుటయేకాక పూర్వోక్త కావ్యన్యాయము (Poetic Justice) కుత్తుక నదిమెను. అత్యాచారుడగు పురుషుని జివరకు సంతుష్టునిగ నొనరించుట కేపాఠకుడుగాని, ఏశ్రోతకాని ఏవిధమగు సంతోషసమ్మతుల నొసంగడు? కాని భవభూతి తన నాటకము నట్లే యొనరించెను.

శకుంతలను విడుచుటయందు దుష్యంతుడు దోషికాడనియు, నా యాచరణమునకు భ్రాంతియే కారణమనియు గవి చూపించెను. ఆభ్రాంతికూడ దైవఘటనమే కాన దుష్యంతుడు దోషియనుటకు వీలుపడదు. కాని రాముడు సీతనువిడుచుటయం దట్టిభ్రాంతి కాని ప్రమాదముకాని లేకనే తెలిసి తనయిచ్ఛానుసారమువర్తించెను. ప్రజాలాపములవిచారణచేయక విశ్వసనీయయు, పతిగతప్రాణయు, నాజన్మదుఃఖినియు నగుజానకి నొంటరిగ నరణ్యమున నుంచెను. ఈ యాచరణమున దనకును గష్టము సంభవించె ననుటయందు సందియము లేదు; కాని ఈకష్టము స్వీయదోషమున సంభవించినదే. రామునికి గష్టము కలిగినదనినంతనే సీత నరణ్యమున విడుచుట న్యాయమని చెప్పజనదు. రాముడు సీతాప్రవాసమువలన రాజధర్మపాలన మొనరించితి ననుకొనియెను; కాని సత్యముగ నతను తనకర్తవ్యము నొనరించలేదు. ప్రజలు చెప్పినంత నంధుడై వినుటయు మన్నిం

చుటయు రాజధర్మ మనం బడదు. న్యాయవిచారణమే రాజకృత్యము. సీత తనపత్నియయ్యును ప్రజాభాగమున జేరియున్నది. తల్లి, సోదరుడు, భార్య, పుత్రుడు మొదలగువారలకు ప్రజేచ్ఛామాత్రమున వనవాసశిక్ష కాని, మరణదండనముగాని యుచితమగునే! బ్రూటస్ (Brutus) తనపుత్రుడు వాస్తవముగ దోషియగుటజేసియే, ప్రజాభియోగమును మన్నించి కుమారునికి మరణదండన విధించెను. సీతపై నట్టియభియోగమే తేబడెను. సీత నిరపరాధినియని తనకు దెలిసినందున ప్రజలయెదుట సీత నిర్దోషియని ప్రమాణముచేయవలసినయవసర ముండినచో నిర్వాసశిక్షకుబూర్వమే మఱియొకమా రగ్నిప్రవేశప్రస్తావన మొనరించియుండవలెను. కాని యట్టిదెద్దియును జరుగలేదు. అభియోగము వచ్చెను; వనవాస శిక్ష నిచ్చెను. సీతకును గొంతయాస్థిత్వము లేకపోలేదు. ఆమెహృదయము తదితరులహృదయమువంటిదే కాన రాముడు దానికి దుఃఖముగలిగించుట యొప్పజనదు. అట్టి రాముడు సీతను బొందుట కనర్హుడు; అయోగ్యుడు. రాముడు సీతను బొందలేదు; ఇది కావ్యన్యాయము. భవభూతి రాముడు ప్రజారంజనార్థ మొకగొప్పకర్తవ్యమునుండి స్ఖలితుడయ్యెను. అది న్యాయవిచారణము. దీని నాతడు పాలించలేదు. జాగ్రదవస్థలో మధ్యాహ్నము రెండుజాములకు, నిరపరాధినియు బద్ధానురాగయు నగుసీతకు వనవాసశిక్ష పరోక్షమున నొసంగెను. ఇందుచే నాతడు సీతను బొందుట కయోగ్యు డయ్యెను. రాముడు యజ్ఞావసరమున సువర్ణసీత నుంచినదియు, సీతకొఱకు గోలపెట్టుచు నరణ్యముల దిరిగినదియు సత్యమే. దానితోగూడ నామెమీద తేబడిన యభియోగమున న్యాయవిచారణ మొనర్పనిదియును సత్యమే. కావుననే సీతాగ్రహణమున కాత డయోగ్యుడు. ఈ విషయమున వాల్మీకి యొనరించినదియె సమంజసము. కాని భవభూతి ఈసమ్మేళన మొనరించి యొక్కమాఱుగ గావ్యకళను గావ్యన్యాయమును రెంటిని హత మొనరించెను.

సీత తన పాతివ్రత్యప్రభావమున మరల రాముని గూడెనని కొందఱు సాహసించెదరు. ఇది సీతయెడల ఘోరతమమగు నపవాదమని నా యభిప్రాయము. సీత స్వయముగ రాముని విడిచిన నేదోషమున నామె చేసియుండెనో మరల విశేషించి యేగుణముననామె యాతని బొందెనో తెలియజేయవలసియుండెను. ఈ విషయమున సీతదోష మిసుమంతయు గాన్పింపదు. దోషి రాముడే; తన దోషముననే రాముడు దన ధర్మపత్నిని బోగొట్టుకొని కూర్చుండెను. యోచించిన నీయపవాదము కేవల మొకసీతకే కాక ధర్మగతి కంతటికి సంభవించును. దీనికే ఆంగ్లేయమున (Adding insult to injury) అనగా "గోరుచుట్టుపై రోకటిపోటు" అని యందురు.

ఎవరు స్త్రీజాతి, మందిరములందలి సామాన్య పదార్థములతో సమానమనియు స్వాధీనాస్థిత్వములు దానికి లేవనియు, భావించి కేవలము కామదృష్టినే కాంతురో వా రీనాపూర్వోక్తాభిప్రాయము ను గనజాలరు. ఎవరు పతి చరిత్రహీనుడైనను, దుష్ప్రవర్తనుడైనను స్త్రీ యాతని చరణములకు లొంగవలెననెడియు, నొక్కపర్యాయమా మెభ్రష్టయైనంతనే పతియామెతలనఱకదగుననియు, బత్నీపతులనీతినిమాత్రము గ్రహింతురో వారికొఱకీనా ప్రయాసము కాదు. స్త్రీజాతి దుర్బలమనియు, నసహాయ మనియు గోమలప్రకృతియనియు నేనొప్పుకొందును. స్త్రీ పురుషస్వాధీనముననే యుండవలెననియు బురుషునిసత్ప్రవర్తనముకన్న స్త్రీసత్ప్రవర్తన మనేకాంశము లధికముగ నుండదగినవనియు ననునియమముల నేనంగీకరించెదను. కాని యామెకును గొంత స్వాతంత్ర్యాస్థిత్వము గలవని నా యాశయము. జ్యోతిశ్శాస్త్రాది గ్రంథనిర్మాతలను, రాజ్యశాసనముల సృష్టించిన సమర్థులును నగు సతీమతల్లులకు పుట్టినిల్లైన మనభరతఖండమున నారీజాతిని కేవల మింటియందలి ఇతరసామగ్రులనుబోలె జూచుటయును, కేవల ముపభోగ్యవస్తుమాత్రముగ నెంచుటయు మిగులహీనము. అనేకవిధముల స్త్రీ పురుషుని కన్న నెక్కువయనియే నేను భావించెదను. శారీరకమానసికబలముల స్త్రీ పురుషునికంటె లోపించినను సేవ, సహనము, శీలత, స్నేహము, స్వార్థత్యాగము, ధర్మానురాగము, చారిత్రికమాహాత్మ్యము వీనియందామెయే సర్వదాశ్రేష్ఠురాలు. దుర్బలయైనంతమాత్రముననె యవిచారము నత్యాచారము నామెయెడ జరుపు టనుచితము.

సభ్యతాభ్యుదయముతోపాటు పురుషజాతి స్త్రీజాతి నధికముగ సమ్మానింప బ్రారంభించినది. కాని కి

గారవమేమన సభ్యతాభివృద్ధి యగుచున్నదని క్రమముగ విచారశీలురగు పురుషు లుద్బోధిల్లుచున్నారు. హస్తగతు డగు శత్రువునే బాధింపనిసభ్యుడు జీవనసంగినియు, గృహజ్యోతియు, నర్ధాంగియు, సహధర్మిణియు నైన భార్యయెడల దయాపూర్ణుడు గానేరడా? పురుషజాతి స్త్రీజాతి కొసగుసమ్మానమునుబట్టియే సంఘసభ్యత నిర్ణయింపవచ్చునని కొందఱు మనీషులు నుడివెదరు. ఆర్య జాతి జాతీయోన్నతి నొందియున్న సమయమున బురుషులు స్త్రీల నెక్కువగ గౌరవించుచుండిరి. భవభూతి నాటకముననే దానికి గొన్ని యుదాహరణములు గలవు. రామచంద్రుడు సీతను "దేవి!" యని సంబోధించుటయు, సీత తన యభిలాషమును బ్రకటించిన "ఆజ్ఞాపయ"యని నుడువుటయు మొదలగునవి. సభ్యులైన యాంగ్లేయు లీ నియమము ననుసరించెదరు. ఇదియే సమ్మానమునకు బరాకాష్ఠ. నేడట్టి యార్యజాతీయు డగు నేగృహమేధియైనను బతి స్త్రీయెడ తనకర్తవ్యము పాలింపకపోయినను స్త్రీమాత్రము తన కర్తవ్యము నెరవేర్పవల యునని యాశయము నొందినచో, నాజాతి కట్టిదుర్దినము సంభవించెనని యనుకొనక తప్పదు.

రంగస్థలమున యుద్ధము దర్శింప దగనిది యగుటచే గవి లవచంద్రకేతుల యుద్ధమును విద్యాధరీ విద్యాధరుల ప్రసంగమూలమున విస్తృతవర్ణన మొనరించెను. ఈ యుద్ధకల్పనము తనకవిత్వసామర్థ్య ప్రకటనము నకే కవి నాటకమున జేర్చియుండునని తోచెడిని. కావుననే నాటకమునకు దీనివలని ప్రయోజనము గాన్పించదు. కవిత్వసందర్భమున జూచిన నీయుద్ధవర్ణన మమూల్యము. దీని సౌందర్యమును ముందు వర్ణించెదను.

ఈరెండు నాటకములందును గొన్నికొన్ని సాదృశ్యములును, గొన్నిగొన్ని వ్యత్యాసములును గాన్పించుచున్నవి. రెండు నాటకములలోని గాథయు రాజుల ప్రణయసంబంధమైనదే. రెండిటియందును బ్రణయినులు మానుషసంభవలు. రెండు నాటకములలోను నాయకులు నాయికలను బరిత్యజించిరి. అట్లు త్యజింప బడిన నాయికలు దైవశక్తిచే దపమాత్రాలయముల జేరిరి. వియోగానంతరమే పుత్రప్రాప్తియు, వారివలననే పునస్సమ్మేళనమును రెండిటియందును గలదు.

సాదృశ్యమునకన్నను వ్యత్యాసమే యధికముగ గాన్పించెడిని. శాకుంతలమున గాముకు డగు రాజు శకుంతలారూపమునుజూచి యున్మత్తుడగును. ఉత్తర రామచరిత్రమున రాజు కర్తవ్యపరాయణుడై సీత గుణాధిక్యమున కలరి ప్రేమించును. మొదటినాటకము యొక్కవిషయము ప్రణయప్రథమోద్దామోచ్ఛ్వాసము. రెండవదానివిషయము బహుదినసంసర్గముచే నుత్పన్నమైన ప్రణయగంభీరనిర్భర భావము. మొదటి నాటకమందలి నాయకుడు కొలదికాలముననే నాయికను మఱచెను. రెండవదానియందు వియోగమున నాయకుని మనము నాయికాస్మృతిచే బరిపూర్ణమైయుండెను. ఒకనికనేకరాణులు గలరు. రెండవవాడు భార్య నరణ్యమున విడిచినను నన్యపత్నీస్వీకార మొనరించలేదు.

రెండునాటకములలోని నాయికలందును విశేష వ్యత్యాసము గలదు. శకుంతల యువతి; సీత ప్రౌఢ. శకుంతల తాపసి; సీత రాణి. శకుంతల యుద్దామప్రవృత్తిచే చంచల; రాజును జూచినంతనే మనశ్చాంచల్యము నొందెను; పాలకుడగు కణ్వునాజ్ఞ గొనుటకైనను నామెకు వ్యవధి లేదు. కాని సీత ధీర; అచలవిశ్వాసిని; రామాశ్రయముననే కృతార్థురాలనని భావించెను. శకుంతల గర్విత; సీత భయవిహ్వల. సత్యమున శకుంతల తపస్విని యయ్యు గృహిణియే; సీత గృహిణియయ్యును దపస్వినియే.

సంక్షేపముగ నిట్లు చెప్పనగును. శాకుంతలమున నాయకీనాయకులు యథార్థమున గాముకీకాముకులు. ఉత్తరరామచరిత్రమున నాయకీనాయకులు దేవీదేవులు.

ద్వితీయ పరిచ్ఛేదము

చరిత్ర చిత్రణము

౧. దుష్యంతుడు-రాముడు

మహాభారతమందలి దుష్యంతుడు, భీరువును,లంపటుడును, మిథ్యావాదియు నని ప్రథమపరిచ్ఛేదముననే చెప్పియుంటిమి. రాజయోగ్యములగు గుణములందువిశేష గుణ మెయ్యదియు నాతడు గలిగియుండలేదు. దుష్యంతునియందేగుణములుగలవో యయ్యవి సామాన్యరాజులందఱును గలిగియుందురు. మృగయాసక్తి, కామ సహి

ష్ణుత, రణశాస్త్రవైశారద్యము, వీరత్వము ఇత్యాదిగుణము లాతనికడ గలవు. కాని రఘుమహారాజుకరణి దిగ్విజయత్వమును, విజయునివలె సమస్తశత్రుచే నావిజయత్వమును, భీష్మునికేవ ప్రతిజ్ఞావాదిత్వమును, యుధిష్ఠిరసమానసత్యవాదిత్వమును, గర్ణునిబలె దాతృత్వమును, లక్ష్మణునివంటి స్వార్థత్యాగమును, విదురునిబోలె తేజస్విత్వమును నాతనికడలేవు. కావుననే దుష్యంతు డొకయతి సాధారణరాజమాత్రుడే.

కాళిదాసు తన కథానాయకుని మిగుల నుచ్చస్థానమునజేర్చి దోషములనుండి చక్కగ గాపాడెను. కాని కవి యెంతకష్టించినను దోషరహితమగు చరిత్రను జిత్రింపజాలడయ్యెను. దుష్యంతుడు వ్యాయామకౌశలు డగుటచే దృఢశరీరుడును మృగయాసక్తి గలవాడును నై యుండెను. దీనినే కవి

శ్లో. "అనవరత ధనుర్జ్యాస్ఫాలన క్రూరకర్మా
రవికిరణ సహిష్ణుః స్వేదలేశై రభిన్నః;
అపచితమపిగాత్రం వ్యాయతత్వా దలక్ష్యం
గిరిచర ఇవ నాగః ప్రాణసారం బిభర్తి"

[రవికిరణముల సహించుచు ధనుర్జ్యాస్ఫాలన పూర్వకముగ క్రూరకర్మ మొనరించుచున్నను, శరీరమున స్వేదోద్గమము కాని, వ్యాయామపరు డౌట నాయాస కృశత్వములుగాని లేక గిరిచరమగు కరివలె ప్రాణసారము భరించుచున్నాడు] అని వర్ణించెను.

కాని ఈవర్ణనమువలన నాతడు దివారాత్రములు విలాసమగ్నుడై యంతఃపురమున నుండక శ్రమను సహించుచు మిగులపాటుపడువాడని తెలియనగునుగాని, దీనిచే నిర్దోషమగు గుణముగలవాడని తేలుటలేదు. ఈశ్రమసహనస్వభావమున నాత డేమహత్కార్యమును జేసి యుండలేదు. వేటయందైనను భయముచే బారుమృగముల జంపెనేకాని క్రూరములగు సింహవ్యాఘ్రాదుల జంపియుండలేదు. ఈవేటను మన్వాదిధర్మశాస్త్రకారులు కేవలము వ్యసనముగ బరిగణించిరి. కాని సేనాపతి మాత్ర మీసందర్భమున—

"మేదశ్ఛేదకృశోదరం లఘు భవ
త్యుత్సాహయోగ్యం వపుః,
సత్వానామపి లక్ష్యతే వికృతి
మచ్చిత్తం భయక్రోధయోః;
ఉత్కర్షః సచ ధన్వినాం
యదిషవః సిద్ధ్యంతి లక్ష్యే చలే,
మిథ్యాహి వ్యసనం వదంతి
మృగయా మీదృగ్వినోదః కృతః."

[మేదస్సు తగ్గుటచే నుదరము పలుచబడి శరీరము చులకనయై మనోత్సాహము గలుగును. జంతుజాలముల భయక్రోధాదిస్వరూపముల దెలియనగును. చలల్లక్ష్యముల నైన భేదించునంతటిసామర్థ్యము కలుగును. కావున ధనుర్ధారుల కిది యవశ్యాచరణీయము. వినోదమున దీనినిబోలినకార్య మెద్దియును లేదు. దీనిని వ్యసనమని నుడివిన మన్వాదులవాక్యములు మిథ్యలు] అని నుడివెను.

ఇవి కేవలము క్షీణవాక్యము. వీటివలన మృగముల భయక్రోధాదిస్వరూపముల దెలియగలిగినను దానివలని విశేషలాభ మెద్దియును లేదు. డార్విన్ (Darwin), జాన్ లబక్ (John Lubbuck) అను వీరిరువురును వేటచేగాక స్వయముగ ననుసరించి చూచుటచే మృగముల చిత్తవికారాదిగుణముల గ్రహించగలిగిరని తెలియుచున్నది. క్రొవ్వు తగ్గుటయు, శరీరము చులకనగుటయు, మనోత్సాహము గలుగుటయు కేవలప్రాణిహింసాస్వరూపమగు వేటవలనగాక నితరవ్యాయామాదుల వలనను సంభవించును. ప్రాణిహింసా వ్యతిరిక్తములై మనోవినోదకరములగు వ్యాయామము లీప్రపంచమున నెన్నియో కలవు. సేనాపతి నిస్సారమగు నీ మృగయావర్ణన మొనరించకున్నను నాటకాలంకారమునకు గళంకము ప్రాప్తించి యుండదు.

అనంతరము దుష్యంతుడు రాక్షసు లొనరించు నత్యాచారనివారణార్థమై ఋషులచే నామంత్రితుడై కొన్నిదినములు గణ్వాశ్రమముననే యుండెను. కాని దాని కంతర్గతమగు కారణము మఱియొకటి కలదు. ఆ సమయమున విదూషకుడు "ఇయ మిదానీ మనుకూలా భ్యర్థనా" [ఈనీయాహ్వాన మనుకూలముగనే యున్న]దనెను. అనంతరము రాజు హుంకారగర్జనలు వేయుచుండి నది నిజమే. మఱల ద్వితీయాంకాంతమున రాజు "భో భో స్తపస్వినః మాభైష్ట, మాభైష్ట; అహ మాగత ఏవ" [ఓతప

స్వలారా! భయపడకుడు; భయపడకుడు. ఇదిగో నేను వచ్చుచున్నాను] అని పలికెను. కాని యాశౌర్యము శారదమేఘమువలె గర్జనమాత్రమే కాని వర్షప్రదము గాదు. నాటకమున నెక్కడను గవి దుష్యంతుని వీరత్వమును గనబఱచలేదు. కేవలము హుంకారరవమును మాత్రమే కనబఱచెను. షష్ఠాంకమున మాత్రము దానవధ్వంసము చేసి స్వర్గమునుండి మఱలివచ్చినట్లు చెప్పబడినది. కాని యదియు మాతలివాక్యముచే దుష్యంతుని గారవము అంతగ బోషింపబడదు.

సఖ్యుస్తే సకిల శతక్రతో రవధ్య
స్తస్య త్వం రణశిరసి స్మృతో నిహంతా,
ఉచ్ఛేత్తుం ప్రభవతి య న్న సప్తసప్తి
స్త న్నైశం తిమిర మపాకరోతి చంద్రః."

[నీసఖుడగు దేవేంద్రునకు దానవు లవధ్యులు. రణక్షేత్రమున నీచేతనే వారికి మృతి సంభవించెను. నిశాంధకారమును సూర్యు డపనయింప నేరడు. చంద్రుడే దాని నడంచును] అని పలికెను.

గోజాతి హిందువులకె ట్లవధ్యమో దానవు లట్లు దేవతల కవధ్యులు. కాని యజేయులుగారని భావము. కావున నింద్రుపరాక్రమము సూర్యతుల్యముగను, దుష్యంతుశౌర్యము చంద్రసదృశముగను వర్ణింప బడినది. మాతలిచే నొనరింపబడిన యీ స్తవ మాతని నోటనుండి వెలికిరాక కేవల మూహ్యముగనుండిన దుష్యంతున కధికసంతోషదాయకముగ నుండియుండును. ఇంద్రసభయందు దుష్యంతునికి జరిగినసమ్మానము సత్యమేకాని యది దేవేంద్రునిసౌజన్యమును బ్రకటించును గాని దుష్యంతుని శౌర్యోపపాదికా నేరదు.

ధర్మశాస్త్రములందును, బ్రాహ్మణవచనములందును దుష్యంతున కెక్కుడాస్థ కలదు కాని యది ప్రతి భారతీయునియెడలను గానబడియెడిని. దానిచే నాతని గుణవిశేష మెద్దియును బయల్పడదు. కాని కణ్వాశ్రమమున నతిథియై గుప్తరూపమున శకుంతలను బరిణయ మాడుటచేనాతనివిశ్వాసఘాతుకత్వమేబయల్పడుచున్నది. పవిత్రమగు మహర్ష్యాశ్రమము నతడు గలుష మొనరించుటచే నాయాచరణమునకు దగినఫలముగ దుర్వాసశాపము బొంద యోగ్యుడగును. కాని పాపము, రాజుచే శోభాప్రాప్తయగు శకుంతలయు శాపగ్రస్తయయ్యెను.

దుష్యంతు డనంతరము స్వాచరణీయమగు తల్లి యాజ్ఞను "సఖే,మాఢవ్య, త్వమప్యంబాభిః పుత్రఇవ గృహీతః" [మిత్రమా! మాఢవ్యుడా! నీవు తల్లిగారిచే బుత్రప్రీతిని బెంపబడుచున్నావుగదా]అని విదూషకుని తల నప్రీతికరమగు నకార్యభార మునిచి తాను దుష్యవనరక్షణార్థము బయలుదేరెను. కాని యది శకుంతలతో బ్రేమాలాపముల నొనర్చుటకు యె త్తినదొంగయెత్తు. ఇంకను నాతనిసత్యపరత్వము మనమీయంకమున జూడ గలము. రాజు వయస్యునితో

"క్వ వయం; క్వ పరోక్షమన్మథో
మృగశాబైః సహ మేధితో జనః;
పరిహాసవిజల్పితం సఖే!
పరమార్థేన న గృహ్యతాం వచః."

[సకలకళాపరిపూర్ణతచే నాగరికాగ్రగణ్యులమగు మన మెక్కడ? కామమన నేమియో తెలియక మృగశాబకములతోపాటు పెరిగిన నీయారణ్యకజన మెక్కడ? కాన నే నింతకుబూర్వము చెప్పినదంతయు బరిహాస విజల్పితమేకాని పరమార్థముగ గ్రహింపదగినది కాదు] అనియెను.

పాపము రాజున కిప్పటినుండియె రాణులవలని భయ ముత్పన్న మైనది. మహాకవి కాళిదాసు వేషము లెన్ని వేసినను మనోగతపాపమును మాత్రము దాచజాలక పోయెను. ముఖ్యముగమనోగతభావ మెయ్యదియో య య్యది బయల్పడుట సహజమే. కావునసె ఈసందర్భమున రాజుమనోగతము బయల్పడియెను.

ప్రథమాంకమున శకుంతలయెదుట రాజు తన విషయమున యాథార్థ్యమును దెలుపక అనృతమాడెను. చోరునివలె దాగియుండి సఖీసహితయగు శకుంతలాసల్లాపముల వినెను; తరువాత నింకను దెలియదగిన విషయముల బ్రశ్నించి తెలిసికొనియెను. ఈచార్యమునందును, నీయసత్యాలాపమునను, నీమిథ్యాపరిచయము కలుగ జేసికొనుటయందును సదుద్దేశముకలదా ?

విశేషప్రయోజన మెద్దియేని లేకున్న ప్రజలు వంచనచేయఁబూనరు; కాన రాజుకూడ శకుంతలామనోగతోద్దేశమును దెలిసికొనునిచ్ఛచే వంచించెను. మహారాజని తెలిసినచో శకుంతల నిర్భయముగ మనసిచ్చి మాటలాడి యుండదు. వివాహమునకుముందు కొంత పరిహాసాలాపముల నొనరించియుండవలసి యుండెను. బహుశః ఇయ్యదియే దుష్యంతుని యభిప్రాయమై యుండనోవు.

దుష్యంతుని గుణములందు ప్రధానము ధర్మభీరుత్వము నే కనబరచెను. పంచమాంకమున రాజు శకుంతలా గ్రహణ మొనర్పక—

"భోభో స్తపస్వినః; చింతయన్నపి నఖలు స్వీకరణ మాత్రభవత్యాః స్మరామి; తత్కథమిమా మభివ్యక్తసత్వ లక్షణా మాత్మాన మక్షత్రియం మన్యమానః ప్రతిపత్స్యే."

[ఓ తపస్వులారా! ఎంత యాలోచించినను నే నీమె నెప్పుడును స్వీకరించినట్లు స్మృతికి రాలేదు. గర్భలక్షణవతియగు నీకామినిని బరిగ్రహించి నన్ను క్షత్రియకళంకునిగ నెట్లొనరించుకొందును? అపరిచితయగు గర్భవతిని బరిగ్రహించుట క్షత్రియధర్మనిరుద్ధ] మనియెను.

కాని ఇందువలన నాతని చరిత్ర మాహాత్మ్యము వృద్ధినందవయ్యెను. ప్రతి సత్పురుషుని యాచరణము నిట్లే యుండును. సుందరియగు రమణినిజూచినంత గామోద్రేకము జనించుటయు, దాని నణచుకొను శక్తిలేకుండుటయు బశుతుల్యులగు పురుషకృత్యములు. ఈ కవిమతానుసారము రఘువంశమున జన్మమెత్తిన ప్రతిరాజును "[మనః పరస్త్రీ విముఖః ప్రవృత్తిః] బరస్త్రీవిముఖుడే. కేవలము పరస్త్రీ విముఖత్వమున శ్రేష్ఠత్వ మాపాదింపబడదు. బైరన్ (Byron), డాంజువన్ (Donguon), కావ్యములలోని విషయము సుప్రసిద్ధము. సభ్యుడగు ప్రతిమనుజుడును బరస్త్రీని మాతృభావమున జూచును. అట్లొనర్చకుండుట నింద్యమె కాని పరస్త్రీ విముఖతయే విశేషమున వలనుపడదు.

కవి తన కథానాయకుని నింకను గొన్ని మహద్గుణములచే నలంకరించెను.

షష్ఠాంకమున రాజు దా వ్రాసిన శకుంతలాచిత్రమునుజూచి విదూషకునితో నుత్కృష్టచిత్రలక్షణముల

"అస్యాస్తుంగమివ స్తనద్వయమిదం నిమ్నేవ నాభిః స్థితా,
దృశ్యంతే విషమోన్నతాశ్చ వలయో భిత్తౌ సమాయామపి;
అంగేచ ప్రతిభాతి మార్దవమిదం స్నిగ్ధప్రభావాచ్చిరం
ప్రేమ్ణా మన్ముఖ మీషదీక్షితఇవ స్మేరా చవక్తీవమాం."

[చిత్రము సమతలమున జిత్రింపబడినను శకుంతలా స్తనద్వయము నిక్కియున్నది. నాభి నిమ్నముగనున్నది. త్రివళులు విషమములై కన్పట్టుచున్నవి. తైలపురంగు వలన నవయవములు గోమలత్వముచే స్థిరముగ ప్రకాశించుచున్నవి. ప్రేమపూర్ణకటాక్షముల నావైపు జూచుచు నెద్దియో మాటాడ నుద్యుక్తయైనట్లు తోచెడిని] అని పల్కెను

తిరోహితయై దుష్యంతకృత్యముల నుపలక్షించుచుండిన మిశ్రకేశియను నప్సరస యాచిత్రమును జూచి యథార్థమగు శకుంతలయని భ్రమచెందెను. చిత్రమును జూడజూడ జిత్రకారుడగు రాజునకే యట్టిభ్రమకలిగియున్మత్తతనొంది శకుంతలా ముఖకమల మధుపానాభిలాషియగు చిత్రలిఖితభ్రమరమును జూచి "అయి! భోః! కుసుమలతాప్రియాతిథే! కిమత్రపరిపతనఖేద మనుభవసి ?

"ఏషా కుసుమనిషణ్ణా తృషితాఽపి సతీ భవంతమనురక్తా;
ప్రతిపాలయతి మధుకరీ నఖలు మధుత్వాంవినా పిబతి."

["పుష్పలతాప్రియాతిథివగు నో భ్రమరమా! ఏల నిచ్చట పరిపతనఖేద మందుచున్నావు? ఈకుసుమము నందలి మధుకరి త్వదీయానురక్తయగుటచే దప్పిగొనినను నీదిక్కే కనుచు నీవులేక మధుపానమును జేయుటలేదు] అనియెను.

ఇట్లనినను భ్రమర మెగురకుండుటచే గోపము వహించి—

"భో నమే శాసనే తిష్ఠసి; శ్రూయతాం
తర్హి; సంప్రతిహి—
అక్లిష్టబాలతరుపల్లవ లోభనీయం
పీతం మయా సదయమేవ రతోత్సవేషు;
బింబాధరం దశసి చే ద్భ్రమర! ప్రియాయాః
త్వాం కారయామి కమలోదరబంధనస్థామ్."

[ఓ భ్రమరమా! నాయాజ్ఞను బాలించవా? అట్లయిన వినుము. అమలినమై పల్లవసదృశమై మనోలోభనీయమగు ప్రియురాలియే యధరమును సురత సమయమున సదయముగ గ్రోలుచుంటినో దానిని నీవు నిష్ఠురముగ దంశనమొనరించినచో నిన్ను గమలోదరమున బంధించెదను] అనియెను.

విదూషకుడు రాజుచిత్తవిభ్రమమును గనుగొని భయ మొందె—

"భోచిత్రం ఖలు" [మహారాజా! ఇదిచిత్ర]మని తెలిపెను.

రాజపుడు మోహయుక్తుడై "కథం,చిత్రం?" [ఏమి? ఇది చిత్రమా?] యని యడిగెను.

ఎవనికిట్టి చిత్రరచనా నైపుణ్యముగలదో వాడుత్కృష్ట చిత్రకారుడే యని యెంచదగును.

పంచమాంకమం దొక యపూర్వమధుర శ్లోకమున దుష్యంతచరిత్రమందు నుతియొక విశేషము గానవగును. రాజు రాజధానింజేరి శకుంతలను మఱచి సభయందు గూర్చుండి సంగీతము వినుచు నిట్లు యోచించెను:

"రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్,
పర్యుత్సుకో భవతి యత్సుఖితోఽపి జంతుః;
తచ్చేతసా స్మరతి నూనమబోధపూర్వం
భావస్థిరాణి జననాంతరసౌహృదాని."

[ఏజీవి సుఖముగ నుండినను మనోహరవస్తువుల జూచికాని మధురశబ్దముల నాలకించికాని ఉత్కంఠచిత్తయగుచున్నదో ఆజీవి నిశ్చయముగ దనమనమున విస్మృత పూర్వజన్మ స్థిరభావయుక్త సుహృద్భావమును స్మరింపుకొనుచున్నది"] అని భావించెను.

దుష్యంతుని మనమున నీసందర్భమున నేదియో స్ఫురించుచున్నది. కాని యది మిగుల విస్ఫుటముగ లేదు. అగాధసుఖమున ననంతవిషాద మొందుచున్నాడు. ఆ విషాదమునకు గారణ మెయ్యదియో యతనికి గోచరించుట లేదు. ఈ శ్లోకమువలన రాజునకు శకుంతలయందు గల ప్రేమయును, సంగీతశాస్త్రజ్ఞానమును సమ్మిళితరూపమున నగుపడుచున్నది. ఈప్రేమ దూర్వాసుని శాపమును సైతము గప్పిపుచ్చుచున్నది. ఈ సంగీతశాస్త్రజ్ఞానము కవి కవిత్వమునంతటిని మించుచున్నది. చింత, అనుభూతి, విరహము, మీలనము, స్థిరత, ఉచ్ఛ్వాసము, నిందు గలియుచున్నవి. తరంగకల్లోలమగు నీలసంద్రమున ప్రాతఃకాల భానుకిరణముల చాడ్పున నల్లని మేఘజాలమున బూర్ణచంద్రికాపతనమువలెను, జంద్రికలోని వనశ్రీభ్రాంతిని బోలియున్నది. ఈ విషయమునే షేక్స్పియరుమహాకవి ఇట్లు చెప్పినాడు.

" If music be the food of love, play on ;
Give me excess of it, that surfeiting.
The appetite may s'cken and so die.
That strain again it had a dying fall.
O! it come per my ear like the sweet South.

That breathes upon a bank of violets stealing and giving odour.

ఇది మిగుల సుందరమైనదియే కాని పై శ్లోకమునకుమాత్రము సాటి కానేరదు. ఒక్కమారుగ నిందు విజ్ఞానమును గవిత్వమును లేవు. పూర్వాపరజన్మములు లేవు. అప్సరోనృత్యము, మర్త్యవేదనము, ప్రభాతవృద్ధి,సంధ్యావిషాదము, మాతృరోదనము, శిశుహాసము నందు లేవు. కావున పైశ్లోకమున కిది సాటికాదు. ఈశ్లోకము నిస్సమానము.

ఆఱవయంకమున స్వయముగ రాచకార్యముల నెఱవేర్చుకొనునట్టి రాజయోగ్యగుణము దుష్యంతునందు బొడకట్టుచున్నవి. ఈ యంకముననే విష్కంభమున దుష్యంతుని శాసనప్రణాళిక యొకటి కనబడుచున్నది.

నగరపాలుని బావమఱది యిరువురు సేవకులతో నొకజాలరినిబట్టి తెచ్చెదరు. వా రాజాలరిని రాజనామాంకితాంగుళీయకము నెక్కడ తెచ్చితివని యడుగ ధీవరుడు మత్స్యగర్భమున నది దొరకెనని చెప్పెను. నగరపాలుని బావమఱది యాయుంగరము నాఘ్రాణించి దీనమత్స్యగంధము గలదని దానిని రాజునొద్దకు గొనిపోవును. ఈ సమయముననే జాలరిని దన్నుటకు సేవకులు తమ కత్తుల నెత్తిరి. ఈరోగము సిపాయీల కనాదినుండియు గలదని తెలియుచున్నది. తరువాత నగరపాలుని బావమఱది ప్రవేశించి ధీవరుని విడిపించి రాజదత్తమగు పారితోషికమును వాని కొసగెను. సిపాయీలు వీడు యమమందిరమునుండి మఱలెనని అనిచ్ఛాపూర్వకముగనిట్టూర్పులతో

వదలిరి. శూలదండమునుండి ధీవరుడు విడువబడి నందుకు వారికి మిగుల క్షోభము జనించెను. ధీవరుడు పారితోషిక ద్రవ్యమున సమభాగము సిపాయీలకు మధుపానమున కిచ్చినంత వారికి వానియందు స్నేహము జనించెను.

ఆకాలమునను బోలీసువారల దుండగము లిప్పటి కంటె దక్కువకావని తెలియుచున్నది. ఆ కాలమున గూడ ఖైదినిగాని యపరాధినిగాని తన్నుటకు బోలీసువారి లాటికఱ్ఱ లెగురుచుండెడివి. అదిమనుష్య స్వభావమే. నీచునిచేతిశక్తికిని, బాలకునిచేతి కత్తికిని, ఘాతకునిచేతి బలమునకును నిట్టిఫలమె కలుగుచుండెను. ఆ కాలమునను బోలీసువారు దన్నుటయ కాక లంచముల గొనుటయందు గూడ బ్రవీణులని తెలియుచున్నది. కాని దుర్మార్గులగు పోలీసువారలకుగూడ రాజశాసనాతిక్రమణము దుస్తరమనియు, రాజశాసనము మిగుల దృఢతరముగ నుండెననియును దెలియుచున్నది.

ఈనాటకమున దుష్యంతుని కోమలగుణ మింకొకటి కనబడుచున్నది. ఆతడు శకుంతలాచిత్రమును దర్శించుకాలమున రాణిరాగా భయముచే జిత్రమును దాచెను. ఇట్లె మఱియొకస్థలమునను రాణులభయము చేతనె శకుంతలయందు దనకుండినప్రేమ యసత్యమని విదూషకునితో జెప్పెను. విరహావస్థయందు రాణుల యెదుట శకుంతలాస్మరణము చేయుచు సిగ్గుచే దలవంచుచుండెడివాడు. ఈభయభావము గొన్నిసమయముల దోషమును గొన్నిసమయముల గుణమును నగును. కావున దీనిని జనులెట్లుభావింతురో తెలియదు.

దుష్యంతుని చిత్రరచనానైపుణ్యముచేతను సంగీతజ్ఞానముచేతను నాతని కాయాకళలందలి కౌశలమే తెలియబడునుగాని వానినే కేవలము చరిత్రగుణములుగ నెంచుటకు వీలులేదు. నాయకుడు సర్వగుణసంపన్నుడని నుడువుటకు దగినగుణము లెవ్వియు దుష్యంతుని చరిత్రమున గానబడవు. మహాభారతములోని దుష్యంతుని కన్నను గవి వీని నెక్కువగ జేసెనే కాని యాదర్శప్రాయునిగ జేయుటకు బ్రయత్నించలేదు. అట్లొనర్చియున్నను గృతార్థుడు కాలేదు.

దుష్యంతునివంటి యతిథి బ్రాప్తించుట కేగృహస్థుడును గోరడు. ఇట్టివీరు డేదేశమునను గౌరవింపబడడు. ఇట్టివరుని బడయుట కేయువతియును దైవమును బ్రార్థింపదు. ఏదేశప్రజలైనను నిట్టివానిని రాజుగ గ్రహించరు. అట్టి దుష్యంతుడే యీజగత్ప్రసిద్ధనాటకమునకు నాయకుడు. నాయకునిచరిత్రమందు విశేష మెద్దియునులేనిచో నాటకమున కింతటిప్రసిద్ధి యెట్లుకలిగెనని పాఠకులు ప్రశ్నించవచ్చును. నాయకుని చరిత్రమందు విశేషగుణములు లేకపోయినను గాళిదాసు తననాటకమున ననేకములగు చక్కనివిషయముల నందందు బొందుపఱచెను. అది ముందు దెలియనగును.

ఈనాటకమును మూడుభాగములుగ విభజించవచ్చును. ప్రథమభాగము మొదటి మూడంకములు. అందు బ్రేమచిత్రము వర్ణింపబడినది. రెండవభాగము నాలుగైదంకములు. అందు వియోగవర్ణన మున్నది. మిగిలిన రెండంకములును దృతీయభాగము. అందు సమ్మేళనము సూచితమైనది. ప్రథమభాగమున దుష్యంతునిపతనము—రెండవభాగమున లేవ బ్రయత్నించుట—మూడవభాగమున లేచుటయు గనపఱుపబడినవి.

దుష్యంతునిచరిత్ర మాహాత్మ్య మీపతనోత్థానములం దున్నది. మృగయాసక్తి నరణ్యముల దిరుగుచు ఋష్యాశ్రమము బ్రవేశించి శకుంతలనుజూచి యెంతటి పతనము నొందవలయునో యంతటిపతన మొందెను. పొంచియుండి వినుటయు, దనచరిత్ర గోపన మొనరించుటయు, దర్శనమాత్రముననె శకుంతల నుపభోగ్యాగ్రనుగ నెంచుటయు, తల్లియానతి నుదాసించుటయు, విదూషకుని మోసముచే నసత్యవచనముల జెప్పి రాజధానికిబంపుటయు, వివాహానంతరము గర్భాగమనమునకు బూర్వమె యాశ్రమమునుండి పారిపోవుటయు మొదలగు గర్హ్యములగు కార్యము లెంతవఱకు సంభవములో యంతవఱకు నొనరించెను. ఇట్టి పాపాచరణమునందు గూడ కేవల మొకపుణ్యరేఖమాత్రము గాన్పించుచున్నది. అయ్యది గాంధర్వవివాహము. మొదటి మూడంకములలో దుష్యంతుని గర్హ్యప్రవృత్తివలన గలిగెడి నరకమునుండిసంరక్షించిన దీగాంధర్వమె. దీననె పునరుద్ధారణమును సంభవించెను.

[సశేషము]

స్వప్న విభ్రాంతి

వేదుల సత్యనారాయణశాస్త్రి గారు

పండి వ్రాలిన వరిపైరుపైనఁ బ్రాకి
వచ్చుచిరుగాలి తరఁగల వరుస వోలె
ఈమహానంద పులకిత హృదయ వీథిఁ
బరుగులిడుచుండె వింతభావంబు లెన్నొ!

ఇంత ఘనానందమున కేది హేతువనుచు
వెనుదిరిగి చూచుకొంటి, కెంబెదవు లందు—
చిరునగవు జీరుకాడ, నీచిగురు కేల
నాభుజంబు స్పృశించియున్నావు నీవు.

ఎపుడు గుఱుతించినదొ నీయదృష్టపూర్వ
భవ్యరూపంబు నీకరస్పర్శ మాత్ర
నపుడె పులకించి పులకించి యవశమైన
నాయెద గ్రహించె నీ వాత్మనాథుఁడ వని.


మరుపుదట్టిన కాలంపు మడతలందు
పాడువడనట్టి బహుజన్మ పరిచయంబు
నామలిన బాష్పగుంఫిత ప్రేమసూత్ర
కలితమై నీదుపాదాలఁ గౌఁగలించె.


ప్రకృతిసౌధంపు దక్షిణద్వారమంత
తెఱచుకొనివచ్చి మనల నిర్వురనుగూడ
మృదులవాసంత పరిమళోర్మికలతోడ
బాధలేకుండ బంధించివైచి రెవరొ ?

ఆదృఢాశ్లేషమున భేద మంతరించి
యుభయులముగూడ ప్రేమైక్యమొందినపుడు
కలఁగియెఱుఁగని విస్మృతిగర్భమందె
యవగతములయ్యె మనరహస్యములు మనకు.

అపుడు నిర్మేఘ మార్గశీర్షాభ్రవీథి
వృద్ధసంధ్యాతపస్విని పెదవివిరిచె
విశ్వరాగశ్రుతుల్ నీరవించిపోవఁ
గ్రమ్ముకొనెమృత్యు కైశికకాళిమంబు.

జారిపోయెడు నీస్మితచ్ఛాయలందు
వదలితి సుఖాంత జాగ్రదవస్థ, కాని—
భిన్నమం దైక్యపుఁ జివుళ్లఁ బెట్టు మనల
క్షణిక మీస్వప్నవిభ్రాంతి, యణఁచఁగలదె ?





నూతిగుచ్చి కృష్ణమూర్తి గారు

పండితాదరణము వడసిన ప్రబంధము లన్నిటిలో పాండురంగమాహాత్మ్యమే మిన్నయని చెప్పవచ్చును. ఈ ప్రబంధమును రచియించినది తెనాలి రామకృష్ణకవి. తెనాలి యను నగ్రహారనిర్ణేత. బ్రాహ్మణుఁడు. ఈకవి కులావతంసుశాఖానిర్ణయము ముమ్ముందుఁ బరికింపనగును. సంస్కృతముఁ దెనుఁగుఁ జేయుటయందును, దెనుంగు సంస్కృతముఁ జేయుటయందును నీకవిని మించినవా రుండరని చెప్పవచ్చును. ఆశువుఁ జెప్పుటయందును గరము మేటియని చెప్పనగును. ఇతనికవితాధార యనర్గళము.

పాండురంగక్షేత్రముయొక్క మహిమమును వర్ణింపనిచ్ఛగించి యచ్చటఁ బుణ్యక్షేత్రమును బుణ్యతీర్థమును బుణ్యదైవమును మిళితములైయుండుటంబట్టి యద్వితీయం బగుటచే దానిప్రౌఢిమను వర్ణించి యీపుస్తకమునకుఁ బాండురంగమాహాత్మ్య మను నామమిడెను. ఇం దీతని వైష్ణవభక్తి యత్యధికముగా వర్ణింపఁబడినది. ఈ గ్రంథరాజము విరూరి వేదాద్రిమంత్రికి నంకిత మియ్యఁబడినది. ఇం దీతనిపాండిత్యము కొలఁదియుఁ గవితా రచన సాగుటంబట్టి పామరులకుఁగాక కేవల పండిత హృదయైకవేద్యమై యున్నది.

సామాన్యముగఁ బ్రాచీనపుం బ్రబంధకర్తలు తమకథానాయకులగు రాజులయు, వారిభార్యలయు, నవయవసౌందర్యములను జర్యావిశేషములను వర్ణించుటయే కాని స్వభావోక్తి నంతఁగాఁ బరికించినట్లు కాన్పింపదు. మఱియు నందు వారలపాండిత్యప్రకర్షముఁ జూపుచు వర్ణించునంశముఁగూడ విస్మరించి యసందర్భముల వర్ణించుటయుఁ గలదు. అట్టి యసభ్యతల నిదివఱలో రసజ్ఞులు మనకుఁ దెలిపియేయున్నారు. కావున నిట్టివర్ణనములు సామాన్యముగ నాధునికనాగరకతాప్రభావమువలన జనులు చాలవఱకు మెచ్చుట లేదు.

కాని మనరామకృష్ణుఁడుమాత్ర మట్లు గాదని చెప్పవచ్చును. ఈతఁడు తనపుస్తకమునందు స్వభావోక్తిని మివులచిత్రముగ వర్ణించియున్నాఁడు. అచ్చటచ్చట నేఁటిభావకవితను బోలియున్నది. ఈతనిస్వభావోక్తిని గొంత పరిశీలించి తరువాత శాఖానిర్ణయమునకుఁ గడంగుదము.

ప్రథమాశ్వాసమున నగస్త్యుఁడు లోపాముద్రాసహితంబుగ సామిమల కేఁగునపుడు మధ్యందినాతపతప్తశరీరయగుటచేఁ జెమర్చిన లోపాముద్రను గవి యతిచిత్రముగఁ జిత్రించి

ప్రాచీనాభరణములు

చిత్రము ౧

258. వెండి కమ్మలు; పంజాబుదేశములోని చంబారాజ్యమువారు దీనిని ధరింతురు. **259.** వెండికమ్మలు. దీనిని చంబారాష్ట్రములోని బార్మ్మౌరునందలి స్త్రీలు ధరింతురు. **260.** కమ్మలు బంగారుతో చేయబడినవి. ౧౬ ముత్యములు చుట్టబడినవి. పంజాబులో గుజ్రన్‌వాలామండలమువారు దీనిని ధరింతురు. **261.** చంద్రవంక పదకము. వెండితో చేయబడినది. నగిషీపనిగలది. గజ్జలుకట్టబడీనది. దీనిని హారములలో 'పదకము'గను, పాపిటబొట్టుగనుకూడ ఉపయోగింతురు. బార్మ్మౌరు మండలమువారు ధరించునదిగా నుండును. **262.** వెండిజుమికి. కాంగ్రారాష్ట్రమువారు ధరించునది. **263.** వెండితలకట్టు. నడిమి చంద్రవంక ఆకుపచ్చ నీలమురంగులుగల రేకులపై నగిషీపని చేయబడినది. **264.** బంగారునీరుపూసిన బిరడాకమ్మలు. నాలుగుకెంపులు, ఒకపచ్చ దీనియందు చెక్కబడినవి. కులు రాష్ట్రమువారు దీనిని ధరింతురు. **265.** నగిషీపనిగల తాయతు. తిబేతు దేశమునది.

చిత్రము ౨

266. బంగారుపాదభూషణము. నగిషీపనిగలది. ౮ మాయకెంపులు చెక్కబడినది. గుజ్రన్‌వాలావారు దీనిని ధరింతురు. **267.** కడియము. లాహోరుదేశమువారు ధరించునది. **268.** గట్టివెండికడియము. పంజాబుదేశమునది. **269.** బాజుబందు. ఆరుమూలలుగల తొమ్మిదిబంగారుగుండ్లు పట్టుదారమున గూర్చబడినవి. బంగారుగుండ్లు ఆకుపచ్చనిరంగువి. **270.** కంకణము. ఆకుపచ్చనిరంగుగల బంగారుమోపులు రెండు ౪ వెండిఅల్లికతీగలతో కూర్చబడినవి. కాంగ్రాయందు దీనిని ధరింతురు. **271.** రెట్టకడియము - వెండిది. గోటకు మండలమువారు దీనిని ధరింతురు. **272** బాజుబందు. నవరత్నములుచెక్కిన తొమ్మిది బంగారుబిళ్లలు దారమున గూర్చబడినవి. **273.** కడియము వెండిది. పూలు చెకబ్కడినది. మరతోచేర్చబడినది. లాహోరువారు దీనిని ధరింతురు. **274.** వెండిఉంగరము—V వలె నుండును. రెండుపగడములు చెక్కబడినవి. కాంగ్రావారు దీనిని ఉపయోగింతురు.

చిత్రము 3

275, 276, 277, ఇవి డేరాఇస్మయిల్‌ఖాను మండలమువారు ధరించు వేఱువేఱు రకముల వెండి కడియములు. **278.** బోలు కాలికడియము. బంగారుది. నీలము ఆకుపచ్చరంగు వేయబడినది. లోపలనున్న గుండ్లు గలగలలాడును. **279.** కంఠాభరణము. బంగారుపై ఆకుపచ్చరంగు వేయబడినది. భావల్పూరమువారు దీనిని ధరింతురు. **280.** చేతికడియము-వెండిది. ఇట్టివి రెండుకీళ్లతో చేర్చబడియుండును. కులురాష్ట్రమువారు ధరింతురు దీనిని.


చిత్రము ౪


281. బాజుబందు—వెండిది. పూలుచెక్కిన బోలువెండికాయలు ౨౧ రెండుదారములతో కూర్పబడినవి. ఒక కొసను కర్పూరపుపూస గలదు. చంబారాష్ట్రమువారు దీనిని ధరింతురు. **282.** బాజుబందు. ౧౬ బోలు వెండికాయలు పూలుచెక్కినవి దళసరి నల్లగుడ్డపై దారములతో కూర్పబడినవి. ఇదియు చంబారాజ్యమువారు ధరించునది యే. **283.** వెండిదండ—పెద్దవెండిపూసలు చిన్నకొయ్యపూసలు ఒకటివెనుక నొకటిగాకూర్చిన రెండు పేరులు గలది. కులు రాష్ట్రము నందలి సుల్తానుపురమువారు దీని నుపయోగింతురు. **284.** దండ—వెండిది నగిషీపనిగల ౧౨ వెండి బిళ్లలు దారములో నడుమ నడుమ రెండువరుసలు పగడములుచేర్చి కూర్పబడినవి. వెండిబిళ్లలయందు వైడూర్యములు చెక్కబడినవి. లడకురాజ్యమున దీనిని ధరింతురు. **285.** అపరంజిదండ. పలకలుతీర్చిన గుండ్లతో కూర్చిన అయిదు పేరులు గలది. నట్టనడుమ నలుచదరమైన పదకము ౫ రాళ్లు చెక్కినది కలదు. రెండుకొనలును పట్టుదారముతో కట్టబడినవి. కాశ్మీరదేశముది. **286.** మెడదండలోని పదకము—వెండిది. నడుమ నొక దేవతావిగ్రహమును, రెండు వైపుల రెండు దాసీవిగ్రహములును చెక్కబడియున్నవి. మూడుగుండ్లు క్రిందిభాగముననున్న ఉంగరముతో నీపదకమునకు జేర్పబడినవి.

చిత్రము ౫

287. శిరోభూషణము—వెండితో చేసినది. చిన్నగొట్టములు పట్టుదారములలో ౮ పేరులుగా కూర్పబడినవి. రెండుకొనలయందు గుండ్రని వెండిబిళ్లలు గిల్టువి, ఆకుపచ్చనిరంగువి గలవు. క్రిందివరుసనడుమ పెద్ద పదకమున్నది. తక్కినభాగమున చిన్నవిగలవు. హజారారాజ్యమున వాడుకలో నుండునది. **288.** కంఠాభరణము. ఒకరు దీనిని పాదాభరణ మనిచెప్పిరి. బంగారుతో చేయబడినది. కెంపులు మాయముత్యములు చెక్కబడినది. చుట్టు పదిచిన్నపదకములు నడుమ నొక పెద్దపదకము గలదు. అన్నిటియందును కెంపులు చెక్కబడియున్నవి. ప్రతిపదకమునకు మాయ ముత్యములును పలుచని బంగారు రేకులును కట్టబడినవి. కాశ్మీరదేశములోని శ్రీనగరమువారు దీనిని ధరింతురు. **289.** కంఠాభరణము—వెండిది. పుష్పములు మున్నగునవి చెక్కబడిన రేకులతో చేయబడిన పదకములు ౮ పట్టు దారమున గూర్పబడినవి. హజారారాష్ట్రమువారు దీనిని ధరింతురు.

ప్రాచీనాభరణములు-చిత్రము ౧





నాఁడు. ఆ పద్యము నిం దుదాహరించు చున్నాను.

సీ. నఖరాగ్రలూనానన స్వేదకోరకం
బర్ధకషాయదృగంచలంబు,
ప్రబలనిశ్శ్వాససౌరభతర్పితమదాళి,
శోషితశ్రవణశిరీషయుతము
దశ్లథమధ్యవృత్తస్రస్తమృదునీవి,
యప్రయత్నపయోధరాంబరంబు
సంశ్లిష్టశర్కరాసహపదన్యాసంబు,
నచలరజోధూమలాలకంబు

గీ. సరణితరుణతరుచ్ఛాయశమితఖేద
మలసమృదులాంగకంబునై యరుగుదెంచు,
నన్నిజపరిగ్రహముఁగూర్చి యాదరించి,
పలుకువింధ్యాద్రినిర్బంధబాంధవుండు.

ఇందు సామాన్యముగ మధ్యందినతాప తప్తులగు పురుషులుగాని స్త్రీలుగాని యిట్లుం డుట లోకసహజము. మఱియొకటి రెం డుదాహరణములు: కుమారస్వామి యీశ్వరదర్శనమున కేఁగునపుడు మార్గమధ్యమున నుండు విధమును, సమీపమున కేఁగువిధమును బరికింప నేఁటియువకులచర్యలు స్మృతికివచ్చును. ఆసందర్భమును బరికింప బజారున వచ్చునపుడు తాంబూలమును నమలి పట్టుపంచె లందముగ వేసికొని చేతనుండుసామాను జమానుచేతికిచ్చి దెసలఁ గ్రేగంటిప్రసారములఁ బ్రసరింపఁజేయు యువకులచర్యలు మిగులచిత్రముగ వర్ణింపఁబడినవి.

ద్వితీయాశ్వాసమున శ్రీకృష్ణునివర్ణించు సందర్భము సరసముగఁ గాన్పించెడిని. అచ్చటఁ ప్రస్తుతము గోపాలుబాలు రెట్లుందురో యది చిత్రముగ వర్ణింపఁబడినది. అందొకపద్యముఁ జూపెద:

ఉ. ఆవునదల్చు పచ్చవెదు
అంఘ్రియుగాంతరవీథి నూఁది య
గ్రావనిఁ దేజరిల్లుకటి
హస్తసమన్వితుఁ గౌస్తుభాంకు నిం
దీ విభునింద్రలీల విభు......

మఱియుఁ దృతీయాశ్వాసమున నిగమశర్మచరితము స్వభావోక్తి గుంభనమని చెప్పవచ్చును. గ్రంథవిస్తరభీతిచే నుదాహరణము లీయనైతి. ఇట్లు స్వభావోక్తు లతిచిత్రంబుగఁ జిత్రించుట నారయఁ గేవల స్వభావోక్తిచమత్కృతికే యీగ్రంథము రచియింపఁ బడెనా యని తోఁచుచున్నది.

"పాండురంగ మాహాత్మ్యము" "రామకృష్ణకవి""మాధవకథాశ్లాఘాసుఖాసక్తుఁడై" అనువానిచే నీగ్రంథము వైష్ణవభక్తునిచేఁగాని వైష్ణవుచేఁగాని రచింపంబడెనని స్పష్టపడుచున్నది. కాని యచ్చటచ్చటఁ గొంత భాగము విమర్శింప నీతఁడు శైవుఁడనియుఁ గారణాంతరమున విష్ణుభక్తుఁ డాయెననియుఁ దోఁచుచున్నది. దానికి ముఖ్యకారణము ద్వితీయాశ్వాసమున నుండు శ్రీకృష్ణుని వర్ణనయే. శ్రీకృష్ణుని గోపవేషము, బాలక్రీడలు, తనివిదీఱ వర్ణించి మఱల దశావతారములఁ బ్రత్యేకావతార నిర్దేశముతోఁ బది పద్యములతో వర్ణించి తిరిగి సీసమాలికలో మఱల దశావతారముల శ్లేషభంగిగఁ జెప్పుటచే నిం దొక నిగూఢాభిప్రాయము గలదు. స్వీయకవితా చమ

త్కృతి యొకటి యందఱకుఁ దెల్లమే. మఱి యొకటి: తాను బ్రథమమున శివభక్తుఁడుగా గాని, శైవుఁడుగాఁగాని యైనట్లును దరువాతఁ గారణాంతరమున వైష్ణవుఁడుగా మాఱినట్లును దత్కారణమున నిజముగా విష్ణుభక్తి గలదో లేక కైతవము నటించుచున్నాఁడో యని యొరులుగాని కృతిపతిగాని సందియ మొందునని తలంచి "నాకు నిజముగ వైష్ణవ భక్తి గలద"ని చెప్పుటకు నొకమాఱు వర్ణించినదానినే పలుమాఱులు వర్ణించెను. దీనిచే మొదట శైవుఁడుగను దరువాత వైష్ణవుఁడుగను మాఱినట్లు తెలియుచున్నది. ఇంకను నీతనిశివభక్తిఁ గొంత చర్చింతము. అగస్త్యుఁడు కుమారస్వామిని దర్శించుటకై వెళ్లి యటఁ గుమారస్వామిని అనేకనామములచేఁ బరిపరివిధముల స్తుతియించెను. వైష్ణవుఁడైనచో నసలు పరమేశ్వరునినామ మెత్తుటయే యసంభవము. ఒకవేళ యెత్తినను నాతనిఁ బరిపరివిధముల స్తుతియించుట దుర్లభము. మఱియుఁ గథాప్రారంభముఁ జేయునపుడే యీశ్వరవర్ణనముచే మొదలిడెను. వేయేల? ప్రథమాశ్వాసమంతయు నీశ్వరవర్ణనముచే ముగిసెనని చెప్పుట కావంతయు సందియము లేదు. ఇది కేవలవైష్ణవమతవిరుద్ధము. ఇఁక ద్వితీయాశ్వాసముఁ బరికించినచో నచటను నీశ్వరభక్తి మఱింత స్పష్టముగఁ గాన్పించెడిని. నారదుఁడు శివదర్శనము కేఁగునపుడు శివుని యంతగొప్పవాఁడు లేఁడనియు సమస్తమున కాతఁడే కారణభూతుఁడనియుఁ జెప్పెను. మఱియు నారదునిచేఁ జెప్పించుటయేకాక కవికూడ "నిరాఘాటనిరఘనిరుపమప్రభఁగాంచె నిర్నిమిషదృష్టి" యనియు "ఆదికపిఁ వృషాకపిఁ" యనియుఁ జెప్పుటచేతను నీ కవికి శైవభక్తియుఁ గలదని విస్పష్టము. దీనికి రెండుపద్యములఁ జూపెద.

క. శరవణభవయుతులగు నీ
పరమమునులు శ్రోతలట యపారప్రజ్ఞా
కరుఁడు నిశాకరశిశుశే [గలదే.
ఖరుఁడు హరుఁడు వక్తయట యగమ్యము

తే. కాళరాత్రిశుఁడగు నీకుఁ గడిఁదితమము
పుండరీకాభుఁడగునీకు భూరిరజము
సత్కృపాంభోధియగు నీకు సత్వభృతియు
ననుగుణంబులు మూర్తిత్రయైకనిలయ.

ఇత్యాదులు బహుళంబులు పద్యంబులు గానవచ్చుచున్నవి. విస్తరభీతిచే నుదహరింపనైతి.

ఒకవేళ నారదుఁడు కార్యార్థికదా? స్వీయకార్యసఫలతకై యట్లు స్తుతియించెను. లోకమున ధనార్థులు లోభులను బాపులను గూడ నింద్రుఁ డుపేంద్రుఁ డనిస్తుతియించుట మనము నేఁటికిని గనుచున్నారముగదా? యన్నచో నట్లు కార్యార్థి, కపటవైతాళికుఁడు నగునారదుఁడు పరమేశ్వరుని సమ్ముఖముననే స్తుతియించునుగాని యాగమన సమయమునఁ దనమనమునందు స్తుతియించుట పొసఁగదు. అట్లు కవికే యీయభిప్రాయముండిన "నిరాఘాటనిరఘనిరుపమప్రభ, ఆదికపిన్ వృషాకపిన్" యని వర్ణించుట యేమాత్రము పొసఁగదు.

కావున కవి వైష్ణవుఁ డైనచో నాతని కేమాత్ర మిట్లువర్ణించుట పొసఁగదు. అట్లు ప్రథమాశ్వాసము పరమేశ్వరుని వర్ణనముతోనే ముగింపుచేయుటయసంభవము. కాబట్టి యీతనికి శైవభక్తియుఁ గలదనితోఁచుటయే కాక ప్రథమమున శైవుఁడనియుఁ గారణాంతరమున వైష్ణవుఁ డాయెననియు నీయీఘట్టములు స్ఫురింపఁజేయుచున్నవి.

మన మీతనిశాఖను నిర్ణయించుటకుఁ బూర్వము సాధారణముగా లోకమునఁబండితపామరులకుఁ జిరపరిచితుఁడైనట్టియు, హాస్యప్రాయుఁడైనట్టియు రామలింగఁడును కేవలపండితపరిచయుఁడైన రామకృష్ణుఁడును నొకడేనా? యనునంశము తేల్చవలసి యున్నది. రామకృష్ణునిగుఱించి నేఁటికిని గొన్ని కథలు చెప్పుకొనుచున్నారు. అవి యన్నియు సత్యమైనను గాకపోయినను గొన్నిమాత్రము సత్యమనక తప్పదు. ఆకథలకును కృష్ణదేవరాయలకును గొంత సంబంధము గలదు. కావునఁ గృష్ణదేవరాయలకాలము చూతము. కృష్ణదేవరాయలకాలము 16 వ శతాబ్దమని వీరేశలింగముపంతులవారు వ్రాసియుండిరి. రామలింగఁడును నాకాలపువాఁడే యనక తప్పదు. రామకృష్ణునికాలము 16 వ శతాబ్దమే కాని రాయలకును నీతనికినివత్సరవ్యత్యాసము దప్ప శతాబ్దవ్యత్యాసము లేదు. రాయల యనంతరమును రామకృష్ణుఁ డున్నట్లు తెలియుచున్నది. పాండురంగ మాహాత్మ్య కృతిపతియు రాయల యనంతరముననే యున్నట్లు తెలియుచున్నది. కావున రాయలకాలమున రామకృష్ణుఁడు రామలింగమనుపేరుతో నుండి యనంతరము వేదాద్రికాలమున రామకృష్ణుఁ డయ్యెను. వీరిద్దఱును నొకరే యనుటకుఁ బాండురంగమాహాత్మ్యమునుండికొన్ని యుదాహరణము లిచ్చెదను. ఇతఁడు రచియించెనని చెప్పెడు చాటుపద్యములలోఁ గూడ నీతని నామము రామలింగఁడని కాన్పించు చున్నది. అందొకపద్యము చూపెద.

ఉ. లింగనిషిద్ధుఁ గల్వల చె
 లిం గని మేచకకంధరుం ద్రిశూ
లిం గని సంగతాళిలప
 లిం గని కర్దమదూషిత స్మృణా
ళిం గని క్ర్శష్ణచేలుని హ
 లిం గని నీలకచన్ విధాత్రృనా
లిం గని రామలింగ కవి
 లిం గని కీర్తి హసించు దిక్కులన్.

ఈతని కథలకుఁ బాండురంగమాహాత్మ్యమున సరిపోల్పఁదగిన పద్యములు గొన్నికలవు. అందుఁ గొన్ని చూపెద. ఇతఁడు భగవంతుని స్తుతియించునపుడును హాస్య వచనములు మానియుండ లేదు. దశావతారముల వర్ణించు నవసరమున

"చ. ప్రతిదిన కేశలుంఛనపు
 రాయిడి నెట్టన బట్టగట్టి పైఁ
బుతపుతమంచు నున్న కురు
 బోడతలన్ ధరియింప నోడియు
న్నతముగ సొమ్ముగాననిడఁ
 జాలపుగా శిఖిపింఛవల్లి సా
గతమతధుర్యు దానిఁ
 గటికట్టుము పుట్టము మిన్నకేటికిన్."

యని వర్ణించియున్నాఁడు. మఱియు:

"సీ.సర్మగర్భోక్తులు నక్కుటక్కులు వింత
నయగారములు బహునాటనములు
పిలుపిచ్చవిద్యలు పేఁకవన్నియలును....."

అని వర్ణించుటచే సీతనివేశ్యాసహవాసము తెలియుచున్నది.

"క.ఎవ్వనికి వలచెనోకోయీ
జవ్వని యని రవ్వ మీరు సరసోక్తులులే
నవ్వులు ముసిచినపువ్వుల [లగుటల్."
రుప్పులఁ దనయందె సమధిరూఢము

"మ.బళిరా? తేరకుఁదేర దక్కె నిటు
లీబంగారుకుండంచు చం
కలు దాటంచుచుఁ గెంపుమోవి దోఁపకం
గా........................"

మొదలగు పద్యములచే సీతనిజారత్వము స్పష్టపడుచున్నది. మఱియు,

"ఉ.ఎల్లరు నెల్లచోధనము
లిచ్చి మృగాక్షులఁ గొంత్రుగాని యో
పల్లవపాణి! యేఁబరము
పావనవంశము నిచ్చి కొంటి నీ
నల్లనిరూపు నిక్కమని
నమ్మి..............................."

యని వర్ణించుటంబట్టి యీతనిహాస్యవచోభంగి తెల్లమగుచున్నది. ఇంకను,

"ఉ. ఈకడజాతినాతి కిహి
హీ! మహిదేవుఁడు సిక్కెనంచు నక
రాకకుఁ బోకకుల్ జనప
రంపర కింపగుచూడ్కిఁ జూచి యం
బూత్కృత మాచరించుటకుఁ
బుద్ధిదలంక కలంకముక్తచం
ద్రాకృతిఁ బొల్చు నీముఖము
నం దమృతస్థితిఁ గాంచి మించుటల్."

అని చెప్పుటచేత సీతఁడు బ్రాహ్మణుఁడయినప్పటికిని నేజాతిస్త్రీని జేపట్టుటకును జంకియుండనట్లు తెలియుచున్నది. ఇట్టికథలకు సరిపోల్పఁదగునవి చాలపద్యములు నిగమశర్మోపాఖ్యానమువలనఁ దెలియుచున్నవి. కావున రామలింగఁడును రామకృష్ణుఁడును నొకఁడే యని పైయంశములవలనఁ దెలియుచున్నది.

అట్లయినచో నామద్వయమునకుఁ గారణము కొంత యుండి యుండవలయును; కావున దానికి వేఱుకారణము గలదు. రాయల కాలమున సీతనినామము రామలింగఁడు. వేదాద్రి కాలమున రామకృష్ణుఁడు. ఇతఁడుతనకు రామలింగనామధేయముగలప్పుడు "ఉద్భటారాధ్యచరిత"మను నొక యారాధ్యచరితము రచియించినట్లు గాన్పించుచున్నది. తరువాత రాయల యనంతరము వేదాద్రి నాశ్రయించెను. కోటివిద్యలు కూటికొఱకన్న చందంబున సీతఁ డుదరపోషణ నిమిత్తమై యాతని నాశ్రయించెను. ఆకాలమున రాజులందఱు వైష్ణవభక్తులుగ నుండుటంజేసి వేదాద్రియు వైష్ణవుఁడుగావున నాతని నాశ్రయించినపుడు తనమతమును మార్చికొనవలయును గదా? అట్లే యీతఁడు వైష్ణవమతమును స్వీకరించి రామకృష్ణుఁ డని నామము మార్చికొనిస్వామియును మఱిచొప్పనఁ బాండురంగమాహాత్మ్య మను

గ్రంథము వైష్ణవభక్తిపరముగ వ్రాసి యాతనికే యంకితమిచ్చియుండెను. పిట్ట గూడువిడచి యెంతదవ్వేఁగినను దన గూటిమీఁదనే యొక కన్నుంచునన్న విధమున వైష్ణవమత మవలంబించినప్పటికిని సహజమైనట్టి యీశ్వర భక్తి వీడలేదని పైఁజెప్పిన సందర్భముల వలనఁ దెలియుచున్నది. కాని యీతఁ డేరాజును నాశ్రయించి యాతనికిఁదన పుస్తకము నేల యంకితము చేయలేదని సందియంపడవచ్చును. ఈతఁడుహాస్యప్రాయుఁడు గనుక నక్కాలమున నీతనిపై రాజులకభిమానము లేకుండ నుండుటచే నట్లీయలేదని తెలియుచున్నది. కాఁబట్టి రామలింగఁడును, రామకృష్ణుఁడును భిన్నులుకారని మనకుఁ బైయంశములవలనఁ దెలియుచున్నది.

ఇఁక మనము దీనినిబట్టి శాఖానిర్ణయము చేయుదము. సాధారణముగా "లింగ" యను శబ్దము బ్రాహ్మణులలో నారాధ్యులకుఁ దప్ప తదితరులకు లేకుండుటంబట్టియు, నుద్భటారాధ్యచరితమను నొక యారాధ్యచరితము రచియించుటంబట్టియు, నైజముగు శైవభక్తి వైష్ణవచరితము వ్రాయునప్పుడును గాన్పించుటచేతను నీకవి యారాధ్యబ్రాహ్మణుఁడని తెలియుచున్నది.

ఇఁక నీతనికవిత్వముఁగూర్చి కొంత చెప్పెదను. ఈతనికవిత్వమున నచ్చతెనుఁగుపదములు మెండుగా నుండును. చీపరపాపరతీగెల కవిత్వముగాక చాలసరసముగానుండును. వసుచరిత్రాదికవిత్వమువలెఁ గాక శైలి యనర్గళముగా నొకేవిధముగాఁ బోవుచుండును. ఈ కవి యితరకవుల వలె నెవ్వరి ననుకరించిగాని వారిపదములఁ దీసికొనిగాని రచియించియుండలేదు. ఇతరకవుల వలె వర్ణించినదానినే వర్ణించుటయుఁ జెప్పినదానినే చెప్పుటయు నెచ్చటను గాన్పింపదు. "పాండురంగవిభునిపదగుంభనంబును" అన్న ట్లీకవికిఁ గుదిరినట్లు పదసందర్భము మఱియెవ్వరికిని గుదురదు. ఈతని కవిత్వమునందు నిరర్థకపదములు సామాన్యముగా నుండవు. ఈతనివృత్తములకన్న సీసములు కొంచెము క్లిష్టముగా నుండును. శ్లేషగలపద్యము లెచ్చటనో కాని కాన్పింపవు. ఈతని సీసపద్యములు చాల సరసముగా నుండి భావప్రస్ఫుటములై ప్రాచీననవీనసహృదయహృదయరంజకములుగా నుండును. అందు రెండుమూఁడుపద్యము లుదాహరించెదను:

సీ. పొదలు నీపొక్కిటి పువ్వు కాన్పునఁగదా
పెనుమాయ పిల్లలఁ బెట్టుటెల్లఁ
బొడము నీమొదలియూర్పుల నేర్పులనకదా
చదువుసంధ్యలుగల్గి జగము మనుట
కెరలు నీయడుగుఁదామరల తేనియఁగదా
పాపంపుఁ బెనురొంపి పలుచనగుట
పొసఁగు నీ తెలిచూపు పసఁగదాయిదిరాత్రి
యిదిపవ లనుమేర లెఱుఁగఁబడుట
భవనఘటనకు మొదలికంబమును బోలె
భువనముల కెల్ల నీవాదిభూతుఁడగుట,
నిట్టనిలుచుని చేఁ గాదె నెట్టుకొనియె
గెంటుఁగుంటును లేక లక్ష్మీకళత్ర!

సీ. నిడువాలు గనుచూపు నిగిడినచో నెల్ల
బీరెంపరే మెండఁ బెండ్లియాడ
నిశ్శ్వాసపవనంబు నెలకొన్నచో నెల్లఁ
బ్రాబిన్కు నెత్తావు లాముకవియఁ

బొక్కిటి తమ్మిపుప్పొడి యొల్కుచో నెల్ల
  బ్రహ్మాంకురంబులు పాదుకొనఁగ
నడుగులేఁజిగురాకు లంటినచో నెల్ల
  వివిధతీర్థశ్రేణి వెల్లివాఁడువ,
గీ. బర్హిమణిబంధ మావేల్పు పచ్చ వెదురు,
  గ్రచ్చకాయల తిత్తియుఁ గంబుశక్తి,
  గలిగివిహరించు బౌండరీకమునందు
  నందు వేఁబట్టె ప్రాలేయనగముపట్టి.
సీ. కనుగట్టి గాంగేయగర్భు డాగురుమూఁత
  లాడించె వత్సాపహరణవేళ
  నాలమందలఁ బోవ శైలమెత్తెడి ప్రాన్కుఁ
  గేలిమై కందుకక్రీడసలిపె
  బాటించెఁ గంబాలయాట రాసక్రీడ
  నాభీర భీరు మధ్యాంకపాళి
  వెలయించె యమునా విహరణం బలకాధి
  రాజ కింకరశిరో రత్నరాజిఁ
తే. దన్ను బిల్లాడె నంగుష్ఠదళితసర్ప
  తనుసుదర్శననామ విద్యాధరేంద్ర
  కఠినజఠరచ్ఛలమున నగ్రజుఁడు దాను
  నందసూనుండు బృందావనంబునందు.

ఇవి మొదలగుపద్యములు బహుళంబులు గలవు. ఇందుఁ గాపులజీవితమును బహుచిత్రముగఁ జిత్రించియున్నాఁడు. గ్రంథవిస్తరభీతి నుదాహరణము లియ్యనైతి.

ఇఁక నిందుఁ గలదోషములఁ జేర్కొని యీవ్యాసమును ముగించెదను. ఇందు దోషములు చాలవఱకు లేవనియే చెప్పవచ్చును. కాని యొకటి రెండుమాత్రము గాన్పించుచున్నవి. ద్వి. ఆ. 95-వ పద్యములో "హరిఁగూడాడుఁ జుమీ" యని ప్రయోగించియున్నాఁడు. ఇచ్చట "గూడి ఆడు" 'గూడియా'డని సంధి కావలసియుండఁ 'గూడా'డని ప్రయోగించియున్నాఁడు. మఱియుఁ "గావుకావనుట" "కన్గొఁజాలక" ఇత్యాదిరూపంబు లున్నవిగాని యవి తప్పులుగాఁ బరిగణింపఁబడుటలేదు. ఈదోషములు దప్ప వ్యాకరణదోషములు కాన్పింపవు. ఇతర దోషములు కొన్ని గలవు. అవి చూపెద; ఒకచో ద్వితీయాశ్వాసమున 107-వ పద్యమున ప్రాతదోషమో మఱియేదోషమో తెలియకున్నది.

తే. దధులతోఁగూడ............
.. ..ఁ బీతాంబరుని రమాకు
చరజవినిలిప్తశిఖిబర్హధరుముఖాంశ......"

యని యున్నది. ఇచ్చట "రజవినిలిప్త" యని యున్నది. "రజోవిలిప్త" నని దిద్దినచో ఛందోభంగ మగును. యథాప్రకారమేయుంచిన శబ్దము తప్పగును గాన నిచ్చట నేమియుండవలయునో తెలియుట లేదు. ఇట్టిది తృతీయాశ్వాసమునఁగూడ నొకటి గలదు. అది 42-వ పద్యము. ఇవితప్ప మఱి యిందు దోషములు గానరావు.

కావున నీపుస్తకమునందు స్వభావోక్తులు ప్రబలములుగ నుండుటంబట్టియు రమ్యము లయిన సీసపద్యము లుండుటంబట్టియు సమస్తమైనవారలకును శ్లాఘ్యమై యున్నది; కాని పాండురంగమాహాత్మ్యమ మనునామ మిడుటచేతనో మఱియేకారణమువల్లనో యీపుస్తకమునకుఁ బ్రచారము తక్కువగాఁ గాన్పించుచున్నది. ఇందుఁ దీర్ఘవర్ణనములు గూడ నెక్కువ చేయలేదు. చదువువారల కంతవిసువుగలిగింపక యీపుస్తకము పరమానందమును గలిగించును

శ్రీ భారతీ కుమారి

సాహిత్య సరస్వతి సీరిపి ఆంజనేయులు గారు

భవ్యతరశోభ విలసిల్లు ప్రకృతిలక్ష్మి
అఖిలసస్యదోహదము వర్షాగమంబు
నళిని యొనరించు విధురగీతారవమ్ము
ప్రాగ్దిశానాథుఁ గేల్పట్టు పరభృతమ్ము
చలువవెన్నెల నేగెడు తెలుఁగుపడవ
క్రమవనభూముల వసించు కవితతీరు
తెనుఁగుకవిరాయనివిపు లాతిథ్యఫణితి
తెలుఁగురాయని యాంధ్రంపుఁగలిమిబలిమి
తేనెలొల్కు- సుధీంద్రుని గానసరణి
మేటికవిపికావళి కగు మేలుకొలుపు
విదుషి-వాగ్దేవి, గొల్పిన విభ్రమమ్ము
రాయబారి- కృష్ణుని, వచోరత్నదీప్తి
అగ్గలంబగు శాతవాహనుని శక్తి
లలిత- నవకాకతీయాంధ్రలక్ష్మి చెలువు
జనని భక్తున కిడిన దర్శనఫలమ్ము
పత్నికిక్ దగు జన్మసాఫల్యపథము
మాధవున కంకితం బగు రాధవలపు
రక్తిఁ గాంక్షించు యామినీరమణిపొల్పు
భావరుచులఁ గొల్పెడు పసిపాపసొబగు
భారతీయునియజ్ఞాత బంధనమ్ము
పాపదాస్యాంబునిధిఁ దోఁగు ప్రాణిజాత
ఇంపు నింపి రూపఱెడు నభీప్సితమ్ము
ఘనదురాశ యొసంగిన కలుషఫలము
శోభ శుష్కింపఁ గీడ్పడు లోభి తెఱఁగు
సారహీనపు జీవితాశయసుమమ్ము
ఆదికారణుఁ దెల్పు నేకాంతసేవ
వినుతవిజ్ఞానదివ్యలోచనయుగమ్ము
అలఁతి భక్తుని సర్వ గర్వార్పణమ్ము
వసుధ నమరాంశమును గన్నవానిసొంపు
వాడుపోవని నెఱివన్నెవానిపెంపు
గమ్యధర్మానుగత మగు కాలరథము
ధర్మవినిబద్ధ మగు ప్రేమతత్త్వగరిమ
మోహ ముడిగిన ప్రాణిసన్నాహబలము
సంఘసేవాధురీణు మోక్షంపుఁ దెరువు
దురితహరుఁ డగు లోకార్తిహరునిమహిమ
కనులు తనియంగ భారతీ! కాంచితమ్మ
ఆత్మ విలసిల్ల నానంద మందితమ్మ.—

వానకాలపుపల్లెజీవనవిధమ్ము
ఉల్లము హరించు నోకకాఁపుపిల్లపదమ్ము
తేటమాటల శ్రుతిఁ గల్పు తెలుఁగుపాట
విస్తృత మ్మగు నాంధ్రకవిత్వచరిత
కడుమనోహరవిస్తృతగానసరళి
విభువియోగాగ్ని నలురాధ వేఁడుకోలు
వరునిచెల్వు హరించు శైవలినిపొల్పు
కరుణఁజిందెడు శ్రీయనార్యాళిచరిత
స్వాత్మబలి గాఁగ నిడుశరణార్థియార్తి
ఘనుని-కవివరేణ్యుని-రవీంద్రుని యశమ్ము
మురళిగానవిలోలుని ముద్దుకతలు
నతిదయామయు- రామమోహనుచరిత్ర

వీనులలరంగ భారతీ! వింటివమ్మ,
ఆత్మవిలసిల్ల నానంద మందితమ్మ.—

సరస గీతాళిఁ బాడు వసంతపికము

చారుశుభదాయక మ్మగు సస్యలక్ష్మి
సకలసంపత్ప్రద మ్మగు జన్మభూమి
ఆంధ్రకవివరేణ్యు నభిమా నాంధ్రగీత
భావసుమమాలికలఁ దెచ్చు ప్రణయలహరి
ప్రణయమూర్తినిఁ గైసేయు వలపువిరులు
వలపు గొలిపెడు పలుకులకలికి- చిలుక,
ప్రాణనాథునిదైన యాహ్వానమాల
అఖిలజీవదమైన యాశామృతమ్ము
ఆశవిడి జీవి పొందు సౌఖ్యాసవమ్ము
అపరపరతత్త్వములఁ దెల్పు నాత్మవిద్య
తత్త్వవిజ్ఞాని గనిన సందర్శనములు
కాన్కలుగ భారతీ! నీవు కాంచితమ్మ,
ఆత్మ విలసిల్ల నానంద మందితమ్మ.—

చిత్తమును వెలయించెడు చిన్ని మొలక
క్రొత్తతలఁపుల నొదవించు కూనతరఁగ
చలువతేని వరించిన కలువకన్నె
పేర్మిఁ గన్నిటఁ బెరిఁగిన ప్రేమలతిక
మృదుల భావము పొదలు తుమ్మెదపదములు
పండితవరేణ్యు- శ్రీనాథు, భావచయము
రాజు చెల్మికెక్కని కవిరాజకవిత
దక్షిణాంధ్రాబ్దమాతృసంస్తవమరీచి
భవహరణహేతు వగు నీతిభవనగరిమ
అవ్యయానందునిన్ గూర్చు నశ్రు దేవి
ప్రళయభీతిహరించు సద్భక్తిపదము
తలఁప భారతీ! నీకు భూషలు గదమ్మ.-

ఇట్టికావ్యప్రసూనము లెన్నియేని

కాన్కలుగ నర్పితము లయ్యెఁ గవులవలన
వాని ధరియించి యాంధ్రభూవలయమందు
మించు సత్కీర్తి నీవు గడించినావు.

* * * *
* * * *

పెద్దలెల్లరు నీ చిన్నిముద్దు దీర్ప
గారవమునఁ దలంచుచున్నారు కనుమ.
మించు చిత్రకారులు వారి కుంచియలకుఁ
బదను గల్పింతు రమ్మ శిల్పములు వ్రాయ.
కవులు పండితవరులు వెన్కటివిధాన
కావ్యభూషల విరచింపఁగడఁగినారు.
'జయము శ్రీభారతీ! నీకు జయ' మటంచు
సలుపుయువకుల జయరావములు సెలంగ
నతుల సర్వాభరణభూషితాంగి వగుచు
భరతమాతకుఁ గడుఁ గూర్చుపట్టి వగుచు
భారతీయులకెల్లఁ గల్పతరు వగుచు
నెంతయును మించు వింత కొఱంత లేక.
పరమసంతృప్తి నెమ్మదిఁ బడయుచుంట
నిత్యవైభవోపేత వై నెగడుచుంట
ననుపమానందభాగ్య మీ వందుచుంట
నిట్టి జన్మదినమ్ముల వెన్నియేని
చెల్లెదునుగాత! సిరులు భాసిల్లుఁగాత!
భద్రమార్గమె నీకుఁ జొప్పడునుగాత!
రమ్యవాక్సుధాలహరి! ధీరజనహారి!
దివ్యసుకుమారి! శ్రీభారతీకుమారి!

ప్రమద్వర

శ్రీ కోమాండూరు కృష్ణమాచార్యులు గారు [సాహితీసమితి]

౧

శకటమహాసురోన్మథన
శౌండము, కాళియదర్పఘస్మర
ప్రకటపరాక్రమం, బసుర
రాజలసన్మకుటాగ్రమౌక్తిక
ప్రకరవిభూషితంబయిన
వైష్ణవదివ్యపదారవిందయు
గ్మకము సమస్తభక్తజన
మానసవీథి వసించుఁగావుతన్!

[భాగీరథీతీరవనప్రదేశము: రురునిప్రవేశము]

కలమధురధ్వనిన్ శుకని
కాయము లాత్మకులాయభూరుహా
వళులఁ జెలంగి కూసె ఖుర
పాతపవిత్రపరాగ మెల్లచోఁ
గలయఁగఁ బర్వ గోకులము
కాననభూముల మేసి యాశ్రమ
స్థలములు సేరె దుగ్ధకణ
జాలము లాత్మపథంబుఁ దెల్పఁగన్.

ఈ మధుమాసమునందు నాకొకయపూర్వ శృంగారము నేత్రపర్వ మొనరించుచున్నది. నే నిదివర కిరువది మధుమాసములఁ జూచితిఁ గాని నాకిట్టి చిత్తవికార మెన్నఁడును గలుగ లేదు. కుసుమపాత్రికలయందు మధురసంబు లంగ్రోలు షట్పదమిథునముల వెంట నాహృదయము పరువులెత్తుచున్నది. శకుంతసంతానముల యవ్యక్తమధురనాదములయందు నాయంతరంగము లీనమగుచున్నది. ఈ జరఠారుణ కాంతులలోఁ దప్తజాంబూనదప్రభల వెలుఁగుచున్న వనలక్ష్మిని జూచినకొలంది నాహృదయమున రాగరసముప్పతిల్లుచున్నది.

భూరుహశాఖలందవె క
పోతతనుద్యుతి ధూమవల్లికల్
వారె, పవిత్రమై దెసలఁ
బర్వెను హవ్యమనోజ్ఞగంధ సం
భారసమీరసౌరభము
భాస్కరబింబము పశ్చిమాద్రికిం
జేరె, మహర్షిమండలము
సేయగనోపు హుతాశనక్రియల్.

[ముందుకు నడచి] ఈ బాల కురంగ మాశ్రమమృగమై యుండనోపును. దారి తప్పి పాప మిటునటు వెఱ్ఱిచూపులు చూచుచున్నది. [అని కురంగమును సమీపించి లేఁత దర్భలనునోటి కందిచ్చుచు దూరమున నిరూపించి చూచి]

కుచభరానత గాత్రియై కురులు చెదర
జఘనభరమున గమనంబు సన్నగిల్ల
శ్రమవినిర్గతనిశ్వాస చలిత హృదయ—
యగుఁ బ్రమద్వర—నిస్సంశయంబుసుమ్ము.

[ప్రమద్వర ప్రవేశము]

చరమగిరీంద్ర శృంగమును
జండమయూఖుఁ డలంకరించె, నా
హరిణకిశోర మింత తడ
వాశ్రమభూమినిఁ జేర, దెట్టి దు
ష్కరము ఘటిల్లెనో యెఱుఁగఁ
గానన భూములు చండసత్వభీ
కరములు గాన మేను వడఁ [దుః
ఖ దోడఁగెఁ మదితాల్మి దూలె

పుట్టిననాఁటనుండియుఁ బుత్ర ప్రేమతోఁ బెంచు చుంటిని. దానికి లేఁతదర్భలను గడుపార మేపి గాని భుజింపకుంటిని. ఆశ్రమోపాంత వనమంతయుఁ గ్రుమ్మరితిని గాని దాని జాడ గనుపడదయ్యె. అదిగో, పావనసలిల యగు భాగీరథి. జలపానార్థ మట కేతెంచెనేమో యరసెదఁగాక. దూరమున నెవ్వరో ఋషికుమారుఁడున్నట్లున్నది. కురంగశాబమును జూచనే మోవిచారించెదను. [సమీపించి] అదె నా కురంగశాబము. [అని దానిని గౌఁగిలించుకొనును.]

రురుఁడు

ప్రమద్వరా, హరిణపోతమును వెదకుటకు వచ్చితివా యేమి? పాప మిది దారితప్పి వెగడొందుచు దిక్కులు చూచుచుండగా నేను పలాలించుచుంటిని.

ప్రమద్వర

[కొంచెము సిగ్గుతో] భార్గవా! మృగశాబమును గంటినను సంభ్రమమున నిన్ను గుర్తింపనైతిని. క్షమింపుము.

రురుఁడు

తరుణసహకార పల్లవ తామ్రములగు
అలశిరీషలతాంత పేశలము లబ్బ,
నీదుపదకోకనదము లీనిష్ఠు రాట
వీపథస్పర్శమునఁ గందె విశ్రమింపు.

ప్రమద్వర

విశ్రమించుట కేమిగాని నాయనగారు శిష్యసహితులై భాగీరథి కేఁగిరి. ఆశ్రమ వృక్షములకు నీరుపోయుటలో గౌతమికిఁ దోడ్పడవలయును.

రురుఁడు

[స్పర్శసుఖము నభినయించుచు]

స్వచ్ఛగంగా పయఃకణ భారవహుఁడు
సాంద్రమల్లీపరీమళ స్వాదుమూర్తి
ఈసమీరార్భకుండు పూర్ణేందువదన,
గాఢపరిరంభయోగ్యుండు గాఁడె మనకు?

ప్రమద్వర

భార్గవా, నాకీమలయపవనమునం దొక దివ్య పరిమళము చిత్తమున కున్మాదమును గలిగించుచున్నది.

రురుఁడు

చెప్పమరచితిని. మొన్న భాగీరథి నవగాహింప జననియగు ఘృతాచి మేనకతోఁగూడ వచ్చి స్నానార్థ మేతెంచిన నన్నుఁగని "వత్సా,

నీరూపలావణ్యముల కనురూప యగు యువతి నచిరకాలమునఁ బెండ్లాడుమని దీవించి నాకీ పారిజాతకుసుమ స్తబకమును బుత్త్రప్రేమతో నొసఁగినది. దీనిని నీశిఖయం దలంకరించు కొనుము" [అని చేతి కందిచ్చును. ప్రమద్వర తీసికొనును] ప్రమద్వరా, నాకొక సందేహము గలదు. సమ్మతమైన వినిపించెదను.

ప్రమద్వర

ఆర్యులకు నేను దీర్చుపాటి సందియ మే ముండును?

రురుఁడు

భగవానుఁడగు స్థూలకేశమహర్షి యూర్ధ్వ రేతస్కుఁడని తాతపాదులవలన వినియుంటిని. నీ వాయనకుఁ బుత్త్రిక వెట్లయితివి?

ప్రమద్వర

భార్గవా, నాజన్మమునుగూర్చి కొంచెము రహస్యము గలదు. మొన్న గౌతమమహర్షి యీప్రశ్న మడుగగా తాతపాదులు వచింప వింటిని.

రురుఁడు

ఎట్లు?

ప్రమద్వర

ఈ భాగీరథియందు స్నానమాడుచున్న మేనక యను నప్సరసను విమానచారియగు విశ్వావసుఁడను గంధర్వరాజు కామించి——

రురుఁడు

తెలిసినది. నీవాదివ్యాంగనకు సద్యోగర్భమున నుద్భవించితివి గాఁబోలును.

ప్రమద్వర

అట్లుద్భవించిన నన్ను భాగీరథీతీరంబున విడిచి భోగైకపరాయణులై వారు యథేచ్ఛం జనిరి.

రురుఁడు

[స్వగతము] దివ్యాంగన గావుననే యిట్టి జగన్మోహనాకారముచే శోభిల్లుచున్నది. [ప్రకాశముగా] నీజన్మము మొదటినుండియు దివ్యమనియే నాయాశయము.

ప్రమద్వర

ఉదయపర్వతశిఖరంబు లోషధీశుఁ
డాత్మకరముల రజతద్రవానులిప్త
ములుగఁ జేసెడు నాకిట నిలువఁ దగదు
సాంధ్యబలికృత్యములుదీర్పఁ జనఁగవలయు.

[స్వగతము] కాని నాకీరురునిఁ బాయ మన సొప్పకున్నది. [ప్రకాశముగా] భార్గవా, ఈది వ్యకుసుమ స్తబకముపై వానచే నీభృంగము నన్ను విడిచి పోవకున్నది. [అని సాధ్వసము నభినయించును.]

రురుఁడు

ఈధూర్తమధుకరము నిన్ను సమీపింపకుండ నాయుత్తరీయాంచలమున విసరుచుండెదను. [అట్లుచేయును]

ప్రమద్వర

పూజ్యుల యెడ నపరాధను గాఁజాలను. [అని వారించును.]

రురుఁడు

ప్రమద్వరా! బాలకురంగ మెటకో యరిగిన ది. మాటలసందర్భమున దానిని మరచితిమి.

ఈమాధవీలతామంటపప్రాంతమున నింతవరకు దర్భాంకురముల గ్రసియించుచుండెను. ఈ పొదరిండ్లమాటున కరిగెనేమో యరయుదము రమ్ము.

ప్రమద్వర

[లేచి రెండడుగులు నడచి బాధ నభినయించుచు] ఈకురంగశాబముకొఱకా యాస మెఱుంగక వనమంతయుఁ గ్రుమ్మరితిని. పాదములు పొక్కులెక్కినవి. అడుగు లిడుటయే భారముగనున్నది.

రురుఁడు

అట్లయిన నాచేతిపై భారముంచి మెల్లఁగ నడువుము. ఈలతామంటపమునం దున్నదేమో చూతము [ప్రమద్వర యట్లుచేయును]

బాల, భవదంగసంస్పర్శ భాగ్యరూప
ఫలముగాంచెను రురుతపఃప్రాభవంబు
భవదనుగ్రహలేశంబు వడయఁగనిక
భార్గవాన్వయమెల్లఁ బావనతఁగాంచు.

[ఇరువురు లతామంటపములోని కేఁగుదురు]

[గౌతమి మైత్రేయి ప్రవేశించుచున్నారు.]

మైత్రేయి

గౌతమీ! ఖిన్నవై కనబడుచున్నావు. కారణమేమి? తాతపాదులు లోకానుగ్రహార్థము సుఖులై యున్నవారా? ఆశ్రమమున నందఱకుఁ గుశలమే కద?

గౌతమి

భగవానుఁడగు స్థూలకేశ మహర్షి యాశ్రమమున నందఱకుఁ గుశలమే. కాని చిన్ననాఁటి నుండియుఁ బ్రమద్వరయు నేనును క్షణమెడబాయకుండఁ దోడునీడలై యాశ్రమమున మెలఁగుచుంటిమి. ఇపుడు ప్రమద్వరను బాసి యాశ్రమమున నెట్లుండఁగలనాయని చింతించుచున్నాను.

మైత్రేయి

ప్రమద్వర యెచటికి కేఁగనున్నది? మొన్న సాయంకాలముననే కదా ప్రమద్వరయు నేనును నీవారధాన్యమును బ్రోవుచేసితిమి.

గౌతమి

ప్రమద్వర యత్తవారింటి కేఁగనున్నది.

మైత్రేయి

[సంభ్రమముతో] ప్రమద్వరకు వివాహమైనదా? అయిన నాకేల తెలియకుండును?

గౌతమి

ప్రమద్వరకు ఘృతాచీసూనుఁడగు రురునిపై ననురాగముండుట యాంతరంగికసఖుల మగు మనకు విశదమేకదా!

మైత్రేయి

రురునకుఁ బ్రమద్వరపైఁగూడ నట్లే.

గౌతమి

వా రిరువురకును మొన్న కుసుమసాయకసాక్షిగ భాగీరథీతీరమున గాంధర్వవిధిని వివాహము జరిగినది.

మైత్రేయి

తాతపాదుల కీవిషయము విదితమేకద?

గౌతమి

త్రికాలవేదులకు విదితముకానివిషయ మేముండును?

మైత్రేయి

అంగీకరించిరా ?

గౌతమి

అంగీకరించుటయేకాక కూఁతురొనర్చిన కార్యమున కభినందించిరి. ప్రమద్వర గంధర్వకన్యయఁట. విశ్వావసుఁడను గంధర్వరాజునకు మేనకయం దుద్భవించినదఁట. ఈ రహస్యమును మొన్న తాతపాదులు మహర్షి మండలమున వెల్లడించిరి.

మైత్రేయి

నా కీరహస్యము తెలియదు సుమా !

గౌతమి

ప్రొద్దెక్కుచున్నది. నీవుకూడ రమ్ము. ప్రమద్వర నీదినమున మనసార నలంకరింతము.

మైత్రేయి

నాకంతకన్న సంతోషకార్యమే ముండును !
[ఇరువురును నిష్క్రమింతురు]

౨

[రురుని పర్ణశాల; ప్రమద్వర ఆశ్రమవృక్షములకు నీరుపోయుచుండును. రురుఁడు ఫలపుష్పములను దర్భలను దీసికొని ప్రవేశించును]

రురుఁడు

[ప్రమద్వరను జూచి]

ఫాలమునందు ఘర్మకణ
పంక్తులు మౌక్తికశోభఁ దాల్పఁగా
బాల జలప్రపూర్ణఘట
భారవినమ్రశరీరయష్టియై
కాలభుజంగకల్పమయి
గాఢనితంబముపైని వేణి గై
వ్రాలఁగ నాలవాలముల
వారి నవారిగఁ బోయుచుండెడిన్.

కాంతకరపల్లవారుణగాఢకాంతి
కుంభగర్భజలంబు కుంకుమరసాతి
రక్తిమముఁ దాల్చె హృద్గతరాగరసముఁ
బోసి పాదపములఁ బెంచుపోల్కిఁ దోఁప.

కల్యాణీ, ఈ ఫలపుష్పముల నందికొనుము. మన యాశ్రమకురంగమున కీ లేఁత దర్భలను గోసికొనివచ్చితిని.

ప్రమద్వర

[సంతోషముతో నందుకొని] ఆర్య పుత్రా; మీచేతిలోని నూతనవల్కల మెచటిది ?

రురుఁడు

ఇది వనదేవతయగు వాసంతిక నీ కుపాయనముగా నొసఁగినది. [అని చేతి కందిచ్చును. ప్రమద్వర ప్రేమతో నందుకొనును.]

రురుఁడు

[అశోకవృక్షమును నిరూపించి]

సిదుపదకోకనదహతి నీరజాక్షి,
చూడు పుష్పించెనిదిగో యశోకవిటపి !
మానినీపాదఘాతసమ్మదముచేత
పులకితశరీరుఁడగు నాథుపోల్కిఁ దరుణి !

[అని దానిని సమీపించును]

ప్రమద్వర

[వారించి] ఆర్యపుత్రా, ఆలవాలసమీపమున కేగకుఁడు; ఆశ్రమవిహంగములు జలపానము చేయుచున్నవి; బెదరిపోవునేమో?

రురుఁడు

అట్లేలపోవును! మనయందు వాని కట్టి యవిశ్వాసము లేదు.

ప్రమద్వర

ఆర్యపుత్రా, ఈయశోకవృక్షమును బుత్రప్రేమతోఁ బెంచుకొనుచున్నాము. వనగజములు కపోలములు రాచి హింసించునేమో; అట్లుగాకుండ దీనిని పరిరక్షింపవలెను.

రురుఁడు

వనగజము లాశ్రమవృక్షముల జోలికి రావు. ఆశ్రమమృగములను మన మెట్లు ప్రేమించుచున్నామో యవిగూడ మనన ట్లేప్రేమించును.

ప్రమద్వర

ఆర్యపుత్రా, సీతామహాదేవి పూర్వమీయ శోకపాదపమూలముననే కదా దురాత్ముఁడగు రావణుని వనమున నివసించినది?

రురుఁడు

అగును. ఆకారణముచేతనే యీ వృక్షము మనకుఁ బూజార్హమయినది.

ప్రమద్వర

ఆమహాసాధ్వి పతిని విడిచి యంతకాల మెట్లుండఁగలిగినదో!

రురుఁడు

రామచంద్రుఁడుమాత్ర మాదుర్భర వియోగము నెట్లు సహించెనో!

ప్రమద్వర

వారు లోకసంగ్రహార్థ మవతరించిన లక్ష్మీనారాయణులు గదా?

రురుఁడు

కావుననే వారికి సాధ్యమైనది. లోకానుగ్రహార్థము వా రట్టి దుర్భరవియోగ దుఃఖమును సహించిరి. మానవమాత్రుల కెట్లు సాధ్యమగును?

ప్రమద్వర

ఆర్యపుత్రా, మన కెన్నఁటికైనను వియోగము సంభవించునను భయము నా కప్పుడప్పుడు గలుగుచుండును. అట్లు సంభవింపదు గదా?

రురుఁడు

అట్లేల సంభవించును?

ప్రమద్వర

మొన్న మనము హిమాద్రిపై విహరించుచుండ నేను గమనాయాసముచే నలసి మీ తొడపై నిద్రించితిని.

రురుఁడు

నేనపు డుత్తరీయమును నీ తలక్రింద నుంచి నీవు నిదురమేల్కాంచునప్పటికి డప్పి జనించునేమో యని యచ్ఛిద్రకమలపత్రపుటిక జలంబులుగొనివచ్చుటకై సమీపమున నున్న గంగానిర్ఝరమున కేఁగితిని.

ప్రమద్వర

నేను మేల్కాంచునపు డార్యపుత్రులు చెంత లేరు. నాకప్పుడు వొడమినభీతిఁ దలంచుకొనిన నాహృదయ మిప్పటికిని సంచలించుచున్నది!

రురుఁడు

స్త్రీలు సహజభీరువులు. నీ వందుఁ గడుముద్దరాలవు!

ప్రమద్వర

ఆర్యపుత్రా, నిజము చెప్పెదను. అప్పటినుండియు, దుర్భరమగు వియోగదుఃఖము సంప్రాప్తమగు ననుభయము నా కప్పుడప్పుడు గలుగుచుండును.

రురుఁడు

నీ కట్టిభయమున కవకాశము లేదు.

ప్రమద్వర

ఏమయినను సరే, ఆర్యపుత్రులు నన్నెప్పటికిని విడువరని వాగ్దానము చేయవలయును.

రురుఁడు

[చిఱునగవుతో] అట్లేకానిమ్ము. మధ్యాహ్నమయినది. భాగీరథికేఁగి యాహ్నికము ముగించుకొని వచ్చెదను. భోజనాదికము సిద్ధముచేయుము.

అంబరమధ్యమందలి య　　[యూ
　　హస్కరు తాపమునఁ వరాహ
ఘంబులు పల్వలంబులకుఁ
　　దాఁటెఁగురంగము లెండమావులఁ
శంబరమంచు డాసె, తరు
　　శాఖలఁబక్షులు విశ్రమించె, వ్యా
ఘ్రంబులు కుంజగర్భముల
　　గాఢసుషుప్తిని జెందె నిత్తఱిఁ.

ప్రమద్వర

వేగిరము రండు.

[ఇరువురు నిష్క్రమింతురు]

రంగంటే రంగే కాదు

గీతిక

కవికొండల వేంకట రావు గారు, బి. ఏ., బి. యల్.

రంగంటే రంగేకాదు
　　చెంగంటే చెంగే కాదు
　రంగద్దినట్టి చెంగు
　　రాచుకొన్నాది
తొంగుండే సందెలిడత
　　తోచకున్నాది—రం.
నిదరోదామంటే దాని
　　యుదుటుచూపులు గుదులు
గుదులుగా నాదుకంట
　　మెదలుచున్నాయి
'ఒదిలించు' కొందా మంటె
　　'ఒదల' కున్నాయి—రం.

పదమాడుకుంటు బుద్ధి
　　సెదరింతామంటె—అబ్బ!
పదంవెల్లదానిపల్కే
　　పలుకుతుంటాది
కథముందు దానికుల్కే
　　లెదురుకుంటాయి—రం.
మొన్నవచ్చినవేళ
　　నిన్నవచ్చినదాలా
నిన్నంటే నిన్నేకాదు
　　మొన్నంటే మొన్నేకాదు
పున్నమిపుచ్చపూల
　　వెన్నెలగాయు రేల—రం.

జైనుల మతకథలు

పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి గారు

3

శ్రేష్ఠి చారుదత్తుని ధర్మాశ్రయ కథ

పూర్వం మనదేశంలో వుండే ప్రసిద్ధిగల పట్నాలలో చంపానగరం ఒకటి. మనకథ జరిగిన కాలంలో ఆపట్నాన్ని శూరసేనుడు పాలిస్తూన్నాడు. శూరసేనుడు పేరుకు మాత్రమే కాకుండా గుణాలల్లో కూడా శూరసేనుడే! వస్తుతః మేధావిన్నీ, పరిపాలన తత్వం తెలిసినవాడూ కాబట్టి ఆయనంటే ప్రజలకు రెండో ప్రాణంలాగ మెలిగాడు. ప్రజలసౌఖ్యమే ఆయనసౌఖ్యం; అయన ఆనందమే ప్రజల ఆనందమైంది.


సాధారణంగా 'రాజు' అనడంతోటే-ఎంతదేవానాం ప్రియుడైనా సరే - ఒక బింకం ఏర్పడుతుంది. తానేదో దేవలోకంలోనుంచి ఊడిపడ్డాననిన్నీ; అంతా తన కనుసన్నల మెలగవలెననిన్నీ తాను ఉందంటే వుందీ లేదంటే లేదూ అనిన్నీ భావం ఏర్పడుతుంది. దానితో అయ్యగారికి కళ్లు నెత్తిమీదికి వస్తాయి. సరి, ఇంక కావలసిం దేముంది? దానితో ప్రత్యక్షయము డవుతాడు. పాపం, ప్రజలు ఎల్లాగో ప్రాణాలు ఓగపట్టుకోని ఈబాధలకన్నిటికీ ఓరుస్తారు. అక్కడికీ మితిమీరి పోయిందా అంటే ఇక తిరగబడతారు. అయ్యగారిపని కొయ్యఅవుతుంది. సాధారణంగా లోకంలో జరుగుతూవచ్చే రాజత్వాలు 90 పాళ్లు ఈవిధంగానే ఉంటూ యని పెద్దలంటూంటారు.


అయితే శూరసేనుడి పాలనం అల్లాలేదు. ఆయనకు లోకమంతా తనకుటుంబమే అయింది. ప్రజలలో ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా అది తనదే అనుకుంటాడు. కాబట్టే ఆచారవ్యవహారల విషయంలో ఏమి, వర్తకం సర్తకం మొదలయిన వాట్లల్లో ఏమి, విద్యాబుద్ధులు ఏర్పరచడంలో నేమి, సంఘముయొక్క యోగక్షేమములను కాపాడడంలో నేమి, ఆయన కన్నాకై కాపాడుకొనివస్తున్నాడు. ఇంతయెందుకూ రెండుమాటల్లో ఆయన యోగ్యత తెలుస్తుంది. మహామండలేశ్వరులకైనా సరే ఆయనమాటా అంటే మఱి ఎదురులేదు; అయితీరవలసిందే. అట్లాగని ప్రజలతో ఐక్యంలేదాఅంటే, లేకేమి? కావలసినంత పోరుపెట్టి ఏడుస్తున్న చేతిపిల్లకైనా సరే రాజువస్తున్నాడంటే ముఖం కళకళ్లాడుతుంది. ఆగ్రహంలో ఉగ్రకోపి, అనుగ్రహంలో అమృతరూపి.

కన్నతండ్రికిమల్లె కాపాడేరాజుంటే ప్రజలకు మఱి ఏమికావాలె? శూరసేనుడు అల్లాంటివాడు కనుకనే దేశదేశాలవారు ఆయన యేలుబడిలోకి రావాలంటూరు. మఱికొన్ని దేశాలవారు వలసవచ్చి చంపానగరంలోనే చేరిపోయినారు. అట్లావచ్చినవారిలోవాడే మన భానుదత్తశెట్టికూడాను. భానుదత్తుడు చతురుడుఃఅదృష్టవంతుడున్నూ కాబట్టే చంపానగరంలో చేరేప్పటికి ఆస్తిపాస్తులు అట్టే ప్రశంసింపతగినంత లేకపోయినా చేరినతర్వాత పెద్దశెట్టులకుకూడా పెట్టుబడి పెట్టగలవాడైనాడు. ఇప్పు డతడు రాజుకుకూడా కంటికాగి ఉన్నాడు. భానుదత్తుడంటె ఏమిటనుకున్నారు—రత్నాల పిట్టు; నిక్షేపాలనిధి.

భానుదత్తుడికి సమస్తైశ్వర్యాలూ వున్నాయి. అనుకూలవతియైన భార్య—సుభద్ర అనేఆమె—భద్రగుణాలకు నిధానమైనది—ఉన్నది. ఎంతఉన్నా సంతానం లేకపోవడ మనేది వారికి చాలా లోపంగా తోచింది. దీన్ని సవరించుకోడానికి వారు అనేకప్రయత్నాలు చేశారు.

ప్రాచీనాభరణములు-చిత్రము 3





అయిని ఫలంమాత్రం విఫలమే. కాని చివఱకు శర్మదేవం అనే జైనక్షేత్రానికి వెళ్లారు. అక్కడ చారణుడనే ఒక ఋషి తటస్థించి వారికి జినపూజాక్రమమును ఉపదేశించాడు. చారణుని ఉపదేశము ననుసరించే భానుదత్తుడు కొన్నాళ్లు జినపూజను చేసినాడు. క్రమంగా భానుదత్తుని భార్య గర్భవతియై కొడుకును గన్నది. ఆశిశువుకు చారణుని అనుగ్రహంవల్ల పొందబడినవాడు గనుక చారణదత్తుడన్న పేరుపెట్టారు. క్రమంగా చారణదత్తుడే చారుదత్తుడిక్రింద మారిందట.

చారుదత్తుడు మెల్లమెల్లగా పెద్దవాడైనాడు. లేక లేక పుట్టినవాడు కాబట్టి, సంపన్నుల బిడ్డగాబట్టి గారాబంగానే పెరుగుతున్నాడు. కాని భానుదత్తుడి ప్రబలప్రయత్నములమూలాన విద్యాబుద్ధుల విషయంలో మంచిపునాదే పడ్డది. తగినగురువులతో సాంగత్యం కుదిర్చి రాత్రిందివాలూ విద్యాభ్యాసంగంలోనే ఆయనని వినియోగించడంవల్ల సమస్తవిద్యలూ లభించినవి. కాని లోకయాత్రకు కావలసిన లోకతంత్రం మాత్రం అలవడలేదు. ఎన్ని చదువులు చదివినా లోకతంత్రం తెలియకపోతే మఱి ఉపయోగం ఏముంటుంది?

కుమారుడి ఈస్థితి చూచి తల్లిదండ్రులు చాలా విచారపడ్డారు. తమ పిల్లవాడు ప్రపంచ వ్యవహారాల్లో ప్రవేశించే విధమేమి చెప్పుమా యని వారు తలపోసి కొన్నారు. చివఱకు అతని మేనమామకూతురిని తెచ్చి-మిత్రవతిఅనే ఆవిడను-పెండ్లిచేసినారు. మిత్రవతి కొన్నాళ్లకు కాపురానికికూడా వచ్చింది. అయితేమాత్రం లాభమేమి? భార్య అంటే ఏమిటో ఎందుకో? అనే పోలూ పొందు కూడా చారుదత్తుడికి గోచరించలేదు. ఎప్పుడు చూచినా తానూ తనచదువూ అంతేమరి. ఇతరం లేదు.

అప్పుడు చారుదత్తుడితల్లి అతన్ని సంసారసుఖాల వంకకు తిప్పడానికి వేరే త్రోవలేక వేశ్యాస్త్రీల తోడి పొత్తు కూర్పించింది. అన్నన్నా! నివృత్తినుండి కుమారుని మరలించుట కెంత తెలివితక్కువ ఆలోచనచేసింది! అసలే ధనికులఇంటి బిడ్డ; ఆపైని గారాబం; ఆపైని వేశ్యాది జన లంపటత; ఇక చెప్పేదేముంది?

మంచి అతికినా అతక్కపోయినా చెడ్డ చాలా సులభంగా అతుకుతుంది. కష్టపడి ఒకఇంటిని కట్టడము చాలా కష్టంగాని కట్టినదాన్ని పడగొట్టడంచాలా తేలిక. ఈవిషయం చారుదత్తుడి విషయంలోగూడా సార్థకమే అయింది. ఎన్నాళ్లో కష్టపడి తీర్చిసిద్ధముచేసిన చారుదత్తుని జీవితమనే తటాకమునకు విషయలంపటత అనే ఛిద్రం ఏర్పడ్డది. దానికి తగినట్టుగానే వసంతసేన అనే మూషికమగు గణికకూడా తోడైంది. ఓహోహో! ఆ విలాసాలేమి, ఆ అందాలేమి,ఆచందాలేమి!ఎప్పుడుకూడా స్తుతిపాఠాలుచేసే కుట్టుజట్టు సిద్ధం. సానివాడలలోని సమస్తజట్టీలు తీర్చడానికి చారుదత్తుడే ఇప్పుడధికరణికుడు. ఇంక కావలసినదేమున్నది? తండ్రి సంపాదించిన ధనరాసులు; తొలుదొల్తతల్లిద్వారా ముద్దుల ముడుపులు గాను,ఆపిమ్మట స్వతంత్రతతోను అదీమదిరేకొద్దీ కాస్త కాస్త ధూర్తతతోను వడివడిగా అంతరించాయి. ఆ తర్వాత స్వర్ణాభరణాలు, రత్నపు వుంగరాలు, నగలు నాణ్యాలు, చివఱకి—కన్నతల్లివి, చేసికొన్న భార్యవి సొమ్ములు సామంధాలు .అన్నీ మాయమవుతున్నాయి. ఎట్లాగో ఒకరీతిగా ఈవాసన భానుదత్తుడిదాకా వ్యాపించింది. భానుదత్తుడు చాలాఖండితవాది. ఇంట్లో శేషించిన ధనద్రవ్యాలనన్నిటినిజాగ్రత్తపడి భద్రపరచుకొన్నాడు. నౌకరులుగానీ చాకరులుగానీ ఇంటివాళ్లుగానీ పరాయివాళ్లుగానీ,ఎవరైనాసరే—తనరయితుక లేనిదిఏవస్తువైనా గానీ చారుదత్తుడి కీయగూడదని కట్టడచేశాడు. సరి; 'బందుకరో' అయింది చారుదత్తుడిపని. ఆందోళనలో పడ్డాడు. ఇంట్లో తండ్రి చోటుపెట్టడు. అతిఖండితం. తానాభోగతృష్ణలోపడి కొట్టుకొంటున్నాడు. 'పోనీ ఇచ్చినాడు పుచ్చుకొన్నారుగదా! ఇప్పు డాదరిస్తారేమో అంటే-సానివాడలో తనసంబంధాన్ని తలపెట్టే వారే లేరు. నిమిషానికి ఓవేషంతో కనపడే వసంతసేన ఇప్పుడు తపస్సుచేసినా కనపడడం కష్టమైపోయింది. అసలే వేశ్యజాతి; ఆపైని ధనతృష్ణ; వీటి అన్నింటిని మించింది ముసలిభోగంముండలపోదు; ఇవన్నీ కలసి చారుదత్తుణ్ణి వేశ్యవాటికవైపు మొగంకూడ ఎత్తనీయకుండా చేశాయి. పాపం! ఈస్థితిలో చారుదత్తుడివిషయం ఆలా ఉండనీయండి, కుబేరుడైతేమాత్ర మేమి??

పాపం దురదృష్టవంతుడు చారుదత్తుడు ఇప్పుడు వ్యర్థుడైనాడు. అతని కేమి చేయడానికి తోచలేదు— తండ్రిని చూతామా దావాగ్నివలె మండిపడుతున్నాడు;

గ్గఱికి రానీయదు; తల్లి అస్వాధీనురాలు. మామగారు మొదలయినవా రెవరూ దగ్గఱలేరు. అతనిస్థితి చివఱకు ఎట్లావచ్చిందంటే పిడికెడు మెతుకులుకూడా విదిలించే వాళ్లు లేరు. ఒకటే చింతతో తెల్లవారుతున్నది. ఎంత ఆలోచించినా ఏమీ పాలుపోలేదు. చిత్రంలో బొమ్మ లాగ ఉన్నాడు. స్థితి ఇలాగున్నది. ఎన్ని దినాలని నిర్వ హిస్తాడు? కాబట్టి ఒకనాడు తెంపుచేసికొని తనభార్య తాలూకు సొమ్ము కొంత అపహరించుకొని ఎవ్వరికి చెప్పకుండా బయలుదేరి వెళ్లి పోయ్యాడు. భానుదత్తు డికి ఈవిషయం తెలిసింది. "వెళ్లాడా? మంచిది. నాకొడుకు ఇక బాగుపడతాడు" అని నవ్వుతూ ఊరుకున్నాడేకాని, మఱి ఆతుర్దాపడలేదు. అందరికిన్నీ ఇది వింత అయింది. కాదా! కన్నకొడుకుగదా? విడిస్తే గతి ఏమిటి?

చారుదత్తుడు ఇంటినుండి బయలుదేరి అడవులు పట్టి వెళ్లుతున్నాడు. మార్గంలో ఒకఅడవినడుమ వర్తకు డింకొకడు తన పరివారంతో సహా విడిసియుండగా అతని దగ్గరకు పోయినాడు. దైవవశమున ఆవర్తకుడు మనచారు దత్తుడికి మేనమామయైన ధనదత్తుడే అవడం తటస్థించింది. ఆహాహా! దైవకల్పన ఎంత అందంగా ఉన్నది. ధనదత్తుడు మేనఅల్లుని సత్కరించి కౌగలించుకొని ఆదరించాడు. యోగక్షేమాలు ప్రశ్నించుకొన్న పిమ్మట చారుదత్తుడు తన స్థితిగతులన్నీ మేనమామతో వెళ్లబోసి కొన్నాడు. ధనదత్తుడు అయినదానికి వగచి లాభంలేదనిన్నీ, ఎంతయి నా వర్తకుని బిడ్డవుగనుక అధైర్యపడక వ్యాపారము చేసి ఆర్జించవలసినదనిన్నీ వ్యాపార శీలురకు లక్ష్మితప్పక ప్రసన్నురా లవుతుం దనిన్నీ, లక్ష్మిప్రసన్నంతో అన్ని దౌర్భాగ్యాలు తొలగిపోతవిఅనిన్నీ ధైర్యంచెప్పి ముందు మార్గాన్ని సూచించాడు. చారుదత్తుడు కూడా సరే నన్నాడు.

తర్వాత ధనదత్తుడు తానప్పుడే లాభముగా సంపాదించిన పదివేలదీనారములను మేనల్లునికి సంచి మొదలుగా ఇచ్చినాడు. అదివఱకు చారుదత్తుడిదగ్గఱ ఉండే సొమ్ముతోగూడా కలసి ఇరువదివేల దీనారము లయింది. ఈసొమ్మును తీసికొని వారిద్వరును ఉడ్రూక్ [బహుశః ఇది ఉడ్రక లేక ఓడ్రక దేశమైయుండును. ప్రాకృతములో డడలకు అభేదముగా నుండును]. దేశ మును చేరినారు. ధనదత్తుడు ఆదేశముచేరగానే తాను వేరయి తనవర్తకాన్ని చూచుకొంటూ, మేనల్లుని ప్రత్యే కించి వ్యాపారంచేయుటకు వదలినాడు.

వ్యాపారమంటే మాటలతో జరిగేదికాదు. అందు లో ఒక్కమారుగా లక్షలు ఆర్జించాలంటే ఎంతో గొప్పఆలోచనతో ఎత్తుఎత్తాలి. చారుదత్తుడికి ఇప్పుడు అసలుపెట్టుబడిసొమ్ము చేతిలో ఉన్నదిగనుక వ్యాపా రం సాగించవచ్చు. అయితే ఏవస్తువులమీద సొమ్ముపెట్ట వచ్చునో ఏవస్తువులమీద పెట్టరాదో బాగాయోచించు కోవలసి వుంది. అందులోనూ దేశకాల పాత్రాల ననుస రించి ఆయావస్తువులయొక్క అర్ఘతానర్ఘతలు ఆవశ్య కానావశ్యతలు మొదలగువాటిని బట్టి ఖరీదు చేయవలసి యుంటుంది. అందుకుగాను ఆదేశంలో నాలుగుమూలలా తిరిగి తగినంత అనుభవాన్ని సంపాదించి చేస్తేగాని లాభ ముండదు.

ఈవిషయం చారుదత్తుడుకూడా తెలిసికొన్నాడు కాబట్టి అతడు ఉడ్రూక్ దేశంలో ప్రవేశించి చక్కగా విచారణచేసి స్థితిగతులు కనుగొన్నాడు. అక్కడి స్థితి గతులనుబట్టి ప్రత్తికొనుగోలుచేస్తే చాల లాభమని తో చింది. పైగా మఱొక విదేశవర్తకుడిద్వారా తామ్రలిప్తి నగరంలో ప్రత్తికి ఎక్కువగిరాకీ వుందనిన్నీ, ఆదేశానికి ఎగుమతిచేస్తే చాలా లాభంవస్తూందనీ విన్నాడు. కేవలం వినడం మాత్రమే కాకుండా తాను కూడా స్థితిగతులు చర్చించి ఆవిషయం నిజమే అని కనుగొన్నాడు. సరి; ఇంకను అభ్యంతర మేముంది? తాను తెచ్చిన ఆ ఇరువది వేల దీనారములలోను పదునైదువేలదీనారములకుప్రత్తిని కొని నాటుమార్గంగుండా (అనగా నేలమీదుగా) సర కును బండ్లకెత్తించుకొని అడవులసందుగుండా సరకుతో లించుకొని ప్రయాణమైనాడు. ఆకాలంలో సరకులబండ్లు అడవిమార్గాన ప్రయాణంచేయడం కష్టమున్నూ చోరా దుల యుపద్రవములకు పాత్రమున్నూ అయ్యేమాటనిజమే. అయినా కొన్నసరకు ప్రత్తికనుకనున్నూ దొంగలువచ్చినా దానిజోలికి రారుగనుకనున్నూ చారుదత్తుడు ఆలోచిం చియే ఈ సాహసానికి సిద్ధపడ్డాడు.

"ప్రాయో గచ్ఛతి యత్రదైవహతకః, తత్రైవ యాంత్యాపదః—" అని అన్నారు పెద్దలు. గ్రహ

చారము చాలనివాడు ఎక్కడికిపోతే అక్కడికల్లా ఆపదలు వస్తూనేఉంటవట. ఈమాటకు సరిగ్గా చారుదత్తుడే ఉదాహరణం కావలసివచ్చింది. పాపం, మహోత్సాహంతో మెట్టమార్గంగుండా ఏవిఘ్నమైన అంతరాయం లేకుండా ప్రయాణంచేస్తూన్న చారుదత్తుడికి పెద్దబెడద వచ్చిపడ్డది. హఠాత్తుగా మధ్య ఒకమజిలీలో ప్రయాణం చేసేటప్పుడు కార్చిచ్చు పట్టుకొన్నది. అదివఱకే రెండు మూడు రోజులనుండీ ఆయరణ్యాన్ని హుతంచేస్తూ రేవిణీవేసికొనియున్న ఆకార్చిచ్చుకు, చారుదత్తుడి పత్తి బండ్లను చూడడంతోనే ఎక్కడలేని ఉత్తేజనంవచ్చింది.

జరజరామంటూ ఒకనిప్పురేఁక లేచింది. దానితోబాటు సుడిగాలీకూడా ఒకటిదాపురించి ఆరేఁకను తెచ్చి చారుదత్తుడి బండ్లమీద విసరింది. ఇక తరవాయి ఏమున్నదీ! హారో హర — బండ్లన్నీ భగ్గుమన్నవి. వాములు మేసే స్వాములకు పచ్చిగడ్డి ఫలహారమన్నట్లు కన్నుమూసి కన్నుతెరచేంతలో సర్వం మంగళమయింది. చారుదత్తుడు నిర్విణ్ణుడైపోయి చతికిలపడ్డాడు. ఎవరైతే మాత్రం ఏంచెయ్యగలరు కలసిరానికాలంలో? అయినా బుద్ధిమంతులు ఆపదలలో ఉద్వేజకంపొందరు. గనుకనే చారుదత్తుడు విషణ్ణహృదయముతో తానొక్కడే తామ్రలిప్తికి పోయెను.

చారుదత్తుడు తామ్రలిప్తనిచేరి, పిచ్చవానివలె నేమియును తోచక తిరుగుచుండెను. ఈ స్థితి ఇట్లుండగా సముద్రదత్తుడనే ఒక శెట్టి-ఆతామ్రలిప్తిలో వుండేవాడే-తనసరకుల నౌకలను ద్వీపాంతగమునకుపంపుచుఒక్కొక్కయోడపైనను వర్తకమునందు మంచినేర్పును స్థైర్యమును గలయువకులను స్వకులమువారిని పర్యవేక్షకులనుగా పంపుచుండెను. చారుదత్తుడు మెల్లగా ఎట్లో సముద్రదత్తుని పరిచయమును కలిగించుకొనెను. సముద్రదత్తుడు కూడ చారుదత్తుని వృత్తాంతమును సాంతముగా విన్నాడు. అతని ధైర్యసాహసాలకు ఆశ్చర్యపడి అల్లాంటి యువకుడు తనయొద్దనుండినచో తప్పక జయముకలుగునని అర్ధలాభపద్ధతిలో ఒకయోడకు చారుదత్తుని నాయకుని చేసెను. ఏర్పాటైన కార్యక్రమము ననుసరించి శాక ద్వీపమునకు రెండునావలున్ను పవనద్వీపమునకు ఒకటిన్నీ బయలువెడలినవి. చారుదత్తుడు పవనద్వీపపు నావకు నాయకుడై బయలుదేరినాడు. "భగవంతుని దయ యున్నచో తన పూర్వస్థితికి తాను రాగల్గుట కెంతకాలమో పట్టదని" యనుకొంటూ మహోత్సాహంతో చారుదత్తుడు పవనద్వీపయాత్ర సాగిస్తున్నాడు. అయితే ఏం మూటకట్టుకుంటాడు? "హతవిధిలసితానాం హీవిచిత్రో విపాకః" అన్నట్టు తీరా సగంమార్గమైనా గడచిందో లేదో; ఇంతలోనే పెద్దతుపాను ఒకటి ఆరంభమైంది. చారుదత్తుడి హృదయంలో రాయిపడ్డది. ఏది ఎట్లావున్నా సమయంలో అధైర్యపడడం పౌరుషలక్షణం కాదుగనుక, తనతోకూడా వున్న సాంయాత్రికుల (నావికులు కళాసులు మొ॥) కు ధైర్యంచెప్పి, ఓడచాపలు దింపివేయించాడు. చారుదత్తుడికి మున్ముందు రాబోయే విపత్తరంగాలు ఈమోస్తరుగా సంక్షోభంతో వుంటవని సూచించడానికి కాబోలు, కొండలకుమల్లె తరంగాలు లేచి పడిపోతున్నవి. గాలి వాటికి రెట్టింపుగా రేగింది. చారుదత్తుడినావ ఈవేపునకు ఆవేపునకు కొట్టుకొని లేచిపడుతూ, నానాఅవస్థ పొందుతున్నది. ఇదంతా ఇల్లాగుండగా, పైన పెళపెళ పెళపెళామని పట్టెడుపట్టెడు వడగండ్లు దూకుతున్నవి. చారుదత్తుడు ఎంతప్రయత్నించినా ఆగక చిట్టచివఱకు పాపం బ్రద్దలైనట్లు ఆనావ బ్రద్దలైపోయింది. నావలోవుండే సామానుఅంతా 'నదీనాం సాగరోగతిః' అయింది. నౌకర్లు చాకర్లు మొదలయిన సరంగుజన మంతా జలజంతువులకు విందులయినారు. కన్నుమూసి కన్నుతెరచేంతలో యథాప్రకారంగా మొండిప్రాణంతో చారుదత్తుడుమాత్రం మిగిలాడు. కాని కాలంలో కఱకంఠుడైతే మాత్రం ఏమిచేస్తాడు? పాపం ఏదోవిధంగా కొయ్యపలకని ఒకదాన్ని ఆధారంచేసికొని ఏడురోజులకు మఱలి తామ్రలిప్తికి చేరగలిగాడు.

సముద్రదత్తుడు జరిగిన కథంతా విన్నాడు. అతను ఆలోచించినంతవఱకున్నూ చారుదత్తుడిలోపం ఏమీ అతనికి కనపట్లేదు. "యత్నం చెయ్యడంలో లోపం ఏముంది? దైవచిత్రానికి మానవకీటం ఏం చేస్తుంది? కానీ ఇంకోమారు ప్రయత్నింతా" మనుకొన్నాడు. ఈమాటు మఱల నావనిండ సరకులనింపి తోడు ఏర్పఱచి తగినకట్టుదిట్టంతోనే పంపాడు. అయితే ఈమారు పవనద్వీపంచేరగలిగాడు చారుదత్తుడు. తీసికొనిపోయిన సరకుగూడా

చాలా విలువకే అమ్ముడు పోయింది. కాని ఇంటికితిరిగి వచ్చేటప్పుడు త్రోవదప్పి నీహారఖండమునకు వెళ్లాడు. అక్కడ ఒక పెద్ద కొండచరియకు పట్టుకొని ఓడ బ్రద్దలై పోయింది. "భక్షితేఽపి లశునే న రోగశాంతిః" అన్నట్టులుగా ఎంతో కష్టానికోర్చి సంపాదించికూడా బూడిదలో హోమమైంది. చివఱకు ఎల్లాగో ఓడాగ సముద్రదత్తుడి దగ్గరికి చావుకబురుతో చల్లగా వచ్చిచేరాడు. సముద్రదత్తుడి ఆశ్చర్యవిషాదాలకు మేరలేదు. అయినా ఆయన ఇంతతో ఊరుకోక, ఇంకోమారు మఱల వస్తువులతో నింపి చారుదత్తుడి ఆధ్యక్షతక్రిందనే నావను వర్తకమునకై స్వర్ణద్వీపమునకు పంపాడు. అదునులోనే హంస పాదని ఈమాటుకూడా ఆగతే పట్టింది. దీనితో చారుదత్తుడిమీద మురబ్బీ చాల తగ్గిపోవడం ఆరంభమైంది. అయినా కూడావుండేవర్తకుల ప్రోత్సాహంవల్ల సముద్రదత్తుడే స్వయముగా నాయకుడై నాల్గోమారుబయలు దేరదీశాడు. నాలుగోసారికూడా నల్లబొగ్గులా తుమ్మ చెక్కలా అయింది. కాని సముద్రదత్తుడు ఈ మాటు తాను దగ్గఱ ఉన్నందువల్ల పరిస్థితులను కనుగొని చారుదత్తుడివల్ల దోషం లేదనిన్నీ అతను చాలా సామర్థ్యాలు కలవాడనిన్నీ తెలిసికోగల్గినాడు. కనుక అంతతో నిరుత్సాహ పడక, మఱల స్వస్థానం చేరి మఱి రెండు మార్లు కూడా తాను దగ్గఱవుండే యత్నం చేయించాడు; గాని ఎప్పటి కుంటికాలు ఎప్పట్టే అయింది. ఈదెబ్బతో ఆరుమార్లు పూర్తి అయింది. చారుదత్తుడికి ప్రాణంవిసిగి ఆత్మహత్య చేసికోదలచుకున్నాడు. కాని సముద్రదత్తుడి నిర్బంధంచేత మానుకున్నాడు.

ఎల్లాగైతేనేం ఓడ ఏడోమారు బయలుదేరింది. "ఏం వీళ్ల అహంకారం? ఇన్నిమారులు బుద్ధిచెప్పినా చాలలేదా?" అన్న కోపంతో కాబోలు ఈమారు నావ మఱోమాఱుమూలకు పట్టింది. అప్పుడు నావలోవుండే వాళ్లంతా గొల్లుమన్నారు. చారుదత్తుడు లేచి సముద్రదత్తుడితో "అయ్యా! ఈదౌర్భాగ్యుడు మీవెంత నున్నంతవఱకున్నూ మీకీబాధలు తప్పవు. నేను తొలగితినా మీరు సుఖపడుతారు" అంటూ ఓడటాపుమీద కెక్కి సముద్రంలోకి ఒక్కమాఱు దూకాడు. అదేమి కర్మమో వెంటనే ఓడ కదిలింది. పాపం చారుదత్తుడేమయ్యాడో కదాయని సముద్రదత్తుడు వ్యాకులపడుతూ ఆఓడతోపాటు కదలిపోయినాడు. తరువాత దైవవశమున ఒకపలకను ఆలంబనము చేసికొని చారుదత్తుడు ఈదుకొనుచు గట్టుచేరి రాజగృహమునకు చేరినాడు. కాని ఇప్పుడు మునుపటి చారుదత్తుడు కాడు. సుఖదుఃఖములుకాని మానావమానములుగాని కాయక్లేశాదులుకాని అతనినేమియు నాకర్షింపలేకున్నవి. శాంతమగు మనస్సమాధితో రాజగృహప్రాంతపు అడవులలో ఆయన ఈమిగిలినకాలమును గడపదలచెను.

ఆరాజగృహప్రాంతపు అడవుల్లో చాలా రోజుల నుండి విష్ణుమిత్రుడని ఒకసన్న్యాసి ఉన్నాడు. ఆయన విద్వాంసుడున్నూ వేత్తయున్నూ అవును. కాని ఆయనకు రసపిచ్చి ఉన్నది. రసపిచ్చిఅంటే పాదరసపు గనుల్లో నుండి పాదరసాన్ని తెచ్చి దాన్ని ఏదోయుక్తితో బంగారం చేయడమన్నమాట. ఇందుకుగాను ఆయన పాదరసపు గను లుండేతావు కనిపెట్టినాడు. అక్కడికి అనాథలుగా వుండే మనుష్యులను మోసంచేసి తీసికోపోయి, వారిని ఆగనుల్లో దింపి రసంతోడించి అందుకొని మళ్లీవచ్చేటప్పుడు నిచ్చెన బద్దలుగొట్టి ఆ మనుష్యులను అందులోనే పడవేసి వచ్చే అలవాటు. విష్ణుమిత్రుడిల్లాచెయ్యడం ఎందుకంటే—గనుల్లోకి దిగిన మనుష్యులు పైకివస్తే తనగుట్టు లోకానికి తెలుపుతారని భయం.

ఇల్లా చేస్తుండగా ఒకనాడతనికి చారుదత్తుడు కనిపించాడు. సన్న్యాసి అతనితో మాట్లాడి విషయాలన్నీ తెలుసుకున్నాడు. తర్వాత తాను స్వర్ణయోగం చేస్తాననిన్నీ తనతోకూడా వచ్చి గనిలోకి దిగి పాదరసం తోడి తనకు ముందుగా అందిస్తే తీసికొని తర్వాత చారుదత్తుణ్ణికూడా పైకి తోడుతాననిన్నీ నమ్మిక పుట్టించినాడు. పిమ్మట తాటినిచ్చెన తీసికొని దానికి సొరకాయబుఱ్ఱ కట్టి దింపి పిమ్మట చారుదత్తుణ్ణికూడా ఆసన్న్యాసి పాదరసపుగనిలోకి దింపాడు. చారుదత్తుడు రసంముంచి నిచ్చెనకు కట్టబోతుండగా అంతకుముందే అందులోపడివున్న రుద్రదత్తుడనే కోమటిపిల్లవాడు జరిగినదంతా చారుదత్తుడికి ఎఱింగించి వద్దని వాదించాడు. చారుదత్తుడుకూడా సరేఅని సొరబుఱ్ఱనిండా రసంముంచిచ్చి రెండోమారు నిచ్చెనలో తాను కూర్చోడానికి

బదులుగా పెద్దబండ నొకదాన్ని కట్టినాడు. సన్యాసి కొంతదూరము నిచ్చెన చేది, తప్పకుండా చారుదత్తుడే అనుకొని సగందూరంలో ఆ నిచ్చెన తెగనరికి వెళ్లిపోయి నాడు. చారుదత్తుడెట్లాగో ఊపిరి బిగబట్టుకొని మఱు నాడు తెల్లవారిందాకా వుండి అచ్చటికి మామూలుగా ప్రతిరోజూ రసంతాగడానికై వచ్చిన ఆవుతోక పట్టు కొని గట్టున బడ్డాడు. వస్తూవస్తూ ప్రాణోత్క్రమణంలో వున్న రుద్రదత్తుడికి పంచనమస్కారమంత్రమునుపదేశించి వచ్చాడు. తర్వాత నతడు ఆమంత్రమును జపించి ముక్తు డైనాడు.

చారుదత్తుడిల్లా ఆపదలోనుండి బయలుపడివస్తూం డగా అతని మేనమామ ధనదత్తుడు మళ్లా తటస్థపడ్డాడు. ఇద్దరు ఒకరొకరివిషయాలు చెప్పుకొని కొంతవ్యాసువెళ్ల బోసికొన్నారు. చివఱకి ఈమాటు ఇద్దరూకలిసి రత్న ద్వీపానికి వెళ్లనిశ్చయించుకున్నారు. అసలు సాధారణంగా ఏద్వీపానికి వెళ్లాలసినా సముద్రప్రయాణానికి అనుకూల మైన ఓడలు మొదలయినసామగ్రి కావలెగదా. అందులో రత్నద్వీపానికి కేవలం ప్రత్యేకసాధనాలతో గాని వెళ్ల టానికి వీలులేదాయెను. ఇకను మన కథా నాయకులు మామాఅల్లుండ్లిద్దరూ కలసి చెరినాలుగు మూళ్లూ మను షులుమాత్రమే తప్ప మఱివే ఉసాధనం లేకపోయెను. ఎంచేస్తారో వాళ్లకే తెలియక కొంచెంసేపు ఆలోచిస్తూ కూచున్నారు.

ఇంతలో ధనదత్తుడు ఒకయుక్తిచేశాడు. బాబూ, చారూ! ఈకొండమీద భేరుండపక్షులు వస్తుంటాయి. భేరుండపక్షులు సాధారణంగా రత్నద్వీపంలోనే వుంటా యిట. కనుక రెండుమేకలను సంపాదించుకొని వాటి మీద కూచొని ఈకొండ శిఖరానికి పోదాము. అచ్చట ఆరెండుమేకలను చంపి వాటి లోపలిమాంసం తీసివేసి వాటి డొక్కలలో మనంకూచొని మూతికుట్టివేస్తే ఇంత లో భేరుండపక్షులు వచ్చి మనల్ని మాంసపుముద్ద లని తలచి మోసికొనిపోతవి. రత్నద్వీపం చేరగానే మనం ఆవట్లు చించేసిబయటికి వచ్చి రత్నాలు మూటకట్టు కొనివత్తాం అనిచెప్పి చారుదత్తుడికి ఇష్టం లేకపో యినా తనంతతానే రెండుమేకలను చంపాడు. చారుద త్తుడు వృథగా తననిమిత్తము చంపబడిన ఆ మేకలకై వగచుచు, వాటికి ప్రాణోత్క్రమణము అయ్యేవేళలో పంచనమస్కారమంత్రమును చెవిలో ఈవిశముగా ఉప దేశించెను.

ధర్మిణో యేఽత్ర వర్తంతే జ్ఞాతశ్రీజినసద్గిరః ;
నిత్యం పరోపకారాయ సంతు తే పరమార్థతః.
ఓం శ్రీం...... .....నమః—అని.

తరువాత వారిద్దరున్నూ అనుకున్నట్లే చేశారు. భేరుండపక్షులుకూడ ఊహించినట్లే వచ్చాయి. ఈ రెండుమొండెములను కాళ్లతో తన్నుకొని రత్నద్వీపానికి ఎగిరిపోయినవి. కాని తోవలో ఒకచిత్రం కలిగింది ధనద త్తుడు కూర్చున్న మొండేన్ని తన్నుకోపోయిన భేరుండం కొంచెందూరం వెళ్లేసరికి మఱోడేగ దానికి ఎదురుపడి ఆయాహారముకై రెండున్నూ పోట్లాడుకోవడం ఆరంభిం చినవి. ఈమధ్యలో కాళ్లపట్టు వదలి ధనదత్తుడున్న ఆ మొండెము నడిసముద్రంలో పడిపోయింది. దానితో ధనదత్తుడికథ ముగిసిపోయింది.

ఇక మిగిలింది చారుదత్తుడున్న మొండెం. ఆపక్షి దాన్నిమాత్రం జాగ్రత్తగా రత్నద్వీపానికి చేర్చింది. తర్వాత ముక్కుతో పొడిచి చీల్చవచ్చే వేళ్లకు చారు దత్తుడు స్వయంగానే ఆమొండెం చీల్చుకొని బయట పడ్డాడు. హఠాత్తుగా మొండెంలోనుండి మనిషిరావడం చూచి ఆభేరుండపక్షి భెదరి అక్కడినుండి ఒక్క మాటుగా ఎగిరిపోయింది. అన్నారు కూడాను పెద్దలు "పుణ్యవంతులకు దుష్టులుగూడా తోడ్పడుతూనేఉంటా రు"అని (లోకే పుణ్యవతాం పుంసాం దుష్టాశ్చాపి హితం కరాః). లేకపోతే ప్రాణాలు బిగపట్టుకొని మొండెలలో కూచున్న చారుదత్తుడికి బయటపడేందు కెట్లా ఉపాయం వస్తుందా?

తర్వాత చారుదత్తుడు ఆరత్నద్వీపంలో అటూ ఇటూ తిరుగుతూ అక్కడ చిన్నకొండ యుండగాఅక్క డికి వెళ్లాడు. అక్కడ అదివఱకే కూర్చుని వున్న ఒక ఋషి చారుదత్తుణ్ణి చూడంగానే వినయంచూపుతూమంద హాసంతో అన్నాడు.

ఋషి—చారుదత్తా! కుశలమా! ఎప్పుడు వచ్చితిరి. మీ యంతటి గుణవంతులను ఎందును చూచి యెఱుంగను.

మీరుచేసిన ఉపకారం జన్మజన్మాలకున్నూ మరువ రానిది సుమాండీ!

చారు—(ఆశ్చర్యంతో) అయ్యా! నన్నెట్టులు మీా రెరు గుదురు? మిమ్ముల నే నెక్కడా చూచినట్లు లేదే! నేను మీాకు ఏమి ఉపకారం చేశానూ? ఏమీా లేనిదే నన్ను గురించి ఇల్లా అనదగునా?

ఋషి:—అయ్యా! నావిషయం చెబుతాను, వినండి. నేను అమితగతియనే విద్యాధరుణ్ణి. మహా విద్యోపాస నవలన నేనుచాలా సిద్ధులను ఆర్జించాను. ఒకమాటు నేను నా భార్యతో కలసి చంపానగరంలో ఉద్యాన వనంలో తిరుగుతుండగా ధూమసింహు డనువాడు ఒకడు వచ్చి నన్ను చెట్టుకుకట్టివేసి నా భార్యను అప హరించాడు. అప్పుడు నాయనా! నీవడ్డపడినన్నువిడి పించి ఉపకారం చేశావు. తర్వాత నేను నాశత్రుణ్ణి గెలిచిమళ్లివచ్చి మిమ్ములను వరముకోర మనగా మీారు కోరరైతిరి. తర్వాతనేనుకొంతకాలము శివపుర మను పట్టణము నేలి అవసానకాలమున జైనదీక్షను పొంది ఇచ్చటచేరి తపస్సు చేయుచున్నాను. ఇదినా సంగతి.

చారుదత్తునితో ఋషీ ఇట్లా చెప్పుకొంటూండ గానే ఆఋషియొక్క కుమాళ్లు ఇద్దరువచ్చి చారుదత్తుణ్ణి చూస్తూనే సాగిలపడ్డారు. చారుదత్తుడు నమస్కార్హు డైన పెద్దయుండగా నాకేల నమస్కరించితి రనెను. ఆ మాట విని వారిద్దరు పాపలేశమువలన మేకలై పుట్టుట యును వధింపబడుటయున్నూ వధకాలంలో చారుదత్తు డు చేసిన పంచనమస్కారోపదేశం వల్ల ముక్తులు కావ డమున్నూ చెప్పి మంత్రదాతవైనందున నీవే గురువు వనుచు పూజించిరి. నిజమే అన్నారుకూడా పెద్దలు; ఏమనంటే—

"పరోపకారిణో లోకే సంతి యే బుధసత్తమాః
తైస్సురాద్యైర్న పూజ్యంతే మహాభక్తిభరైశ్చతే.—"
(నేమిదత్తుడు)

తర్వాత ఆవిద్యాధరులు అందరూ కలసి చారు దత్తుని విమానంలో కూర్చుండబెట్టుకొని అనంతములగు రత్నరాసులతో కొనివచ్చి చంపాపురిలో వదలిపెట్టి వెళ్లిరి. లెక్కలేనన్ని రత్నరాసులతో మణిగణములతో దివ్యాలంకారములతో వచ్చిన కొడుకును చూచి భాను దత్తుడు ఆనందాబ్ధిలో తేలినాడు. ఇక సుభద్రసంతో షానికి మేరయే లేదు. చంపానగరంలో వుండే జనులు నిత్యోత్సవాలతో ప్రతినిత్యం గడపడం సాగించారు. చారుదత్తుడున్నూ అంతటి యైశ్వర్యం పొందినప్పటికీ ధర్మాశ్రయమహిమను కండ్లారా చూచినవాడు గనుక యావజ్జీవము జినేంద్రయాత్రలు చేస్తూ తీర్థంకరులకు భక్తితో అర్చనలు సల్పుతూ జైనవేదాంతానుసారముగా మెలంగుచు సుఖించి యుండెను. కాబట్టి ధర్మాశ్రయ తత్పరులై లోకము సుఖింపగోరెదము. పెద్దలుకూడా ఇల్లాగే చెప్పిరికూడాను.

శ్లో. శ్రీమత్స్వారసురేంద్రచంద్రనికరై
ర్నాగేంద్రసత్ఖేచరైః
షట్ఖండాధిపభూవరైశ్చ నితరాం
భక్త్యా సదాభ్యర్చితమ్;
ధర్మం శ్రీజినభాషితం శుచితరం
స్వర్గాపవర్గప్రదం
నిత్యం సారసుఖాయ శర్మనిలయం
సంతః శ్రయం త్వంజసా.

ఇది జైనులమతకథలందు శ్రేష్ఠిచారుదత్తుని
ధర్మాశ్రయ మనుకథ.

క్రోధమూర్తి

పంద్యారం వేంకట సుబ్బయ్యగారు

నారదుఁడు

రామునితోఁ గుశలవులు పోరినరీతి, దేవవ్రతా! గురుదేవుతోడ
నీపోరు తెరువవి నీతిసూచకము భార్గవరాము! నీవ యీ రాచబిడ్డఁ
జేసితి వింత విద్యాసమీచీనుని, నీపుత్త్రుఁబోనివాని సమరమున
డీకొంటివే సాల్వ! యీకన్నె నీతంఘు, పోకినంతన దీనిశుద్ధి భంగ
మాయెనే! యోగ్యగైకొనవోయి విలయ, కాల మాసన్నమైనదిగాక యిట్టు
లేయుగంబులనేని నయేతరులయి, పోరిరే గురుశిష్యులు భూమి యద్రువ.

ఆకాశంబున నప్డు నోఁచి సుర లీయాలంబు సాలింపుఁడ
య్యా! కీడుం గలిగించెదున్ ధరకు ధాత్రాత్మోద్భవుం డీయతి
శ్రీకంఠుం డనుమాట నిక్కమని సస్నేహంబుగా నాడి రా
వాకుల్ పూవులు రాల్చుచున్ ముగిసె దేవప్రీతిగాఁ బోరిరో!

చదలువాక కరుళ్లులుచల్లగాలి, విసరి వారల కోపాలు విరిచె నప్పు
డచటఁదోఁచినజమదగ్నియట్టిమునియు, 'సమరమును మానుఁ'డనియె లోకములకొఱకు.

గంగ

ఏనే యేడ్వురఁ జంపికొంటి నిఁక వీఁడే నాకు లోకం బిసీ!
పీనిన్ రూపడఁగించు కోరికమెయిన్ విశ్వేశ్వరుంగూర్చి ధ్యా
నానూన స్థితిఁ జేయుదే తపము చానా! యింతట న్మాని చ
న్నే నైసర్గికమైన మాతగుల మేలే యీవృథాయాసముల్.

నీకౌటిల్యము నీకుఁ దెచ్చెడును తన్వీ! యిన్నికష్టాలు పో
వే కల్లోలిని వయ్యె దంత పునరావిర్భూతియున్ లేద! యీ
లోకంబంతయు నేకమయ్యు గుణజాలున్ భీష్ము నిర్జించునే
నాకుల్ సైతము వీనితోఁ దొడరనైనన్ జూడ రత్యల్పులై.

అనియె జాహ్నవి ఆమాట వినియు నంబ, తనమనోరథసిద్ధిని గనినదాఁకఁ
దపము సేయందలంచెఁ గోపపడు నేమొ! శివుఁడు తన దేవనదితోడి చెలిమి కులికి.

శిఖండి

'తనయ యిది తనయుఁ డవునని, మును చెప్పెను విశ్వపతి యమోఘమ్మగు నా
తని యాశీర్వాదమ్మిటుఁ, గనఁబడద టె సార్థమై జగ మ్మెఱిఁగెనో కో!
అని ద్రుపదరాజు తనమన, మునఁ బొగులుచునుండ నటకుఁ బుత్రుఁడు వచ్చెన్.
వనమునకుఁ జన్న పుత్రిక, ననుగ్రహించి రట యక్షు లటు పుత్రుఁడుగాన్.

క్లేశంబేది నృపుండు లేచి సుతు నాశ్లేషించు చానందబా
ష్పాంశంబు ల్నయనద్వయిం దొఱఁగ “తండ్రీ! నీవు మద్విద్విష
న్నాశంబుం గలిగింతు వంచు నసువు ల్నట్టాడు నాలోన, నా
యాశావల్లిక నేఁటికిన్ సఫలతాహ్లాదంబు గల్గించెరా!

నాయన! పొమ్ము భారతరణంబున ద్రోణుమదం బడంచి ర
మ్మాయుధముందు కైతవబలాధికుఁడై నను నొంచెమున్ను కౌం
తేయులు నీదుబావలును నేనును సమ్మదమంద యుద్ధముం
జేయుము దీవన ల్గనుము శ్రీ వెలయింపుము రా కుమారకా!

అనవుడు విలు నమ్ములుఁ గై,కొని పజ్జన్ నిలిచియున్న కూరుచువానిన్
గనుసన్న సేసి గుఱ్ఱము, గొనిరమ్మని పంపె ద్రుపదుకూర్మిసుతుండున్.

భీష్ముడు

“ అవును పంచభూతాత్మకమైన దేహ, మునకు నాశముంభద్ర మెప్పుడును లేదు
దీనికిది చక్కగా నున్నచోనతీర్పఁ, గావలయుఁ జేయఁదగినట్టి కర్మలెల్ల
ధాతృనిర్దిష్టకర్మ యుద్ధంబు సేఁత, క్షత్త్రియకుమారులకు; మైవసంబు నేది
దానఁగూలిన మేలకదా స్వకార్య, నిర్వహణమూర్ధ్వగతులు సెందించు నేని!”

“మీమెయి కండరంబులకు మిక్కిలి గూర్చిన యట్టికౌరవ
స్వామికిఁగాఁ బెనంగుఁ డురుశక్తి బయల్పడ”నంచు యోధులన్
దీమసమారఁ బోరికిఁ గదించి ప్రతాపము శత్రుసేనపైఁ
బ్రాముఁవ యోనతాంగుఁడు సుపర్వనదీసుతుఁడోటు చూడఁగన్.

ఓహరి సాహరిం బెనఁగుచుండిరి యోధులు పార్థుఁ డుగ్రుఁడై
దేహబలంబురీతిగనె ధీబలముం బఱిగించి చూచె, న
ప్డాహవమున్ మహాభయదమయ్యెను ధూర్తశిఖండి వైశిఖ
వ్యూహము ధార్తరాష్ట్రపృతనోద్ధతి మాపనువచ్చె నాయెడన్.

అంగనాపూర్వుతోడ నే సంగరంబు, సేయమి యెఱింగి క్రీడి! తెచ్చితె శిఖండి
ముందునకు “నంచువిల్లునమ్ములను విడిచి, బాణములమీఁద నొఱఁగె దేవవ్రతుండు
మేదురములయ్యె దిశలు హాహాదురంత, రావములతోడ నుభయపార్శ్వములవారు
తాతకడ కేగుదెంచిరి ధన్యుఁ డుత్త, రాయణము సూచికాని తీరఁడట యతఁడు.

శ్రీమతి సు. స. గారికి బహిరంగ లేఖ

పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు

అమ్మా! శ్రద్ధతో వ్రాసి యశ్రద్ధతో విడిచిపెట్టిన నీయుపన్యాసము దైవవశమున నాకు దొరకుటచే దానిని సంతోషమునఁ జదివి విమర్శింపవలసి వచ్చెనని విచారించితిని. ఆ యుపన్యాసము స్త్రీలకై యుద్దేశింపఁబడినదైనను, దానిలోఁ బురుషులకుఁ బుంఖానుపుంఖములుగాఁ దిట్లుండుట వలనను, భర్తపైఁ గోపమున వెల్లడించిన యభిప్రాయములకు భారతీయజాతిపరిశుద్ధితో లంకెయుండుటవలనను, దానిని స్త్రీపురుషు లందఱు చదువవలసినదని యెంచి భారతిలోఁ బ్రకటింపించితిని. అట్లు ప్రకటించుటకు మీ సెలవు లేదని యెఱుఁగుదును. కాని మీరెవ్వరో నే నెఱుఁగనప్పుడు మీ సెలవు నొందకపోవుట లోపము కాకపోవచ్చును. అదికాక జాత్యుపద్రవ మేదో వచ్చినదని మీరు భావించుచు మహాందోళన మొందుచుండ నట్టియాపత్కాలములో ననుజ్ఞ యక్కఱలేదని యనుకొనుట కూడ లోపము కాకపోవచ్చును. ఎటులైనను భారతీసేవకై సంకల్పింపఁబడినది భారతినే చేరినది.

అమ్మా! నీ యుపన్యాసము నామూలాగ్రముగ బండిలోనే చదివితిని. అదినాల్గుభాగములుగా విభజింపఁబడినట్లు స్థూలదృష్టికిఁ గానబడుచున్నది. మొదటిభాగము మగవానికిఁ దిట్లు; రెండవ విభాగము మగవానికిఁ దిట్లు! మూఁడవ విభాగము మగవానికిఁ దిట్లు; నాల్గవ విభాగము మగవానికిఁ దిట్లు; మగవాఁడు పట్టి వ్యర్థుఁడని మీ యభివృద్ధికిఁ బ్రతిబంధకారుఁడని, పరమశత్రుఁడని, ప్రత్యక్షమారకుఁడని, యాతనిఁ దృణీకరించి స్వప్రయత్నముననే మీరిట్టి మహోన్నతదశకు వచ్చితిరని, మగవాని నేల నడఁచి త్రొక్కినను పాపము లేదని మొదలగు ప్రారంభశాపవాక్యములు మొదటి యధ్యాయమునందుఁ బ్రకాశించుచున్నవి. మీబుద్ధిచేత మీకర్హములని యుపయోగకరములని మీరెంచిన బాహ్యవేషములను ధరించుచు నభినవశోభావిరాజమానలై యార్యావర్త కల్యాణ దేవతలై యలరారుచుండఁగ, బాహ్యవేషధారణమునఁదన్నేమో మీ ననుకరించుచున్నారని బ్రాంతిపడి మగవాఁడు మి మ్మెంతయో యల్లరిపెట్టినాఁడను కోపమున మీరాతనిని జెడమడఁ దిట్టినతిట్లు రెండవ యధ్యాయమున నేర్చినరత్నాలవలె భాసిల్లుచున్నవి. మగవాఁడు కోక కట్టుకొని, కాటుకపెట్టుకొని, సవరపుబుట్టనెత్తినిగట్టుకొని బూడిద మొగమునఁగొట్టుకొని కోడెపెయ్యయై రంగమున నవతరించినందుల కాతని కడ్డమైన తిట్లు-మాయదారిచూపులు- మంగళపుటారతి చూపులు-చూడలేకపోయెనని మఱిమఱితిట్లు-

ఆఁడుది నిలువఁబడినట్లు నిలువఁబడనైన లేక పోయినాఁడని నిలువెల్లఁ దిట్లు-మానినీతత్త్వము ననుకరింప లేక పోయెను గాని మగయెడలి పొంకములు, మనస్తత్త్వము కూడ మన్ను చేసికొనినాఁడని — ఓ — హద్దుపద్దు లేనితిట్లు-మూఁడవయధ్యాయమునఁ బ్రచండ ధాటీపరిపాటితో విజృంభించుచున్నవి. సంకర రూపసమార్జనమున సంసారకృత్యమున కర్హుఁడు కాని యాతఁడానాటకరంగమందే పడియుండి మగవాఁడు కాకుండ నాఁడుది కాకుండ నేదో మధ్యమమార్గగామియై దేహము చాలించుకొనక, సిగ్గులేక, యిల్లుచేరి, తగుదు నమ్మాయని తనవంటి మందభాగ్యుల నింక నవతరింపఁజేయుటకుఁ బ్రయత్నించుచున్నాఁడని, దేశద్రోహియని,జాతిద్రోహియని తిట్టినతిట్లు- హరిహరీ !- తురీయాధ్యాయమున నప్రతిహతములై యనిర్వర్ణ్యములైయున్నవి. వేదోచ్చారణమును వదలి చతుర్ముఖుఁడగు బ్రహ్మదేవుఁడు తిట్లకులంకించుకొన్నయెడలనింతకంటె నెక్కువ తిట్టలేఁడేమో యనుసందేహమును గలుగఁజేసితివి. ఈ నాలుగధ్యాయములలో నాలుగువర్ణములవారికి నాలుగాశ్రమములవారికి, నాలుగుయుగములవారికిఁ దలమున్కలైనతిట్లు ప్రసాదించితివి; తల్లీ! శాపాలాపశారదావతారమవు!

వెఱ్ఱితిట్లకు విమర్శన మేమున్నది? స్వరమగునెడల గాంధారమా 'మధ్యమమా' మఱియొకటియా యనుపరీక్షకాని, యపస్వరమునకుఁ గైశికియా కాకలియా యనువిచికిత్స యుండునా? ఉపేక్షకంటె నుత్తమవిమర్శనము వేఱొకటి లేదు కావునఁ దిట్లసంగతి యింకఁ దలపెట్టక విమర్శింపవలసినయంశము లేవో కొలఁదిగా విమర్శింతును.

అమ్మా! స్త్రీపాత్రధారణము తఱచుగఁ జేయుమగవానిమూలమునఁ గలుగుపిల్లలు సంకరస్వరూపులై యుందురని మీవాదము! ఇది మీభావనకాని ప్రకృతిసత్యము కాదు. ఆడారివా రెందఱో ప్రపంచమున నున్నారు. నే ననేకుల నెఱుఁగుదును. వారియాఁడారితన మింతయంతయని చెప్ప వీలులేదు. మాటలోఁ జూపులో, రూపులో, నడకలోఁ, దలఁపులోఁ, జర్యలో సంపూర్తిగా నాఁడువారివంటివారే కారు — ఆఁడువారే! అంతయో యింతయో దుష్టత్వ మాఁడంగితనమున కంటియేయుండును. ఆఁడారివాఁడు గుమ్మమునొద్ద నిలువఁబడియుండగ వీథిలో నెవఁడైన సుందరుఁడు పోవుచుఁ దనవంకఁ జూడకుండిన యెడలఁ దనపుట్టి యేమిమునిఁగిపోయినది? తనస్త్రీత్వము నాతఁ డవమానపఱచినాఁడని యాతఁ డట్టుడికిన ట్లుడికిపోవును. ఆసుందరుఁడు మఱియొకయాఁడుదానిని జూచి మందహాసమొనర్చునెడల నాడారివాఁ డసూయచేఁ దల నేలఁగొట్టుకొనుటకు సిద్ధపడును. అట్టి యాఁడంగివాఁడైనను బుంస్త్వసహితుఁడై పతివ్రతయైన తనభార్యయం దిల్లునిండినబిడ్డలఁ గనుచున్నాఁడు. వారు సంకరస్వరూపులైయున్నారా? అణువంతయాఁడారితన మాతనిపుత్త్రులయం దెచ్చటనైనఁ గనఁబడుచున్నదా? దుర్బలులైనపిల్లలఁ గనుచున్నాఁడా? ఉక్కు-తునుకలవంటివారిని గనుచున్నాఁడు. పౌరుష

విహీనులైనవారిని గనుచున్నాఁడా? లేదు, శౌర్యసహితులనే కనుచున్నాఁడు. ఆఁడారి తండ్రికిఁ బుట్టినవాఁ డెవ్వఁడుకూడ నాఁడారి వాఁడు కా లే ద ని యనేకదృష్టాంతములు చూపవచ్చును. అంతవఱ కిప్పు డవసరము లేదు. స్త్రీపాత్రధారియైన పురుషుఁడు దేహమున స్త్రీత్వములం దా డంగివానికంటె నెక్కువ చెడిపోయినాఁడా? లేదు. ఆఁడంగివాఁడే యట్టి బిడ్డలను గనుచుండ, స్త్రీపాత్రధారి సంకర స్వరూపులను గనుననుట సత్యదూరము; సాహసము.

వేదవిహితాచారసంపన్నుఁడై స్వచ్ఛమూర్తియైన వైదికశిఖామణికి, రైల్వేవారి భోజనమఠములందు గొడ్డుమాంసమును బీఁకుకొనితిను కర్మచండాలుఁడు జన్మించుచున్నాఁడు. పార్వతీపరమేశ్వరులవలె నప్రతిమాన దాంపత్యసహితులై పరమప్రశస్తులైన భార్యాభర్తలకు వారవనితామాతచేఁ జెప్పుదెబ్బలు దిను వంశోద్ధారకుఁ డుదయించుచున్నాఁడు. షట్ఛాస్త్రపాండితీమండితుఁడై సర్వటగంత విశ్రాంతకీర్తియుక్తుఁడైన వానికి శుంఠలలో శుంఠ జన్మించుచున్నాఁడు. అమ్మా! ప్రపంచ చరిత్రమును జూచుచుండుట లేదా? వితరణకళాదీక్షయందు బలిశిబికర్ణాదులంతటి మహావదాన్యునిగర్భమునఁ దండ్రిప్రాణోత్క్రమణ సమయమున నాతనితలవైపునఁ బెట్టుదీపము దండుగయని యార్పఁజేయు లుబ్ధాధమాధముఁడు కలుగుచున్నాఁడు. నవరసమయనవ జగన్నిర్మాతయైన Shakespeare మహాకవి గొడ్లు కోసికొను కటికవానిపుత్త్రుఁడని యందురు. ఒకనీగ్రోజాతియాతఁడు మహావిద్వాంసుఁడై మహాసభయం దొకమహోపన్యాసమిచ్చుచుండగా విని మహాశ్చర్యభరితుఁడైనట్లు శ్రీ వివేకానందస్వామి సెలవిచ్చినారు. ఆ నీగ్రోపండితుని తండ్రితాతలు వట్టిమూఢులై యుండ, నట్టివిద్వాంసుఁడు వారివంశమునఁ బుట్టుట చూఁడగా "Heredity" యనునది కల్లకాని వేఱుకాదని యాస్వామి స్పష్టపఱచినారు. ఏఁడడుగులయెత్తు దాటినవానిని Giant అని యందురు. అట్టివా రెందఱో యిదివఱకు జన్మించిరి. కాని వారితల్లిదండ్రులు సామాన్యాకృతి కలవారేకాని తద్భిన్నులుకారని పరిశోధనమువలనఁ దెలిసినయంశమే కదా? ఏఁడడుగులయెత్తుగల తండ్రికి మూఁడడుగుల వామనుఁ డుద్భవించుట లేదా! ఇంతయేల? ముగ్గుఱుభార్యలు చాలక, దినమున కొకత్తె చొప్పున మూఁడువందలయఱువదుగు రుంపుడుకత్తెలను జేరఁదీసిన దశరథమహారాజునకు—పరశురాముఁడు కాఁబోలు యుద్ధవార్త నంపగాఁ జేతులకు గాజులు తొడిగించుకొని యాఁడువారి గుడారములలో దాఁగిన దశరథమహారాజునకేకదా—ఏకపత్నీవ్రతుఁడైన జానకీనాథుఁడు — జగదేకవీరుఁడైన శ్రీరామచంద్రమూర్తి జన్మించినాఁడు; అమ్మా! ఇంకను Heredity ని నమ్మెదవా? Heredity యనుదాని వలనఁ దండ్రిసంబంధమైన ముక్కుపొడుగో, తల్లిసంబంధమైన కన్నుసోగయో, మేనమామసంబంధ మగు మూతివంకరయో పిల్లవానియందుఁ గాదా చిత్కముగ సంక్రమింపవచ్చునుగాని, జగత్తు నేలుటకు సామర్థ్యముగలయట్టియు, గాక

జగత్తునకు బొనిస యగునంతటి తుచ్ఛత్వము గల యట్టియు, మనస్సులోనిశౌర్యము, గాంభీర్యము, త్యాగము, నాపత్సహనము, భూతదయ, దైవభక్తి మొదలగు సద్గుణపరంపర కాని, కాతరత, లాఘవము, లోభము, శాంతిరాహిత్యము, తామసము, నాస్తికత మొదలగు దుర్గుణపరంపరకాని, Heredity వలనఁ గలుగుట కవకాశములేదు. అట్టియవకాశమే యుండునెడల బ్రహ్లాదుఁడంతవాఁడు హిరణ్యకశిపు నంతటివానికిఁ బుట్టుట సంభవించునా? అనూచానత కారణము కానియెడలఁ గారణమేదని యడుగుదువేమో? జీవునిపూర్వజన్మసుకృతదుష్కృతములే జన్మములోని గుణాగుణములకుఁ గారణములుకాని వేఱుకాదు. అమ్మా! నమ్ముటకు నీకిష్టమైనయెడల నమ్ముము; కానియెడల మానివేయుము. నీనమ్మకమువలన నార్యమతమునకు బలములేదు. నీతిరస్కారమువలన నీరసతయు లేదు. మహాబుద్ధిశాలులైన పెద్దలు నిర్వచించినమాటలను నాకుఁ దెలిసినంతవఱకు నా యత్యల్పశక్తిననుసరించి చెప్పుచున్నాను. వేదర్షుల యందలి విశ్వాసముచేనైనను నీ నూతన సిద్ధాంతమును ద్యజియింపఁదగును.

"నీవు స్త్రీ పాత్రధారణ మొనర్చితివి కావున నీతో నేను గాపురమొనర్పన"ని నీవు నీభర్తతో నిరంకుశముగఁ బలికితివే! ఆహా! భారతదేశ సంరక్షకదేవతలు గడగడ వడఁకు నంతటిమాటయంటివే! భర్త పైటవేసికొనివంకరగఁ జూచినంతమాత్రముననేభర్తృభార్యా సంబంధము తెగుననియనుకొంటివా? అదిగాక "మనకు భర్తలు శాశ్వతులుకారు; వారియిష్టము లేకున్నఁ బోవుదురు. మనయిష్టము లేకున్నను బోవుదు"రని వ్యాసుఁడు బ్రహ్మసూత్ర రచన మొనర్చినట్లు నీవు పరిణయ సూత్రములను గల్పించితివే! అమ్మా, ఎంతదానవు! మన వివాహశాసనము వంటపూటింటివ్యాపారము వంటిదే యనుకొనుచున్నావా? రష్యావారి మూఁడుసంవత్సరముల "కాంట్రాక్టు" వంటిదే యనుకొనుచున్నావా? భార్యాభర్తలు తనువులు వాసెనను బంధమువీడునదికాదని యెఱుఁగవా? శరీరయాత్ర చాలించి స్వర్గమున నఖండానంద సముద్రమున నోలలాడుచుండు నిల్లాలైనను భూలోకమం దింక జీవించియున్న తన భర్తకై గ్రుడ్ల నీరు గ్రుక్కుకొనుచునే యుండునుగదా? తనభర్త యన్యకాంతాసక్తుఁడుకాక తనయందే యపేక్షఁగలవాఁడై యుండవలయుననియుఁ దన గృహదేవతలను బూజించుచు నతిథిసత్కార మొనర్చుచు సదాధర్మమందే చరించుచుఁ గీర్తికాముఁడై యుండవలయుననియుఁ, బుణ్యరాశి యైన యాతఁడు, భూలోకయాత్రా పరిసమాప్తియనపిమ్మటస్వర్గమునఁ దన్నుఁజేరి యవ్యయానందము ననుభవింపవలయుననియు నామె భగవంతున కెల్లప్పుడు మ్రొక్కుకొనుచునే యుండును గదా? ఇది సత్యమని నిరూపించుటకు నిదర్శనములున్నవి కాని లేకపోలేదే! అట్టిచో నిద్దఱ పాత్రము పొరుగింటినుండి తెచ్చుకొని యిద్దెనలుచేసికొన్నపిమ్మట వారిపాత్ర వారికిఁ బొఱవైచినట్లు భర్తతో నవసరము తీఱినవెంటనే యాతనిబైకిఁ బొమ్మనుటకు నీకధికార మున్న

దని యనుకొనుట తప్పుకాదా? పట్టరానికోప
ముచే నటులంటివికాని నీ మనస్సులో నట్టి
యుద్దేశములేదని పెద్దవాఁడనైన నేను గ్రహిం
పలేనా? ఆఁడువేసములువేసిన పురుషులవలన
సంకరస్వభావులు పుట్టుదురని స్వప్నమందైన
ననుకొనకుము.

అమ్మా! మఱియొక్క మాట. మీకున్న
భావననుబట్టియే మీకుఁ బుత్త్రులు కలుగు
దురు. ఈయంశమును గూర్చి జంఘాలశాస్త్రి
చెప్పియే యున్నాఁడు. ఆతనిమాటలనే చెప్పె
దను. "భర్తయందు మీకున్న భావనాగౌరవ
మునుబట్టియే మీకు సంతానము కల్గును. తెలి
సినదా? భర్త పరదేవతయని యెంచి మీరా
తనిని సేవింపుఁడు. మీభావనా బలముననే
మహాపురుషులు మీగర్భమున నవతరింతురు.
భర్త మీకు బానిస యనియెంచి యాతనిపై
నధికార మొనర్పుఁడు. మీరు బానిస క్రింద
బానిసవంటి పిల్లలఁ గందురు. అది నిశ్చయము
అభిమన్యుని సుభద్రయే కనవలయును. భర
తుని శకుంతలయే కనవలయును. ఈ కాలము
లో నభిమన్యులు భరతు లెందుకు లేరు?
సుభద్రలు శకుంతలలు లేకపోవుటవలన. భర్త
లను దైవములుగ సేవించుటకు భగవత్సము
లైన భర్త లిప్పుడున్నారా యని తెలివి
తక్కువ ప్రశ్న మొనర్పకుఁడు. ఒకప్పుడు
మాత్రము భగవత్సములైనవా రుండిరా? లేరు.
ఇప్పుడింతకంటె లేరు. లేకపోయినప్పటికి మీ
భావన కభ్యంతర మేమి? మగలు కాని మట్టి
బొమ్మలు కారే. మట్టిబొమ్మనే ద్రోణాచార్యుఁ
డుగ భావించి సేవించినవాఁడు ధానుష్క-
శిఖామణి కాలేదా? అంతవఱ కెందులకు?
గాజులతట్టుతోఁ గప్పఁబడినగోడిగ యరే
బియాగుఱ్ఱమును గనుటలేదా? భావనయే
ప్రధానమా? అంతకంటె నేమైన నున్నదా?
అట్టి మీభావనాలోపమువలననే జాతిలో
బానిసతన మెక్కువయగుచున్నది. మీయెద్ద
మీభర్తలు గడగడలాడినప్పుడు మీరు కన్న
కొడుకు లెలుకలను జూచి, యిల్లిల్లులను జూచి
యేడ్చినారనఁగ వింత యేమున్నది? సోదరీ
మణులారా! బాహుబలసంపన్నులు, ప్రజ్ఞా
శాలులు, క్షాత్రవంతులైన పుత్త్రులఁగని భారత
దేశప్రాచీనగౌరవమును గాపాడుదురుగాక!"

విమర్శింపఁదగిన యంశ మింకొక్కటి
యున్నది. నాగరకతగల యితరదేశములందలి
పద్ధతి ననుసరించి స్త్రీలకే స్త్రీపాత్రము లిచ్చి
నాటకకళను బరిపోషింపవలసినదని మీరు
నాటకసంఘాధికారులకొసఁగఁదలఁచిన
యాజ్ఞాపత్రములో నున్నది. అమ్మా! ఆవ
శ్యక మైనయెడల నన్యదేశీయపద్ధతి నవలం
బింపనేవచ్చును. కాని, దాని నవలంబించు
టకుఁ బూర్వము మనదేశశీతోష్ణస్థితు లేమో,
సాంఘికనైతికాదిస్థితు లేమో, జాతీయాదర్శ
మేమో, యన్యదేశీయపద్ధతి మనయీపరిస్థితు
లకు సరిపోవునో వికటించునో, మనతత్త్వము
లకు విరుద్ధమైనమందును దీసికొనుటవలన
నున్నరోగ మట్లుండగా మఱి యింక నేరోగ
ము కలుగునో రవంత చూచుకొన నక్కఱ
లేదా? పాశ్చాత్యదేశములలో మిక్కిలి శీతల
ప్రదేశములందలి వారికి శీతోదకస్నానము
స్వప్నమందైన లేదుగదా! ఉష్ణోదకస్నాన

మైన దినమున కెన్నిసారులని యడుగవలదు; వారమున కెన్నిసారులని యడుగవలదు; మాసమున కెన్నిసారులని యైన నడుగవలదు. సంవత్సరమున కయిదాఱు పర్యాయము లైన యెడల—ఓ—సమృద్ధి! పండ్రెండుస్నానము లొనర్చువాఁడు పరిపూర్ణస్నాననిష్ఠాగరిష్ఠుఁడు. ముంజేతులకు మొగమునకు మాత్రమే యుష్ణోదకస్పర్శముకాని యొడలికేది? వారు నాగరకత కలవారుకారా? అట్లని వారిపద్ధతి మన మవలంబించునెడల భారతదేశమంతయుఁ బదిమాసములలో నిర్జనమగుట కేమైన సందేహమా?

అమ్మా! France దేశమునకుఁబోయి యచ్చటి యొకనటిని నీ వీవృత్తినేల యవలంబించితివని యడుగుము. "ఈవృత్తిలోఁ జాకచక్య మగపఱచి, ధనముసంపాదించునెడల మగఁ డెవ్వఁడైన లభించునేమో యను నాసతో నిందుదిగితి" నని యామె ప్రత్యుత్తరము చెప్పును. ముప్పదిరెండేండ్లకన్య మొగమునకు బూడిద రాచికొని యర్ధదిగంబరవేషముతో నాట్యమాడుచు, వలతోఁ జిగురుగండెలతోఁ పక్షికూఁతలతో మగలకై వేఁటాడుచు, నెవ్వనినో యొకని గ్రహించి వానిని గొంతకాలము పరీక్షించి నచ్చనియెడల విడిచిపెట్టుచు, మఱి యొకని గ్రహించి, వాఁడు చేసిన మోసము వలనఁ గలిగిన ఫలముల కేడ్చుచు, మఱల మఱియొకనికై ప్రయత్నించుచు, నాందోళన పడుచు, నల్లాడుచు, మిడుకవలసినస్థితి భారతదేశస్త్రీ కెన్నఁడైన నేమాత్రమైనఁ గలుగుటకు సాధ్యమగునా? ముప్పదిరెండేండ్లవఱకెందులకు? పదునెనిమిదేండ్లు దాఁటినకన్యను సాధారణముగా భారతదేశమందుఁ జూపఁగలమా? అంతవఱకుఁగూడ నెందులకు? పదియేండ్లకుఁ బెండ్లి, పదునొకండేండ్లకు సమర్త, పండ్రెండేండ్లకు లాడితెడుబిడ్డయుగల గృహిణి భరతశాస్త్రాభ్యాసము చేయు టెప్పుడు? ప్రసన్నయాదనములో నూర్వశియై తాండవించు టెప్పుడు? అమ్మా, Germany లో మఱియొక్క నటిని నీవీవృత్తిలో నేల చేరితివని యడిగెదవా? ఆమె యేమిప్రత్యుత్తర మిచ్చుచున్నది. Excitement కొఱకని చెప్పుచున్నదా? అమ్మా! అనగ నేమో నీకర్థమైనదా? ఉత్సాహమునకు — ఉబికిన కిన యుద్రేకమునకు-నరములకదలికకు ఆమె యీవృత్తిలోఁ జేరినదఁట. ఇంట బండపనిచే, భర్తృసేవచే, బంధువుల యాదరణముచే, నతిథిజనసన్మానముచే దేవపూజాద్రవ్య సమార్జనముచేఁ, బిల్లల కొనర్ప వలసిన మొదలు తుదలేని, తెఱపి తెంపులేని యుపచారపరంపరచే నిత్య ముత్సాహముతోఁ గదలికతో మెలఁగవలసిన మన నారీమణుల కెప్పుడైననట్టి (Excitement) కావలసియుండునా? పరదేశనటీశిఖామణులు బ్రహ్మచారిణు లగుటచే నేవిధమైన జంజాటము నెఱుఁగని హేతువున వారి కట్టి యుద్రేకస్థితి యావశ్యకము కాని, యూఁపిరి విడుచుటకైనఁ దెఱపిలేని యుద్రేకస్థితిలోఁ దఱచుగా నుండవలసిన మన నారీమణుల కది యెట్లన్వయింపఁగలదు? ఒకవేళ నెప్పుడైన నేకారణముననైన రవంతమాంద్యముగా నున్నయెడలఁ దోఁపకుండ నుండు

నెడలఁ గదలిక కొఱకు గ్రచ్చకాయ లాడుకొందురు; చతురంగ మాడుకొందురు; పాటలు పాడుకొందురు; పదిమంది చేరి యేదైన గ్రంథమును జదువుకొందురు. అంతే కాని యంతకంటె నుద్రేకమిచ్చునను లొనర్చుటకు మనవారు పాల్పడఁగలరా? పట్టపగలు, భర్తతో నైన రవంత యేకాంతముగ మాటలాడిన యెడల నత్తగారు రొసరొస లాడునే! ఆఁడుబిడ్డమూఁతి విరుచునే! పర పురుషుని స్పృశింపఁదగదు; చూడఁదగదు; తలఁపఁ దగదని ముప్పేటయేనుఁగుమెలికల బంధముతో జాతితత్త్వపరిశుద్ధినిమిత్తమై పరమసంతోషపూర్వకముగ బంధించుకొన్న మన సోదరీమణులు నాటకములలోఁ బర పురుషులచే నాలింగన మొనర్పఁబడుటకుఁగాని, ముద్దుపెట్టుకొనఁబడుటకుఁగాని యంగీకరించుట యెన్నఁడైన సాధ్యమగునా? పదవయేటఁ గట్టుకొని, యెనిమిదేండ్లనుండి కాపురముచేయుచునల్వురు బిడ్డలను గన్నమగఁ డింటిలో నుండఁగా మన దేశమందలి సంసారిణి "ప్రాణప్రియా" యని ఔరంగజేబుమీఁదఁ జేయివైవఁగలదా? పైన హిమాలయము, ప్రక్కనుసముద్రము, లున్నంతకాలము భారతదేశస్త్రీల కట్టి దుర్యోగము పట్టదు? ఇతరదేశ స్త్రీలందుమాత్రము నటీవృత్తి వివాహముతో సామాన్యముగ నంతము కాకుండ సాగుచున్నదా? అందుచే సంసారిణుల కది యనర్హమని ప్రపంచ మంతయు నంగీకరించిన విషయములాగునఁ గనిపించుచున్నది.

ఇఁక మిగిలినవారు వేశ్యలు. అమ్మా! వీరికి స్త్రీపాత్రము లీయవలసినదని నీ యభిప్రాయమై యుండవచ్చును; ఇది సమంజసమగునో కాదో చూతము. ఇప్పుడు వేశ్యలలో గొప్పసంస్కరణ మారంభమైనది. దైవకటాక్షమువలన నిది దేశమంతట వ్యాపించును. అత్యంతము న్యాయమైన యీ సంస్కరణమునకు సంపూర్ణవిజయము సిద్ధింపవలయు నని మనుష్యమాత్రుఁ డెల్ల గోరఁదగినది. ఇఁక నొక్క పది సంవత్సరములలోఁ బెండ్లికాని వేశ్య కనఁబడకపోవచ్చును. అంతవఱ కిప్పుడున్నవారిని నాటక రంగమునఁ బ్రవేశపెట్టి కాలక్షేప మేలచేయరాదందువా? అమ్మా! అటులే అదికూడఁ జూతము.

చెవికంటెఁ గన్నెక్కువజ్ఞానేంద్రియ మగుటచే, శ్రవ్యప్రబంధ పఠనమున మనము సంపాదించుకొను విజ్ఞానముకంటె దృశ్యప్రబంధ ప్రదర్శనమున సంపాదించుకొను విజ్ఞాన మెక్కువ— యెక్కువ సుసాధ్యము—యెక్కువబలీయము—యెక్కువ శాశ్వతము.


నీతికిఁ దావై, ధర్మమునకు నిలయమై, శాంతి కాకరమై, స్వార్థపరిత్యాగమునకు స్థానమై దేశభక్తికిఁ దావలమై, దైవభక్తికి మూలమై మోక్షనిశ్రేణికకు మొదటిమెట్టై ప్రకాశించు పవిత్రనాటకరంగమును ప్రత్యక్షపాపవృత్తి వలన జీవించు వేశ్యలసమావేశముచేఁ గలుషపఱచుట సమంజసము కాదని భావించుట న్యాయముకాదా? ఇప్పు డున్ననటకులందఱు యోగులు, భక్తులు, జ్ఞానులేనాయని యధిక్షేపింపకుము. మంచివారున్నారు; చెడ్డవా


రున్నారు. పోనీ! నీయభిప్రాయప్రకారము చెడ్డవారే హెచ్చుసంఖ్యవా రున్నారని యంగీకరింతము. ఇదివఱకున్నకీడే ప్రబలమైయుండెనని నీ వొప్పుకొనుచున్నప్పుడు దానికంతకంటెఁ బ్రబలమైనకీడును జేర్పఁ బ్రయత్నింపవచ్చునా? ఉష్ణప్రదేశమగుటచే నుప్పులేకుండ ముప్పందుము త్రాగఁగల యిట్టినటకులతో— సంభాషణములకు, సరాగములకు, సాహచర్యములకు, సమాలింగనములకు—ప్రత్యక్షవేశ్యలనే యంటఁగట్టినయెడలఁ గొంపలు నట్టేట వేతెకట్టుకొనవక్కఱలేదు. ఇఁక నటులలోఁ బరస్పరము కొట్లాటలు, గుద్దులాటలు జరుగుట కేమైన సందేహమా? వారకాంతలను స్త్రీపాత్రములుగఁ జేసికొన్న యొకటి రెండునాటకసంఘముల నేనెఱుఁగుదును. ఆ సంఘములు సంవత్సరము జరుగకుండనే యంతరించినవి. ఆయొక్కసంవత్సరములో జరిగిన హంగామా యింతయంతకాదు — తాతలనాఁటి యీనాములతనఖాలు, వేశ్యాకాంతల బంగారువస్తువులచౌర్యములు, న్యాయసభలలో నభియోగములు, బ్రాందిబుడ్లతో నొకరినొకరు కొట్టుకొనుటలు, ప్రేక్షకులు కొందఱు నాటకరంగమున బలాత్కారమునఁ బ్రవేశించుటలు, రక్షకభటులనిరోధములు, తెరలవేలములు, పాకకునిష్పంటించుటలు, సివిల్ ఖైదులు—సుఖవ్యాధులు.—

అమ్మా! క్రొత్తసంస్కరణ మేమియు వలదు. ఏదో శాంతియుక్తముగా జరుగుచున్నదానిని జరుగనిమ్ము. బాగుచేయఁదలఁచి మఱింతపాడుచేయుట ధర్మముకాదు. స్త్రీపాత్రధారులకు మగతనము మట్టిలోఁగలసినదేకాని యిసుమంతయైన స్త్రీత్వము రాలేదని యట్టె పట్టుపట్టకుము. ముంగురులు కత్తిరించుకొని యిజారు తొడిగికొని సైకిలెక్కనందువలన మీ కెంతమగతనము వచ్చినదో యామాత్రపు స్త్రీత్వ మాతనికి రాకపోలేదమ్మా! ఇప్పటినటులు బాగుగనే యభినయించుచున్నారు. కొందఱుత్తమస్థాన మాక్రమింపనున్నారు. నాట్యకళాభివృద్ధి కెందఱో పాటుపడుచున్నారు. బుద్ధిమంతులైన విమర్శకులాకళపై గ్రంథముల వ్రాయుచున్నారు. నాటకపరిషత్తు నొకదానిని స్థాపించి తత్కళాభివృద్ధికి మార్గములు యోజించు చున్నారు. భరతశాస్త్రాభ్యాసనమునకై భరత మునిబృందమొకటిస్థాపింపఁబడినది. అమ్మా! ఏ కళలోనైన నుత్తమస్థితి త్వరలో లభించునా? పాటుపడఁగఁ బడఁగలభింపక మానునా? నాట్యకళకు సుదినములు రాఁగలవని తోఁచుచున్నది.


అమ్మా! మఱియొక్కమాట. పాశ్చాత్య వనితలకుఁ గలిగినంత యభివృద్ధిదశ మీ కింక రాలేదని చీటికిమాటికి విచారింపవలదు. అట్లు విచారించివారిపద్ధతులను మీరవలంబింపఁ బ్రయత్నింపవలదు. వారియభివృద్ధిదశతో వారేమోవిసుగుఁ జెందియున్నట్లు కొలఁదిగాఁగనఁబడుచున్నదనియు, సర్వసౌఖ్యాకరమై సమస్త గౌరవభాజనమై సర్వమధురమైన గృహిణీత్వపదమునపేక్షించుచున్నట్లగపడుచున్న దనియు నింకొక పది సంవత్సరములలో వెనుకకునడచి నడచి యథాస్థానమును జేరవచ్చు ననియు నొక పాశ్చాత్య గ్రంథకర్త("The Modern

ప్రాచీనాభరణములు-చిత్రము ౫







1. టర్కీ-సైనికోద్యోగి యొక్క క్రొత్త యొుటోపీ.



2. కాన్‌స్టాంటినోపిలు గవర్నరుయొక్క క్రొత్తరకపు టోపీ.



3. యూరోపియను దుస్తులను ప్రవేశపెట్టిన లెఫ్టినెంటు బీహో జే గారు.




4. ప్రాతమాదిరి ఫెజుటోపి. దీనినిధరించుట అవమానకరముగా నిప్పుడు తలచుచున్నారు.



5. ప్రస్తుతము అధికముగా వాడుకలోనున్న టర్కీ-స్త్రీల తలదుస్తు.



6. ఘోషా మేలిముసుగుకు మారుగా ఉపయోగించు వేఱొకమాదిరి తలదుస్తు.



7. యూరోపియను స్త్రీలతలదుస్తు—ఇట్టిదానినే ఇప్పుడు పెక్కుమంది టర్కీ-స్త్రీలు ధరించుచున్నారు.

వందలకొలది ఏండ్లనుండి టర్కీ-వారు ఫెజు (కుచ్చుగల ఎఱ్ఱని పొడవు) టోపీలను పెట్టుకొనుచుండిరి. ఇటీవల కొంతకాలమునుండి టర్కీ-సైనికులు ఫెజుటోపీలనుమాని యూరోపియనులటోపీలను పెట్టుకొనుటకు మొదలిడిరి. క్రమక్రమముగ ఇక కొంతకాలమునకు టర్కీ-దేశమున ఫెజుటోపీలు వాడుకలోనుండి భొత్తుగా తొలగిపోవునని నిశ్చయింపదగును. ఇంతేకాక అధికవ్యయమును కలిగించు టర్కీ-స్త్రీల దుస్తులలోను మార్పులు బయలుదేరినవి. ముస్తఫా కెమల్ పాషాగారు టర్కీ-స్త్రీలను యూరోపియను స్త్రీలవలె దుస్తులను ధరింప ననుమతి నొసంగిరి కావున వేలకొలది టర్కీ-యువతులు ఘోషా మేలిముసుగులనుమాని పారిసులో తయారయిన దుస్తులను ధరించుచున్నారు. ఈ మార్పువలన ప్రసిద్ధముగా చెప్పికొనుచుండిన టర్కీ-నారీమణుల యపూర్వసౌందర్య మీనాటికి యథార్థమని నిరూపితమైనది.

Girl nonsense,, అను శీర్షికతో మొన్న మొన్న వచ్చిన Titbits లోఁ దన యభిప్రాయమును వెల్లడించినాఁడు. దానిని నీవుచూడ వచ్చును.

అమ్మా! పురుషులు స్త్రీపాత్రముల ధరించి జాతికంత యప్రతిష్ఠ తెచ్చుచున్నారన్న విషయము జంఘాలశాస్త్రి పక్షపాతబుద్ధిచేత విమర్శించుట మానినాఁడని నీవాతని నిందించితివి. ఈవిషయమున నిన్ని చిక్కులుండుటచేత నే మానివైచినాఁడు; కాని పక్షపాతబుద్ధిచేఁగాదని నే ననుకొందును. జంఘాలశాస్త్రిని నేను రవంతయెఱిఁగినవాఁడనగుటచే, నాతఁ డిప్పుడు బదరీనారాయణమున నుండుటచే నాతనిపక్షమున నేను నీ కీప్రత్యుత్తర మీయవలసి వచ్చినది. కాని యాతఁడు కొలఁది కాలములో మనవైపులకువచ్చునని కింవదంతి యున్నది. వచ్చుటయే సిద్ధించునెడలఁ దిరుగ నేదో యొకసంఘమునుస్థాపించి కొంత గడబిడ చేయకమానఁడు. అమ్మా! సౌభాగ్యవతివై, యాయుష్మతివై, సంతానవతివై, సుఖమున నుండుము.

అ నా వృ ష్టి

విద్వాన్ కట్టి సాంబమూర్తి శాస్త్రిగారు

హర్షోత్కర్షము మీఱఁ బ్రాణితతి వహ్వాయంచు భాషింపఁగా
వర్షాకాలము ఘర్మతాప మెడలన్ వారించి వర్షించినన్
దర్షల్ దీఱఁగ సర్వసస్యముల మందస్ఫూర్తి వర్ధిల్లినన్
వర్షాకాలము కాని కానియెడ నేవర్షంబు లేకాలముల్!

సీ. ఫెళఫెళ ధ్వనులతో భీకరంబగు మేఘ, బృందంబులను వాన చిందలేదు,
రోదసీకుహరంబు రొదయించు సుడిగాలి, మిన్కుమిన్కని వాన చిన్కలేదు,
తళతళ మెఱయు సౌదామినీలతలను, పలపలమనివాన పర్వలేదు,
దెసలఁ గన్పడనీని విసవిసముసురుల నదనునకగునీటి పదనులేదు
గీ. అక్కటకట! వర్షాకాల మల్లనరిగె!, పొలములను చెర్వులను నీరు పూజ్యమయ్యె!
ఎట్లు పంటలు పండు నీ యేఁడు, జనము, లెట్లు జీవింతు రెట్లు గడింత్రు ధనము!

సీ. బెకబెక ధ్వనులతో భేకసంతతి వీను, విందులఁగూర్చి రావింపలేదు,
జీండ్రు జీండ్రను రొదఁ జీరండపుర్వులు, చెవులు గింగురుగ వాచింపలేదు,

కలకలారవముల గారండవంబులు, కమలాకరములఁ బ్రాకంగలేదు,
జలజలధ్వానులతో సాగరగామినీ, వ్రజము పూర్ణముగఁ బారంగలేదు.
గీ. వరిపయిరు కారుకోలు సూపంగలేదు, భాద్రపదమది నద్భద్రపదముగాఁగ
నరిగె కర్షకజనకుతూహలము తోడ, నెట్టులీయేఁడు బ్రతుకుటో యీశ్వరేచ్ఛ!

మ. కలమంబుల్ పరికించి కర్షకులు శోకంబాపఁగాలేక సం
కుల నానావిధ దీనరావములతో ఘోషింప నాకంబు నా
కులమయ్యెన్, జగమెల్ల నారొదలతో గోపెట్టె, కన్నీట నా
విలమయ్యెన్ భువనంబు, నూర్పులను గంపించెన్ దిశాస్తోమమున్.

క. శ్రావణ భాద్రపదంబులు, వేవే వచ్చునని జనులు వింతగ నరకుల్
రావించి నిలువఁ జేసిరి, యేవార్తయు లేక నరిగె నిరునెల లకటా!

సీ. పాలకైయల్లార్చు బడుగులేగలఁ జూచి, కన్నీరునించు గోగణము లొకట!
గోగ్రాసమెల్ల మహోగ్రాతపంబునఁ, బసమాడనూర్చు గోపగణ మొకట!
గోపులబత్తెంబు లోపియిచ్చుట యెట్లొ, యని నసిఁజూచు గ్రామణులు నొకట!
గ్రామణుల్ కొల్చమ్మఁగాఁ దేకయుండిన, బ్రతుకెట్టులను వణిగ్వార మొకట!
గీ. అక్కటకట! యాయావరమైన దొరక, దెట్టు లిఁకమనుటను జన్నిగట్టు లొకట!
పలువెతలఁగుంది పనవుభూభర్త లొకట! వర్షఋతువునఁ గ్రోధనవత్సరమున!

సీ. పసిమి మీఱేడులేఁత నసి లేక గోగణం, బరచిక్కి శల్యమై యవురుఁబాసె!
రాగిపైరులుమాఁడి రాజనంబులు నెండి, కర్షకజనము నిర్హర్షమయ్యె!
మంచినీటికినేగు నించుబోణులశోష, సలిలాకరములు పంకిలములయ్యె!
మజ్జనార్హములైన మడువులెండుట మహిషాళికి నొడలులఁ గీలలెగసె!
గీ. హరహరా! వర్షకాల మిట్లగునెయెందుఁ, గనియు వినియు నెఱుంగని కానికాల
మింతనైనఁ గృపంబూని యింద్ర, భూమి, సంతసిల్లఁగ వర్షంబు సల్పుమయ్య!

శా. లోకంబొక్కెడ ముంచునట్లులు దురాలోకంబుగా నాకమం
దేకధ్వానముమీఱ సంతసిలి బర్హిస్తోమముల్ నృత్తముల్
వేకావింపఁగఁ బర్వియుర్జినుకు లుర్విన్ రాలఁగా నీమ తా
ఘాకల్ మీఱఁగ మేఘబృందములబోఁడాశంఖనచ్ఛాత్రమై!

సీ. వారుణసూక్తముల్ వాయెత్తిపఠియించు, వైదికప్రవరు లేవలనఁ గలరె?
వేకుండలభిషేక మాకపాలికిఁ జేయు, నైష్ఠికాగ్రణ్యు లేనాటఁగలరె?
వైరాటపర్వంబుఁ బారాయణమొనర్చు, పౌరాణికేంద్రు లేపట్లఁగలరె?
కప్పకావడిఁ దెచ్చి కడవనీటినిఁగోరు, కాపుకన్నియలు నేకడలఁగలరె?


గీ. గంగజాతరలను పానకమ్ము పప్పఁ, జలిమిడియుఁ బిల్లలకు నిచ్చు బలియులేరి?
వానలెట్టులు గురియు దుర్వారఘోర, పాపఘూర్ణితములగు నీపట్టులందు?

గీ. ఈశ్వరారాధనంబుల నెలమిఁ జేయుఁ, డన్న మఖిల దీనావళి కరసి యిడుఁడు!
గోవులకు బ్రాహ్మణుల కొసంగుఁడువిందు, లమృతవర్షంబుకురియు మీ యంగడముల!

క. గర్జత్కాదంబినితో, స్ఫూర్జధులు చెలంగ క్షేత్రములు వడి నిండఁగ
స్వర్జాతధేను విధమున, పర్జన్యుం డమృత వృష్టిఁ బచరింపవలెన్!

శా. ఓ పర్జన్య! సురేశ! యోవరుణ! యోహో చంద్రచూడా! శశీ!
యేపాపంబులఁ జేసినారమొ యినీ! యీబాధలన్ బొంద, మా
తాపం బిప్పటికైన మాన్పఁదగదే దైవంబులారా! యిఁకన్
బ్రాపెవ్వారలు మీరుదక్క శుభవర్షంబున్ బ్రసాదింపుఁడీ!

సీ. ఇంద్రా! కృపాదృష్టి సాంద్రా! సుధావృష్టి, గురియించి మముఁ బ్రీతి నరయుమయ్య!
వరుణా! ఘృణాంచితావరణా! కరుణ మాదు, సస్యంబులకు వృద్ధిఁజల్పుమయ్య!
పర్జన్య! దుర్జన భర్జన మూర్ధన్య!, మా గోగణముఁ బాల మలపుమయ్య!
చంద్రా! సకలకళాసాంద్రా! కళలఁదేర, మాపసిపాపల మనుపుమయ్య!
గీ. రుద్ర! భక్తావనాతి నిర్నిద్ర! మాదు, హృద్రుజలమాన్పి శుభము లర్పింపుమయ్య!
కమలలోచన! మాకు నఖండితాయు, రైశ్వరారోగతల నిచ్చి యరయుమయ్య!



కల్యాణి

బులుసు వేంకటరమణయ్యా గారు

౧

రాత్రి దాదా పెనిమిదిగంటలకాల మైయుండును. భగవంతుఁ డగు లోకబాంధవుఁడు చరమ గిరికరుగఁగనే యంతర్గృహములందు సంచరించుట మాని సూర్యాస్తమయకాలమును దొంగితొంగిచూచు చీఁకటు లిప్పుడు నిరాటంకముగఁ జతుష్పథముల సంచరింపఁ దొడంగెను. నాఁటిదినము కృష్ణపక్షచతుర్దశి యగుటచేఁ జంద్రుని జాడయే లేకుండెను. నక్షత్రములు గొన్ని మినుకుమినుకు మని మెఱయుచుండెను. పురపాలక సంఘమువారిచే నియమింపఁబడిన దీపములు ప్రాణావశిష్టునిఁ బోలె వెలవెలఁ బోవుచుండెను. పురమునఁ గల యంగళ్లొక్కటొక్కటి చొప్పుననే మూయఁబడుచుండెనుగాని నగరబహిర్భాగమునఁగల సారాయి దుకాణము చెంత సందడి యధికమగుచుండెను. ఇట్టిసమయమున నొకయువకుఁ డిరువది వత్సరముల వయస్సుగలవాఁ డాయాపణము చెంతనుండి నగరమును బ్రవేశించుచుండెను. ఆతని శరీర మతికఠినమై నీలమై చూపరుల కొకింత భయముఁ గొల్పుచుండును. ఆతఁ డమితముగ ద్రాక్షారసపానము చేయుటచేఁ గన్ను లగ్నికణములవలెఁ బ్రజ్వలించు చుండెను. రసపానము చేయుటచేత నాతఁడు మైమఱచి జోగుచు, రోడ్డుపైఁబడుచు, లేచుచుఁ, దన్నెఱిఁగినవారి కంటఁబడితినేమో యనుభయమున నలువంకలఁ బరికించి తెలివిగల వానివలెఁ జరచర నాల్గడుగులు వేయుచు, మరల స్మృతి తప్పిపడుచు నెట్టెటులో గ్రామమధ్యమునగల విశాలగృహ ప్రాంగణమును జేరుకొనెను. తనస్నేహితుఁడగు నొక బాలుఁడు "విలాసా! ఇంతవఱ కెచట నుంటివి? శరీరమున కస్వాస్థ్యము కలుగలేదుకద!" అను మాటలతోఁ గడపటిదానికే "లేద"ని యస్పష్టముగ నుత్తరమిచ్చి తనగదిఁ జేరి తలుపు మూసికొనెను. ఒకగంటకాల మైన పిదప గదితలుపు తెఱచుకొని పరు లెవ్వరును లేని సంగతిని దెలిసికొని తనగది కెదురుగనున్న గదిఁ బ్రవేశించి, జిలుకుకొయ్యకుఁ దగిల్పఁబడిన తాళములను జప్పుడు కాకుండఁ దీసి వసారాను దాటి మఱియొకగదికడ కరిగి యొకతాళముతోఁ దలుపు తెఱచెను.

అది యొక యౌషధాగారము. మిక్కిలి విలువ గలవియు, వివిధములు నగు నౌషధము లాగదియందు భద్రముగా నుంపఁబడును. ఆ గదియం దొకబల్లయు దానిపై వివిధము లగు ద్రావకములతో నింపఁబడిన సీసాలును గలవు. ఆబల్లకుఁ బ్రక్క నొకబీరువా గలదు. అందును విలువగల మందుసీసాలును, జూర్ణములు గల పొట్లములును శస్త్రవైద్యమున కుపయోగించు వస్తువులును గలవు. క్రిందఁ గొన్ని ఖల్వములలో సగము నూరఁబడిన యౌషధములు గలవు. విలాసుఁ డాగదిఁ బ్రవేశించి నలువంకలఁ బరికించెను. ఒకగోడకుఁ దగిల్పఁబడిన చిన్నదీపము వెలుఁగుచుండెను గాని మఱియొక్కవిశేషమైన కాంతియు లేదు. విలాసుఁడు తొందరతోఁ దలుపు మూసి బీరువాను దెఱచి యందుఁ గల చూర్ణములను బరికించుచుండెను. వేఱువేఱు స్థలంబులనుండి రెండుపొట్లములను దీసి వానిపైఁగల పేరులం జదివి కొంతవఱ కాలోచించి, తిరిగి దీపమునొద్ద వానిపైఁగల పేరులం జదివి బల్లపై నారెండుపొట్లముల నుంచి భద్రముగ మూఁత నూడఁదీయుచుండెను. హత్యను జేయువానివలె వానిచేతులు కంపింపఁ దొడంగెను. ఆతనితల తిరుగుచుండెను. పానమత్తతచే నాతఁ డొకపరి జోగెను. అప్పు డాతనిచేతికిఁ దగిలి యొకగాజుసీసా బ్రద్దలై పోవ నందుండి ద్రావకము ఒలికిపోయెను. అప్పు డొకించుక శబ్దమగుటచేఁ బరు లనుమానింతురేమో యని యాతఁ

డించుకనేపు నిశ్శబ్దముగ నుండెను. అప్పుడొకమానవుని ఛాయ విలాసుని కగుపడెను. కాని యాప్రకృతి గదిం బ్రవేశింపలేదు. విలాసుఁడు పొట్లములను విప్పి వానియందుండు మందును వినిమయము చేసి (ఒకపొట్లమున నుండు మందును మఱియొకపొట్లముననను, మఱియొకదానియందుఁ గలదాని నీపొట్లముననుబెట్టి) మామూలుగా మూఁతల నంటించెను. అంటించి యాపొట్లములపై నొకసారి చూచెను.

ఒకపొట్లముపైఁ 'దలనొప్పికి మం' దనియు, మఱియొకదానిపై 'విషద్రవ్య' మని యును పేర్లుగలవు. అవి చూచి విలాసుఁడు సంతోషముతో "ఆహా! ఇన్నిదినములనుండి నేఁజేయు ప్రయత్నము నేఁడు సఫలమైనది. దుర్మార్గుఁడగు జగన్నాథునకుఁ దలనొప్పి తఱచుగ వచ్చుచుండునుగదా! ఆ సమయమున నియ్యది దలనొప్పిని బోఁగొట్టుమందే యని, నేను మార్చిన యీ మందును దినిపించెదను. క్రూరాత్ముఁడు మోహనునివలె నన్నుఁగూడ మోసముచేసి ధనము నపహరించెను. ఇంక నాధనమంతయు నాయదియే" అని పలుకుచుండెను. హర్షాతిరేకమున నాతఁ డొడలు మఱచియుండెను. ఇంతలో రాత్రి యధికమయ్యెనని తెలిసికొని యాతఁడు మెల్లమెల్లగ నా యౌషధముల నుచితస్థలమున నుంచి యాగది దాటి వెలుపలికిఁబోయెను. సంతోషాతిశయమున నాతఁడు తన జేబురుమాలు నాగదియందు మఱచిన సంగతి నేగుర్తెఱుంగలేదు.

౨

వాసుదేవరావుగారు రామతీర్థనివాసులు. విశేషధనవంతులు. మఱియుఁ బ్రఖ్యాతివహించిన వైద్యులు. వారు ధనవంతులైనను ఇప్పటివారివలె వ్యర్థముగఁ గాలముఁ గడుపువారు కారు. పరోపకారమునకై సర్వదా కష్టపడుచుందురు. బీదవారైననేమి, శ్రీమంతులైననేమి ఎవ్వరికడనుండియైన నొకగ్రుడ్డిగవ్వనైన గ్రహింపక రోగుల కుచితముగ నౌషధములనిచ్చుచుందురు. ఆచుట్టుప్రక్కల నుండుజను లాతనిని భగవంతునిగ భావించుచుందురు. వేయేల! ఆయన యిచ్చిన యెఱ్ఱమంటియైనఁ జింతామణియని వారిభావము. ఇట్టిసత్పురుషులకుఁ బుత్రసంతానము లేకపోవుట యొకకొఱంత యైయుండెను. కాని పదునాల్గు వత్సరముల వయసు గలిగి రెండవ లక్ష్మివలెఁ బ్రకాశించుచు, సకల సద్గుణోపేతయైన పుత్రికను గల్యాణినిజూచి యాతఁ డానందించుచుఁ బుత్రులులేని దుఃఖమును బొందలేదు. పితరులు లేని మేనల్లుని-విలాసుని-పెంచుచుఁ బెద్దవానిని జేసిరి. వానికిఁ గల్యాణి నిచ్చి వివాహము చేసి వాని నొకయింటివానిగఁ జేయఁదలంచిరి గాని దుండగీఁడగు విలాసున కాపాటియదృష్టము లేకపోయెను. విలాసుఁడు విలాసవంతుఁడై చదువుమాని, సురాపానముఁ జేయుచుఁ గాలముగడపుట చూచి వాసుదేవరావుగారు స్వప్రయత్నము మానుకొనిరి. వాసుదేవరావుగారీ మేనల్లునేకాక తల్లిదండ్రులు లేనిబాలుని బంధుకోటిలోనివానిని, మోహనుని పెంచి పెద్దవానిని జేసెను. ఆతఁడు రావుగారి యాజ్ఞాప్రాణమై మెలఁగుచుండెను. రావుగారు తమ యభిమానవిద్యయగు వైద్యమున నీబాలుని దమయంతవానిని జేసి తమపైఁ గల సగముభారము నాబాలునిపై నుంచిరి. ఆబాలుఁ డాయింటివారికే కాక చుట్టుప్రక్కలనున్న జనులకుఁగూడఁ బ్రేమాస్పదుఁడని నొక్కి చెప్పవచ్చును. సద్గుణవంతునిఁ బొగడనివా రెవ్వరుందురు?

మోహనుఁడు పదునెనిమిదివత్సరముల యీడుగల సౌందర్యవంతుఁడు; స్ఫురద్రూపి. అందుచేతనే భగవంతుఁడు సమవయోరూపులగు కల్యాణీమోహను లన్యోన్యముఁ బ్రేమించుకొనునట్లు చేసెను. అది యేమిచిత్రమో కాని వారిరువురును శరీరమాత్రమున భిన్నులు కాని హృదయ మాయిరువురి కొక్కటియే. అంకురించిన వీరి యన్యోన్యానురాగ మెప్పుడు ఫలించునోయని వీరు వితర్కించుకొనుచుండిరి.

మోహనుఁడు ధనవంతులఁ బిడ్డఁడైనను దన దురదృష్టవశమునఁ దల్లిదండ్రులతోఁ గూడ ధనమును గోలుపోయెను. తన కొకవ్రేలు విడిచిన మేనమామయగు జగన్నాథుఁ డన్యాయముగ నతనిసొత్తపహరించెను. 'పాపమునకుఁ బ్రాయశ్చిత్తము వెంటనేయగు' నను లోకోక్తి చొప్పున నచిరకాలముననే వాని దారాపుత్రులు మరణించిరి. ఇట్లయ్యును, లోభియగు నా మూర్ఖుఁడు ధనమును మోహనున కీయలేదు. దిక్కులేని యీ బాలుని వాసుదేవరావుగారు పోషింపకుండినచో నీ

బాలుఁడుగూడ నింతకుఁబూర్వమే మరణింపవలసి యుండునుగాని భగవంతుఁడు బాలుని రక్షించుటచే నాతనికెట్టి యపాయము లేకుండెను.

విలాసుఁడు జగన్నాథుని సమీపబంధువు. కుటిలుఁడగు నిబ్బాలుఁడు జగన్నాథుని వంచించి ధనము నపహరింపఁదలంచి యనేకములగు పన్నుగడలను బన్నెను. విలాసుఁ డొకపరి తన వివాహమునుగూర్చి మేనమామ నడుగ నాతఁడు "వత్సా! నీవు నీభార్యను బోషింప సమర్థుఁడవేని నీకుఁ గల్యాణి నీయవచ్చు" నని పలికెను. తన సామర్థ్యమును వాఙ్మాత్రమునఁగాక క్రియారూపమున మామకుఁ దెలుపఁగోరి ధనసంపాదనముకై యహర్నిశములు పాటుపడుచుండెను. తాను గల్యాణితో వివాహవేదికపై నెపుడు కూర్చుండునో యని యాలోచించు చుండెను; లీలోద్యానమున నాబాలికతోఁగూడ మందమలయానిలముల నెపుడు సేవింతునో యని యువ్విళ్లూరు చుండెను. పాప, మీమూఢుఁడు కల్యాణీ మోహనుల యన్యోన్యానురాగము నించుకైనఁ దెలిసికొనకుండెను. ఆహా! ఎంతటి వెఱ్ఱి! పేశలకుసుమ మగ్నిని బడదనుసంగతి నీతఁడు గ్రహింపలేదు.

3

సాయంసమయము ఐదుగంటలకాల మైనది. వాసుదేవరావుగారియింటికి వెనుకఁ గల లీలోద్యానమునఁ గల్యాణి విలాసార్థమై తాను బెంచుకొనుచున్న గులాబి, చేమంతి, చెంబేరి, సన్నజాజి, మల్లె, మొక్కలకు నీరు పోయుచుండెను. తోఁటకాఁపు "వలదు, వల"దని యెంత బ్రతిమాలుచున్నను బాలిక తనపనిని మానలేదు. ఇంతలో వెనుకనుండి మోహనుఁడువచ్చి యాబాలికయొక్క కన్నులను మూసెను. అది యెఱిఁగి కల్యాణి (నవ్వుచు) "విడువుము. దొంగవలె వెనుకనుండి పట్టుకొనుట తగునా!" అనెను.

మోహ—కల్యాణీ! నిన్నుఁ జూచినంత మాత్రమున నా హృదయమును దొంగిలిన నీవే దొంగవు.

కల్యా—మోహనా! నీరూపమున నన్ను మోహింపఁజేసి నాచేతమును హరించిన నీవు దొంగవుకావా!

మోహ—బాలవయ్యు నీబుద్ధి యప్రతిహతమైనది. [అని చేతులుదీసి బాలికముఖమును జూచి] కల్యాణీ! నీ ముఖ మీదినమునఁ గొంచెము వాడియున్నట్లున్నది? కారణము చెప్పవచ్చునా!

కల్యా—మోహనా! నీకుఁ జెప్పఁదగని కారణ మేమి గలదు? నాప్రాణముగ భావింపఁబడుచున్న నీవు నన్నన్యథా తలంచుట యెఱింగి నా ముఖము కళఁ దక్కియుండునేమో!

మోహ—అయ్యో! నన్నట్టి కఠినహృదయునిగ నేతలంచు చుంటివా! [మోహనుని కనుకొలుకులనుండి రెండశ్రు బిందువులు రాలెను. కల్యాణిని స్తబ్ధయైపోయెను.)]

కల్యా—నేను నిన్నెట్లు భావించు చుంటినో నీవ యెఱుంగుదువు. కాని మోహనా! నీకు నాయందమితమగు ప్రేమగలదని యెన్నిసారులు చెప్పినను నా మనస్సాక్షియూరటఁ జెందలేదు. నీవు నా హృదయమునకు స్వాస్థ్యముఁ గలుగఁజేయవా!

మోహ—ప్రేయసీ! ఇంత యనుమానమేల? షోడశకలాపూర్ణుండగు చంద్రుఁడు సాక్షిగాఁ దెలియఁజేయుచున్నాను. నాకు నీయం దమితమగు ప్రేమకలదు.



ఇంతలో వెనుకనుండి మోహనుఁడువచ్చి యాబాలికయొక్క కన్నులను మూసెను.

కల్యా—వలదు. వలదు. దినదినము క్షీణించెడి దోషాకరుఁడు సాక్షియా! [నవ్వి] నీకు నాపైఁ గల ప్రేమ గూడ నిట్టిక్షయమును బొందుననియా నీ యాశయము?

మోహ—త్రిలోకైకపూజ్యుం డగు, శ్రీరామచంద్రుని సాక్షిగాఁ జెప్పుచున్నాను. ఇఁక.........

కల్యా—(అర్ధోక్తియందే) నాకు సాక్ష్యమేవలదు. నీ మనస్సే సాక్షి. నేనే పూర్తిగ నమ్మితిని. ఏ నా ప్రాణాధికుఁ డగు భగవంతుఁడు విశ్వజనీనుండై నిష్కళంకుఁడై నాయందమితమగు ప్రేమఁ జూపి నా కపారమగు స్వాస్థ్యమును గలుగఁజేసెనో, ఏ మహాత్ముఁడు సర్వదా నా హృదయసీమయందు మెలంగునో, ఆభగవంతు నీ కుసుమమాలికతోఁ బూజించి నా కృతజ్ఞతను వెల్లడించుకొందును. [అని సమీపమునఁ గల మాలికను దీసి మోహానునికంఠము నలంకరించెను. మోహానుఁ డానందపరవశుఁడై నోట మాటలేక చేష్టదక్కియుండెను.]

*   *   *   *   *

సూర్యుఁ డపరాంబుధిఁ గ్రుంకనుంకించుచుండెను. కల్యాణి గృహమునకుఁ బోవ నుంకించుచు "మోహానా! సాయంకాలమైనది. నే నింటికిఁ బోవనిచోఁ దలిదండ్రు లనుమానింతురు. కాన నా కనుజ్ఞ నిమ్ము" అని మోహానునితోఁ బలికి రెండడుగు లరిగి జ్ఞప్తినటించి వచ్చి, "చెప్పమఱచితిని. అమ్మకుఁ గొంచెము తలనొప్పి వచ్చినట్లు తెలిసికొంటిని. ఆమె తనబాధను గప్పిపుచ్చినను ముఖవైవర్ణ్య మాబాధను జెప్పకయే చెప్పుచున్నది. కాన నేదైన నొకమందు భద్రముచేసికొనియున్నచో మంచిది" అని మృదువుగఁ బలికెను. అంత మోహానుఁడు "అటులనా! మన కిచ్చువచ్చిన మందుల నవలీలఁగఁ దేఁగలను. నేనును నీవెనువెంట నేవచ్చి మందు తెచ్చెదను" అని పలికెను. బాలిక గృహాభ్యంతరమునకుఁ బోయెను.

ఇంతలో విలాసుఁ డాసమీపమునకు వచ్చి మోహానునిఁ జూచి "ఓహో! ఆడఁబోయినతీర్థ మెదురైనట్లు నీ విచటఁ దటస్థించితివే!" అని పలికెను. మోహానుఁడు "విలాసా! అత్యవసరము లగు కార్యము లేవైనఁ జేయ నక్కఱలేదుగద!" అని యనెను.

విలాసుఁడు—[విచారమును నటించి] మఱి యేమియును లేదు. అనిష్టమైనను జెప్పక తప్పదు గనుక చెప్పుచున్నాను. అనకాపల్లిలో నున్న మీపినతండ్రి చాల నపాయమున నున్నాఁడట! జీవించుననను ఆశ లేశమైనను లేదట! నీ వతిత్వరగ రావలెనని చెప్పిరట

మోహ—(తొందరతో) ఎవ్వరెవ్వరు! ఎపు డెవరు వచ్చిరి?

విలా—ఉత్తరము వ్రాసిన నాలస్యమగుననియు, బాలుఁడ వగు నీ వొంటిగాఁ బోలేవనియు నెంచి మనిషి నొకనిని బంపిరి. అతఁ డిపుడే వచ్చెను.

మోహ—ఆహా! ఎంతటికష్టము! నే నిపుడే పోవలె ననుకొనెదను.

విలా—ఇపు డెట్లుపోఁగలవు? రాత్రి విజయనగరము నుండి పోవు రైలుబండినెక్కిపోయినచో రేపటి యుదయమునకుఁ బోవచ్చును.

మోహ—అటులనే చేయవలయును. మాయదృష్ట మెట్లున్నదో! అని యనుకొనుచు విలాసునితోఁగూడ నా స్థలమును విడిచెను.

౪

వాసుదేవరావుగారును మోహానుఁ డనకాపల్లికిఁ బోయినదినమునకు మఱుసటి దినమున నే కార్యాంతరముపై విశాఖపట్టణమునకుఁ బోయిరి. అదియే యుక్తసమయమని యెంచి స్వకార్యమును బూర్తి చేయఁదలఁచి విలాసుఁ డౌషధాగారమునఁ బ్రవేశించి, బీరువాను దెఱచి యిదివఱకుఁ దాను మార్చియుంచినమందు లేకపోవుటచేఁ గళవళపడెను. తాను జేయఁదలంచినకార్యము కొనసాగకపోవుటయే కాక నిరపరాధియగు మఱియొకజీవి మరణింపఁబోవుటచే నాతఁడు నిశ్చేష్టుఁడై వెలవెలఁబోయెను. కొంతవడికిఁ దెలివినొంది స్వయంకృతాపరాధమును దిద్ద నాలోచన చేసెను.

*   *   *   *   *

కల్యాణి!—మోహానుని వీడుకొని తల్లికడ కేఁగి యమృతాంజనము నుపయోగింప నామె బాధ నివారణ యయ్యెను. పిదప మోహా

నుఁ డౌషధమునీయ నెప్పటికయిన నుపయోగించు నను తలంపున దానిని భద్రపఱచెను. అచిరకాలముననే మోహనుని పినతండ్రికి విపరీతమగు రోగమువచ్చెనని తెలియుట చేతను, మోహనుఁ డూరలేకపోవుటచేతనుగూడ నామె యస్తిమిత మనస్కయయ్యెను. అందుచేత నామెకుఁ దలనొప్పిరాఁగా నమృతాంజనము నుపయోగించెను. కాని మానసికరోగమునకుమందుండునా! అమృతాంజనమువలన బాధ యుపశమింపలేదని యామె మోహనుఁడిచ్చినమందు నుపయోగింపఁదలంచి, రెండుమూఁడు మాత్రలను దినెను. ఇంతలో నామె కమితముగఁ గంప ముదయించెను. నోట మాట లేకపోయెను. ఇతరులతోఁ జెప్పకుండఁ దనగది కేఁగి మంచముపైఁ బరుండెను. ఆమె మోహనునివిషయమై యెట్టియనుమానమును బొందలేదు. దుష్టులెవ్వరో యౌషధమును వినిమయముచేసిరనియు, నిష్కపటుఁడగు మోహనుఁడు మోసమెఱుంగక తనకిచ్చెననియు నామె భావించెను. నిరపరాధుఁడగు మోహనునకుఁ దనమూలమున నెట్టియిక్కట్టును గలుగకుండుటకై మనసార భగవంతు నొకపరి ధ్యానించి నిమీలితలోచనయయ్యెను.

సాయంకాలమైనది. కల్యాణి యింట సంచరించుట లేదు. కల్యాణి యిరుగుపొరుగులవారియిండ్లకుఁ బోవదని తల్లి యెఱుంగును. బాలికజాడ లేనందునఁ దల్లి హృదయమున నొకఱాయి పడినట్లు తలంచెను. గృహమున సందులును వెదకి తుదకు గదిలోనే పడుకొనియున్న కల్యాణిని గాంచిరి. బాలికకు రోగము వచ్చినదేమో యని తల్లి వడివడివచ్చి యామెశరీరముపైఁ జేయివైచి చూచెను. శరీరము చల్లనై యుండెను. కన్నులు మూతఁబడిపోయెను. నాడి యాడుచున్నట్లు లేదు. మిక్కిలి పరీక్షించినఁగాని యూపిరి సూక్ష్మముగ వచ్చుచున్నదనుసంగతి తెలియకుండెను. కాన తల్లి కాయనుమానము లేకపోయెను. "హా! గృహలక్ష్మి! సుమంగళా! కల్యాణీ! నన్నుఁ గన్నతల్లీ! మందభాగ్యులమగు మమ్ము వీడిపోయితివా!" యని యేడ్చియేడ్చి దుఃఖభారము నాపుకొనలేక మూర్ఛవోయెను. విలాసుఁ డిదియంతయుఁ జూచి కాలుసేతులు గడగడవడంక నోట మాట లేక వెఱ్ఱివానివలె నిటునటుఁ దిరుగుచుఁ బొరుగింటి కగ్నిని ముట్టింపఁదలఁచి తనగృహమునే దగ్ధముచేసితి ననుకొనుచు నాభారము తనపైఁ బడకుండఁ దప్పించుకొనఁ గోరి రక్షకభటాలయమునకుఁ బోయి "బాలిక విషప్రయోగమున మరణించె"నని చెప్పఁదలంచెను. గుమ్మము దాటగనే మోహనునికి వార్తఁ దెచ్చిన వార్తాహరుఁ డెదురుపడి "మోహనుని ధూమశకట మెక్కించి మాయ చేసి నేను వచ్చితిని. నా కవకాశము చిక్కనందున వెంటనే చెప్పఁజాలకపోతి"నని చెప్పెను. "ఆసంగతి కేమి! ప్రాణాపాయమునకే వచ్చినది. కుతంత్రములఁ బన్నినచో నిట్టియొగ్గే కలుగును" అని విలాసుఁ డనుచుఁ దొందరగాఁ బోవుచుండ వార్తాహరుఁడు "కారణమే"మని యడిగెను. వీనిమాటను వినకయే విలాసుఁడు రక్షకభటాలయమునకు బోయెను.

* * * * *

౮

రాత్రి తొమ్మిదిగంటల సమయమున వాసుదేవరావుగారు విశాఖపట్టణమున మిత్రునితోఁ గొన్ని వ్యవహారములనుగూర్చి మాటలాడుచుండఁ గల్యాణి యకస్మాత్తుగ మరణింపనున్నదని తంతివార్త వచ్చెను. ఆవార్తను విని యాతఁడున్నట్టుననే నిలువున నీరయిపోయెను. ఇంతలో రక్షకభటాధికారి యొక రక్షకభటునితో వచ్చి "వాసుదేవరావుగారూ! మీబాలిక యకారణముగ మరణించినందులకు మేమెంతయుఁ జింతిల్లుచున్నాము. రామతీర్థమునుండి మాయధికారి యిపుడే తంతినంపియున్నాఁ"డని తెలియఁజేసెను. ఈవాక్యమును విని రావుగారు "అయ్యో! అయ్యో! మరణించెనా! అల్పమగు నీయూశ కూడ నడుగంటెనా!"అని వార్తగలపత్రమును పారవైచి నిలువునఁ గూలిపోయెను. అట్టియవస్థను జూచి యట నున్నవా రందఱును మిగుల విలపించిరి. కొంతవడికి రావుగారు లేచి కూర్చుండ రక్షకభటాధికారి "కాని, అయ్యా! నేను బలుకువాక్యములకు క్షమించి నామాటను వినుఁడు. ఇట్టిహత్యకుఁ గారణము మీ......" అని మఱి చెప్పఁజాలక పోయెను. రావుగా రామాటవిని "హా! ఎట్టికళంకము కలిగినది? గోరుచుట్టుపై రోఁకటిపోటా! అని యనుకొని "నాతో మీరు రండు. అక్కడకు బయలుదేఱిపోవలెను" అని వెంటనే ప్రయాణోన్ముఖుఁ డాయెను.

* * * * *

"దురాత్ము లెవ్వరో బూటకముగా మా పినతండ్రికి దీవ్రరోగము సంభవించెనని చెప్పిరి. ఆమాటలను విలాసుఁడు చెప్ప నిజమే యనుకొని పోవ వాత్తేరు స్టేషనునొద్దనే మా పినతండ్రి నన్నుఁ దెలిసికొని పలుకరించెనుగదా! ఇట్లు నన్ను బాధింప వా రేమిలాభమును దలంచిరో! ఇదివఱ కెవ్వరికైన నే నిట్టికష్టముఁ గలిగించియుండలేదే! ఎట్లయిననేమి, అందఱు సుఖముగ నున్నారుగదా! అంతియె చాలు" నని యనుకొనుచు మోహనుఁడు గ్రామమునుజేరి రావుగారియింటిని బ్రవేశించుచుండెను. ఇంతలో నాతని కెదురుగఁ బ్రసిద్ధులగు నాచార్యవైద్యులును, గ్రామములోని మఱియొకతగుమనుష్యుఁడును వచ్చుచుండిరి. వారిని జూచి మోహనుఁడు ప్రక్కకుఁ దప్పుకొనెను. అందుఁ దగుమనుష్యుఁడు "మహాత్మా! ఏమైననాశయున్నదా!" అని సగద్గదముగనడిగెను. వైద్యులు "ఆర్యా! మనకుఁ దోఁచిన చికిత్స చేసితిమి. కాని మందు గుణమిచ్చుచున్నట్లు తోఁపదు. తరుణము మించిపోయినది. ఇష్టజనదర్శనమున కాప్రాణము తల్లడిల్లుచు నిలిచినది" అని పలుకుచు వెడలిపోయిరి.


ఆరోగియెవ్వరో యని మోహనుఁడు తల్లడిల్లుచుండెను. గృహములోనికిఁజని పరికింపనొకయెడఁ గొందఱు పరిశోధకులు పరీక్షించుచుండిరి మోహనుఁడు జాగ్రత్తగాఁ జూచుచుండెను. ఒకఁడు— "విలాసుఁడు రావలె" ననెను. మిత్రసహితముగ విలాసుఁడు వచ్చెను. అధికారి "ఔషధాలయమునకు నీవుపోయితివా! లేదా! అని యడుగ నాతఁడు "లేద"ని చెప్పెను.

అధికారి: అది అసత్యము. నీ జేబురుమాలట కేల పోవును? ఒలికిన ద్రావకముకూడ దీనిపైఁబడియున్నది.

విలాసుఁడు వెలవెలపోయెను. అధికారి తేఱిపాఱజూచి "గృహసేవకుఁడు" అని యనెను. సేవకుఁడు రాఁగా నధికారి "విలాసుఁ డప్పుడప్పుడీ మందుకొట్టునకు వచ్చునా! తఱచుగనా!" అని యడిగెను. సేవకుఁడు "బాబూ! అప్పుడప్పుడు వచ్చును. మొన్నఁటి సోమవారమురాత్రి సీసాపడినచప్పుడు విని నే నిటకు రాఁగా నీతఁడే మందుకొట్టులో నా కగుపడెను. పైవా రెవ్వరును గారని నేఁబోయితిని." అనెను. మోహనుఁడు తొందరతో "నన్ను మోసముచేసిన దురాత్ముఁడు వీఁడే" అని విలాసునిస్నేహితునిఁజూచియఱచెను. "మాపినతండ్రికిని జబ్బుచేసెనని పలికినదురాత్ముఁడు." అని పండ్లుపటపట కొఱికెను. అధికారి "ఇదికూడనా! ఓయీ! ఆతనిని వంచించితివా! నిన్ను బందిఖానాకుఁ గొంపోయెద" నని విలాసునితో నన నాతఁడు భయపడి, "ఆర్యా! నేను నిరపరాధిని. ఈ నాస్నేహితునిమాట విని నేనట్లు చేసితిని. నాయపరాధము క్షమింపుఁడు"అని యన నధికారి "ఇట్లుచేయుటలో నీయభిప్రాయ మేమి?" అని విలాసు నడిగెను.

విలాసుఁడు మాటాడలేదు. భటులు వానిని గొట్టగా నిట్లనెను "ఇతఁ డుండిన మా స్నేహితుని కొర్కనికి మంచిమందు లభింపదని నే నిట్లు చేసితిని" అనెను. అధికారి "అసత్యము నీవీబాలికను గాకపోయినమఱియెవ్వరినైన జంపఁదలంచి మందును మార్చి పొట్లములను గట్టి మాచువారల కనుమానము గలుగకుండఁ జేసితివి. సరే పొమ్ము. విచారించి యుక్తదండనవిధించెద. పరోపకారపరాయణుఁ" డగు నీబాలుఁడు మంచిమం దీయఁడా! నీవంటి యభాగ్యునిఁ జేరఁదీయుటవలనఁ బంతులు గారికీయాపదసంభవించెను. నాయొదుటనుండిమరలుము. రక్షకభటులు నిన్ను రక్షించెద" రని యానోటు వాసెను.

'బాలిక' యనుమాట వినఁగానే మోహనుఁడు విపత్తు సంభవించెనని తెలిసికొని తా నిచ్చినమందు విషమే యని గ్రహించి "హా! నాయట్టి రాక్షసుఁడీలోకమునఁ గలఁడా! శిరీషకుసుమమును గఠినతరవారిచే సంహరించితినే! నాజీవితమును నేనే పోఁగొట్టుకొంటినే!" అని వెక్కివెక్కి యేడ్చుచు నింటిని వెనకి బాలిక పరున్న గదిఁ జేరెను. బాలిక కిఁక నొకటిరెండు నిముసములలోఁ బ్రాణము పోవునన నీతఁడు ప్రవేశించెను. అచటఁ గల్యాణితల్లి కంటికిమంటికి నేకధారగా విలపించుచుండెను. అప్పుడే వచ్చిన వాసుదేవరావుగారును, మఱియొక తగు మనుష్యుఁడును, రక్షకభటాధికారి యొకఁడును మిక్కిలి విలపించుచుండిరి. రక్షకభటాధికారి రావుగారి నోదార్చుచుండెను. మోహనుఁ డెవ్వరితోడను బలుకకయే శయనముకడకుఁ బోయి వాడియున్న యాబాలికయొక్క ముఖమును జూచి యస్పష్టముగ



“మోహనుఁడు దుఃఖాతిరేకమున నోటమాటలేక కొయ్యబారి వెనుకకుఁ బడిపోవుచుండెను.”

“కల్యాణీ! నీప్రాణతుల్యుఁడ నగు నన్నువీడి దివి కేఁగుచుంటివా!” యని వెక్కి-వెక్కి యేడ్చుచుండెను. కొన యూపిరితోనున్న యాబాలిక యొకమాఱు మోహనుని బలుకరింపఁదలంచెనే కాని యశక్తయయ్యెను. చూపులతోడనే మోహనునొద్ద సెలవుగైకొని యొకటి రెండు కన్నీటిబిందువులనేకాక ప్రాణములను గూడ విడచెను.

ఇది ప్రత్యక్షముగఁ జూచుచున్న మోహనుఁడు దుఃఖాతిరేకమున నోటమాటలేక కొయ్యబారి వెనుకకుఁ బడిపోవుచుండెను. రక్షకభటాధికారి లేచి పడుచున్న మోహనునిఁ బట్టుకొని పరుండఁబెట్టెనే కాని యంతకమున్నే యాతఁడు విగతజీవుఁ డయ్యెను.

వేఁడికోలు

వెలగపూడి దానయ్యచౌదరి గారు

ఉత్తానపాదియట్లలితతరంబగశక్తి, నెండవానల కోర్చి యుండఁజాలఁ
ప్రహ్లాదులీల దుర్వారభక్త్యావేశ, నిగడిమైనిన్ను ధ్యానింపఁజాల
నారదుపగిది నీనామాక్షరంబులఁ, బ్రీతిగీతమునఁ గీర్తింపఁజాల
వ్యాసునిభాతి నీయతులితమహిమంబుఁ, బొగడికావ్యమొనర్పఁ బూనఁజాలఁ

తే. గాన, నోదేవ! యోపిక గలకొలంది, భక్తిభావంబునన్ నిన్నుఁ బ్రస్తుతింతు
నస్మదీయాఘములనెల్ల నడఁచివైచి, కరుణఁదిలకించి సతము నన్ గావుమయ్య!

ఆత్మప్రబోధము ౧

శ్రీ వేంకట పార్వతీశ్వర కవులు

సర్వసముఁడవు, భావా, ఖర్వోద్రేకమునఁ బ్రకృతిగానమున సుఖాం
తర్విస్మృతుఁడవు, మాటట, సర్వజ్ఞుఁడ వీ వఖండశక్తుఁడవు కవీ!

సీ. నింగికి నిచ్చెనల్ నిర్మింపఁగలశక్తి, నీటిలో జాడల నెమకుశక్తి
ఎండమావుల నీరు నిండింపఁగలశక్తి, గగనపుష్పంబులఁ గాంచుశక్తి
గాలిలో మేడలఁ గట్టింపఁగలశక్తి, జీవులఁ దార్మాఱు సేయుశక్తి
భావసంతతికి రూపముఁ గూర్పఁగలశక్తి, సృష్టికిఁ బ్రతిసృష్టి సేయుశక్తి
ప్రకృతితత్త్వములను బరికింపఁగలశక్తి, ప్రకృతి మఱఁగఁజేయు ప్రౌఢశక్తి
సర్వశక్తులను బ్రసాదింపఁగలశక్తి, కవిత, నీకుఁ గలదు గా కవీంద్ర!

సీ. తృణము మేరువు గాఁగఁ దృణముగా మేరువు, జిత్రించి గారడుల్ చేసి చేసి
తిట్టు దీవన గాఁగఁ దిట్టుగా దీవనఁ, బట్టించి చిడుముడుల్ పెట్టిపెట్టి
కల్ల నిజంబుగాఁ గల్ల గాఁగ నిజంబుఁ, బచరించి చీకాకుపఱిచి పఱిచి
గుణము దోషంబుగా గుణముగా దోషంబు, వెలయించి తబ్బిబ్బుఁ గొలిపి కొలిపి
మాయలాడిప్రకృతి మఱఁగి చెర్లాటల, నెట్టు లాడుకొన్న నేమిగాని,
పాడితప్పనీకు పరతత్త్వబోధలఁ, బేరు నిలిపికొనఁగఁ గోరితేని.

సీ. బ్రహ్మసూత్రంబుతోఁ బడుపుసానిహొరంగు, పోంబట్టులంగాకుఁ బొందుచేసి
గడసానిపారాణి కాళ్లతో వైష్ణవు, పంగనామాలకు రంగువైచి
ముసలిగడ్డంబుతోఁ బసిబాలచిన్నారి, చెక్కుటద్దాలకుఁ జెలిమిఁగూర్చి
వశ్యమంత్రములతో వైరిదుర్జయవీర, శైవదీక్షితునకుఁ జదువుసెప్పి
ఇచ్చవచ్చినట్టు లెన్నియో ప్రకృతులఁ గూర్చి మార్చి పాడుకొనుము గాని,
పాడిదప్పనీకు పరతత్త్వబోధలఁ, బేరు నిలిపికొనఁగఁ గోరితేని.

సీ. ప్రకృతిబాహ్యప్రలాపము విలాసము గాంచి, కుతిదీఱఁగాఁ బాడుకొను నొకండు
ప్రకృతియంతర్వికారము వికాసము గాంచి, చెలరేఁగి నృత్యంబు సలుపు నొకఁడు
ప్రకృతిలో లీనుఁడై భావనాధీనుఁడై, హాయిగా గానంబు సేయు నొకఁడు
ప్రకృతికి భిన్నుఁడై ప్రక్రియాపన్నుఁడై, యవశుఁడై తెయితక్క లాడు నొకఁడు

వెక్కి వేవిధముల వెలువడునట్టులే, కవిత కోటిగతులఁ గ్రాలుచుండు
నన్నుఁ బోలలేదు నాజాతివాఁ డని, తోడివాని నెగ్గు లాడనేల?

సీ. సరసంపుఁ బదముల సవరింపఁ జనుఁగాని, నిద్దంపుఁగృతుల నిందింపనేల?
షట్పద శ్రుతివిలాసముఁ జూపఁదగుఁగాని, కల్యాణికై వ్రేలు గఱువనేల?
ఆటవెలందుల నలరింపనగుఁగాని, తేటగీతులఁ దప్పుఁ దీయనేల?
వనమయూరము లీల మనుట యొప్పగుఁగాని, మత్తకోకిలవంక లొత్తనేల?
గాయకునకు నీకుఁగల దొక్కటియె తిక్క, బ్రదుకుఁ దెరువుకొఱకొ పరువుకొఱకొ
సత్యగౌరవములఁ జంపి, గాయకమాళి, గాఁ డతండు సుకవిగావు నీవు.

సీ. పలు విచ్చినంతనే పలు కాయెఁగా యంచు, నౌచిత్యమును వీడనాడకయ్య!
కల మూఁచినంతనే గతి గల్గెఁగాయంచు, సారస్యమున మేర మీఱకయ్య!
తల ద్రిప్పినంతనే తల పాయెఁగా యంచుఁ, జెలువంపుగతి వాయఁ జేయకయ్య!
కనుగొల్పినంతనే కళ దోఁచెఁగా యంచు, లలితంపుజిగి సాఁగ లాగకయ్య!
బాస వచ్చునంచుఁ బలుక నేర్తునటంచు, గవిత గట్టి పాడఁగల నటంచు
రసము విఱుగుదాఁకఁ బ్రకృతి నచ్చినదాఁకఁ, దీగ లాగి లాగి త్రెంపకయ్య!

సీ. నిమిసంబునకు నొక్క నెఱవన్నెఁ దులకించు, ప్రకృతియే నీప్రియురాలు—నిజము
గడియలో నెన్నియో కల్పనల్ పుట్టించు, ప్రజ్ఞయే నీయూఁతపట్టు—నిజము
అవలీల జగమెల్ల నవశంబు గావించు, పాటయే నీస్వభావంబు—నిజము
సులువుగా బ్రహ్మాండవలయంబు నెలమించు, కవితయే నీజీవగఱ్ఱ—నిజము
నీవు నీవు గాఁగ నిలిచి నీమర్యాద, గూడ జగతి నిలిపికొనుము గాని,
వేడ్కకైనఁ దత్త్వవికటవిమర్శక, పథముఁ బట్టి మిట్టిపడకుమయ్య!

సీ. కవిగీత మూఁతగాఁ గాంచి నిల్చిన నీవు, పికకూజితమునకే బెదరు టేల?
ప్రకృతిప్రబంధంబు పాడి యాడిన నీవు, సరసబంధమునకే జంకు టేల?
పార్వతీపరమేశపదభావగతి నీవు, ప్రకృతిపూరుషులకే భ్రమయు టేల?
ధ్వనిజీవివైనయుపన్యాసకుఁడ వీవు, పలుకుపొందికలకే యులుకు టేల?
ప్రణయరసముఁ గొలిపి ప్రకృతిని వలపించి, పరవశతను గూర్చు పాటఁ బాడి
ఎన్నొ యాటలాడునీ విట్టు లేకాంత, సేవ నింత వడఁకి పోవు టేల?

క. కవివై పాడుచు నీమది, దవిలినగతిఁ బోదుగాక తగవు విడిచి స
త్కవి కవితల వివరించెదు, నవరసములఁగూడఁ గవిత లల్లకుము కవీ.

ప్రణయ పరిణామము

గుండిమెడ వేంకటసుబ్బారావు గారు

అక్బర్ చక్రవర్తి పరిపాలనమునందు అది కడపటి దినములు. సూర్యాస్తమయమైనది. ఢిల్లీనగరమునందలి చౌక్ బజారునందు స్వయంకృతములైన కొన్ని టోపీల నమ్ముకొని పదునాల్గేండ్ల ప్రాయముగల యొక బాలిక గృహోన్ముఖియై పోవుచుండెను. ఆమె కట్టువస్త్రము రక్తవర్ణముకలిగి యరుణకాంతులు వెదచల్లుచుండెను. అప్పుడప్పుడే యాకసమునందు నక్షత్రము లొక్కటొక్కటిగఁ బొడఁగట్టుచు గగనేందిర కలంకార ప్రాయము లగుచుండెను. ప్రకృతియంతయు శాంతిమయమై తోఁచుచుండెను. ఈ మనోహర దృశ్యమును తదేక దృష్టిఁ జూచుచు నాబాలిక పరాధీన మానసయై పయనము సాగించుచుండెను. శోభామయమైన యా సాయంసంధ్యా దేవత తప్ప వేఱేమియు నామె దృష్టిపథమున లేదు. రక్తకాంతులఁ గ్రక్కుచున్న యామె వస్త్రమును గాంచి బెదరి యాప్రాంతమునఁ ద్రిమ్మరుచుండిన యొక యెనుబోతు అకాలమృత్యువువలె నామెపైఁ బరుగిడుచుండుటయు నామె చూడలేదు. ఎనుబోతు భయంకరాకారమున నాసికారంధ్రములనుండి విస్ఫులింగముల వెడలించుచు నాబాలికను సమీపించుచుండెను. పిడుగుపాటులవలె భూమి సదరించుచుండిన యాజంతువు పదఘట్టనముల కామెయదరిపడి తెలివిగాంచి వెనుకకుఁ దిరిగి, నడగొండవలెఁ బైఁబడవచ్చుచుండిన యాఘోరాకృతిని గాంచి, కెవ్వునఁ గేకవైచి ప్రాణభయమునఁ బరువిడనారంభించెను. సరి! ఇంక నొక్కక్షణమాత్రమున నా యెనుబోతు పదాహతులచే నాబాలిక కుసుమకోమలశరీరము ఛిన్నాభిన్నమై పోవును! ఆపాదమస్తకము నామె శరీరము గడగడ వడకనారంభించెను. ఇంక నామెను రక్షించువా రెవ్వరు? అనాధరక్షకుఁడగు నీశ్వరుఁడు! ఇంతలో నొకానొక యవ్యక్తహస్తమునుండి యొకబాణము వెలువడి యాయెనుబోతు శిరఃప్రదేశమును భేదించి చొరఁబాఱెను! గిజగిజ గింజుకొనుచు నాజంతువు నేల వ్రాలెను. ఈ విచిత్ర దృశ్యమును జూచి యచ్చెరువొందుచు నా బాలిక కొయ్యబారి నిలువఁబడెను! "నన్ను మృత్యుముఖమునుండి రక్షించిన పుణ్యాత్ము లెవ్వరు?" అని యామె దశదిశలను బ్రశ్నించుచుండెను. ఇంతలో మనోహరమైన యొక రణాశ్వముపై నాసీనుఁడై తనవైపునకు వచ్చుచుండిన యొక రాజపుత్రుఁ డామెకు దృష్టిగోచరుఁడయ్యెను. అనతికాలములోనే యాతఁ డామెను సమీపించి "నీకేమియు నాపద సంభవింపలేదుకద?" యని



"నీకేమియు నాపద సంభవింపలేదుకద"

మృదుమధుర కంఠస్వరమునఁ బ్రశ్నించుచు గుఱ్ఱముపైనుండి నేలకు లంఘించెను. ఇదివఱ కిట్టికారుణ్యమెన్నఁడును జవిచూచియెఱుఁగని యాబాలిక యీ మాటలకు ఆశ్చర్యపడినోట మాటరాక నిలచియుండెను. అంత నాతఁడు తన చేరుమాలును దీసి యామె కన్నుల నీ రద్దుచు " బాలా! భయపడ వలదు. రమ్ము. నిన్ను నీయింటియొద్ద విడచివచ్చెదను," అని యామె ననుసరించెను. నిశ్శబ్దముగ వా రిద్దఱును పయనము సాగించుచు నాబాలిక కుటీర మును సమీపించిరి. ఇంతవఱకును భయ విభ్రాంతులచే మాటలేక యుండిన యాబాలిక యిప్పు డించుకధైర్యము వహించి గద్గద స్వర మున "ఇదియే మాకుటీరము" అనిపల్కెను. ఇరువురును లోని కేగిరి.

జరిగిన భయంకరోదంత మంతయు నెఱింగి యా బాలికామణితల్లి యానందపార వశ్యమున బాష్పములు రాల్చుచు నారాజ పుత్త్రునకు హృదయపూర్వకముగఁ గృతజ్ఞ తాభివందన మొనరించెను. అందుల కాతఁడు "అమ్మా! ఇందు నేనొనర్చిన విశేష మేమి? ఆపదయందుండిన యొకానొక యబలామణి ప్రాణములఁ గాపాడఁదలంపని నిష్ఠురాత్ముఁడు రాజపుత్త్రవంశమునఁ గలఁడా?" అని వినయ పూర్వకముగ మాఱుపల్కెను. పిమ్మట నాతఁ డావృద్ధాంగనవలన వారిపూర్వచరిత్ర మంత యుఁ దెలిసికొనెను. ఆబాలికపేరు కమలా కుమారి. ఆమెతండ్రి ఢిల్లీయందు వస్త్రవ్యా పారముఁ జేయుచుండిన లక్ష్మణసింహుఁడు! కమల పండ్రెండవయేఁట నామెతండ్రి మరణిం

చెను. ఆతనిమరణానంతరము వారిబంధువులు తమ జీవనాధారమైయుండిన యా వస్త్రాగారమును సహితము వశపఱచుకొని యీమాతాపుత్త్రిక లిరువురను నిరాధారులనుజేసి విడచిరి. ఇప్పుడీయిరువురును మిక్కిలి దీనావస్థయం దుండిరి. కలుషాత్ముల విషదృష్టులనుండి సౌందర్యరాశియగు కమలను రక్షించుటకై పాప మాయనాథవృద్ధాంగన ఢిల్లీనగరమును బరిత్యజించి యచ్చటి కనతిదూరమం దున్న "కుతుబ్ మినార్" ప్రాంతమున నా కుటీరమును నిర్మించుకొని కాయకష్టమున జీవనమును సాగించుకొనుచుండెను. ఈ యుదంతమంతయు నాలించి యారాజపుత్త్రుఁడు దుఃఖభారమున లేవలేక లేచి మరలఁ దమ్ముఁజూడ వచ్చెదనని వాగ్దానముఁజేసి యచ్చోటుఁబాసి వెడలిపోయెను.


II

మరునాఁడు కమల యుదయ మాదిగఁ బ్రతినిమేషమును కుటీరగవాక్షమునుండి వెలుపలికిఁజూచుచు నెవ్వరినిమిత్తమో యత్యాతురమున నిరీక్షించుచుండెను. కాని, యామె యెదురుచూచుచుండిన వ్యక్తి యెప్పటికిని వచ్చుట కానరాదు. అస్తమయమైనది. ఆకసము ధూసరచ్ఛాయావృతమై నిరాశను బ్రకటించుచుండెను. ఇంతలో నడుగులచప్పుడు వినవచ్చెను. ఒక వృద్ధమహమ్మదీయుఁడు నలుగురు సేవకులచేఁ గొన్ని భక్ష్యపదార్థములను, కొన్నివస్త్రములను మోయించుకొని వచ్చి యాకుటీరముముంగిట దించెను. వానిని గమలతల్లి గ్రహింప నంగీకరింపకున్నను, ఆ వృద్ధమహమ్మదీయుఁడు పదార్థముల నచ్చట విడచి మాఱుమాటాడక తనదారినిఁబోయెను. అంత నామాతాపుత్త్రిక లిర్వురును, తమ దారిద్ర్యజీవనమునకు జాలినొంది తమక్షేమాభిలాషియగు నా రాజపుత్త్రుఁడే యభిమానవిశేషమున నాపదార్థములను బంపెనని నిశ్చయించుకొని, వానిని స్వీకరించిరి. కాని, యీవస్తువులు కమల కానందమునకుమాఱు మఱింత హృదయవేదనను గలిగించెను. అప్పటినుండియు నామెహృదయాంతర్గతమగు ప్రేమజ్యోతి ద్విగుణీకృతమై విరాజిల్లెను. ఎట్లైనను దన హృదయము నపహరించిన యారాజకుమారు నొక్కసారి చూడవలయు నను కుతూహల మామె కధికమయ్యెను. కాని, యామె తన మనోరహస్యమునుగుప్తపఱచుకొన నెంతయో యత్నించెను. మఱునాఁడు రాజపుత్త్రుఁడు తప్పక వచ్చునని యామె పుట్టెఁడాసతోఁ బ్రతీక్షించుచుండెను. కాని యానాఁడు సహితమామె విఫలమనోరథ యయ్యెను. గడచిన నాఁడు వచ్చిన యావృద్ధ మహమ్మదీయుఁడే నేఁడు సహితము ఎప్పటియట్లఁ గొన్ని పదార్థములను వారియింట విడచిపోయెను. ఈ విధముగఁ బ్రతిదినము నావృద్ధుఁడేవో తినుబండములను గొనివచ్చి వారి కుటీరమున విడచిపోవుచుండుట వాడుకయయ్యెను. కాని, రాజపుత్త్రుని పునర్దర్శనము మాత్రము కమలకు మఱి ప్రాప్తించలేదు. నానాఁటి కామె హృదయము విరహభారమునఁ గ్రుంగిపోవుచుండెను.

ఒకనాఁటి సాయంసమయమున నెప్పటియట్ల నావృద్ధమహమ్మదీయుఁడు తమ కుటీ

రమునకు వచ్చినంతనే కమల తన ప్రాణదాత యగు నా రాజపుత్త్రయువకునిఁ గూర్చి వాని నడిగెను. అంత నావృద్ధుఁడు "రాజపుత్త్రుఁ డెవ్వఁడు?" అని మోము చిట్లించుకొనుచుఁ బ్రశ్నించెను. అందులకు కమల "అనుదినము నీచేత నీ పదార్థములను మా కందఁజేయుచుండిన యాతఁ డొక రాజపుత్త్రుఁడు కాఁడా?" అని తిరుగఁ బ్రశ్నించెను. అంత నాతఁడు గంభీరముగ "నాచేత రాజపుత్త్రుఁ డెవ్వఁడునీపదార్థములనుబంపుచుండుటలేదు."

కుటీరమును జొచ్చి యా యనాథ యువతులకు దర్శనమిచ్చెను. దుఃఖాకులమై యుండిన కమల మానస మానందభరిత మయ్యెను. ఆమె ముఖపద్మము వికసించి తేజోమయ మయ్యెను. అంత నామె తల్లి రాజపుత్త్రునిఁ జూచి, "నాయనా! నేఁటినుండియు మాకు నీవెట్టిపదార్థములను మఱి పంపవలదు," అని దీనముగఁ బల్కెను. అందుల కారాజపుత్త్రుఁ డాశ్చర్య మభినయించుచు, "పదార్థములా? ఏమిపదార్థములు? నేనెట్టిపదార్థములనుమీకుఁ బంపుచుండుటలేదే! మంచిది. ఆతఁ డెవ్వఁడో నాకుఁ గానవచ్చిన నేను వలదని చెప్పెదనులెండు," అని పల్కెను. ఈ మాటల యర్థ మా మాతా సుతలకేమియు బోధపడ లేదు. కమల చిత్తవృత్తి యల్లకల్లోలమై యనేకవిధముల మాఱుచుండెను. పిమ్మట నావృద్ధాంగన, "నాయనా! నేను దొలుత నడుగ



"నాచేత రాజపుత్త్రుఁ డెవ్వఁడు నీపదార్థములను బంపుచుండుటలేదు."

అని మాఱువల్కి వెడలిపోయెను. ఈ ప్రత్యుత్తరముచేఁ గమల మానసము నావరించుకొనియుండిన యంధకారము మఱింత గాఢమైనది. ఆమె కిప్పు డేవిషయమును విస్పష్టముగఁ దెలియుటలేదు.

మూఁడు దీర్ఘమాసము లతికష్టముగగడిచిపోయినవి. ఒకనాఁటి సాయంసమయముననాకస్మికముగ నానాఁటి రాజపుత్త్రయువకుఁ డా

మఱచితిని. నీనామమేమి? నీయుదంత మంతయుఁ దెలియఁజెప్పిమమ్మానందింపఁజేయుము," అని వేఁడెను. అందుల కాతఁడు "నేను రాజపుత్త్రుఁడను. నాపేరు కుమారసింహుఁడు. నేను మొగల్ సైన్యాధ్యక్షుఁడగు రాజా మానసింహుని బంధువర్గములోనివాఁడను," అని ప్రత్యుత్తర మిచ్చెను.

ఈవిధముగ వా రన్యోన్యము నెఱింగిరి. నాఁటినుండియుఁ గుమారసింహుఁడు వారికుటీరమునకుఁ బలుమారు వచ్చుచుండుటయుఁ, గమలాకుమారితోఁ జనవుగ మాటలాడుచుండుటయు జరుగుచుండెను. ఆమెతల్లి యిందుల కెట్టియభ్యంతరమును జెప్పకపోవుట యటుండ, వా రిరువురకును వైవాహికసంబంధ మేర్పడుఁ గాక యని నిరంతరముఁ దనహృదయమునఁ బరమేశ్వరునిఁ బ్రార్థించుచుండెను.

దినములు గడచినకొలఁదియు కమలాకుమారసింహుల హృదయములను బంధించి యుండిన స్నేహపాశము బలవత్తర మగుచుండెను. కమల పొందుచుండిన యానందమునకు మేరయే లేదు. ఈవిధముగ నొకసంపూర్ణవత్సరము మహోత్సాహమునఁ గడచిపోయెను. కాని, యింకమీఁద నొకభయంకరదుఃఖసముద్ర మామెను ముంచనున్నదని కమల కేమి తెలియును? హఠాత్తుగ కుమారసింహుఁ డా కుటీరమునకు వచ్చుట మానెను ఇందులకుఁ గారణమేమైయుండును? ఎంత యోచించినను గమల కేమియుఁ దోఁచుటలేదు. ఆమె తన దురదృష్టమును నిందించుకొనుచుండెను. అహోరాత్రములు యోచనానిమగ్నయై గడపుచుండెను. ఆమెహృదయ మల్లకల్లోలమై మరల నంధకారబంధురమయ్యెను.

III

"పాపము! కుమారసింహున కేమి కష్టము సంభవించెనో! యేమి యాపద వాటిల్లెనో! లేకయున్న, నాసౌఖ్యమే తన సౌఖ్యముగ నెంచి, నాయానందమే తన యానందముగ భావించి, యనవరతము తనసాన్నిధ్యభాగ్యము నాకొసంగుచుండిన యాతఁడు రాక యుండుటకుఁ గారణమేమి?" యని కమల పరిపరి విధముల యాలోచనములతో దిన మొక యుగముగా గడుపుచుండెను.

ఇట్టి మనస్తాపమున నామె దగ్ధమగుచుండ, వేఱొక హృదయవేదనసహిత మామె నావరించి కల్లోల పెట్టసాగెను. దుర్భరమైన జరాభారమునకు, పుత్త్రికా జీవనవిషయికమైన యాంతరంగిక విషాదభారము తోడై యామె తల్లిని మంచముపైఁ బడవైచెను. ఇంక నామెను గనిపెట్టుకొనియుండు భారము కమలపైఁ బడినది. అహోరాత్రము లామె తల్లిమంచము ప్రక్కఁ గూర్చుండి యుపచారములు చేయుచుండెను. కాని, యాహారవిహీనులై యెంతకాలము వారు జీవించఁ గలరు? జీవనమంతకంతకు వారికిదుర్భరమగుచుండెను. ఈవిశాలజగమున నేకమాత్ర బాంధవమైన కమల యామెతల్లినిఁ గాపాడుకొనుట యెట్లు? ఎట్టకేలకుఁ గమల జీవనోద్యోగమునకై ఢిల్లీ నగరమునకుఁ బోవుటకు నిశ్చయించుకొనెను. అచ్చటఁ గుమారసింహునిఁ దప్పకఁ జూడఁగలనను యాశ యామె కించుక యుత్సాహముఁ గలిగించెను. ఈ యుత్సాహమే తనకు మార్గప్రదీపకముగ నామెయొకనాఁటియుదయమునఁ దల్లియొద్ద సెలవుగైకొని, ఢిల్లీపురాభిముఖయై బయలు వెడలెను. మార్గమధ్యమున నామె యనేక వికృతాలాపములకు గుఱి కావలసి వచ్చెను. కాని, హృదయము దిటము చేసికొని, యామె యించుకంతయు బెదరక తన

దారిని బోవుచుండెను. ఇట్లు కొంతదూరమేగుసరి కామెకంతయు నగమ్యగోచర మయ్యెను. బహుమార్గసంకులమైయున్న యాఢిల్లి నగరమున నిప్పు డామె కేవైపునకుఁ బోవుటకుఁ దోఁచకుండెను. మార్గము తప్పినది. ముందునకు సాగుటకుఁగాని, వెనుకకు మఱలుటకుఁగాని, యామెకు దుస్సాధ్యమయ్యెను. ఆమె హృదయము భయవిహ్వలమై దడదడ కొట్టుకొనుచుండెను. ఇంక నామెకు దిక్కెవ్వరు ? ఆ మహా పట్టణమున నా బాలిక నెఱిఁగినవా రెవ్వరు!" ఇట్లు పరిపరివిధముల నామె యోచించుచు నా ప్రాంతముననున్న యొకమసీదుప్రక్కఁ గూలఁబడియెను. ఆమె హృదయమున దుర్వారమైన దుఃఖసాగర ముప్పొంగుచుండెను. ఏకధారగ నామె నయనాబ్జములనుండి యశ్రుబిందువులు రాలుచుండెను. వెక్కి వెక్కి యామె యేడ్వ మొదలిడెను. ఇంతలో నామార్గముననే పోవుచుండిన యొక మహమ్మదీయవృద్ధుఁ డాబాలికను గాంచి నిలచి " కమలా ! ఏకాకివై యీ మార్గమధ్యమున నీ వేడ్చుచుంటి వేమమ్మా ?" అని ప్రశ్నించెను. " కమలా " యను సంబోధనము వినినంతనే యామె విస్మితయై తలయెత్తి, కట్టదుట అనుదినము దమగృహమునకుఁ బదార్థములఁ గొనివచ్చుచుండిన యావృద్ధునిఁ జూచెను. చూచి, మహానందమున నామెలేచి, " అయ్యా ! నిరాశాసాగరమున మునిఁగిపోవనున్న నన్ను దరిఁజేర్ప నేతెంచిన నావవలె నీవు తటస్థమైతివి ! నన్ను నాగృహముఁజేర్చి పుణ్యముఁ గట్టుకొనుము, " అని బ్రతిమాలెను. అందుల కాతఁడు సంతోషపురస్సరముగఁ దలయూఁచి, యామెకన్నుల నీరద్ది, తనవెంట నడువ నాజ్ఞాపించెను. మార్గమధ్యమున నాతఁడు కమలవలన, కుమారసింహుఁడు వారి యింటికివచ్చుట మానెననియు, వా రిప్పుడు కేవలము నిరాధారులైయుండిరనియు, యేదేని జీవనోపాధి లభింపవచ్చునని యామె ఢిల్లీకిఁ బయనమయ్యె ననియుఁ దెలిసికొనెను. అంత నావృద్ధుఁడు "అమ్మా! నీకేదేని యుద్యోగము కావలసియున్న నేను నీకు సమకూర్పఁగలను. కాని, నీవు మహమ్మదీయ గృహమునఁ బరిచర్యఁజేయుట కంగీకరింతువా?" అని ప్రశ్నించెను. అందుల కాబాలిక మాతృరక్షణము తప్ప యన్యవిషయ మేమియు యోచింపక, "నా కెట్టి యభ్యంతరమును లేదు" అని బదులు చెప్పెను.

అంత నాతఁడు, "అట్లయిన, రేపటి యుదయమున నీవు సిద్ధముగ నుండుము. నేను నిన్ను "ఆగ్రా"నగరమునకుఁ దోడ్కొని పోయెదను. అచ్చట నీవు చక్రవర్తి రాణి వాసమునందుఁ గొలువుఁజేయవలసియుండును. నీతల్లిని సహితము నీవెంటఁ దోడ్కొని పోవలెను. అచ్చట నీజీవనము సౌఖ్యావహమై యుండఁగలదు," అని నచ్చఁజెప్పెను. ఇంతలో వారిద్దరును కమలకుటీరప్రాంతమునకు వచ్చిరి. వృద్ధుఁ డామె నచ్చట విడచి తన దారినిఁ బోయెను. కమల గృహముఁ జొచ్చెను. సూర్యాస్తమయమై యప్పటికప్పుడే చాలకాలము గడచిపోయినది. కమలాకుమారీమానస

కుహరమువలెఁ బ్రపంచమంతయు నంతకంతకు నంధకార బంధురమయ్యెను.

IV

ఆపటినుండియు కమల చక్రవర్తిరాణివాసమునందొక బానిస! ఇది విధి నిర్ణీతము! ఇంక నెట్టెట్టి యభాగ్య వీచికలామె నావరింపనున్నవో యామెకుఁ దెలియదు. ఆరాత్రి యంతయు నామెకు నిద్ర లేదు. ధారాపాతముగ నశ్రుజలము లామె చెక్కుటద్దములపైఁ బారుచుండెను. అత్యంత సన్నిహితమైయున్న యాసేవకావృత్తి యామెతల్లికి సహితమేమియు నిష్టము లేకుండెను. కాని యేమిచేయఁగలదు. జీవనోపాధికి గత్యంతరము లేదు.

మఱునాఁటి యుదయమునఁ దనవాగ్దానము ప్రకారమావృద్ధమహమ్మదీయుఁడువచ్చి వారిర్వురను మొగలాయి రాజధాని యగు "ఆగ్రా" నగరమునకుఁ దోడ్కొనిపోయెను. అచ్చట వారి నివాసార్థ మొకగృహమేర్పఱచి, కమలాకుమారిని అంతఃపురమునఁ బ్రవేశపెట్టెను. అచ్చట నామె యువరాజగు సలీంభార్యకుఁ జెలికత్తెయై యుండవలయును. కమల పూర్వచరిత్రమంతయు నెఱింగి యామె యధికారిణి మిక్కిలి జాలినొంది, యధికానురాగమునఁ జూచుచుండెను. ప్రతిదినము నామె తనగృహమునకుఁబోయి తల్లికివలయు సపర్యలఁ జేసివచ్చున ట్లాజ్ఞాపించెను. అన్ని విధముల, కమల యచ్చట నిశ్చింతగనే జీవనము సాగించుచుండెను. ఎన్నఁటికైనఁ దన మనోహరుఁ డగు కుమారసింహుని ఆనగరమునఁ గలియఁజాలుదునను నాశాదీపిక యొక్కటి యామెహృదయమును విద్యోత మొనర్చుచుండెను.

ఒకనాఁడు కమల యంతఃపురము నుండి నిజగృహోన్ముఖియై పోవుచుండ, నామె కొక గొప్పజనసమూహ మెదురయ్యెను. ఆనాఁడా మొగలాయిరాజధానియందు గొప్పయుత్సవ మొక్కటి జరుగుచుండెను. ఆ యుత్సవమునందు పెద్దపెద్ద రాజకీయోద్యోగులు కొందఱు పాల్గొనుచుండిరి. గజాశ్వభటానీకములు బారులుతీర్చి వెనుక నడుచుండెను. చిట్టచివర కొక మహమ్మదీయ యువకుఁడు యోధవేషమున మనోహరమైన యొక హయరాజముపై నాసీనుఁడై వచ్చుచుండెను. ఈ యాశ్వికునిఁ గాంచినంతనే కమల కవ్యక్తమగు మనోవికారముత్పన్నమయ్యెను. ఆమె మానసము పరవశమగుచుండెను. ఆ యువకుని ముఖ విలాసము నిస్సంశయముగ కుమారసింహునిది. ధరించినది మహమ్మదీయ వేషము! తాను మానసింహుని బంధువర్గములోనివాఁ డనికదా చెప్పియుండెను. అది కల్లయా? ఇతఁడు నిశ్చయముగ కుమారసింహుఁడు కాఁడా? ఇట్టియోచనా సముద్రమున మునిఁగి, పారముఁ గానక కమల శూన్యదృష్టులఁ జూచుచుండెను.

చూచుచుండఁగనే యుత్సవ మదృశ్యమయ్యెను. ఇప్పు డామె కంతయు నంధకారమయమై తోఁచుచుండెను. తిరిగి యామె యంతఃపురోన్ముఖియై పోవసాగెను. మార్గమధ్యమున నామెకు తోడిపరిచారికయొక్కతె యెదురై యామెను బలుకరించెను. ఆమెను జూచి కమల, "అమ్మా! ఇప్పు డీయుత్సవము

నకుఁ జిట్టచివరను అశ్వారూఢుఁడై పోవుచుండిన యా యువకుఁ డెవ్వఁడు?" అని ప్రశ్నించెను. అందులకామె యాశ్చర్యపూర్వకముగ "అయ్యో! కమలా, యువరాజ కుమారుఁడగు ఖుస్రూను నీ వెఱుఁగవా? ఆతఁడు రాజా మానసింహుని మేనల్లుఁడు! ఎప్పటికైన నాతఁడే ఢిల్లీ సింహాసనముపై నధిష్ఠించునను నమ్మకముకూడ నాకుఁ గలదు!" అని మాఱు వల్కెను.

ఈ వాక్యములు కర్ణములు సోకినంతనే కమలాకుమారి హృదయప్రవృత్తి యెట్లుండెనో వర్ణింప నలవికాదు. ఆమెకు మేనఁ జైతన్య ముడిగెను. అప్రయత్నముగ నశ్రుబిందువు లామె చెక్కుటద్దములపై జలజల ప్రవహింపసాగెను. ఇంతకాలమునుండియు సత్యాంతానురాగమునఁ దనప్రాణధనముగఁ బ్రేమించుచుండిన యాతఁడొక మహమ్మదీయుఁడు! ఆపై చక్రవర్తికి సన్నిహితబంధువుఁడు. తానొక దరిద్ర హిందూబాలిక! ఇంక నాతనితోఁ దనకు వివాహ మెట్లు పొసఁగును? చిరకాలమునుండియుఁ దన మనోగతమై యున్న ప్రణయబీజము పుష్పించిఫలించు టెట్లు? అసంభవము! కేవల మసంభవము! ఒక్కపెట్టున నామె హృదయము క్రుంగిపోయెను.

దీర్ఘవిచారమున నామె వ్యాధిగ్రస్తయై తన యజమానురాలియొద్ద సెలవుఁ గైకొని తల్లియొద్దకుఁ బోయెను. తిరిగి మాసము దినములలో యువరాజ్ఞి వైద్య సహాయమున నామెకు గొంచెము స్వస్థత చేకూరెను. అనంతర మామె తన యధికారిణియొద్దకుఁ బోయి తనవ్యాధినివారణమగుట యందనేకవిధముల నామె తనకుఁ దోడైనందులకు కృతజ్ఞతాభివందనము లొనర్చి, "యువరాజ్ఞీ! నీకారుణ్యమును నే నెన్నఁటికిని మఱువఁజాలను. కాని, కొన్ని కారణాంతరములచే నేను నీ పోషణమునుండి పోవలసియున్నది. నాకు సెలవిమ్ము," అని పల్కెను. అందులకు యువరాజ్ఞి మిక్కిలి ఖేదపడి, ప్రయత్నించియుఁ గమలను దనపట్టుదలనుండి మరల్పఁజాలక, చివరకారాత్రియైన తనతో నామెను గడుపఁగోరెను. కమల యందుకు సమ్మతించెను. ఆ రాత్రి యంతఃపుర గోష్ఠియందు గమల యొకదారుణమైన వృత్తాంతమును వినినది. ఖుస్రూ రాజకుమారుని, అనగా, తాను ప్రేమించిన కుమారసింహుని కారానిబద్ధునిఁ జేయుటకు సలీం పరిజనముచే ప్రయత్నములు జరుపఁబడుచున్నవి! ఈసమాచారము పిడుగుపాటువలె నామె కర్ణపుటములఁ బడినది. ఇంక నీ యపాయమునుండి తన ప్రేమపాత్రునిఁ దాను కాపాడుకొనుట యెట్లు? ఆ క్షణమే పోయి ఖుస్రూనివాసస్థలము గుర్తెఱింగి యాతనితో నీయుదంతమును దెలియఁజేయుటకే తొలుత నామె సంకల్పించుకొనెను. కాని, వెంటనే మనసు మార్చుకొని, యంతఃపురమును విడువక, ఇంకను దత్సంబంధములగు విశేషములను సంగ్రహించుట శ్రేయస్కరమని తలఁచి యతి జాగరూకతతో నంతయుఁ గనిపెట్టుచుండెను.

అంత నొకరాత్రి ఖుస్రూను బంధించుటకై యంతయు సర్వసిద్ధముగనున్న సమాచార మామెకుఁ దెలియవచ్చెను. "ఇంకఁ గర్త

వ్యమేమి? నా కుమారసింహుని రక్షించుటెట్లు? నాప్రాణములనుఁ గాపాడిన యాదయామయుని ఋణమును నేను దీర్చుకొనఁజాలనా? పరంపరాగతములగుచున్న యిట్టి యోచనలతో నామె మైమఱచిపోయెను.

V

అక్బర్ చక్రవర్తి మరణానంతరము, ఆతని కుమారుఁడగు సలీము, సలీం జ్యేష్ఠపుత్త్రుఁడగు ఖుస్రూ వీరిద్దఱును ఢిల్లీ సింహాసనము నకై తగవులాడుకొనుచుండిరి. తండ్రి గతించిన పిమ్మట కుమారుఁడగు సలీమే రాజ్యార్హుఁడైనను, ప్రజాశత్రువై యాతఁడు పట్టు తప్పియుండెను. ఈ యవకాశమును జేకొని సైన్యాధ్యక్షుఁడగు మానసింహుఁడు తన మేనల్లుఁడగు ఖుస్రూను సింహాసనాధిష్ఠితునిఁ జేయుటకుఁ బూనుకొనెను.

అక్బర్ మరణవార్త వినినంతనే ఖుస్రూ తన మేనమామయగు మానసింహునిఁగలియు తలంపున, చంచలహృదయుఁడై వడి వడిగఁ బోవుచుండెను. అది రాత్రిభాగము. గాఢాంధకారము కన్నులున్నవారిని సహితము గ్రుడ్డివారినిగఁ జేయుచున్నది. ఇట్టి సమయమున ఖుస్రూ యేకాకియై యొకసన్నని బాటవెంబడి నతివేగముగఁ బోవుచుండెను. మార్గ మధ్యమున నొకానొకవ్యక్తి యడ్డమై యాకస్మికముగ నాతని నిలువఁబెట్టెను.

"ఎవరువారు?" అనిగంభీరముగనాతఁడు ప్రశ్నించెను. అంత స్త్రీకంఠమున నావ్యక్తి, "ప్రభూ! ఈరాత్రి రాజభవనమునుండిమీరు కదలవలదు. సలీం పరిజనము మిమ్ముబంధించుటకై వేచియున్నారు," అని మారుపల్కెను. ఈ వాక్యములందు ఖుస్రూ కించుకంతయు విశ్వాసము లేకుండెను. "నన్ను బంధించువారెవ్వరు?" అని యాతఁడు నిర్లక్ష్యముగ మందహాసముఁ జేసెను. అంతనామె "ప్రభూ! నన్ను క్షమించుఁడు! ఈ యాపత్సమయమున నేను మిమ్ము విడువను," అని దృఢముగ నాతని చేయిఁ బట్టుకొనెను.

ఆ నిబిడాంధకారమునఁ దన్నట్లు నిర్బంధించుచున్న యావ్యక్తి యెవ్వరో యాతఁడు గుర్తింపలేకపోయెను. తప్పక ఆమె సలీం చారులయందొక్కతెయై యుండునని నిశ్చయించుకొని, యాతఁ డామెను బలవంతముగఁ ద్రోసివైచి తనదారినిఁ బోయెను.

అట్లు కొంతదూరమేగుసరికి, హఠాత్తుగ నాయుధహస్తులగు సిపాయిలు కొంద ఱాతని పైఁబడిరి. ఒరనున్న ఖడ్గమును పైకిఁదీయుటకైన నాతని కప్పట్టున వీలులేకుండెను. అద్వితీయుఁడైన యాతఁడు తత్క్షణమేవారిచే బందీకృతుఁడయ్యెను. పిమ్మట వారివలననే యాతఁడును ఘడియక్రిందతన కెదురైనయువతి సలీం శుద్ధాంతమునందు దాసివృత్తినుండిన కమల యని తెలిసికొనెను. "కమల" యను నామాక్షరములు చెవిఁబడినయంతనే యాతని మానసాకాశమున మెఱుపు మెఱసినట్లయ్యెను. "ఆ కమలయే యీకమలయగునా? అయిన నామె సలీంశుద్ధాంతమునందలి దాసియెట్లయ్యెను?" ఆతని హృదయము మిక్కిలి కళవళ మొందఁ జొచ్చెను.

అనతికాలములో సిపాయి లాతనిఁ దోడ్కొనిపోయి యొక చెఱసాలయందుంచిరి. ఆ కారాగృహాధికారి నాతఁడు కమలవిషయమై ప్రశ్నించెను, కాని విశేషమేమియు నాతనికిఁ దెలియలేదు. ఆమె యొకయంతఃపుర పరిచారికయనియు తన తల్లి మరణించిన కారణమున నామె యిప్పుడు దాసీవృత్తిని బరిత్యజించెననియు మాత్రమే యాతనికిఁ దెలిసెను. ఆ కమలయే తనప్రేమపాత్రముగుకమలయనియు, ఏకారణముచేతనో యీబానిసవృత్తి నవలంబించెననియు నాతఁడు స్థిరపఱుచుకొనెను.


మాఱువేషమున నాతఁడు దేశ సంచారముఁ జేయుటయు ఆనాఁడు ఎనుబోతు పదాహతులఁ జావనున్న కమలను తానురక్షించిన వృత్తాంతమును, పిమ్మట ననుదినమునువలయు వస్త్రాహారములను కమల యింటికిఁ దాను బంపుచుండిన సమాచారమును, క్రమ క్రముగ నాతనికి జ్ఞప్తికివచ్చెను. చక్రవర్తి యాజ్ఞానువర్తియై తాను దక్షిణ హిందూస్థానమునకుఁ బోయియుండుటచే నాతఁడామెనువాగ్దానప్రకారము చూడఁజాలక పోయెను. తిరిగి మూఁడుమాసముల పిమ్మట నాతఁడు ఢిల్లీనగరమును జేరికొని నప్పటినుండియుఁ బ్రతిదినము నాతఁడు కమలకుటీరమునకుఁ బోవుచుండెను. అనతికాలములోనే యవిభేద్యమైన ప్రేమపాశము వారిరువురిహృదయములను బంధించెను. ఇట్లుండ, హఠాత్తుగ నొక్క దినమున నాతఁడు చక్రవర్తియాజ్ఞఁగొని కాశ్మీరదేశమునకుఁ బోయెను. ఇదియే దురదృష్టవంతురాలగు కమల నీచదశకుఁ బ్రారంభము. ఆ మీఁది కమలా వృత్తాంతము పాఠకులకుఁ దెలిసియే యున్నది.

కాని, తాను విదేశవాసియై యున్నను, ఇంతకాలము కమలాకుమారి ముఖకమలము దూరస్థమై యున్నను, ఆరాజపుత్త్రుఁడు కమలను మఱువలేదు. కాశ్మీరమునుండి మరలివచ్చిన యనంతర మాతఁడు ఢిల్లీకిఁ బోయి పరికించెను, కాని యానిరుపేద కుటుంబ మిప్పుడచ్చటలేదు. కమల వృత్తాంతమేమియు నాతనికిఁ దెలియలేదు. ఈ యుదంతములన్నియు నొక్కటొక్కటిగ, అంధకార మయమైన యాకారాగృహము నందాతని స్మృతిపథమున గోచరించెను. "కమలయెచ్చటనున్నది? నేనామెను మఱలఁజూడఁగలనా? ఆమె సజీవయైయున్నదా? లేక, కఠోరదారిద్ర్యదుఃఖముల సహింపఁజాలక మరణించినదా? ఛీ! అట్లేల జరుగును? ఈశ్వరపాలితమగు నీ విశాలవిశ్వమున తిండికిలేక మరణించిన ప్రాణి యొక్కటియును లేదు! ఆమె తప్పక జీవించియే యుండును. కటకటా! నేను నిర్భాగ్యుఁడను! దుర్బలుఁడను! కారాబద్ధుఁడనైన నేనింక నామె కేమి సహాయముఁ జేయఁగలను?" అని యాతఁడు బాష్పవారిపూరితములైనతనకన్నులనుమూసి, "దైవమా! అకాల మృత్యువునుండి నన్ను రక్షించి నాకమల కాధారముఁజూపుము" అని యంజలి మొగిడ్చెను!

ఈశ్వరానుగ్రహమున నచిరకాలముననే యాతనికి కారాగృహవిముక్తి కలిగెను. తన మేనమామ యగు మానసింహుని ప్రయత్నవిశేషముచే నాతఁడు చెఱనుండి తప్పింపఁ

బడి, యుదయపురమునకుఁ బోయి యుచిత సమయము లభించునంతవఱకచ్చట నేయుండు నట్లాజ్ఞాపింపఁబడెను. కాని, కమల వృత్తాంతము నెఱింగి, యామెను జూడకుండ నాతఁ "డాగ్రా" నగరమును విడచుటెట్లు? ఈయుద్దేశముతో నాతఁడు మాఱువేషమున నా పట్టణమునందే కొన్నిదినము లుండుటకు నిశ్చయించుకొనెను.

ఒకనాఁటి ప్రాతఃకాలమున నాతఁడు యమునానదీతీరమున నేకాకియై విహరించుచుండెను. అంత నాకస్మికముగ నాతని యెదుట సన్న్యాసినీ వేషమున కమలసాక్షాత్కరించెను.



అంత నాకస్మికముగ నాతని యెదుట సన్న్యాసినీవేషమున కమల సాక్షాత్కరించెను.

తల్లి మరణానంతరము కమలవిరాగినియై సన్న్యసించెను. చూచినంతనే కుమారసింహు నామె గుర్తించినది. చిరకాంక్షితమైన సమావేశము వారిద్వరకు నీ విధముగ జరిగెను.

కమలను చూచినంతనే ఖుస్రూ మహానందపరవశుఁడై యామెను గౌఁగలించుకొనఁ బోయెను. కాని, కమల యాతని బాహుబంధమునఁ జిక్కక తప్పించుకొని, యాతనితో, "ప్రభూ! క్షమింపుఁడు. తాము రాజపుత్రులు కారనియు మహామ్మదీయాన్వయసంజాతులనియు,తమప్రస్తుతనామము కుమారసింహుఁడు కాక ఖుస్రూ యనియు నే నిప్పుడు తెలిసికొంటిని! తొలుతనే తమనిజవృత్తాంతము నాకెఱిఁగించియుండిన, నేను మిమ్ముఁ బ్రేమించుటకే సాహసింపకయుందును. ప్రేమించి యీ విధముగ నగాధమైన యీ దుఃఖసాగరంబున మునిఁగిపోవకయుందును!" అని పల్కి బొటబొట కన్నీరుఁ గార్చెను.

అంత నాతఁడు, "కమలా! నాయవజ్ఞతకు మన్నింపుము! ఆవిషయమైముచ్చటించుటకు నాకిప్పుడవకాశము చాలదు. నన్ను శత్రువులు వెంబడించుచున్నారు! ఒక్క ప్రశ్నకు మాత్రము నాకుఁ బ్రత్యుత్తరమిమ్ము. నన్ను వివాహమాడెదవా?"

ప్రేమామృతమొలుకుచున్న యీ ప్రశ్న కర్ణపుటముల సోఁకినంతనే కమలదేహమా

పాదమస్తకమును బులకిత మయ్యెను! దీర్ఘమగు నిట్టూర్పు విడచి, యామె "అయ్యో! నీవు నా కుమారసింహుఁడవై యుండిన—"

ఖుస్రూ—"కమలా! నన్ను క్షమింపుము! నీవు నన్ను వివాహమాడెదనని చెప్పుము. నాకదియేచాలును. ఆమీఁద నింక నే నీఢిల్లీ సింహాసనమునకేనియు నపేక్షింపను."

కమల—"కుమారసింహా! నిన్ను వివాహమాడెదనని చెప్పుటకే నా హృదయము నన్నుఁ బ్రోత్సహించుచున్నది. అందుచే నీదృఢాలింగనశాశ్వతానందమనుభవింపఁగలను! ఈ ఢిల్లీ సింహాసన మధిష్ఠించు మహాభాగ్యముసహితము నే ననుభవింపఁగలనను సంపూర్ణవిశ్వాసమున్నది! కాని, ప్రభూ! చిరకాలవర్ధితమైన నామతసాంప్రదాయమును, కులగౌరవమును, నేను కళంకభూతముఁ జేయఁజాలను. వాని నిమిత్తము నేను నా ప్రేమధనమును ధారవోయుటకు సంసిద్ధనై యున్నాను. నా మాతాపితరులు మరణించిరికాని, వారియాత్మశాంతి నాసౌఖ్యముకన్న వేయిరెట్లధికము. నన్ను క్షమింపుము!" అని బాష్పాకుల నేత్రయై గద్గదస్వరమున కమల మాఱుపలికెను.

ఆమె వాక్యములను ఖుస్రూ సావధానముగ నాలించి, యామె యెదుట మోకరించి, "కమలా! ఇట్టి మహోన్నతాదర్శవిరాజితవైన నిన్ను నేనొక ప్రత్యక్షదైవతముగ భావించుచున్నాను! నీ యంతరాత్మ కెట్టిభంగపాటును కలిగింప నే నిచ్చగింపను. కాని, యొక్కకోరికమాత్రము నేను నిన్నుఁ గోరెదను. నా యవసానసమయమునందుమాత్ర మొక్కసారి నీ దివ్యదర్శన మిచ్చి నన్ననుగ్రహింపుము! ఈమాటలతో నాతఁ డాప్రదేశమును విడచి యదృశ్యుఁ డయ్యెను.

నేఁటి నుండియు ఖుస్రూ హృదయమునం దొక గొప్పపరివర్తనము జరిగెను. ఇప్పు డాతని కెట్టి యైహికభోగాశక్తియు లేదు. ఢిల్లీ సింహాసనాపేక్షయు సంపూర్ణముగ నశించెను. జీవితమునం దాతనికి విరక్తి పొడమెను. మేనమామయు, శ్రేయోభిలాషియు నగు మానసింహుని యాజ్ఞానుసార మాతఁ డుదయపురమునకుఁ బోలేదు. తిరిగి సలీం పరిజనముచే నాతఁడు బందీకృతుఁడై గ్వాలియర్ కారాగృహమునం దుంచఁబడెను పది దీర్ఘవర్షము లా చెఱసాలయం దాతఁడుగడపెను. అనంతరము రాజాజ్ఞచే నాతఁడు చంపఁబడెను. హంతకుల ఖడ్గఘాతులచే నాతని దేహము చీల్పఁబడుచున్న సమయమున, నాతనితోఁ గూడ నొక యువతీమణి సహితము బలియగుచుండుటఁ గాంచి యెల్లరును విస్మితులైరి. కడప్రాణముతో ఖుస్రూ ఆమెనుఁజూచి "నీవెవ్వరవు?" అని యామె నడిగెను. అందులకామె కొనయూపిరితో మందహాసముఁ జేయుచు, "కుమారసింహా! నేను కమలను! ఇదియే మన వివాహము! ఈ హంతకుల ఖడ్గములే మనలను గూర్చినవి!" అనిపల్కి ప్రాణములు విడచెను.

పాపాయి

లీలలు

నాళము కృష్ణారావు గారు

గల్లుగల్లున చిఱుగజ్జె లల్లలాడ
చిట్టిచేతుల సారె కట్టిట్టు త్రిప్పి
విద్దియమ్ములు సేయు నీముద్దు వగలు
మఱవ శక్యమె యెన్నిజన్మముల కైన?

అల్లనల్లన మెల్లఁగ నడుగు లిడుచు
వెనుకపాటునఁ జేరి నాకనులు నట్టె
మూసి, 'ఎవ' రని యడుగు నీముగుదతనము
మఱవ శక్యమె యెన్నిజన్మముల కైన?

'వచ్చి రెవ్వరో నీతోడ ముచ్చటింప'
ననుచు వచియింప, నేఁ దటాలునను లేవ,
జననిఁ జూపించి నవ్వు నీజాణతనము
మఱవ శక్యమె యెన్నిజన్మముల కైన?

'నీదు తలమీఁద నున్నది యేదో' యనుచు
నుడువ, తడఁబడి నేఁ దల తడవికొనఁగ,
'తడవె దెవ్వరి' ననెడు నీ గడుసుతనము
మఱవ శక్యమె యెన్నిజన్మముల కైన?

ఎచటనుండియొ నే నింటి కేగుదేర
తలుపుచాటున నల్లన దాగియుండి
కెరలి దోబూచులాడు టక్కరి తనంబు
మఱవ శక్యమె యెన్నిజన్మముల కైన?

గాఢముగ నేను నిద్రింప, గడ్డమునకు
నార నంటించి మెల్లన నన్ను లేపి
కులికి యద్దంబు జూపు నీకొంటెతనము
మఱవ శక్యమె యెన్నిజన్మముల కైన?

'ఏడువకు మేడువకుము, నీ వేడ్చితేని
కనుల జలజల నీలాలుగాఱు' ననుచు
చిట్టి తమ్ముని నీవు జోకొట్టు హొయలు
మఱవ శక్యమె యెన్నిజన్మముల కైన?

కమ్మనెయ్యియు బువ్వయు కందిపప్పు
కలిపి గుజ్జుగఁ గావించి కడుపునిండ
గోరుముద్దలఁ దినిపింప నారగించి
ఎలమి నన్నలరించువా రెవ్వ రింక?

'పండు లోయమ్మ గుమ్మడిపండు' లనుచు
నెత్తిపై నిన్ను నిడుకొని నేను కేక [గ, కేరి
లిడఁగ, 'వెల యెంత' యని యమ్మ యడుగ
నవ్వి నన్నలరించువా రెవ్వ రింక?


నవ్వుటాలకు నినుఁ దల్లి నొవ్వనాడ,
'అమ్మ! నీపని పట్టింతు' ననుచు నన్ను
జేరి బుడిబుడికన్నీరు చిందువాఱ
నేడ్చి నన్నలరించువా రెవ్వ రింక?

'ఎచటి కేగుచు నుంటివి, యేను వత్తు'
ననుచు పరుగున నాచెంత కరుగుదెంచి
చిట్టిచేతుల నాకాలు చుట్టి పెనఁచి
ఎలమి నన్నలరించువా రెవ్వ రింక?

'వెండిగిన్నియ నుంచితి వెన్న బువ్వ
పసిఁడిదొన్నియఁ బోసితి పాలు పెరుగు,
ఆరగింపర జాబిల్లి' యనుచు పాడి
ఎలమి నన్నలరించువా రెవ్వరింక?

'ఔర! అబ్బాయితలమీఁద గోరువంక
చెప్పకుము చెప్పకుము నీవు చిట్టిపాప!
చెప్పితే నీదుకన్నులు చెడు' నటంచు
ఎలమి నన్నలరించువా రెవ్వరింక?

ఒప్పు లొలుకఁగ 'ఒప్పులకుప్ప' లాడి
మోద మారఁగ 'దాగుడుమూఁత' లాడి
వేడుకలు మీఱ 'గుజ్జెనగూడు' లాడి
ఎలమి నన్నలరించువా రెవ్వ రింక?



కాశీనాథుని భైరవమూర్తి గారు

శ్లో. యస్య శ్రీనందసూనో ర్వ్రజయువతి జనా శ్చాగతా భర్తృపుత్రా౯,
త్యక్త్వా శ్రుత్వా సమీపే విచకితనయనా స్సప్రమోదా స్స్వగేహే;
రంతుం రాసాదిలీలా మనసిజదళితా వేణునాదంచ రమ్యం,
కృష్ణో రాధాసమేతో విలసతు హృదయే సోఽస్మదీయే సదైవ.

గత వ్యాసమున నుదాహరింపబడిన గాన క్రియాప్రభేదాదులందు ముఖ్యముగ గమనింపవలసిన విషయముల గురించి, రాగ తాళాధ్యాయములను గూర్చి తెలుపుటకు పూర్వము వ్రాయబడును. ఇందు నొకటి గమక ప్రభేదము. ప్రస్తుతమున ప్రచురింపబడిన గ్రంథాదులందునను వాడుకగా జెప్పబడునట్టివియు దశవిధగమకములనుట సుప్రసిద్ధము.

శ్లో. ఆరోహ మవరోహంచ ఢాలు స్ఫురిత
కంపితాః, ఆహతః ప్రత్యాహతశ్చ త్రిపు
చ్ఛాన్దోళ మూర్ఛనాః.

అనగ ఆరోహణము, అవరోహణము, ఢాలు, స్ఫురితము, కంపితము, ఆహతము, ప్రత్యాహతము, త్రిపుచ్ఛము, ఆందోళము మూర్ఛన, యని వాడుకగ జెప్పటకలదు. దశవిధగమకములని నామమాత్రమున నేకాని, అనుభవమున ననేకు లనేకవిధములుగ జెప్పుచున్నారు. ఇదిగాక,

స్ఫురితః ప్రత్యఘాతశ్చ;
కంపితో లీనమిత్యపి
ఆందోళితో వళి శ్చాథ
హుంపితోల్లాసితౌ తథా.

అని మఱియొక పూర్వశ్లోకము ననుసరించి గమకములు దశవిధము లనియు తేలుచున్నది గాని నామములు వేర్వేఱుగ గానవచ్చుచున్నవి. ఆరోహణావరోహణమూర్ఛ నలుగూడ గమక ప్రభేదముల క్రింద చేర్చిరి. వీటి కుదాహరణముల వేర్వేఱుగ నాధునిక గ్రంథముల జూచుచున్నాము; గాని ప్రాచీన గ్రంథములందున నుండురీతిని ఈక్రింద కొంత

వరకు వ్రాయబడును. గాయకులు సాంప్రదాయముగ గానము చేయునపుడు వివాదిస్వరములను వినువారికి నింపుగ నుండునట్లును, శేషించిన వాటిని మిగుల రంజనముగ నుండునట్లును, ఆయాస్వరముల పుట్టినవి పుట్టినట్లే చూపక గమకములను కపటక్రియలచే రంజనము చెడక, వృద్ధినొందునట్లుచేయుటయే గమక ముఖ్యోద్దేశ్య మనిరి.

శ్లో. స్వరస్వరంహి గమకః
శ్రోతృచిత్త సుఖావహాః,
స్వీయస్థాన శ్రుతిగతా
ఛాయా హ్యన్యాశ్రయా మపి;
ఛాయాం గమయతీ త్యేష గమకః
పరికీర్తితః.

[చతుర్దండి ప్రకాశిక]

అనగ నొక శ్రుతినాదచ్ఛాయ మఱియొకశ్రుతి నాదఛాయను బొందునట్లు చేయుటయే గమక మనదగును. ఇందు పదునైదు విధములు చెప్పబడినవి.

శ్లో. తిరుప స్ఫురితశ్చైవ
కంపితో లీనమిత్యపి,
ఆందోళితో వళిశ్చాథ
త్రిభిన్నః కురుళాహతౌ,
ఉల్లాసితః ప్లావితశ్చ
హుంపితో ముద్రిత స్తథా,
నామితో మిశ్రితశ్చేతి
భేదాః పంచదశ స్మృతాః.

[చతుర్దండిప్రకాశిక]

ఇదిగాక సంగీతరత్నాకరమున సామాన్య గమకము లనియు విశేషగమకము లనియు జెర్కొనబడియున్నవి.

శ్లో. స్వరస్య కంపో గమకః శ్రోతృచిత్తసుఖావహాః, తస్యభేదా స్తు తిరిపః స్ఫురితః కంపిత స్తథా, లీన ఆందోళితవళి త్రిభిన్నకురుళాహతాః, ఉల్లాసితః ప్లావితశ్చ గుంఫితో ముద్రిత స్తథా, నామితో మిశ్రితః పంచ దశేతి పరికీర్తితాః.

[సంగీత రత్నాకరము]

అనగ తిరిపము, స్ఫురితము, కంపితము, లీనము, ఆందోళితము, వళి, త్రిభిన్నము, కురుళము, ఆహతము, ఉల్లాసితము, ప్లావితము, గుంఫితము లేక హుంపితము, ముద్రితము, నామితము, మిశ్రితము యీ పదునైదును, గమక ప్రభేదములని యున్నారు.

"శ్రోతృ చిత్తసుఖావహా ఇత్యనేన విశిష్టస్యైవ కంపస్య గమకత్వ మిష్టం, అన్యథా విపరీతస్యాపి తస్య గమకత్వంస్యాత్"

[సంగీత రత్నాకరము]

తత్తదుద్దిష్ట ప్రకారముగ నున్ననే తప్ప లేనిచో శ్రోతృచిత్తమునకు సుఖావహాముకాదనియు రత్నాకరవ్యాఖ్యానకర్తలగు శ్రీకల్లినాధులు వ్రాసియున్నారు. ఈ పదునైదింటిలో నొక్కొక్కదానికిని లక్షణముల జెప్పియున్నారు. గనుక దాని ప్రకారముగ గమకముల బట్టవలయు నని శాస్త్రము. వాటిని గూర్చి ముచ్చటింతము.

శ్లో. లఘిష్ఠడమరుధ్వాన
కంపానుకృతిసుందరః;
ద్రుతతుర్యాంశ వేగేన
తిరిపః పరికీర్తితః.

[సంగీత రత్నాకరము]

యీ గమకముల బట్టుట వీణావాద్యమునందే సౌకర్యముగ జూపనగును గాన నట్లు వ్రాయుదము.

వీటిలో మొదటిది (1) తిరిపము అని రత్నాకర గ్రంథకర్తలు వ్రాసియున్నారు. చతుర్దండి ప్రకాశికయందు, తిరుపమని వాడియున్నారు. గాన తిరిపము, తిరుపము అని వాడుట గలదు.

ఇది సూక్ష్మతమ మగు డమరుకనాదమును బోలి సుందరముగ నుండవలయు ననిరి. మఱియు నొకస్వరమందు "ద్రుతతుర్యాంశ వేగేన" అనగ ½ అర అక్షరకాలము నిలచి, అదిమిగాని కొట్టిగాని ప్రక్కకు లాగిగాని, సమీపమునందుండు పైస్వరము యొక్క ఛాయను పల్కించుటయే దీనిలక్షణ మనిరి.

తిరుపు అనగ హింసించుట యని కలదు. దీనికే "నొక్కు" అనియు నామాంతరము గలదు. అనగ నాస్వరమును మరింత యూతముగ, బలముగ బలుకునట్లు చేయుట. శేషించిన గమకాదులలక్షణముల నిట్లు వ్రాసియున్నారు.

శ్లో. వేగే ద్రుతతృతీయాంశసమ్మితే స్ఫురితో మతః, ద్రుతార్ధమాన వేగేన కంపితం గమకం విదుః; లీనస్తు ద్రుతవేగే నాందోళితో లఘువేగతః, వళిర్వివిధవక్రత్వ యుక్తవేగ వశాత్ భవేత్; త్రిభిన్నస్తు త్రిషుస్థానే ష్వవిశ్రాంత ఘనస్వరః, కురుళో వళిరేవ స్యాత్ గ్రంథిలః కంఠకోమలః; స్వరమగ్రగ మాహత్య నివృత్త స్త్వాహతో మతః, ఉల్లాసిత స్సతుప్రోక్తో యః స్వరానుత్తరోత్తరాన్; క్రమా ద్గచ్ఛేత్ ప్లావితస్తు ప్లుతమానేన కంపనమ్, హృదయంగమ హుంకార గంభీరో గుంఫితోభవేత్; ముఖముద్రణసంభూతో ముద్రితోగమకో మతః, స్వరాణాం నమనాదుక్తో నామితో ధ్వనివేదిభిః.

[సంగీత రత్నాకరము]

ఈలక్షణముల వివరము సులభవేద్యమగునటుల నీక్రింద వ్రాయబడును.

(2) స్ఫురితము—అనగ స్ఫురింపజేయుట, తోచునట్లుచేయుట యని తాత్పర్యము. ఇది జంటస్వరముల నారోహక్రమమున ననగ[సస-రిరి-గగ] వాయించునపు డుపయోగించును. జంటస్వరములందు మొదటిదానియందు ద్రుతతృతీయాంశము అనగ సుమారు మువ్వాతిక అక్షరకాలము నిలిచి దానిని కొట్టి దానికి సమీపముననున్న క్రింది స్వరఛాయను పల్కించుట స్ఫురితమగును. 'సస' అనుదానిని 'సనిస'అని పల్కించుటే యగును.

యీ జంట స్వరములనే యవరోహణక్రమముగ బట్టునపుడు వాద్యమునందు 'సస' అనుదానిని 'సరిస'గను, 'నిని' అనుదానిని 'నిసని'గను పల్కించుట ప్రత్యాఘాతమని చెప్పుచు ప్రత్యేక గమకప్రభేదముగ నాధునికులు వాడుచున్నారు. వీరిగ్రంథములందునను గాననగును. వీనికి మాఱుగ "డోలము" అనియు గలదు. డోలముయొక్క కదలింపు ముత్యములోపల నీరు పొరలునట్లుండు ననిరని సంగీత సాంప్రదాయ ప్రదర్శినియందు గలదు.

(3) కంపితము—అనగా కదలింపబడుట.

లీనము, ఆందోళితము, ప్లావితముగూడ దీని యందంతర్భాగము లనదగును. గాని వీనికాల నిర్ణయముమాత్రము వేఱగుటచే ప్రత్యేకముగ వ్రాయబడియుండును. కంపితమున నొకస్వరమందు "ద్రుతార్ధమాన వేగ"మనగ నొక యక్షురకాలముమాత్రముకదలించి, నాభినాదముగ నల్లార్చుటయే యనియు, యా స్వరమునకు సమీపమున ప్రక్కన నుండుస్వరములఛాయ రాకుండునట్లు కదలించుటే యనియు గలదు.

(4) లీనము— అనగ సాయుజ్యము. ఐక్యము కలసిపోవుట యని యర్థము. ఏదేని యొకస్వరమున ద్రుతవేగము రెండక్షరముల కాలము మాత్రము నిలిచి కదలించి దానికి డాసిన పైస్వరమందు క్రమముగ లీనమగునట్లీడ్చిపట్టుట లీనమగును.

(5) ఆందోళితము—అనగ నూపబడినది యని భావము. ఒకస్వరమందు నాలుగక్షరములకాలము (ద్రుతవేగము) వరకు తంత్రిని ఊగులాడించి దానికి సమీపస్థస్వరఛాయను పల్కించుట దీనివినియోగము.

(6) వళి—దీనికి సమూహము లేక సుడి యని యర్థము. వివిధవక్రత్వయుక్తవేగవశము వలన గల్గింపదగినదని కలదు. అనగ వక్రముగ సుడియించి, బిగబట్టి పై నొకటి రెండు మూడు స్వరఛాయలను బల్కింపచేయుట దీని యుపయోగము. అనగ నిదా అని దైవతమును పాడునపుడు ఆదైవతమున రెండు మూడు స్వరములు పాడుట దర్బారు,అఠాణా, రాగములందు గానవగును.

(7) త్రిభిన్నము—వేర్వేఱుగ మూడు అని భావము. వాద్యమున మంద్ర, పంచమ, షడ్జాదితంత్రులను నొకేసారిగ విడివిడిగ మీటుట, రంజనమునకై కూటముగ మీటుటయు గలదు. అనగ నేదేని స్వరపుమెట్టుపైన తీగలన్నిటి నదిమిపెట్టుకొని అన్నిటిని ప్రత్యేకముగ గాని కలిపిగాని మీటుటచే అవి శ్రాన్త ఘనస్వరము నుద్భవిల్లజేయుటయే దీని వినియోగము. ఇయ్యది వీణకు ముఖ్యము.

(8) కురళము—కురులు; ముంగురులపైనుంచి దీని కుద్భవము. దీనియందు ఒదిగింపు, ఒరయిక (ఒరికె=వరికె) అని రెండు విధములు.

i ఒదిగింపు—ఒక స్వరమందుననే బహుస్వరములను బట్టుట యనదగును. గాత్రగానమున జారుట యనదగును. వీణయందున నొక మెట్టుపై తంత్రిని ప్రక్కకు లాగుట వలన అనేకస్వరముల నొకమీటుతో పల్కునట్లు చేయుట.

ii ఒరయిక—[రాపిడి యని భావము.] ఏదేని యొకస్వరమునుండి దిగునపుడు పై స్వరముయొక్క ఛాయను పల్కింపుచు దిగుట దీని వినియోగము. అనగ "స ని ద ప" అను దానిని "స రి ని స ద ని ప" అనునట్లు పాడుట యగును. పైస్వరమును రాచుకొనివచ్చునట్లుండును గనుక "ఒరయిక"అనిరి.

(9) ఆహతము—కొట్టబడిన దని తాత్పర్యము. దీనిని రవ, ఖండింపు, అని రెండువిధముల బేర్కొనియున్నారు. అందు (i) రవ యనగ నేపైన నొకస్వరముననుండి ఆస్వరమును రాల్చుకొని రాలెడు స్వరఛాయతోడ

నే క్రిందిస్వరమునకు దిగుట దీని కుపయోగము. "పమ" యనుటకు "పపమ" యనుట.

(ii) ఖండింపు—తెగగొట్టుట అనగ పై దానిలో మఱియొకవిశేషము. ఒకస్వరము నుండి క్రిందికి దిగునపుడు మధ్య నొకస్వరమున, (శ్రీ) ఆంజనేయమూర్తి సముద్రతరణ సమయమున మైనాకునిపై పాదమూనినట్లు, ఆగుట. అనగ ఆదిగుటను ఖండించి పిమ్మట దిగుట. "మరి" యనునపుడు "మగరి" యని దిగుట

(10) ఉల్లసితము—ఉల్లాసితము = ఉల్లసింపజేయబడినదని తాత్పర్యము. దీనికే జారుట యనుపేరు గలదు. దీనను ఎక్కుజారు అనియు దిగుజారు అనియు రెండువిధములు.

(i) ఎక్కుజారు—ఏదేని ఒకస్వరము నుండి మఱియేదే నొక పైస్వరమునకు బోవునపుడు నడిమిస్వరఛాయలను రాచికొనిపోవుటయే యగును. అనగ నడుమను గల స్వరఛాయల నిమిడ్చికొనియుండుటయే కాని వ్యక్తీకారము చేయనేరదు.

(ii) దిగుజారు—పైరీతిని అవరోహణ క్రమమున పల్కింపుచో దిగుజా రననగును.

(11) ప్లావితము తేల్చుట తేలునట్లు చేయుట యని భావము. ఒకస్వరమందు, ప్లుతమానకంపితమనగ పం(డెండక్షరములకాలము నూపి కదలించి డాసిన పై స్వరఛాయను బల్కించుట దీని వినియోగమని కలదు.

(12) గుంఫితము, లేక హుంపితము, లేక కుంభితము. అనగ నూపిరి పూరించుట యని యర్థము. "హుం" అనునాదము నుద్భవిల్లజేయుట దీని వినియోగము. జారువంటిదే యగును గాని ఆరోహావరోహక్రమముగ, బలముగ "హుం" అనునాదము పుట్టునట్లు కాహళాదిధ్వనివలె పల్కునట్లు చేయుట. ప్రథమమున పెద్దదిగను క్రమముగ క్షీణించునట్టిదిగ నుండుట గాని మొదట కొద్దిగనుండి పిమ్మట గ్రమముగ వర్ధిల్లుటగాని దీని లక్షణము. ఇయ్యది రాలుడుచుక్క ననుకరించును.

(13) ముద్రితము— యియ్యది గాత్రగానమునకే యనదగును. అనగ దేనినైన మూసి ముద్ర వేసియుంచుదురుగదా! అట్లే నోటిని మూసికొని పెదవుల నెడము చేయుక పాడుట ముద్రిత మనబడును.

(14) నామితము—స్వరముల నమనము అని తాత్పర్యము. అనగ విశేష ధ్వని గలుగ నీయక మిగుల రంజనముగల్గునటుల నాదమును తగ్గించి సూక్ష్మధ్వనితో పాడుటవలన గలుగు స్వరములకదలికయే దీనివినియోగము.

శ్లో॥ ఏతేషాం మిశ్రణాన్మిశ్రః తస్య స్యుర్భూరయో భిదాః. [సంగీత రత్నాకరము]

(15) మిశ్రితము — కలుపబడినదని తాత్పర్యము. పై జెప్పబడిన గమక భేదముల నేకములుగ జేర్చి పాడుట మిశ్రిత మనబడినది. ఈమిశ్రిత గమకమందు నేయే గమకములు చేర్చి యొకేసారిగ పాడవచ్చును, ఎయ్యవి కూడదు మొదలగునవియు "గమకాశ్రయత్వేన తదనన్తర ముద్దిష్టానాం స్థాయీనాం సామాన్య లక్షణం." [సంగీత రత్నాకరము]

స్థాయీవాగభేదములు అనన్తములనిరత్నాకరమున వ్రాసియున్నారు. గ్రంథవిస్తర భీతిచే నిట విరమింతుము.

ఈసంచికయందు మేఘరాగము యొక్క-యు, తత్పంచరాగిణులయొక్క-యు విగ్రహాదికములు ముద్రింపబడినవి.

మేఘ రాగము

శ్లో. షడ్జేషాడ్జీభవః షడ్జగ్రహాంశాన్తో నిగోత్కటః; మేఘరాగో మంద్రకా నో గ్రహాంశన్యాసధైవతః." [సంగీత రత్నాకరము]

శ్లో. మేఘః పూర్ణోదత్రయః స్యాదుత్తరాయతమూర్ఛనః; వికృతో ధైవతో జ్ఞేయః శృంగారరసపూరకః. [సంగీత దర్పణము]

యీరాగము సంపూర్ణమనియు, ధైవత స్వరగ్రహాంశమనియు ఉత్తరాయత యను మూర్ఛనకు సంబంధించినదనియు, ధైవతము వికృతమనియు శృంగారరసమునందు ప్రయోగము చేయబడవలసినదనియువ్రాసియున్నారు. దీనికి స్వరము. ధనిసరిగమపధయని గలదు.

ధ్యానశ్లోకము:

శ్లో. నీలోత్పలాభవపు రిందు సమానవక్త్రః
పీతాంబరఃతృషితచాతక యాచ్యమానః;
పీయూషమందహసితో ఘనమధ్యవర్తీ
వీరేషు రాజతి యువాకిల మేఘరాగః.
[సంగీత దర్పణము]

అనగ నీలోత్పలసమాన కాంతిగల దేహఛాయయు, చంద్రునిబోలు ముఖమునుగల్గి, సువర్ణఛాయను గేరువస్త్రమును ధరించి, మృదుమందహాస వదనారవిందముచే నొప్పారుచు, మేఘమధ్యముననుండి చాతకపక్షులచే యాచింపబడుచు వీరాధివీరుడై చెలగుచు యౌవనమధ్యస్థమూర్తియై వెలుగుచుండునని తాత్పర్యము. మఱికొందరి మతమున ఖడ్గము ధరించుననియు, గానముచేయుచుండు ననియు, శ్వేతఛత్రముగల్గి మేఘావృతుడై, వర్షమును మెరుపులు తన నావరింప చాతకపక్షులచే యాచింపబడుచుండుననియు గలదు. ఇట్లు దీని రూపమని వర్ణించియున్నారు.

టంక్=టంకా=టక్క

శ్లో. టక్కః సాంశగ్రహన్యాసః కాకల్యన్తరరాజితః. [సంగీత రత్నాకరము]

శ్లో. టంకా స్యాత్తు త్రిధా షడ్జా సంపూర్ణా చాది మూర్ఛనా. [సంగీత దర్పణము]

సంపూర్ణమనియు, ప్రథమ మూర్ఛనకు జెందినదనియు షడ్జస్వరగ్రహాంశన్యాసమనియు గలదు. రత్నాకరమున కాకల్యన్తరరాజిత మనియుగలదు. దీనికి స్వరము సరిగమపధనిస.

రాగధ్యానము:

శ్లో. శయ్యాసు సుప్తం నళినీదళానాం
వియోగినీ వీక్ష్య విషణ్ణచిత్తమ్;
సువర్ణవర్ణా గృహ మాగతా సా
కాంతం భజంతీ కిల టంకసంజ్ఞా.
[సంగీత దర్పణము]

అనగ పద్మదళములను శయ్యగా గొని నిద్రావశమై యున్నను పతివియోగ దుఃఖాక్రాంతయగుచు సువర్ణదేహకాన్తిగల్గు టంకా యను రాగిణీరూపము పతిరాకకై యాతని భజింపుచుండునట్లుండునని భావము. మఱికొందఱు చేడియలుగూడ దుఃఖాక్రాన్తలై యీమె దుఃఖమును విభాగించికొనుచున్నట్లుండుననిరి.

మల్లారీ=మలహారి

శ్లో. మల్హారీ తదుపాంగం స్యాత్ గహీనా
మంద్రమధ్య మా, పంచమాంశగ్రహ
న్యాసా శృంగారే తాడితా మతా.

[సంగీత రత్నాకరము]

మల్లారీ సహీనాస్యాత్ గ్రహాంశన్యా
సధైవతా; ఔడవా పౌరవీయుక్తా వర్షా
సు సుఖదా సదా.

[సంగీత దర్పణము.]

దీనికి షడ్జపంచమవర్జ మని దర్పణమందు గలదు. ధైవతము గ్రహాంశన్యాస స్వర మనియు ఔడవరాగమనియు, పౌరవి మూర్ఛనకు జేరినదనియు, వర్ష ఋతువునందు సౌఖ్యదమనియు వ్రాయబడినది. యీరాగము రత్నాకరమున పంచమము గ్రహాంశన్యాసస్వరమనియు గాంధార మంద్రమధ్యమములు హీనములనియు పాఠభేదముగ వ్రాయబడి యున్నది. దీనికి స్వరము ధనిరిగమధ అని గలదు.

రాగధ్యానము:

శ్లో. గౌరీ కృశా కోకిలకంఠనాదా
గీతచ్ఛలే నాత్మపతిం స్మరంతీ;
ఆదాయ వీణాం మలినా రుదస్తీ
మల్లారికా యౌవనదూన చిత్తా.

[సంగీత దర్పణము]

అనగ తెల్లని మైచాయగల్గి, కృశాంగియై కోకిలారవము ననుకరించు కంఠధ్వనితో గానమను మిషచే వీణను తెచ్చి వాయించుచు మలినవస్త్రయై రోదనము చేయుచు పతిని స్మరించుచు పాడుచుండునని గలదు.

ఘూర్జరి=గుజ్జరి

శ్లో. తజ్జా గుర్జరికా మాన్త్రా రిగ్రహాంశా మ
మధ్యభాక్; రితారా రిషభూయిష్ఠా శృం
గారే తాడితా మతా.

[సంగీత రత్నాకరము]

ఇందు మహారాష్ట్ర, సౌరాష్ట్రి, దక్షిణ, ద్రావిడీ గుర్జరీ లని వేరు వేరుగ వ్రాసి యున్నారు.

శ్లో. గ్రహాంశన్యాసఋషభా సంపూర్ణా
గుర్జరీ మతా, పౌరవీ మూర్ఛనా
యస్యాం బంగాళ్యా సహ మిశ్రితా.

[సంగీత దర్పణము]

ఇది సంపూర్ణమనియు, ఋషభ స్వరగ్రహాంశన్యాసమనియు, పౌరవీమూర్ఛనకు సంబంధించిన దనియు బంగాళరాగమిశ్రిత మనియు గలదు.

రాగధ్యానము:

శ్లో. శ్యామా సుకేశీ మలయద్రుమాణాం
మృదూల్లసత్పల్లవతల్పమధ్యే;
శ్రుతిస్వరాణాం దధతీ విభాగం
తంత్రీముఖా దక్షిణగుర్జరీయం.

[సంగీత దర్పణము]

నీలదేహఛాయగల్గి చక్కనితలకట్టుగల్గి మలయద్రుమములయొక్క లేజిగురుల తల్పముగా నమర్చికొని వీణను శ్రుతిచేసికొని చక్కగ బాడుచుండునని గలదు. మఱికొందఱు ద్వాదశవిధములగు నగలను, పదునారు విధములగు నలంకారములును గావించికొని, ఎర్రని చీరను పచ్చనిమేలిముసుగును ధరించి, సింగము ననుకరించునడుముగల్గి పతివియోగాకులచిత్తయగుచు తల్పమును వదలి వీణ



ఆంధ్రనట శిఖామణి — కీ. శే. కందాళై శ్రీనివాసాచార్యగారు

భూపాలీరాగిణి



శ్లో. గౌరద్యుతిః కుంకుమలిప్తదేహా తుంగస్తనీ చంద్రముఖీ మనోజ్ఞా;
కాంతం స్మరంతీ విరహేణ దూనా భూపాలికేయం రసశాంతియుక్తా.

దేశకారీరాగిణి



శ్లో. భర్త్రాసమం కేళికళారసజ్ఞా సర్వాంగపూర్ణా కమలాయతాక్షీ;
పీనస్తనీ యుక్తశిరాః సుకేశీ సంపూర్ణచంద్రానన దేశకారీ.

వాయించుచు కాలక్షేపము జేయుచుండిన ట్లున్నదనిరి. దీనికి స్వరము. రిగమపదనిసరి యనియు గలదు.

భూపాలి=భూపాళ=భూపాల

శ్లో. షడ్జగ్రహాంశకన్యాసా భూపాలీ కథితా బుధైః; మూర్ఛనా ప్రథమాయత్ర సంపూర్ణా శాంతికే రసే; కైశ్చిత్తు రిపహీనేయం ఔడవా పరికీర్తితా.

[సంగీత దర్పణము]

అనగ షడ్జము గ్రహాంశన్యాసస్వర మనియు, ప్రథమమూర్ఛనాసంబంధ మనియు, సంపూర్ణ రాగమనియు, శాంతిరసమందు ప్రయోగమనియు నుడివియున్నారు. మఱికొందరు ఋషభపంచమవర్జమనియు, ఔడవరాగ మనియు జెప్పుచున్నారు. దీనికి స్వరము, సరిగమపదనిస అథవా, సగమపదనిస అనియు గలదు.

రాగధ్యానము:

శ్లో. గౌరద్యుతిః కుంకుమలిప్తదేహా
తుంగస్తనీ చంద్రముఖీమనోజ్ఞా;
కాంతం స్మరంతీ విరహేణ దూనా
భూపాలికేయం రసశాంతియుక్తా.

[సంగీత దర్పణము]

తెల్లనిమైచాయపై కుంకుమ మలది పీన వక్షోజములచే నొప్పారుచు చంద్రబింబమును హసించు మోముగల్గుటచే సుందరమై కాంతుని వియోగమువలన మిగుల బొగులుచున్నట్లున్నదనిరి. మఱికొందఱు, రత్నములయు ముత్యములయు హారములధరించి, పుష్పమాలికను గైకొని, ఎపుడు కాంతుడు వచ్చునో ఎపుడాతని పుష్పమాలాలంకృతునిగ జేతునో యని తదేకధ్యాననిరతయై యున్న ట్లున్నదనిరి.

దేశకారి

శ్లో. దేశకారీతు సంపూర్ణా షడ్జన్యాసగ్రహాంశికా, మూర్ఛనా ప్రథమా జ్ఞేయా వైరాటీ మిశ్రితా భవేత్.

[సంగీత దర్పణము.]

అనగ నీరాగిణి సంపూర్ణమనియు, షడ్జన్యాసగ్రహాంశమే యనియు, ప్రథమ మూర్ఛనాసంబంధమనియు వైరాటీరాగ మిశ్రితమనియు వ్రాసియున్నారు. దీనికిస్వరము: సరిగమపదనిస.

రాగధ్యానము:

శ్లో. భర్త్రాసమం కేళికళారసజ్ఞా
సర్వాంగపూర్ణా కమలాయతాక్షీ;
పీనస్తనీ రుక్మతనుః సుకేశీ
సంపూర్ణచంద్రానన దేశకారీ.

[సంగీత దర్పణము]

అనగ సర్వాంగసంపూర్ణసౌందర్యము గల్గి కమలాయతనేత్రములు, పీనకుచకచభారముగల్గియొప్పుచు, పూర్ణచంద్రునివంటి మోము గల్గి, భర్తతో సమముగ కేళికళారసజ్ఞత నంది యుండునని వర్ణించియున్నారు. మఱికొందఱు సువర్ణవర్ణమును గేరు దేహకాంతి గల్గి ముక్తాహారమును కంఠమున దాల్చి నుదుటను చందన మలది తనభర్త్రాగమనమును నిరీక్షించి యాతనితో సరససల్లాపము లాడుచుండినట్లు వర్ణించియున్నారు.

వసంత కోకిలము

అనంతపంతుల రామలింగస్వామిగారు [భారతీసమితి]

ఆజన్మాంతము శిశునొందినను నీయానందరాగాంకుర
శ్రీజన్మాలయ గీతికారవము నుర్వి న్నెర వీలౌనె యే
రోజన్; బుష్పగతామృతంబుఁబలె నీకొప్పంగదే నైజమై;
నీజన్మం బిల ధన్యకర్మవశమై నిండారు నో కోయిలా!

గీ. మాతెలుఁగు కన్నియకుఁ బంచమస్వరంబు, నేర్పఁ బాడినపాటనే నీవదెంత
పాడినను నీదువెనువెంటఁ బాడనేర్చెఁ, గాని తనయంత ఁదాఁ బాడఁగలుగఁదయ్యె!

ఉ. రామకథానుసారి శ్రుతిరంజకగానము వామలూరుజుం
డీ మహిఁగ్రైతకొమ్మను వసించి విరించిని మించిపాడు ను
ద్దామగతిఁ సుధారససిధానముఁ బంచమసుస్వరైక్యమా
రామకథానుసారి శ్రుతిరంజకగానము నీవుఁ జేయవే!

ఉ. నీదగుజోడువల్కెనని నెమ్మదిఁ దీయనిమోసమొంది స
మ్మోదరసైకవాదరుతముఁ బచరించెదొ, మాతెలుంగుతో,
గాదిలిమాతెలుంగు సరిగానగు నీజగతీస్వరూప మి
థ్యాదశ మాకుఁదెల్పుట కుదాహరణంబుగ నట్లొనర్చెదో?

చ. ఘనతరు లాలకింపఁ దొలికాలునవచ్చి వచించుచుందువో
ఘనతర నమ్రభావగతి, కమ్రతపోన్నతి, త్యాగరాగ శ
స్తనియతి, మాధవాతిహితసంగతియుఁ, సుమనఃప్రభావ వ
ర్ణనము, రసానుసంగ్రహణ నైపుణి మున్నగు నీతిపాఠముల్.

గీ. సల్లలితముగఁ గొమ్మలు పల్లవింపఁ, గామరూపోచితప్రభాకలితుఁ డగుచు
మాధవుఁడు మాధవుండయి మలయువేళ, నతనిమురళి భవద్రూప మందునేమొ?

ఉత్తర హిందూదేశ యాత్ర

ఆచంట జానకిరాం గారు

శిశిరఋతువు. ఒకింత చలికి భీతిజెందని దాక్షిణాత్యుల కుత్తరహిందూస్థానపర్యటనమునకు మిక్కిలి యనుకూలమగు కాలము. ప్రచండుడై సూర్యుడు తనసహస్రకిరణములతో సకలపదార్థముల నగ్నికణములుగ మార్చు మండువేసవి యింకను దవ్వుననే యున్నది. ఎంతప్రొద్దెక్కినను, వెచ్చనిమిద్దెటిండ్లను విడువనీక, శాలువలపై శాలువల గప్పుకొనజేయు విపరీతపు శీతకాలము చాల భాగము గడచిపోయినది. ఇట్టి యుత్తమఋతువున నొక శుభముహూర్తమున మామిత్రబృందము 'ఉత్తరదిగ్విజయ యాత్రకై' యొకరాత్రి బెంగుళూరునుండి బయలు వెడలెను.

మేము తలయొక దేశస్థులము అగుటవలన మాసంఘ మెంతయు వర్ణనీయము. ఒకరు సింధునదీప్రాంతవాసులు; మళయాళదేశపు కొబ్బరితోటలందు పుట్టిపెరిగినవారింకొకరు, శాశ్వతమగు కీర్తి వహించిన సబర్మతీనది యొడ్డున నివసించు గుజరాతీబ్రాహ్మణు లొకరు; విద్యావిషయముల వన్నెకెక్కిన కొచ్చిరాజ్యమునుండి యేతెంచిన వారు వరొకరు; నేనన్ననో కృష్ణా గోదావరీ సుస్యస్థమగు నాంధ్రదేశమునకు జేరినవాడను. ఇట్టి జాతీయసమావేశముతో మేము దేశపర్యటనము ప్రారంభించితిమి. త్వరలో మైసూరుదేశమును గడచి 'దత్తమండలమున' బ్రవేశించితిమి. కడపటితరగతి ప్రయాణికులనుభవింపగలిగిన కలతనిద్దురలో నప్పుడప్పుడు హిందుపురము, అనంతపురము, పెనుకొండ యనుస్టేషనుల పేర్ల వినినంతనే ఆంధ్రదేశమున నుంటిమికదా యని యొకరీతి సంతుష్టి చెందెడివారము. తెల్లవారుసరికి గుంతకల్లుజేరితిమి. పదునొకండుగంటలకు రాయచూరుదుర్గమునుదాటి తుంగభద్రానది జేరి, గండశిలలపై బ్రవహించు నా నదీప్రవాహమును వేడుకతో జూచితిమి. "ఇయ్యదియే కాబోలు, నింక కొంత తూర్పున విద్యారణ్యయతీంద్రులచే స్థాపితమై, విజయనగరసామ్రాజ్య ధురంధరుడైన కృష్ణదేవరాయని రాచనగరై వెలసిన హంపి విరూపాక్షుల చెంతనుండి ప్రవహించు దివ్యవాహిని"యని తలంచి యానందించుచు నైజామురాష్ట్రమున బ్రవేశించితిమి.

వరిచేలనడుమ బెరిగినవారల కీప్రాంతములు సారహీనములై, వేసవియందు మిగుల సంతాపదాయకములై యుండును. కాని, యీఋతువున రైలుబాట కిరువంకల యోజనము మేర జొన్న, ప్రత్తి పైరులచే దేశమంతయు బచ్చనై యొకింత నేత్రానందకరముగనే యుండును. ఐనను, కనుచూపుమేరలో గ్రామ మొకటియు గానరాదు. స్టేషనులచెంతమాత్రము పైకప్పు సహా రాతితో కట్టిన కొన్నిగృహములు గలవు. ఇట్టి ప్రదేశములగుండ విసుగుతో ప్రయాణ మొనరింపగ, మధ్యాహ్న మగుసరికి నిరంతరము కొట్టుకొను తరంగములరాపిడిచే నున్ననై సూర్యకిరణములను దర్పణముల మాడ్కి ప్రతిఫలింపజేయు రాళ్లం దాకుచు కృష్ణవేణీనది కలిగించు ఝరఝరధ్వని కర్ణయుగముల సోకి యొక్కడలేనియానందము నొసంగును. కాని, యిదివరలో విజయవాడపురమును జూచినవారితో నీ నది కృష్ణయనిన వారు విశ్వసింపరు. రమారమి యర్థక్రోసు వెడల్పున కడుమెత్తనగు నిసుకతిన్నెలపై ప్రవహించు మహానది యేడ! ఇన్నూరుగజములకు దక్కువ వెడల్పున రాళ్లరప్పలపై దొర్లింతలాడు కొండవా గెక్కడ?

క్రమముగ నిజామురాష్ట్రపుటాంధ్రము కన్నడభాషకు దావాసగును. ఇంక కొన్నిగంటల కదియు మహారాష్ట్రభాషలో కలిసిపోవును. వేకువజామున నెవ్వరో 'పునహా', 'పునహా'యనుట వినబడును. పునహా దాటనంతనే యతిరమ్యమగు పడమటి కనుమలనడుమ రైలు పోవును. వర్ణనాతీతములగు ప్రకృతిసౌందర్యముల నచట

గొల్లగొనవచ్చును. ఇందుల కీప్రాంతముల బగటిపూట ప్రయాణ మొనర్పవలెను. క్రమక్రమముగ మిగులప్రయాసతో మిక్కిలి పట్టుదలతో రైలు పర్వతాగ్రముల, నధిరోహించి యటనుండి జయజయధ్వనులతో బొంబాయి పై పుగల లోయప్రదేశముల జేరును. ఈకనుముల దాటునపుడు నేత్రపర్వంబగు ప్రకృతి సౌందర్యాతిశయమున కనేకులు ఖండాంతరవాసులు సైతము విస్మయానందముల నొందుట వినియుంటిమి.

౨

బొంబాయి

బొంబాయి ఇప్పటి నాగరికతాసామ్రాజ్యమునకు ముఖ్యపట్టణ మనదగును. ప్రత్యేకము పట్టణముల జూడవలెనను వారికిందు జూడదగు నంశము లనేకము లున్నవి. కాని,పట్టణము లనిన విసుగుజెందిన మావంటివారలకు సైతము మితానంద మొసంగు సుందరప్రదేశములును గలవు. ప్రొద్దుననే 'మలబారీహిల్సు' అను రమ్యప్రదేశమున నొకజాము సేపు విహరింపవచ్చును. ఇట విశాలములైన పూదోటలమధ్య శ్రీమంతుల హర్మ్యములు విరాజిల్లుచుండును. ఈకొండనెత్తములనుండి బొంబాయినంతయు జూడనగును. ఇక్కడనే యొకప్రక్క పార్శీజాతివారి వింతసమాధులు గలవు; వీరు ప్రేతముల దహనమొనర్పరు; భూగర్భమున బూడ్చరు. అత్యున్నతప్రాకారములమధ్యనున్న గచ్చుప్రదేశమున ప్రేతమును విడిచి వత్తురు. అచ్చోటి దమనివాసస్థలము నేర్పరిచికొనియున్న భయంకర మగు రాబందులసమూహము లాప్రేతము నొకక్షణములో శల్యావశిష్ట మొనర్చును. ఈవింత యాచారము పార్శీవా రవలంబించుటకు ప్రబలమగు మతాధికారము గలదు. పరోపయోగార్థ మగుఁన యీ మానవశరీరమును, నిర్జీవదశ నొందినపిదపకూడ భూతతృప్తికొరకే వినియోగపఱుపవలె ననెడి యూహతో నీ యాచారము కలిగింపబడెనని కొందఱు విశ్వసింతురు. ఈ సమాధులకు 'టవర్సు ఆఫ్ సైలెన్సు' (Towers of Silence) అని పేరు.

మలబారీకొండనెత్తములందే బొంబాయి కంతకు నాధారమైన నీటివసతు లున్నవి. బొంబాయికి చాల దూరముననున్న సరస్సునుండి యుదక మిచ్చోట నున్న రాతిచెఱువులందు నింపబడును. రాతితో నిర్మింపబడిన యీ చెఱువుపైకప్పుమీద విచిత్రరీతి నొకరమ్యమగుపూదోట యున్నది. వృక్షము లేవియు లేకున్నను, మనోహరములగు పూలచెట్లుగలవు. నేత్రానందకరములగు పచ్చికబయళ్లయందు చక్కని యాసనములనుకలిగిన యచటిసుందరప్రదేశములు,ఊగెడు ఉద్యానములు(Hanging Gardens) అను నామమున బరగుచున్నవి. మలబారీ హిల్సు, ఒకకొనను, 'కొలాబా పాయింటు' రెండవకొనను,(చౌపాటీ) ప్రదేశము మధ్యను గలిగి యిచటి సముద్రతీరము అర్ధచంద్రాకృతి నున్నది. 'చౌపాటి' యను నిసుక ప్రదేశమునందే లోకమాన్యుని శరీరము చందనపు చెక్కలలో బంచభూతములకు నర్పింపబడినది. ఈ పుణ్యప్రదేశమున గౌరవసూచకముగ నొకకట్టడమును నిర్మింతురట!

బొంబాయిపురమున జనసంఖ్య లెక్కకు మిక్కుటమై ప్రజలు నివసించుటకు తావు చాలకుండ నున్నది. కనుకనే మందిరములన్నియు నేడంతస్థులకు దక్కువ కాక యున్నవి. ఈవిషయమున నాకసము నంటజూచుచు, నింకను తావుచాలక, పూర్వోదాహృతమగు 'కొలాబా' 'చౌపాటి'లమధ్యనున్న సముద్రభాగమునంతయు రాయిరప్పలతో పూడ్చి భూప్రదేశముగమార్చి యట వసతుల నిర్మింపవలె ననెడి యుద్యమమున బొంబాయి పురపాలకసంఘమువారు లక్షలకొలది వెచ్చించుచున్నారు. పాశ్చాత్యభౌతిక రసాయన శాస్త్రముల సాయమున మానవుడెంతటి పనులనైన చేయజాలకుండగునుకదా!

వాణిజ్యమున కాలవాలమైన బొంబాయికి గల నౌకారక్షకస్థానము చాల వైశాల్యముగలదై మిక్కిలి అనుకూలమై యున్నది. ఇందొక ముఖ్యభాగమున 'అపొలోబందరు' అనురేవు కలదు. ఇచ్చటనే ౧౯౧౧ సంవత్సరమున ఢిల్లీపట్టాభిషేకసమయమున జార్జి చక్రవర్తియు నతనిసతియు హిందూదేశమున నడుగిడిరి. ఈ ప్రదేశమున నిర్మలఁ శిలావేలు వెచ్చించి, "హిందూదేశద్వార"మను నాడంబరనామమున బరగు నొక ద్వారమును నిర్మించిరి.



మహాగుహ - రావణుడు కైలాసము నెత్తుట




మహాగుహ - అర్ధనారీశ్వర విగ్రహము

ఎలిఫెంటా గుహలు



మహాగుహ-త్రిమూర్తివిగ్రహము



మహాగుహ-శివపార్వతుల వివాహము

3

ఎలిఫెంటాగుహాలు

నవనాగరికత నొకవైపున తొల్లిటి మనపూర్వుల యౌన్నత్యము నొకవైపున నుంచి తూచి విమర్శింపవలె ననినచో బొంబాయి వెళ్లినవారట కెనిమిదిమైళ్ల దూరమున సముద్రమధ్యమున నున్న 'ఎలిఫెంటాగుహాలను' తప్పక చూడవలెను. ఇంకొకవైపున, సముద్రముననే యున్న 'కన్హేరీ' దీవులను కూడ నవశ్యముగ బరీక్షింపవలెను. 'అలెగ్జాండ్రియా రేవు'నుండి యొక మధ్యాహ్నము 'స్టీమరు' నెక్కినచో సముద్రతరంగములపై హాయిగ నుయ్యెలలూగుచు నాలుగుగడియలలో 'ఎలిఫెంటాదీవి' చేరవచ్చును.

ఈ ద్వీపముయొక్క నిజమైనపేరు 'ఘారపురి'. దక్షిణభాగమున నున్న కుగ్రామ మాఘారపురినుండియే -'గిరిపురి' అని వికృతి జెందియుండునని కొందఱి యభిప్రాయము. పోర్చుగీసువారి కీ ద్వీపమున నొక పెద్దరాతియేనుగు దొరకుటచే దీనికి 'ఎలిఫెంటా' యను పేరు కలిగినది. ఆయేనుగిపుడు బొంబాయి విక్టోరియాతోటయందున్నది.

గిరిపురియందు పురాతనమగు నొక బౌద్ధస్తూపమునకు జెందిన యస్థిభాగమును, ఇటుక గోడలును చరిత్రకారుల కంటబడగ, వారు వీనిని క్రీ. శ. 3 వ శతాబ్దపునాటివని నిర్ణయించిరి. ఈ ప్రదేశముననే బౌద్ధులనాటివి ఏడుకొండచెఱువులును కలవు. 'నారాయణపురాణమును', క్రీ. శ. ౫ శతాబ్దమునాటి యక్షరములతో లిఖింపబడిన శాసనమును ౫, ౬, శతాబ్దముల మధ్యకాలపువని యూహింపదగిన చరిత్రాత్మక విషయములను డాక్టరు ఫర్గుసనుగారిటు వ్రాసిరట. ఇక్కడ ముఖ్యమైన గొప్పగుహా రమారమి ౮ వ శతాబ్దపునాటిది అనగా ఎల్లోరా, యోగేశ్వరి గుహాలతో సమకాలికమని యనేక నిదర్శనములచే నిర్ణీతమైనది.

ఊరివారిగల ముదుసలుల నడిగినచో నత్యద్భుత శిల్పచాతుర్యముతో నిటు నీగుహాల నిర్మాణమును గూర్చి రెండుమూడుకథలు వినవచ్చును. మనదేశమున గల యనేకములైన ఇతర పురాతనస్థలములందు వలెనే యిచటను పూర్వము పాండవులు వసించినటులును, వారు రాత్రి ప్రారంభించి తెల్లవారుజామున కోడి కూయునంతలో నీవిచిత్రగుహాల నిర్మించినటులును కథగలదు. ఇంకొక స్థలపురాణమున బాణాసురుడు తన కొమారితయగు నుషా కన్యకకొఱకీగుహాల నిర్మించినటులును, అందామె యనేక సంవత్సరము లవివాహితయై యొంటరిగ నివసించినట్లును కలదు. వేఱొకకథ యీగుహాలను ఆలెగ్జాండరు (సెకందరు) నిర్మించినటులు దెల్పును.

చరిత్రకారుల పరిశోధనలవలన గిరిపురి ఆరవశతాబ్దాంతమున బశ్చిమసముద్రతీరమున బరిపాలించిన మౌర్యుల ముఖ్యపట్టణమై యుండెనని తెలియుచున్నది. మౌర్యుల తరువాత నది క్రమముగ చాళుక్య, రాష్ట్రకూట, యదువంశపురాజులకు వశమై తుదకు పదుమూడవ శతాబ్దాంతమునకు జనవిహీన మయ్యెను. మహమ్మదీయుల కాలమువఱకు (పదునైదవశతాబ్దము) నీ గుహాలందలి సుందరప్రతిమలు చెక్కుచెదరక యుండినటులను, క్రీ. శ. ౧౫౩౪ సం.న చక్కనిస్థితియందవి పోర్చుగీసువారికి దాన మొనర్పబడినటులను తెలియుచున్నది. ౧౫౩౯లో డామ్ జయోడికాస్ట్రో యనునత డీ గుహాలు అత్యద్భుతములై, మనుష్యమాత్రులకు సాధ్యముకాని యుత్తమశిల్పనైపుణ్యమున జిత్రింపబడెనని వర్ణించెను. కాని, క్రమక్రమముగ పోర్చుగీసుసైనికులు వీనిని నాశన మొనర్పజొచ్చిరి. వారందు దమపశువులను గట్టివేయుటయే కాక యిందుగల చిత్రప్రతిమల బాడుజేయ దొడగిరి. ౧౬౧౭ ప్రాంతమున నొకసైనికుడు 'ప్రతిధ్వనుల' గురించి పరిశోధనచేయుచు నీమహాగుహాలలోనికి ఫిరంగిగుండ్లు బారుచేసినటులును అందువలన కొన్ని రమ్యములైన ప్రతిమలును, కొన్ని యందమైన కంబములును తుత్తునియ లయ్యెననియు నాకాలపు చరిత్రకారు డొకడు వర్ణించెను. బ్రిటిషుపరిపాలనారంభము నుండి వీనినిగుఱించి శ్రద్ధకలిగి, యిప్పుడు డి. పి. డబ్ల్యువారి రక్షణయందుండుటవలన నీగుహాలు చాల చక్కగ భద్రపరుపబడినవి.

స్టీమరుదిగి యొక యరమైలుదూరము కొండ యెక్కినచో నుత్తరదిశనుండి (చూ. చిత్రము ౧.) మహాగుహాలోనికి ద్వారముగలదు. ఈద్వారము కాక తూర్పు పడమరలనుండికూడ గుహాలోనికి ప్రవేశముండుటవలననిది

చాల వెలుతురుకలిగి చక్కని మందిరమువలె గన్పట్టును. గుహలోనికి ప్రవేశించుచుండగ నిరుప్రక్కల గల రాతి గోడలమీద చక్కని శిల్పములు గలవు.

అందు, నెడమచేతివైపున "మహాయోగి" యగు శివుని తపంబును వర్ణించు శిల్పము, 'సతిని' గోల్పోయి యుగ్రతపం బొనర్చుచు బద్ధాసనమున నున్న శివుని బరివేష్టించు నగరాజులును, గంధర్వాప్సరసలును చిత్రముగ జిత్రింపబడియున్నారు. శివునికి గరుడారూఢుడైనవిష్ణు వొకవైపునను హంసవాహనుడైన బ్రహ్మ యొక దిక్కునను కాననగు. ఈశిల్పమందే యొకచక్కనికదళీవృక్షము కూడ గలదు.

ద్వారమునకు గుడివైపున 'తాండవమును'వర్ణించు శిల్పము కలదు. విచిత్రగతిని నాట్యమాడుచున్న నటరాజునకు దక్షిణభాగమున పార్వతియు, వామ భాగమున గణపతియు, నతనిచెంత గార్తికేయుడును, భృంగి మొదలగు పరిజనులును గలరు. ఆకసమున బ్రహ్మయు, విష్ణువును, ఇంద్రుడును తమతమ వాహనములపై నుండి యీనృత్యమును వీక్షించుచున్నారు.

గుహను ప్రవేశించినంతనే యిరువదియారు మహాస్తంభములు గల యామందిర మెంతయో నయనోల్లాసమును, హృదయానందమును గలుగజేయును. ఇందు బదిమాత్రము పురాతన స్తంభములు చెక్కుచెదరక యున్నవి. మిగిలినవి యప్పుడప్పు డొకకొంత మరమ్మతు నందినవే. ఈ స్తంభములు పదునైదు మొదలు పదునేడడుగుల యెత్తు గలిగి మనోహరముగ జిత్రింపబడియున్నవి. ఒకప్పు డీమహాగహాంతర్భాగము రమ్యవర్ణములతో నలంకరింపబడియుండెనని కొందఱి యభిప్రాయము.

ఇప్పటికిని పైకప్పున గొన్నిప్రదేశముల గొన్ని రంగుల జూడనగును.

ఈమందిరమునకు వాయవ్యభాగమున (Northwest) భైరవునివర్ణించు శిల్పము గలదు. భైరవవిగ్రహము కొంత భాగము శిథిలమైయున్నను, ఈ భయంకరాకారము చక్కగ గాననగును. ఈ శిల్పమున రాక్షససంహారము, పదునొకండడుగులయెత్తుననున్న భైరవవిగ్రహము నలంకరించు కపాలకంఠహారము, సర్పము, కిరీటము పైభాగమున నెలవంకయు చక్కగ స్ఫుటముగ జెక్కబడి యున్నవి. దక్షుని శిక్షించు సమయమున నీమూర్తి యాననమున గలిగిన భీకరాకృతి ప్రస్ఫుటముగ వ్యక్తీకరింపబడి యున్నది.

మందిరపు పడమటిభాగమున మధ్యస్థముగ తూర్పుముఖమై యున్నది గర్భాలయము. ఇందు నిరువదిమూడడుగులు చదురమును, ద్వారచతుష్కమునుగల ప్రదేశము నడుమ నొక శివలింగము ప్రతిష్ఠింపబడి యున్నది. ప్రతి ద్వారము చెంతను మహాకాయులగు ద్వారపాలకులు కావలియున్నారు. ప్రతిమహాశివరాత్రి పుణ్యకాలమున ననేకులు శివభక్తులీయాలయమున బూజ లొనరింతురు.

పై గర్భాలయపు వెనుకభాగమున గొన్నిమెట్లు దిగినచో నొకగుహయు, దీనిచెంతనే యిరువది యడుగుల పొడవు నలుబదియడుగుల వెడల్పుగల యొక సొరంగము కలదు. అందొక ప్రక్కనుండిలోనికి ప్రవహించు నూటవల్ల నీచిన్నిసొరంగము స్వచ్ఛజలపూరితమై జలాశయముగ నేర్పడును. ఈ యుదకమును యాత్రికులు గంగోదక సమానముగ బూజించుచు వీలుచొప్పున కొంతతీర్థమును తమ గృహములకుగూడ గొంపోదురు.

మరల మందిరమును ప్రవేశించినంతనే కుడివైపున నుమామహేశ్వరుల కల్యాణమును (చూ. చిత్రము౨.) వర్ణించుశిల్పము కలదు. శివునిదక్షిణపార్శ్వమున పార్వతియు, కూతురిని వివాహవేదికచెంతకు దోడ్కొనివచ్చు హిమవంతు డామెవెనుకయు, పార్వతికి కుడిభాగమున నామె జననియగు మేనకయు, వీరివెనుక నమృతకలశమును దెచ్చుచున్న చంద్రుడును చక్కగ జిత్రింపబడి యున్నారు. ఈశ్వరుని వామ భాగమున బురోహితుడగు బ్రహ్మయు, నతనివెనుక నొకచేత చక్రమునుధరించి రెండవచేత నుదకమును ధారవోయుచున్న విష్ణువునుకలరు. నింగిపైనుండి ఋషులును, దేవగణములును వివాహము నత్యుత్సాహముతో గాంచుచున్నారు. దురదృష్టవశమున నీశిల్పము చాలతావుల శిథిలమైనది, కాని పార్వతి యొక్క ప్రతిమ చాలసుందరమై, యుత్తమకన్యకామణికిం గానలసిన యంగసౌష్ఠవరేఖను రమ్యముగ సూచించుచున్నది.

ఇక ముఖ్యమైన శిల్పమును చూడవలెను. ఇదియే 'త్రిమూర్తి'(చూ. చిత్రము ౩) బ్రహ్మవిష్ణుమహేశ్వరు

లనొక మహాప్రతిమయం దిమిడ్చి చిత్రించిన శిల్పియొక్క చతురతయెంతయు సంస్తవనీయము. మధ్యనున్న యాకారము, పరమశాంతమును సూచించు బ్రహ్మ. ఈవిగ్రహపు పేరురమున వజ్రములతోను ముత్యములతోను గూర్పబడిన యాభరణములు చిత్రింపబడియున్నవి. కొందఱు ఋషీశ్వరులనువలె, నీవిగ్రహముయొక్క కర్ణరంధ్రములు నిడుపలై యున్నవి. వాటిలో నొకదానికి పులితలయు, రెండవదానికి మకరమును కర్ణాభరణములుగ నున్నవి.

ప్రాఙ్ముఖమై యున్నమూర్తి శివుడు. మోమున నొకవింత మందహాస మలంకరింప దక్షిణహస్తమున బట్టబడిన పడగవిప్పిన ఫణీంద్రు నవలోకించుచున్న యీ మూర్తి మూడవ కన్నుతో, కపాలమాలతో, సర్పములతో, బిల్వపత్రములతో చక్కగ గానవగను.

మూడవమూర్తి జగద్రక్షకుడగు విష్ణువు. ఈ ప్రతిమ ముఖాకృతి స్త్రీముఖమువలె నున్నది. ఒక చేత పద్మము కలదు శిరోభూషణ మనేక వజ్రాలచేరులతో నలంకరింపబడినది. విష్ణుమూర్తి ప్రతిమయొక్క ముఖము స్త్రీరూపమైయుండుట పలువురు చరిత్రకారుల తీవ్ర చర్చలకు కారణమైనది. అనేకు లనేకవిధములుగ వాదింతురు.

పైనుదాహరింపబడిన రమ్యశిల్పములుగాక నీమహాగుహాయందే 'గంగావతరణము' 'అర్ధనారీశ్వరుడు, (చూ. చిత్రము ౪.) 'పార్వతీపరమేశ్వరుల ప్రణయ కలహము, రావణుడు కైలాసగిరినెత్తుట (చూ. చిత్రము ౫.)—ఇవి యన్నియు నెంతయు విపులముగ బహుచమత్కారముగ చెక్కబడియున్నవి. ఈ మహాగుహకాక, చెంత నింకను నాలుగు చిన్నగుహ (చూ. చిత్రములు ౬, ౭.)లున్నవి. ఇందును అతినిపుణతతో బూర్వకాలపు శిల్పు లొనర్చిన యందమైన శిల్పములు కలవు. ఇవియన్నియు మనపూర్వులకు చిత్రకళయందును, శిల్పమందునుగల యసమాన కౌశలమును వేయినోళ చాటుచున్నవి.

౪

బరోడా

వర్తకచక్రవర్తుల రాజధానియైన బొంబాయినివీడి యొక్క రాత్రిప్రయాణమున స్వతంత్ర సంస్థానములలో మిగుల వాసికెక్కిన బరోడాను జేరితిమి. హూణభాషా సంపర్కముచే వికృతరూపముల దాల్చిన పురనామములలో 'బరోడా' యొకటి. రాజమార్గమున కిరువలంకుల బారులు తీర్చి యలంకారముగ నుండి పైన కొమ్మ లొకదానితో నొకటి కలిసికొని పెనవైచుకొని పోవుటచేత మార్గమునంతయు నొక రమ్యనికుంజముగ నొనర్చిన వటవృక్షములపంక్తు లమితముగ నుండుటవలన నీపురము తొలుదొల్త 'వటోదర' యను నామమున బరగుచుండెను. క్రమముగ నియ్యది "వడోదర" యయ్యెను. ఇప్పటికిని గుజరాతీయు లీసంస్థానమును 'వడోదర' యనియే పిలుతురు. కాని, పూర్వపు పాశ్చాత్యవర్తకులు, చరిత్రకారులు, ప్రయాణీకులు "బ్రడోరా" యని వాడుచుండిరి. 'బ్రడోరా' యిప్పటికి క్రమముగ 'బరోడా' యైనది!

ఇదిగాక, యీపురమున కింకను రెండుపేళ్లుండెనని తెలియుచున్నది. పదునేడవశతాబ్దమున విలసిల్లిన ప్రేమానందుడను గుజరాతీకవీశ్వరుని వ్రాతలమూలమున నీపురము 'వీరక్షేత్ర' మనియు, 'వీరవతి' యనియు, 'వటోదర' యనియుగూడ వ్యవహరింపబడుచుండె నని స్పష్టమగుచున్నది. మరియు నింతకుపూర్వ మీనగరము జైనులయొద్దనుండి దీనిని వశపరచుకొనిన రాజపుత్రవీరుడగు రాజచందను వానిపేర 'చందనవతి' యనబరగుచుండెననియు తెలియుచున్నది. ఏవిధమునైన నేమి, యాపేళ్లన్నియు మాయమై యిప్పటి 'బరోడా' యను సులభపదము వాడుకలోనికి దిగినది.

రైలు దిగినంతటనే మనకు గోచరమగునది సంతోషాశ్చర్యములను కలుగజేయు నిచ్చటి సంపూర్ణ భారతీయత్వము. అందఱు తమదేశపు దుస్తులనే ధరింతురు. ప్రతిమనుజుడును తనభాష యగు గుజరాతీ లేక ఉత్తరహిందూస్థానమున రాజభాషయైన హిందీ. వీటిని మాత్రమే మాట్లాడును. రెండునిమిషము లీ జనసమూహమున మసలినంతనే యియ్యది "హిందూరాజ్యము సుమా!" యని యప్రయత్నపూర్వకముగ స్ఫురించును. మరెక్కడను దొరకని మిక్కిలి చక్కని గుఱ్ఱపుబండ్లు బరోడా యందు దొరకును. బండ్లుకూర్చుండుటకు చాల సౌకర్యముగ నుండుటయేకాక చక్కని యాకృతిని కలిగి రమ్యముగ నలంకరింపబడి యుండును. బండితోలు నతడు

తెల్లని పైజామాయును, పలుచనికుడితినీపైని సొట్టి చొక్కాయిధరించి, రంగు పాగాతో పెద్దమనుష్యుని వలె గన్పట్టును. ఈయూరిలో సామాన్యదుస్తు లియ్యవియే. ఈ యందమైన శకటములనెక్కి పురమునంతయు మూడు గంటలలో చూచిరావచ్చును.


విశాలమై, పరిశుభ్రమై, యిరువంకల తరుపంక్తులచే నలంకృతమైన రాజమార్గమున బురప్రవేశ మొనరించినంతనే మనకు గనబడునవి సరస్వతీనిలయములే. మహారాజావారికి ప్రియతమమగు విద్యాభివృద్ధికి తోడ్పడు నీయున్నతపాఠశాలయు, కళాశాలయు చక్కని భవనములలో నున్నవి. వీనిని నిర్మించుట కారులక్షల రూప్యములయ్యెనట! ఈప్రదేశముననే విద్యార్థుల వసతిగృహములును, వ్యాయామప్రదేశములును, కలవు. చెంతనే యొక 'బొటానికల్ గార్డను' అనగా, నానావిధ తరులతాదులతో విలసిల్లుచు ముఖ్యముగ వృక్షశాస్త్రము నభ్యసించు విద్యార్థుల కత్యంతోపయుక్తమగు నొకరమ్యమైన తోట యున్నది.


కళాశాలకు గొంచెముదూరముననే మహారాజావారు పిన్న వయసు నుండగనే,జనులసౌకర్యార్థమై నిర్మించిన యందమైన యుద్యానవనమును, అందు వివిధజంతుసమూహములను మాడనగును. ఈ తోటయందే పేరొందిన బరోడావస్తుప్రదర్శనాలయమును, చిత్రకళామందిరమును గలవు. 'మ్యూజియము' నందు భూగోళ, భూగర్భశాస్త్రములకును, వృక్షశాస్త్ర, జంతుశాస్త్రములకును, నానావిధమానవసంఘముల వర్ణించు శాస్త్రమునకును సంబంధించిన యనేకవస్తువులు గలవు. ఇవిగాక, చాలముఖ్యముగ గమనింపదగినవి గాయకవారుచే సమకూర్పబడిన వివిధగానపరికరములు. మనదేశమునను, ఇతరదేశములందును గల యనేకవిధములగు గానవాద్యము లధికమగుశ్రద్ధతో పదిలపరుపబడి యున్నవి. వింతైన పన్యమును చాటు అందమైన దంతపుపను లనేకము లున్నవి. మరియు, సుప్రసిద్ధమగు 'వెడ్జివుడ్ పాటరి' (Wedgewood pottry) అను మృణ్మయపాత్రల సమూహమును చూచి యానందింపవలెను. సుందరమగు నాకారమున రమ్యమగు వర్ణమున విచిత్రమగు చిత్తరువుల దాల్చిన యీ మృణ్మయపాత్రలు తొలుదొల్త వట్టి చేతులతో అనల్పకౌశల్యమున రచియింపబడియుండెను. ఇటీవల వీనిని తయారుచేయుటలో యంత్రముల నుపయోగించుచున్నారు.

చదువురానివారికి ఇక్కడగల ప్రతివిషయము తేటతెల్లముగ దెలుప నొకసంస్థానపు టుద్యోగి నియమింపబడియున్నాడు. మరియు, విద్యార్థులు తమగురువులతో నిచటగలవస్తువులగూర్చి ప్రత్యేకముగ సావకాశముగ పఠించుటకై యేర్పాటు లొనర్పబడియున్నవి. ఇవిగాక జనసామాన్యమునకు సులభముగ దోచు రీతిని వివిధశాస్త్రవిషయములగూర్చి మ్యాజిక్ లాంతరు సాయమున నుపన్యాసము లీయబడుచున్నవి. ఇట్టి మ్యూజియములు జనులకెంత విజ్ఞానప్రదములో వేరుగ జెప్పవలెనా? ఈ విషయములందు బరోడా యితరసంస్థానము లకంటె వేయిరెట్లధికముగ నభివృద్ధిచెందినట్లు తెలియకమానదు.


లలితకళా ప్రదర్శనాలయమున జగత్ప్రసిద్ధులైన పాశ్చాత్యచిత్రకారుల చిత్తరువుల నమూనాలు కొన్ని యున్నవి. ఇవియన్నియు నాహ్లాదకరములై, వారి యుత్తమకళానైపుణ్యమును వేయినోళ్ల జాటుచున్నవి. ఇవిగాక, భారతదేశమున వర్ధిలిన వివిధసాంప్రదాయములకళాభివృద్ధిని దెలుపు పురాతనములైన యమూల్యములగు చిత్తరువు లనేకము లున్నవి.

ఈపురజనుల విలాసపుతోటను వీడి, విశ్వామిత్ర నదిని దాటినంతనే కొన్ని యుత్తమ వైద్యశాలలు కనబడును. వాటిని జూచుచు మహారాజావారు తమ ప్రజల యారోగ్యవిషయమున జేయు సత్ప్రయత్నముల ప్రశంసించుకొనుచు నరిగినంతనే సంస్థానపు రాజకీయభవనముల గననగు. పిదప 'సూర్ సాగర్' అను నొక తటాకము కలదు. చీకటి పడినపిదప, నలువంకల నలంకరించు దీపపంక్తుల దనలో ప్రతిఫలింపజేయు నీవిశాల జలాశయమంతయు గన్నులపండువుగ నుండును. దీని చెంతనే న్యాయస్థానభవనము లున్నవి. మహారాజావారి పరిపాలనక్రింద గ్రామపంచాయితీలు చాల చక్కగా పనిచేయుచున్నను, కోర్టునకుపోవుట చాల వ్యయకారణమైనను, ఈప్రధాన న్యాయస్థానములకు నిరంతర మమితమగు పని కలుగుచున్నది.


చిన్నగుడి
పడమటి వసారా



౨, ౩, ౪, నెంబరుల గుహలు



అయిదవ గుహ (ఎలిఫెంటాకు చేరువనున్న పర్వతములపై నున్నది.)

నిన్న మొన్నటివరకు బరోడా పురవాసులు తమ నివాసముల నొక వింతరీతి నేర్పరచుకొని యుండిరి. ప్రతి కులమువారును ప్రత్యేకప్రత్యేక సంఘములుగా వసించుచుండిరి. వీనికి నాలుగుదిశల గోడలుండి, పెద్దపెద్దకొయ్య తలుపు లుండెడివి. ఈ యేర్పాటువలన ప్రతి కులము వారును సమిష్టిగ వసించుచు తమతమ కులకృత్యముల నధిక శ్రద్ధతో నిర్వహించుకొనుచుండిరి. ఆధునిక నాగరికత వలన నీ యేర్పాటులన్నియు నాశనమై పోయినవి.

పురమధ్యమున 'నాజర్ భాగ్' అను రాజమందిర మున్నది. ఇది యంతటి శిల్పచాతుర్యమును జూపకున్నను ఇందు బరోడా సంస్థానపు టమూల్యాభరణము లుండుట వలన నీభవనమునకు చాల ప్రముఖత గలదు. ఇందు ఎనిమిదిలక్షల విలువగల ఆరుముత్యములును, ఏబది మూడు లక్షల వెలగల గొప్ప ముత్యాలహారమును ఉన్నవి. ఈ హారము చేయుటకు కొన్ని సంవత్సరములు పట్టెనట. ఇవి పూర్వపు వెలలు. ఇప్పుడు వీటివిలువ యెన్నిరె ట్లధికమై యుండునో! ఈ భవనమున రత్నములతోను వైఢూర్యములతోను కూర్చబడిన రత్నకంబళ ముండెడి నట. మరియు, మహారాజావారి గొప్పవజ్రహారముకూడ కలదు. ఇందే స్టార్ ఆఫ్ ఇండియా అను అమూల్యవజ్రమున్నది. ఇయ్యది నెపోలియను దని చెప్పుదురు.

నాజర్ భాగ్ చెంతనే ప్రసిద్ధి చెందిన బరోడా పుస్తకభాండాగార మున్నది. భాండాగారోద్యమమున నాంధ్రదేశమునకు మార్గదర్శకమైన బరోడా మనకు చిర పరిచితమే. ఇందుగల గ్రంథసంఖ్య రెండులక్షలకు మించి యుండును. భవనమున నొక భాగమున స్త్రీలకును, బాలబాలికలకును ప్రత్యేకముగు పఠనాలయమున్నది. ఇది యెంతయు చక్కగ నున్నది. సులభములయ్యు మిగుల జ్ఞానదాయకములై పిన్నవయసువారు పఠింపదగిన పుస్తకము లనేకములిందున్నవి. కుట్టుపని, 'కిండర్ గార్టను', చిత్రలేఖనము మొదలగు అంశములు బహుచమత్కారముగ చూపింపబడి యున్నవి. ఇట్టి పఠనాలయము మరియొకటి మనదేశమున లేదని చెప్పవచ్చును. ఇదియంతయు విద్యావతియగు నొక నారీమణి యధీనమున నుండుట మరియు ప్రశంసనీయము కదా!

పురమునకు నాలుగైదుమైళ్లదూరమున 'మకరపుర' మను రాజభవన మున్నది. ఇది తొలుదొల్త ఖాండేరావుచే నిర్మింపబడినది. అతడు తనయంత్యదశలో సతి యగు జమునాబాయితో నిటవసించెను. ఈయన యనంతరము వీరిసోదరుడగు మలహరరావును బ్రిటిషువారు రాజపదచ్యుతుని చేయగా జమునాబాయి ప్రస్తుతగాయక వారును దత్తపుత్రుని జేసికొనెను. వీరీభవనమునం దనేక మార్పులు చేసి దానిని బహురమ్యముగ నొనరించి యున్నారు. పుష్పితరసాలవృక్షము లిరువంకల నలంకరింప సుందరమై, ప్రయాణమున కింతేయు ననుకూలమగు రాజమార్గమున నీభవనమును జేరెదము. సుందరములగు నుపవనములను, రమ్యములగు నారామప్రదేశములను కలిగి, నిరంతరము సూర్యరశ్మి యందు తళతళలాడు నీటిని పై కెగజిమ్ము నీటిబుగ్గలతో అందమొలుకు నట్లు నిర్మింపబడిన రాతిగుహలతో, పొదరిండ్లతో యోజనము పరిమితిగల ప్రదేశము నాక్రమించు నీభవనము మహారాజునకు రాజ్యతంత్రపు తొందరలనుండి అప్పుడప్పుడు ఒకింతవిశ్రాంతిని కలిగించుచుండును.

మకరపురముకంటె నగరమందున్న 'లక్ష్మీవిలాసము' మరింత విలాసవంతమైనదని చెప్పవలెను. ఇందు మహారాజావారును, వారిసతీమణియు వసింతురు. హిందూ మహమ్మదీయశిల్పపద్ధతులను రెంటిని మేళవించి యిరువదిలక్షల రూప్యములు వ్యయముచేసి యనేకములగు మంటపములను గోపురములను విలసిల్లు నీరాచనగరును నిర్మించిరి. తెల్లరాతితోను, చలువపలుకలతోను నిర్మితమై, అందమైన నగిషీపనితో నొప్పారు సింహద్వారమార్గమున లోపలప్రవేశించి, విశాలమగు వసారాయందు కొంతదవ్వరిగినచో ఉన్నతమై, నయనానందకరమై యొప్పు దర్బారుభవనమునుజేరెదము. లోని కరిగినంతనే యామందిరపు సౌందర్యము మనకన్నులు మిరుమిట్లు గొలుపకమానదు. మందిరముయొక్క పైభాగము విచిత్రచిత్రములతో నలంకృతమై యున్నది. చలువరాతినేలయు 'మెసెయిక్' అనుతీరున చిత్రితమైయున్నది. ఇరువంకల నున్నకుడ్యములనాని, "బాల్కనీ"లను వసారా లున్నవి. అతిచతురమైన నగిషీపని కలిగి విరివిగ బంగారముతో దనుకొత్తు కొయ్యతెరలు గలిగిన యీ

'బాల్కనీల' నుండి జనానాస్త్రీలు దర్బారు నవలోకింతురు. మహారాజావారి యందమగు సింహాసనము వెనుకనున్న యున్నతగవాక్షములందలి వింతరంగులమయ సుందరపు చిత్తరవులుగల యద్దములనుండి సూర్యరశ్మి యీ భవనములోనికి వివిధవర్ణములతో ప్రసరించును.

చలువరాతి సోపానపంక్తులచెంతనున్న గోడలపై ప్రసిద్ధికెక్కిన యిటాలియనుచిత్రకారులు, శిల్పులు రచించిన చిత్తరువులును, ప్రతిమలును చూచి యానందింప వలసినవి. ఇవిగాక లక్ష్మీవిలాసమందు కొన్ని రవివర్మ లిఖించిన పటములుకూడ కలవు.

సౌధము మొదటియంతస్థున మహారాజావారి పఠనాలయమును, ఉద్యోగస్థులను అతిథులను సత్కరించు మందిరమును, శ్రీవారి భోజనమజ్జనాదుల కేర్పడిన ప్రత్యేకభవనములును గలవు. వీని వెనుకనే మహారాణీవారి రాణివాసమున్నది. మొదటి యంతస్థున అతిథుల సత్కరించు మందిరమును, సంపూర్ణముగ హిందూవిధానమున నమర్పబడిన భోజనాలయమును కలవు. వీరి యంతఃపురమును జేరు సోపానపంక్తులుకూడ నిరుపంకల నత్యధికమగు కళాపరిజ్ఞానమునుచాటు వింతచిత్రములతో విలసిల్లుచున్నవి.


లక్ష్మీవిలాసమును విడిచిన కళాభవనమును చేరెదము. విద్యార్థులకు వివిధకళలను, నానావిధ పరిశ్రమలను నేర్పి మున్ముందు తమదేశపరిశ్రమాదుల నుద్ధరింప నాయత్తపరచు నీ కళాభవనము మన ఆంధ్రజాతీయకళాశాలకంటె నెక్కుడు రాజసన్మానమును పొందుచుండుటవలన మిక్కిలి యభివృద్ధిలోనున్నది. ఇందు బాలురును, యువకులును, తమతమ యీడుకు దగిన తరగతుల విద్య నభ్యసించుచు చిత్రలేఖనము, ఫొటోగ్రఫీ, దంతపుపని, కమ్మరపని, నేతపరిశ్రమలు, కలంకారీయద్దకము, సబ్బుచేయుట మొదలగు విషయముల నేర్చికొందురు. ఇట విద్యయంతయు మాతృభాషయందే గఱపుచున్నారు. బరోడారాష్ట్రమున కీర్తివహించిన కే. గజ్జారుగారి నిరంతరకృషిచే రసాయన భౌతికశాస్త్రములగురించి సులభశైలిని మాతృభాషయందు పుస్తకములు రచింపబడి యున్నవి.

విద్యావ్యాప్తి విషయమున బరోడా భారతదేశమున నగ్రస్థానము నవలీలగ నలంకరించును. మహారాజావారు రాజ్యాభిషిక్తు లగుసరికి విద్యాగంధ మెరిగినవారిసంఖ్య చాలతక్కువగ నుండెను. ఇప్పుడన్నచో ప్రతిగ్రామమున నొకబడియు, పట్టణమున నాలుగైదు పాఠశాలలును, రాజధానియందు బహుచక్కని కళాశాలలును విలసిల్లుచున్నవి. స్త్రీవిద్యయు తక్కువకాని యభివృద్ధిని తెలుపుచున్నది. ౧౮౯౧-వ సం. పాఠశాలలందున్న స్త్రీలసంఖ్య ఆరువేలకు లోపుగ నుండెను. ౧౯౦౫-వ సం. నీసంఖ్య పండ్రెండువేలకు మించియుండెను. కడచిన యిరువది సంవత్సరములలో నీసంఖ్య ద్విగుణమైనదట! హిందూదేశమున నిర్బంధ ప్రాథమికవిద్యావిధానము (Compulsary Elementary Education) ప్రప్రథమున నమలులోనికి దెచ్చినది బరోడాయనుట లోకవిదితమే. నానాదేశసంచారముచే మితిలేని యనుభవమును గడించిన మహారాజావారు స్వయముగ నీపద్ధతిని తొలుదొల్త 'నమ్రేలీ'యందు స్థాపించిరి. మిగిలినచోట్ల నీ యుద్యమము కొనసాగుట కష్టసాధ్యమని బాగుగ నెరిగియే గాయకవారు మొదట నావిధానము నక్కడ ప్రారంభించిరి. ఇట లభించిన యనుభవము నూతగా గొని, రాజ్యమం దితరస్థలములం దీపద్ధతిని సులభముగ సాగించియున్నారు. ఇంతటి ధైర్యముతో బూనుకొనినయత్నము సఫలము కాకపోవునా?

బరోడా గాయకవారుగారి దివ్యనామము భారతదేశాభ్యుదయ చరిత్రయందు సువర్ణాక్షరములతో లిఖింపదగినది. వీరు తమ ప్రజల యభివృద్ధికై సలుపుచున్న యత్నముల నింక నేరాజులైన సలుపుచున్నారా యని సంశయింపవలసియున్నది. వీరి పరిపాలనక్రింద రాజ్యపరిశ్రమ లత్యద్భుతముగ నభివృద్ధి జెందియున్నవి. పాడిపంటలయభివృద్ధికై పయవ్యవసాయశాస్త్రజ్ఞులను, పరిశోధకులను నియమించి వీరుకృషీవలుల కెంతయు సాయమొనర్చుచున్నారు. ఉత్తమమగు విద్యావిధానమును శాశ్వతముగ స్థాపించియున్నారు. ఇంతియకాక దేశమునందు ప్రబలియున్న దురాచారముల నణగద్రొక్క శక్తివంచనలేక ప్రయత్నించుచున్నారు. వీరుపాలనమున కుపక్రమించిన పిదప నతిబాల్యవివాహములు క్రమముగ నరుదగుచున్నవి.

ఇది వీరుచేసిన యొక చట్టమువలననే! ఈచట్టమువలన నతి బాల్యవివాహముల చేయసమకట్టు ప్రతివారికి జరిమానా విధింపబడును. అంత్యజుల విషయమై గాయకవారు చూపుచున్న శ్రద్ధ మిక్కిలి శ్లాఘాపాత్రము. వారి పురోభివృద్ధికై ప్రత్యేకపాఠశాలలను నిర్మించి బరోడా నగరమున నొక యంత్యజాశ్రమమును స్థాపించిరి. పురమున నెక్కడచూచినను మహారాజావారి సత్పరిపాలనమునకు తార్కాణములు కనబడుచునే యుండును. ఇట నొకనూతన భవనము మహారాజావారిచే నిర్మింపబడినది. అచ్చో "శ్రీవారి యాజ్ఞపై నీరాజమార్గము విశాల పరుపబడి యున్నది;" మరియు నొకచోట "యీ పరిశ్రమను మహారాజావారింగ్లాండునుండి వచ్చినంతనే స్థాపించిరి," ఇంకొకతావున "యీవిషయమున శ్రీవారు స్వయముగ శ్రద్ధదీసికొనుచున్నారు;" అను వర్ణనలు వినక తప్పదు. ప్రజల ప్రేమ విశ్వాసములకు పాత్రులు కావలయునన్న పరిపాలకు లిటుల నేకదా వర్తింపవలెను!

చిత్రము ౧ ఎలిఫెంటా గుహలు



మహాగుహాద్వారము

సశేషము

పూజాపాత్ర

పెనుమర్తి వెంకటరత్నము గారు (యువకవిమండలి)

నీవాత్సల్యసుధాస్రవంతికలు రానేవచ్చె! దోయినిన్నుగాం
భోవైదగ్ధ్యపవిత్రవాహినులప్రాపుం జేరి మచ్చెచ్ఛెవ
శ్రీవిద్యాపరమూర్తి! నీచరణరాజీవాంతరాళిందభూ
మీవేదిం బడి పుల్కరించితిని గ్రమ్మెన్ స్వఃపురీభోగముల్ !

ఈదైనందినతాపసంగ్లపితమౌ హృద్వృత్తి నీమ్రోల గ్రీ
ష్మాదితోగ్రప్రనిపాతవల్లరికి సాయంకాలవర్షాంబుద
స్వాదుస్వచ్ఛపయస్సునన్ బలె వికాసంబుల్ ఘటించెన్ భవ
న్మాధుర్యస్మితచంద్రికల్ హృదయగానంబును వాసించెబో !

ఎన్నోజన్మలనుండి నీపదరజోమృల్లేశసంపాదనా
ఖిన్నుండన్ భవదద్భుతప్రణయసంగీతామృతాకాంక్షినై
ఎన్నోవిద్యలఁ గ్రోలితిన్ దిశల నెందే నాకభూభృద్దరీ
వన్యానావనసంచరిష్ణుఁడను భావంబెల్ల శుష్కించినన్ !

ఈనైదాఘవిపద్దగ్ధులకు నీయీషత్కృపాంభోదవ
ర్షానైర్మల్యము లావహించినను గారామారఁ జోషించెఁ ద
ల్లీ! నీప్రేమమృదుస్మితంబులకు స్ఫారీభూతసాధాకకే
శ్రీనైశ్చల్యము లర్థభాసితములై చెల్వొందె ప్రీడాహతిన్.

ఆకాశంబున భూమిరంగమునఁ బ్రోద్యద్దివ్యవారాంనిధిన్
నాకష్టంబులు వాపి సౌఖ్యమిడునే నాథుం డెవండేని యం
చేకాకిన్ భ్రమియించితిన్ హృదయవాహిన్యంతరాళత్వదీ
యాకారంబున నాకుఁ దోఁచె నమృతవ్యాహార మాధుర్యముల్ !

తెల్లంగలభట్టగ్రామము

చిలుకూరి వీరభద్రరావు గారు

మహామహోపాధ్యాయ హరప్రసాద శాస్త్రి యను బంగాళీబ్రాహ్మణులొకరు 'ది జర్నల్ ఆఫ్ ది బేహార్ అండ్ ఒరిస్సా రీసర్చి సొసైటి' అను పత్రికయొక్క 1918 వ సంవత్సరము జూను నెల సంచికలో మనోరంజకమైన యొక శాసనమును బ్రకటించియున్నారు. అయ్యది తెలుఁగువారికి ముఖ్యమైనది. ఆశాసనము సల్కి వంశములోని రణస్తంభదేవుని దానశాసనమై యున్నది. వంగదేశములో రాఢామండలములోని 'తెల్లంగలభట్టగ్రామ' నివాసియును, శుక్లయజుర్వేద కాణ్వశాఖయుఁడును, కాశ్యపగోత్రియుఁడును నగు వాఘుని మనుమఁడును, హరిపుత్త్రుఁడునునైన పోచుకుఁడను బ్రాహ్మణునకు పైరాఢామండలములోని బారాసీమలోని జారాగ్రామమును సల్కివంశములోనివాఁడయిన రణస్తంభదేవుఁడు దానముచేసి తన యితర దానశాసనములవలెనే కోడాలకపట్టణమునుండి యీదానశాసనమును బ్రకటింపించియున్నవాఁడు. మహోపాధ్యాయులు కోడాలకపట్టణమును గుర్తింప లేకపోయిరి. వంగదేశములోని రాఢామండలములో తెల్లంగలభట్టగ్రామము పేర్కొనఁబడుటయు, సల్కివంశీయుఁడయిన రణస్తంభదేవుఁ డచటఁ బరిపాలనము సేయుటయు మాత్రము వారికాశ్చర్యమును గలిగించెను. మిథునపుర మండలములో మధ్యమతరగతివ్యవసాయకులును, పలుకుఁబడిగలవారునునైన 'శుక్లీ' అను నొక తెగవారు గలరనియు, వారి మొదటివాసస్థానము 'కేదాలక'మని చెప్పుకొనుచున్నారని వచించి సల్కిశబ్దమునకును, శుక్లీశబ్దమునకును, కోడాలక శబ్దమునకును, కేదాలక శబ్దమునకును నేదయిన సంబంధ ముండఁగలదా! యని ప్రశ్నించుచున్నారు.

ఆఱునూఱందల సంవత్సరముల కాలము పర్యంత మాంధ్రదేశమును బరిపాలించిన చాళుక్యరాజవంశము సల్కివంశమని పెక్కులు తెలుఁగు కన్నడశాసనములనుబట్టి మనమెఱిఁగియున్నాము. ఈ సల్కివంశమునకు నాసల్కివంశమునకు భేదము గన్పట్టుచున్నది. ఆంధ్రదేశములోని వారిముద్రికపై వరాహలాంఛనము గన్పట్టుచుండఁగా బంగాళములోనివారి ముద్రికపై వృషభలాంఛనము గన్పట్టుచున్నది. అయినను చాళుక్యులకుఁ బూర్వ మాంధ్రదేశములోని వేంగినాడును బరిపాలించినవారిలో శాలంకాయనులది మాత్రము వృషభలాంఛనమే. మఱియు వారిముద్రికపైనుండు చంద్రరేఖయు, మనవారిముద్రిక

పైనుండు చంద్రరేఖయు నొకకేతువు నున్నవి. ఈశాసనములో నుదాహరింపఁబడిన దానప్రతిగ్రహీత కాశ్యపగోత్రీయుఁడయిన రాఢీయబ్రాహ్మణుఁడుగాఁడనియు, రాఢీయబ్రాహ్మణులు వీనివలె శుక్లయజుర్వేదులు కాక సామవేదులయి యున్నారనియు, పదునైదు గ్రామములలోనున్న కాశ్యపగోత్రీయులయిన రాఢీయులలో నెవ్వరిగ్రామమును 'తెల్లంగలభట్టగ్రామము' గాదనియు మహామహోపాధ్యాయ హరప్రసాద శాస్త్రిగారు వ్రాయుచున్నారు. రణస్తంభదేవుని శాసనకాలము దెలియరాదు. శాసన లిపిని బట్టి పదవ శతాబ్దము నాఁటివాఁడని కొందఱు పరిశోధకులు తలంచుచున్నారు. గాని స్పష్టముగా వచించుటకు నాధారమేమియుఁ గానరాలేదు. 'జారా' గ్రామమునకు హద్దు లీవిధముగాఁ దెలుపఁబడినవి. 'జారా' గ్రామమునకు నాగ్నేయమూలను చాకలికభూమియు, స్తంభకారక్షేత్రము తూర్పునను, పడమట 'జారా' గ్రామమును, ఆహారాగ్రామ ముత్తరమునను, దక్షిణమున సింతాభూమియుఁ గలవు.

ఈశాసనము పఠించి చదివిన మహామహోపాధ్యాయులవారు 'తెల్లంగులభట్టగ్రామము'లోని మొదటియక్షరమగు 'తె' అయినట్లు ఇంగ్లీషునవ్రాసి దేవనాగర లిపిలో శాసనమును వ్రాయుచు, నందు 'తె'కు బదులు 'తి' పెట్టి 'తిల్లంగులభట్టగ్రామ' అని వ్రాసిరి. అండజవంశ ప్రభువుల మనియు, కాశ్యప గోత్రులమనియుఁ జెప్పుకొనిన భంజవంశపు రాజుల శాసనములలో 'తలాయి' మండలముదాహరింపఁబడినది. ఈ శాఖకు సంబంధించిన ఉదయవరాహుని శాసనములో 'తనది మయూరవంశ' మనియు, తనతాత 'ఉదితవరాహు' డనియు, తనతండ్రి 'తేజోవరాహుఁ' డనియుఁ జెప్పుకొన్న శాసనములో నుదయవరాహుఁడు తనపూర్వులు వాసిష్ఠునకు నివాసభూమియగు చిత్రకూటపర్వతములనుండి 'తలాయి' మండలమునకువచ్చి నివాస మేర్పఱచుకొని రని చెప్పుకొనియున్నాఁడు. ఈశాసనము సంస్కృతభాషలోనున్నది. తలాయిమండలములో కోకిలసీమలో 'కొడాసమా' గ్రామము నొక బ్రాహ్మణునకు దానము చేసినట్లున్నది (J B O R S. Vol VI, pt. II) ఇంతవఱకు నీప్రదేశము లెచ్చటివో తెలుపఁబడియుండలేదు. వీనినిబట్టి తల్లెమండల మనునదొకటి ప్రాచీనకాలమున నుండెనని తేటపడుచున్నది. ఈ తల్లెమండలము కళింగదేశములోనో, లేక కళింగదేశము యొక్క సరిహద్దుననో యుండియుండక తప్పదు. ఈతల్లెమండలమునుండియె తల్లెంగులు క్రీ. శ. ౨ వ శతాబ్దములో బర్మాదేశమునకుఁ బోయి తల్లెంగురాజ్యమును స్థాపించి యుండవలయును. తల్లెరాష్ట్రమునుండి తల్లంగుల భట్టులు రాఢామండలమునకుఁ బోయి వసతులు గుదుర్చుకొనిరేమో విచారింపవలసియున్నది. రాఢీయ బ్రాహ్మణులలోఁ గాశ్యపగోత్రీయులు సామవేదు లగుటచేతను, తెల్లంగులభట్టగ్రామములోని దానప్రతిగ్రహీత యగు

కాశ్యప గోత్రీయబ్రాహ్మణుఁడు శుక్ల యజుర్వేద కాణ్వశాఖీయుఁ డగుటచేతను రాఢీయ బ్రాహ్మణులకు తెల్లంగులభట్టులకు సంబంధము లేదని మహామహోపాధ్యాయులవారు సూచించిరి. ఇంతమాత్రముచేత తెల్లంగలభట్ట గ్రామములోని బ్రాహ్మణు లెల్లరును రాఢీయ బ్రాహ్మణులుగారని తలంపనగునా? ఆగ్రామములోని భట్టబ్రాహ్మణులెల్లరును శుక్లయజుర్వేద కాణ్వశాఖీయు లనియె చెప్పదగునా? శృంగభృత్యులయిన కాణ్వాయన బ్రాహ్మణ సామ్రాజ్యమును దుదముట్టించి మగధసామ్రాజ్యము నాక్రమించి దక్షిణాపథము నవక్రపరాక్రమముతో నేలిన యాంధ్రభృత్యులును, శాతవాహనవంశీయులును, శాతకర్ణి బిరుదాంచితులయిన బ్రాహ్మణులను బంగాళీ బ్రాహ్మణు లని నుడువసాహసించిన ఈమహామహోపాధ్యాయులవారు రాఢామండల వాస్తవ్యులును, తెల్లంగలభట్టగ్రామనివాసులు నగు బ్రాహ్మణులను రాఢీయబ్రాహ్మణులని చెప్పుటకు నేల వెనుకాడవలసి వచ్చినదో తెలియరాకున్నది. వీనింగూర్చి మఱియొకమాఱు సవిస్తరముగా వివరింతును.


కాకవీ!

వైఖరి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు

శ్రీనాథు రమ్యవాక్ శ్రీనాథుఁ గొల్వక, సోము ధూర్జటి భీము స్తుతి సలుపక
అమలవిజ్ఞానామృతాంభోధిఁ గ్రుంకక, ధరణి దేవాదిసత్కరుణఁ గనక
ఛందస్స్వరూపంబు చక్కఁగా నెఱుఁగక, వ్యాకృతిజ్ఞాన మావంత లేక
లోకానుభవ మహాలోకమ్ము నొందక, వృద్ధుల సేవించి బుద్ధిఁ గనక
వాఙ్మనశ్శుద్ధి నడయక పరుమహాని, జనులకైన నగమ్యమై చను కవిత్వ
చోరవిధమునఁ జొరఁ గావ్యచోర! యేల, వ్యర్థయతనంబు సల్పెదు వలదువలదు
దేవతాపావనాలయ దివ్యభూమి.

గీ. పొల్లుమాటల చేఁపలబుట్టమాడ్కి, కైత మల్లిన లోకంబు కసరి నగదె
కాకవీ! యేల కుందెదు కాకమవయి, కోకిలాలాపమధురిమఁ గోరఁదగునె.

గీ. వ్యాకరణదోషములు లేక వచనమేని, వ్రాయఁజాలవు కాకవీ! పద్యములను
చెప్పనేర్తువె? చాలు నీ గొప్పమెత్తు, "ఉట్టి కెక్కలేనిది స్వర్గ మెట్టులెక్కు?"



(చిత్తసంశుద్ధి)

శ్రీమాన్ ముడుంబై శ్రీనివాసాచార్యులుగారు

౧

నాకు పండుగు లనిన చాలా సరదా. కేవలము పిండివంట లారగించి క్రొత్తబట్టలు కట్టుకొని షికార్లు చేయవచ్చుననియే కాదు. ఆయా పండువు లేర్పఱచిన మన పెద్దల కోర్కెలు ఫలించేలాగు నడుచుకొందమనియే నా ఊహ.

నిరుడు దీపావళిపదిరోజు లున్నదనగానే ఆపండుగనుగూర్చిన వివరాలన్ని తెలిసికొని ఆనాటి కార్యక్రమముసంగతి ఆలోచించుకొనుచు ఊటలూరుట ఆరంభించినాను. నే నెల్లూరు జాతీయమహావిద్యాలయములో చేరి మూడేండ్లయినదేమో! అప్పటికి నేను చదువుచున్నది ఏడవతరగతి. మాకు నరకచతుర్దశి, అమావాస్యయు సెలవు దినములే. అయినను నేను త్రయోదశినాటిమధ్యాహ్నము కూడ బడిమానివైచి బజారులో దీపావళి విశేషములు చూచుటకు బయలుదేరినాను.

మధ్యాహ్నము మూడుగంటలయినది. నేనుబజారు వెళ్లి చూచితినిగదా, ఏమి చెప్పుదును? కళ్లు చెదరిపోవునట్లన్నికొట్లును బాణసంచులతో నిండియున్నవి. రెండు మూడుగంటల కాలము బజారంతయు దిరిగి తిరిగి విసిగి యొక పెద్దకొట్టుయెదుట క్రొత్తగా ఎత్తబడిన తడకకు నిట్రాడుగానున్న ఒక వెదురుకఱ్ఱ నానుకొని చుట్టుపట్టుల చిత్రాలన్నియు జూచుచు నిలువబడినాను. ఊరుగూరి జనముకూడావచ్చి సీమటపాకాయలు, మతాబాలు అగ్గిపెట్టెలు, జపాను కాకరపువ్వు వత్తులు, మతాబా తీగలు మొదలైన వింతవింతవస్తువులుకొని పట్టుకొనిపోవుచున్నారు. అదిఅంతయు తదేకదృష్టితో చూచుచు నిలువబడినానేమో అప్పుడు నా మనస్సులో ఏవో రెండు రకాలఊహాలవరుసతో నడవారంభమైనది. ఒకటిప్రశ్న; ఇంకొకటి జవాబు.

ప్ర—ఈ సాహుకార్లందఱు మనదేశమునకు నష్టము కలిగించే ఈ విదేశపు సరుకులు ఎందుకు తెప్పింతురో?

జ—ప్రజ లిటువంటివే విస్తారముగా కొందురు గనుక.

ప్ర—ఎందుచేత కొందురు?

జ—వింతవింత రకాలెన్నో ఉండుటచేత.

ప్ర—గాలిని శుభ్రముచేసే స్వచ్ఛమైన గంధకము, సూరేకారము మొదలైనవానితో చేసిన మన దేశవాళీ సరుకులుమాని ఎందుకుపనికిరాని విదేశపు బాణసంచా కొనడమంత తెలివితక్కువపని మఱేమున్నది?

జ—గాలిని బాగుచేయుటకిదొక్కటేమార్గమా ఏమిటి? లక్ష ఉన్నవి. ఏమిటో? కాల్చిపారవేసేదానికి స్వదేశము విదేశము లేదా యేమిటి? విదేశపుబట్టలు తగులబెట్టినట్లు ఇవీ తగలబెట్టుచున్నాము కాని పెట్టెలలో పెట్టుకొని దాచుకోవడము లేదుకదా?

ఇంతలో ముద్దునకు కాల్చినట్లున్నా డెవడో తాటాకుటపాకాయ, అదివచ్చి సరిగ్గా నాకాళ్లదగ్గఱపడి 'ఢాం' అనిపెద్దధ్వని చేసినది. ఊహాప్రపంచము పోయి నేను ఉలిక్కిపడినాను. నా అర్థములేని ఆలోచనలు తలుచుకొనగా నాకే నవ్వువచ్చినది. నవ్వాపుకొని నాల్గువైపులు చూచినాను. రోడ్డుప్రక్క కుఱ్ఱవాడొకడు వెలిగించిన సిసింద్రీ చేతితో పట్టుకొని విడువకే అడ్డదిడ్డ

ముగా త్రిప్పుచు మనుష్యుల సంపును చిత్రముగా తప్పించుకొనుచు కెవ్వున కేక వేయుచు పరుగెత్తిపోవుచున్నాడు. ప్రక్కకొట్టుదగ్గఱ ఎవరో పొడుగుపాటిమనిషి నిల్చుండి మేజాబల్లమీది నీళ్లబాల్చీలో రకరకాల మందుబిళ్లలు వైచి పాములు, బాతులు, పడవలు, పిట్టలు— ఒకటేమిటి— అనేకరూపాలు పుట్టించి చూడవచ్చినవారి నందఱిని బొమ్మలవలె నిల్చిపోయేలాగు చేయుచున్నాడు.

నేను మనస్సులో "ఆహా! దీపావళి ఎంతమంచి పండుగ !!" అనుకొన్నాను. రేపువచ్చి తప్పక యిటువంటి చిత్రాలన్ని కొని తీసికొనిపోవలెననుకొనుచు నేను బజారువీథిమళ్లి ఇంటివైపునకు వచ్చుచున్నాను.

అప్పుడే మోతేవారి జ్యూబిలీమిల్లు ఆఱుగంటల మోత మోసినది. నా జతగాడు సత్యనారాయణ కసరత్తు చేసి బడినుండి యింటికిపోవుచు దారిలో నా కెదురుపడినాడు. మేమీలాగు మాట్లాడినాము.

నేను—ఈవేళ బజా రేలాగున్నదనుకొన్నావు ? కేవలము కన్నులపండువే. బాణసంచా కొనుక్కొందుకు—మఱి—మన మెప్పుడు వెళ్లుదము ?

సత్య— నేనీయేడు ఏమీకొనను. నేనేకాదు, మనతరగతిలో పిల్లలందఱును బాణసంచా కాల్చడము మానివేయవలెనని నిశ్చయము చేసికొన్నాము.

నేను—(ఆశ్చర్యముతో) ఇదేమిప్రారబ్ధము ! విదేశపు బాణసంచా మానితే మానవచ్చునుకాని—స్వదేశపు వాటికేమి ?

సత్య— ఏవీకాల్చకూడదు. మనవాక్యరచనమాస్టరుగారు ఈవేళ ఆపండుగ పుట్టుపూర్వోత్తరాలన్నియు చెప్పినారు. ఇప్పుడు మనమున్నస్థితిలో బాణసంచా కాల్చడము ఎంతబుద్ధితక్కువో మాకు బాగుగా తెలిసినది.

ఆమాట వినగానే నామనస్సు చివుక్కు మన్నది. నిజముగా నాకా మేస్టరుగారిమీద చాలాకోపము వచ్చినది.

నేను—ఆయనమాయలోపడి మానితే మీరు మానండి. నేనుమాత్రము మానను. ఏడాది కొకసారి గాలిని శుభ్రపఱచుటకు మనవాళ్లుపెట్టిన ఈ పండుగమానుటే !! ఎంత తెలివితక్కువ !

సత్య—నా కెందుకు ? రేపు ఆకథవింటే నీవే మానుతానంటావు.

నేను—నేనంత పిచ్చివాడనుకాను.

సత్య—సరే. రేపు బడిలో కలుసుకొందము.

అనుచు అతడు తన ఇంటికి పోయినాడు. నాకేదో మాయ బెంగవచ్చి పడినది. ఎంతప్రయత్నము చేసినను మనస్సు కుదుటపడలేదు. నడిచి యేలాగో యిల్లుచేరినాను.

రాత్రిసరిగా నిద్రపట్టలేదు. తెల్లవారినది. ఆవేళ నరకచతుర్దశి. "ఈరెండురోజులు ఆ మేస్టరుగారి కంటబడకుండి దీపావళినాడేలాగైన బాణసంచా కాల్చితీరవలెను" అని నిశ్చయముచేసికొన్నాను కాని ఆరోజు సాయంకాలము మాబడిలో స్నేహితులతో బచ్చిక్కాడుకొనుచు ఇట్టే ప్రక్కకు చూచితినిగదా; చేతిబెత్తము నేలనానుకొని నిలువబడి ఆ వాక్యరచన మేస్టరుగారు ప్రత్యక్షమైనారు. నాకుగుండె గుబేలు మన్నది. "నాకెందుకు ఈభయం. ఆయన ఎన్ని చెప్పినను నేను లొంగను. మనస్సు నల్లరాయిగా చేసికొందును" అని నాకు నేనే ధైర్యము చెప్పుకున్నాను. ఇంతలో మా తరగతి దుడుకుకుర్రవా డొకడు ముందుకువెళ్లి "పంతులుగారూ! నరసింహామూర్తి బాణసంచా కాల్చడము మానడట. హరిహరబ్రహ్మాదులు దిగివచ్చినను నాచేత మాన్పించలేరనుచున్నాడండి" అన్నాడు.

"అతనిమాట కేమిగాని రేపు నీవేమి చేయుటకు నిశ్చయించుకొన్నావు?" అన్నారాయన. ఆ పిల్లవాడు "నేనెంతమాత్రము కాల్చను. అసలు మా యింటిలోనికి బాణసంచా అన్నమాటే రానివ్వ" నన్నాడు.

అప్పు డిద్దరుముగ్గురు కుర్రవాళ్లు ముందుకు వచ్చి "పంతులుగారూ! ఆకథ మళ్లీచెప్పండి! నిన్న మేము వినలేదు. మేముకూడ బాణసంచా కాల్చుట మానివేయుదుము" అన్నారు.

ఉపాధ్యాయులు నావైపుతిరిగి "ఏమి నరసింహమూర్తీ! చెప్పమన్నావా?" అన్నారు.

నాకు ఇష్టములేకపోయినను వెంటనే "చెప్పండి" అనుమాట నానోటినుండి జారివచ్చివేసినది.

"మఱి—ఆటమానిపైచి అందఱు చాపమీదకువచ్చి శ్రద్ధగా వినెదరా?" అనుచు ఆయన ఆచార్యాశ్రమము దగ్గఱ సావిడిమీదిచాపపై కూర్చున్నారు. మేమందఱము వెళ్లి చుట్టును కూర్చున్నాము. ఆయన ముందుగాచెప్పిన మాట లివి.

"మీరు నాకు భయపడికాని, తొందరపడి కాని నేను చెప్పినట్లు నడుచుకొందుమని మొగమిచ్చకపు మాటలు చెప్పవద్దు. నిర్భయముగా అడిగి మీకు తోచిన సందేహములన్ని తీర్చుకొని మనస్సు మార్చుకోవలసిన యుండిన తప్పక మార్చుకొనుడు. ఎవరేమనుకొన్ననుసరే నే నీ తప్పుపని చేయకమాననని చెప్పెడివాడు ఎందుకుపనికిరాడు. ఎన్ని ప్రయత్నములైన చేసి చెడుకోరికలను చెడు అలవాటులను తరిమివైచి మన మనస్సులు బాగుపఱుచుకొనుటకొరకే మనమీ ప్రపంచకమున మనుష్యులముగా పుట్టినామన్న మాట మఱచిపోకుడు."

నే నూరుకోలేదు "ఏమండీ మేస్టరుగారూ; మంచి వని తోచినపనులన్నీ మనము చేయగలమా? చెడ్డవి పూర్తిగ మానివేయగలమా? చదువుకొనే పిల్లలు బ్రహ్మచర్యవ్రతం పూని కారపుతిండ్లుమాని మునులవలె నిష్ఠగా ఉండవలెనన్నారుకదా? ఈకాలములో ఎవరైన ఆలాగున ఉండగలరా?" అన్నాను.

పంతులుగారు అన్నారు. "అబ్బాయీ! నూతిలో కప్పలాగున అందఱు నీవంటివారే అనుకోకు. ఏకాలములోనైన మంచిచెడ్డ లుండకమానవు. నీవు అహమ్మదాబాదు సబర్మతీ ఆశ్రమమునకును హరిద్వార గురుకులాశ్రమమునకును పోయిచూచినట్లయితే అక్కడ చదువుకొను పిల్లల నిష్ఠకు నీవు చాల ఆశ్చర్యపడెదవు. అట్టి దీక్షగలవా రక్కడ నీకు వందలకొలది కాన్పింతురు. దేవునిదయ ఉన్నట్లైతే పవిత్రచరిత్రులైన మనపాఠశాల ఉపాధ్యాయుల మంచిబోధలవలన మీరును చిత్తసంశుద్ధి పొందినవారై మన మహావిద్యాలయమును ఆంధ్రదేశమున కంతటికిఆదర్శప్రాయంగా ఉండేలాగునచేయగలుగుదురు.

ఈమాటలు వినగానే నా కెంతో సంతోషము వచ్చినది. "ఆలాగున జరిగించుటే మనము జన్మమెత్తినందుకు ఫలము" అనుకొన్నాను. ఉత్సాహముతో తలఊపుచు "చెప్పండి. చెప్పండి. కథ" అన్నాను.

౨

పగలు నాలుగుగంటలు కొట్టుచున్నప్పు డాయన కథ ప్రారంభించినారు. కథపూర్తి అగునప్పటికి సాయంత్రము రమారమి ౭ గంట లైనది. పిమ్మట ఆ కథకును మనదేశములో ఇప్పుడు జరుగుచున్న గాంధిగారి సహాయనిరాకరణ కథకును సంబంధము కలిపిచెప్పిన సంగతులు పూర్తియై నేను తెల్లబోయిలేచి ఆకాశ మందుకొనుచున్న ఊహలతో ఇంటికి వెళ్లబోయేసరికి రాత్రి ఎనిమిది దాటిపోయినది.

ఎంత ఆలస్యమైతేనేంగాని నాకుచాలా క్రొత్త సంగతులు తెలిసినవి. దీపావళిపండుగ గుట్టుమట్టులన్ని పూర్తిగా తెలిసిపోయినవి. నాకు తెలిసిన సంగతు లన్నియు మన తెనుగుదేశములో ఉండే పిన్నపెద్ద లందఱికి తెలిసేలాగుచేసి ఈ బాణాసంచాపిచ్చి పోగొట్టవలెనని నాకు గట్టిపట్టుదల కలిగినది. ఏ మంచిపనియైన లోకములో వ్యాపించవలెనంటే మాటలవల్లకంటె, చేతలవల్లనే త్వరగా అవుతుందని మా పంతులుగారి ఉద్దేశ్యము. "ముందు నీవుచేసి, తర్వాత నీస్నేహితులచేత చేయించు. అదేక్రమముగా లోకమెల్ల వ్యాపించు" నని వారిబోధ. వారు చెప్పినది కొంతవరకు నిజమేకాని నాకు తెలిసిన సంగతులన్నియు నావంటిచిన్నవాళ్లకు తెలియజెప్పితే వారు వెంటనే మాబడిపిల్లలవలె చేయడమునకు సిద్ధపడుదురని నాకొక గట్టినమ్మకమున్నది. అందుచేత నా మనస్సులో బాగుగా నాటుకొనిపోయిన కథలోని ముఖ్యమైన సంగతులు మాత్రము పిల్లలకు తెలిసేలాగు నేనిందు వ్రాయుచున్నాను. మిగిలినవి మీరే ఆలోచించి తెలిసికొండు.

పదునైన పెద్దకోరలు. పొడుగయిన ముట్టె. బలముగల గిట్టలు. పొట్టితోక. మెడనిండ జూలు. చూడగానే గుండెబ్రద్దలయేలాగు భయంకరమైన అడవిపంది అవతార మెత్తినాడు విష్ణుమూర్తి. ఎత్తిఏమిచేసినాడు? అన్నిలోకాలు గజగజవణకిపోయేలాగు మొదట గట్టిగా ఘుర్ఘురించినాడు. వెంటనే తిన్నగాపోయి హిరణ్యాక్షుని గుండెలలో ఒక్కపోటుపొడిచి పడగొట్టి కోరలతో ఒడలంత చీల్చివైచి గిట్టలతోమట్టించి ఆ రక్తప్రవాహములో రెండుసార్లుపొర్లి తోకత్రిప్పుకొనుచు ముందుకుపోయి కనబడిన దుష్టరాక్షసుల నందఱిని ఈలాగే

చిత్రవధచేసివచ్చి రూపముపొందిన కోపదేవత లాగు భయంకరాకారముతో నిలువబడినాడు.

హిరణ్యాక్షుడు చాలాదురాత్ముడు. తాను చెడి పోవడమే కాకుండ లోకమంతా పాపములో పడిపోయే లాగు చేసినాడు. వానినిచంపి ఆపడిపోయిన భూదేవిని పైకి తేవడానికే విష్ణుమూర్తి ఇంతతామసాకారము తొల్ప వలసివచ్చినది. భూజనులంతా విష్ణుమూర్తి చేసినపనికి చాలా సంతోషించినారు. "దురాత్మగ్రపురాక్షసులను చంపి ప్రజలకు సౌఖ్యము కలుగచేయుటకు నీవంటి అద్భుత పరాక్రమముగల రాజునే మాకు దయచేయవలె" అని వాళ్లంతా వెర్రివాళ్లై హరిని కోరినారు. "నావంటి తామసమూర్తి ప్రాణులను చంపడమునకే కాని ప్రజలను రక్షించడమునకు పనికిరాడు" అన్నారాయన. వాళ్లు నమ్మలేదు. గట్టిపట్టుపట్టినారు. హరి దయాసముద్రుడు. 'సరే'అని మాయమైపోయినాడు.

వెంటనే వాళ్లకోరికకు ఫలముగా నరకుడు పుట్టి నాడు. వానిపరాక్రమము చెప్పశక్యముకాదు. పెద్ద వాడై పశుబలమువల్లనే లోకమునకంతకు చక్రవర్తి అయినాడు. ఎంతబాగుగా పరిపాలించినాడు అనుకొన్నారు? త్రాగుబోతులు, జూదగాళ్లు, దొంగలు, హంతకులు, డాంబికులు, కులద్రోహులు, దేశద్రోహులుకూడా విచ్చలవిడిగా తిరుగుచు నరకుని ప్రాపకమువల్ల హాయిగా బ్రతికేవారు. కాని, ఇంకను ధర్మమేపట్టుకొని ప్రాకులాడుచున్న సత్యకాలపువాళ్లకిమాత్రము కష్టాలు దుఃఖములు తప్పినవికావు. "మనకీ కష్టమెందుకు? నలుగురితోపాటు నారాయణా. మనమూ అధర్మముగానే ఉంటే తీరిపోతుంది" అని మిగిలినవాళ్లుకూడ ఒక్కొక్కరే అధర్మపరులైపోయినారు. అంతా ఒక్కరకమై పోగానే స్వసౌఖ్యంకోసము పోట్లాడుచు కొట్లుకుక్కల లాగు చెలరేగినారు ప్రజ. భూలోకమంతా నరకలోకమైపోయినది. నరకుడును ఆయన పరిజనమును చేసే దుండగాలు చూచితే ప్రజలందరికి అసహ్యము వేసినది. రాజు ధర్మమూర్తిగా లేనియెడల రాజ్యాని కెంతనష్టమో వాళ్లకి బాగుగా నాటిపోయినది. అయితే ఏమిచేయగలరు, మనసార చేసికొన్న పనికి? ఎంతవిచారించితే ఏమి లాభము? అప్పుడు రాజ్యములో వింతవింత మార్పులు ఎన్ని కావలెనో అన్నీ ప్రత్యక్షమైనవి.

లోకములోఉన్న తమాషాయే ఇది. ఒకసారి జరిగిన సంగతులవంటివే మఱలమఱల జరుగుచుండడము స్వభావము. పాశ్చాత్యవ్యామోహము పోగొట్టి మనకందరికి దేశభక్తి కలిగించడమునకిప్పుడు వైశ్యకులములో గాంధిగారు పుట్టినట్లే అప్పుడు ప్రజలలోఉండే అజ్ఞానము, భయము, చపలత్వము మొదలైనవి పోగొట్టి ప్రజలందరిని ధర్మనందాసక్తిగలవారినిగా చేసి వారిబాధలు పోగొట్టడమునకు శ్రీకృష్ణమూర్తి యాదవకులములో అవతరించినాడు. యాదవులంటే ఇప్పటి మనగొల్లలతో సమానము. ఆకులములో పుట్టినాడుగనుకనే ఆయన సామాన్యజనుల కందఱికి తెలిసేలాగున ధర్మబోధ చేయగలిగినాడు. ఆయన ముఖ్యముగా చెప్పినదేమంటే "మంచిపనులన్నీ మీరుచేయండి, ఫలం కలుగునని ఆశతోచేయవద్దు. దేవుడనైన నేను చేయుమన్నానని నాయందుభక్తిచేతనే చేయండి. పనిచేయడమే మీవంతుగాని ఫలముజోలి మీకక్కరలేదు. అది కలిగించేవాడను నేనే. ఆ భారము నాకు వదలిపెట్టి మీపనిమీరు మీరుండండి"

దేశాలన్నీ తిరిగి ఇంకా అనేకఉపన్యాసాలిచ్చినారాయన. "దైవాంశతోపుట్టిన మహానుభావుల మంచి బోధలువిని మనస్సులు మార్చుకోలేని నిర్భాగ్యులగు కఠిన చిత్తులకు నరకుని పరిపాలనలో కష్టాలు పొందుచు తమ హక్కులన్నీ పోగొట్టుకొనడమే శిక్ష. మీరిప్పటికైనను పశ్చాత్తాపానికివచ్చి "నిజముగా మేము ధర్మమే నమ్మినాము. అధర్మము మాకక్కఱలేదు." అని దైవసాక్షిగ చెప్పగలిగినట్లయితే ఈక్షణమునుండియే నరకుని ఆశ్రయించుట మానివేయండి. మీరందరు ధర్మమే నమ్ముకొని ఉంటే మీకు మేలుకలుగుతుంది. తుచ్ఛమైనయిహ సుఖముకోసము అమూల్యమైనధర్మమును అమ్ముకోకండి. మిమ్ములను నరకుడు బెదిరించునే కాని చంపలేడు. మీకే నిజంగా ధర్మదీక్షవుంటే అతడుచేసే అపకారాలన్నీ మీ పాలిటి ఉపచారములై పోకమానవు. ఒకవేళ చంపుతాడే అనుకోండి. ఎవరిని చంపుతాడు? మీ ఆత్మలకు చావులేదు కదా! ఈశరీరం పోగొట్టునా? అది పోతే మీకు మరీమంచిది. ఒక్కధర్మముతప్ప ఈ జన్మములో మీరు సంపాదించుకొన్న దేదీ మీతోరావు. అధర్మము మూలనే మీ ముందుజన్మములయొక్క సౌఖ్యమంతా ఆధారపడియుండును. కనుక ధర్మముకాపాడుటకోసము ఎంత

కష్టమునైన పడుటకు వెనుదీయకూడదు" ఈలాగున ఒకటేమిటి చాలాసంగతులు బోధించినారు.

ఆయన బోధవింటే దేశభక్తియనే పవిత్రమైన అగ్ని ప్రజల అంతఃకరణములలో పుట్టి హృదయాలనుండి బయలుదేరి రక్తనాళాలలో దూరి కేశనాళికల గుండా ప్రవహించి శరీరమంతా ఆక్రమించి తృణప్రాయమైన స్వార్థచింతను పూర్తిగా దహించివైచి వారిని అత్యద్భుత స్వార్థత్యాగులుగా మార్చివైచినది.

ఈలాగున ఉంటూండగానే ఒకనాడు నరకుడు అపరాధం ఎఱుగని చాలామంది స్త్రీలను పురుషులను చంపించి దిక్కులేనిబాలికలను పదహారువేలమందిని తెప్పించి చెఱయందుంచి అనేకవిధాల వారిని బాధించడము మొదలుపెట్టినాడు.

దారుణమైన ఆసంగతిజరిగిన మఱునాడే శ్రీకృష్ణుడు అనేకచోట్ల సభలుచేయించి ప్రజలందఱికి బాగుగా పురి యెక్కించినాడు. ఒకనాడు ఉదయము వారందఱు తీర్థప్రజలాగు బయలుదేరి యమునానదికి వెళ్లిపవిత్రమైన ఆనీటిలో స్నానాలుచేసి తూర్పువైపు తిరిగి అంతా ఒక్కసారిగా సూర్యనమస్కారాలు చేయుచు "మేము ఈరోజు మొదలు ఈ నరకునకు ఈషత్తైన సహాయముచేయము. తిండిలేక ప్రాణముపోయినసరే, వీనిని ఆశ్రయించుటకు సిద్ధపడము. మమ్మింతింత ముక్కలుగ కోయుచున్నను సరే అహింసనువీడము. అధర్మమునకు ఒడబడము. ఓ కర్మసాక్షియగు భగవంతుడా! మేమిది తప్పితిరిగే యెడల నీచండకిరణములచే మమ్ములను మాడ్చివేయుమా!" అని ప్రమాణములుచేసిరి. ఈలాగే పంచభూతములను తలచుచు దృఢప్రతిజ్ఞలు పట్టిరి.

3

నరకరాజ్యములో ఆనాటికానాడు దైవప్రార్థనలు, హరిభజనలు ఎక్కువైపోవుచున్నవి. కొందఱు దేశభక్తులు అనేకచోట్ల ప్రచారము చేయుచు శ్రీకృష్ణుని దివ్యబోధఅనే అమృతవర్షమును జనులహృదయక్షేత్రములమీద కురిపించివైచుచున్నారు. కొందఱు చాలా నియమముగలవారై నిద్రాహారాలుమాని తపస్సుచేయుచు స్వార్థపరులగు కఠినచిత్తులకు మూగితనముచేతనే పాఠాలు నేర్పుచున్నారు.

నరకుడిదేమిటిరా చిలికిచిలికి గాలివాన అయేలాగున్నది అని ప్రజాశక్తిచూచి చాలాగాబరా పడిపోయినాడు. అయితేనేమి? అతడేమీ ఊరుకోలేదు. సామదానభేదదండాలు పూర్తిగా ఉపయోగించినాడు. కూలిచ్చి కృష్ణునితిట్టించినాడు. స్వార్థపరులు పాపానికి భయపడక శ్రీకృష్ణలీలలన్నిటికి పెడఅర్థాలుతీసి నోటికివచ్చినట్లెల్ల ప్రేలుట మొదలుపెట్టినారు. ఆపాపపుమాటలు వినేవారెవరు? నరకుని ఏకపుత్రుడు భగదత్తుడే తండ్రిపరిపాలనావిధానము నాక్షేపించుచు శ్రీకృష్ణభక్తుడై తుంటరులైనవారి కారులను ఖండించుచు ఎక్కడచూచిన తానేయై ఉపన్యాసాలిచ్చుచున్నాడు.

"శ్రీకృష్ణమూర్తి దైవాంశతో పుట్టిన మహానుభావుడు. దయాసముద్రుడు. కులముకన్న గుణముగొప్పదని చూపుటకు ఆయన యదుకులమున పుట్టినాడు. సంసారములో నుండియు మోహమును గెల్వవచ్చునని చూపుటకు అనేకమంది భార్యలమధ్య నతడు అస్ఖలిత బ్రహ్మచారిగా నుండగలిగినాడు. భక్తియు మించినమతియు నున్నవాడు. వేదము చదువరాని శూద్రుడైనను దైవసమానుడే అని ఆయన ప్రత్యక్షముగా నిదర్శనము చూపుచున్నాడు." అని భక్తపరవశుడై సంతోషబాష్పములు రాల్చుచు అతడు చెప్పేసంగతులు కఠినహృదయములను సైతము వెన్నవలె కరగించివైచుచుండెను.

నరకునికి కావలసినన్ని అస్త్రశస్త్రము లున్నవి. కాని, స్తంభించిపోయిన పరిపాలనను సాగించుటకివి ఏవీ పనికిరాలేదు. శ్రీకృష్ణుడు దేశస్థితిఅంతా కనిపెట్టుచునే ఉన్నాడు. చాలామందిప్రజలు గర్భదరిద్రులైపోయినారు. తిండి, బట్ట, దీపము, ఇల్లు ఒకటేమిటి అన్నీ కఱవైపోయినవి. ప్రత్యక్షంగా నరకబాధలే అనుభవించుచున్నారు. కాని, ఒక్కడైన నరకుని సహాయముకోరన నిష్టపడలేదు.

భూదేవి దీనావస్థచూచి రుక్మిణీ సత్యభామలు చాలావిచారించినారు. ఒకనాడు సత్యభామ కన్నీళ్లు చీరచెరగుతో ఒత్తుకొనుచు శ్రీకృష్ణునిదగ్గఱకువెళ్లి ఏదైనా అవతారమెత్తి మఱల భూమిని రక్షించమని చాలాసేపు బ్రతిమాలినది.

"ఏఅవతారం అక్కఱలేదు. నరకుడు తన అధర్మముచేత బలమంతయు పోగొట్టుకొని శవమైపోయినాడు.

ఇప్పుడట్టివానిని నీవంటిఆడుదైనను సులభముగా ఓడించగలదు." అని శ్రీకృష్ణుడామెతో వేళాకోళమాడినాడు.

"ఆమాట నిలుపుకొం" డని చెప్పి సత్యభామ యుద్ధానికి సిద్ధపడినది.

"నరకుడు నాచేతిలో చచ్చి మోక్షము పొందవలెనని చాలా ఉబలాటము పడుచున్నాడు. అందుచేత వాడు నీచేతిలో చావడు" అన్నాడు శ్రీకృష్ణుడు.

దానితో వారిద్దటికి వాదోపవాదాలు పెరిగి పెద్ద నాటకమంతపని జరిగినది. తుద కేలాగైతేనేమి శ్రీకృష్ణుడు గరుడవాహన మెక్కి సత్యభామతో కూడ యుద్ధరంగమునకుపోయి ఆమెచేతనే యుద్ధము చేయించి ఒకసారి నరకునిమూర్ఛ పొందింపజేసి సత్యభామను సంతోషపెట్టినాడు. తరువాత నరకుని తన చక్రాయుధముచేత చంపి అతనికి మోక్షమిప్పించినాడు.

శ్రీకృష్ణ నరకాసురుల యుద్ధము జరుగుచున్నదంతే ప్రజలప్రాణాలు పీచుపీచు మంచున్నవి. గుండెలు దడదడ కొట్టుకోవడము మొదలుపెట్టినవి. ఏమో! ఎటుండి ఎటువచ్చునో అని ఎంతధర్మమూర్తులైనను సందేహపడకుండ ఉండలేకపోయినారు. నరకుని పక్షమువారలకు మాత్రము భయము సందేహము లేకపోయినది. ఆడారి అచ్చిన్నలాగ గొల్లకొంపలలో తిరిగేవుట్టివా డేమిటిలోకభయంకరుడైన శ్రీనరకమహారాజుగారితో యుద్ధముచేసి జయించడ మేమిటని నవ్వి చప్పట్లుకొట్టినారు.

మెఱుపుకాంతిలాగు వచ్చిపడినది. శ్రీకృష్ణుడు జయించినాడన్న శుభవార్త. ఇంక చెప్పేదేమిటి? "శ్రీకృష్ణునకు జయ్"అనేకేకలకు విధివిరామము లేదు. చిన్నలు పెద్దలు, స్త్రీలు, పురుషులు అనే భేదము లేకుండ అంతా ఆడిపోయినారని నమ్మండి. ఒకటిరెండు రోజులవరకు గుళ్లలో ఉండే జేగంటలు, బళ్లలో ఉండే బడిగంటలు, ఇళ్లలో ఉండే చిరుగంటలు ఖంగుఖంగున మ్రోగిపోయినవి. ఆ ధ్వనులతో భూమి ఆకాశము నిండిపోయినవి. కాని వాళ్లకు గలిగిన ఆసంతోషమునకు ఈధ్వను లేమిలెక్క? ఊరూరను విడువకుండ ఫిరంగులుకూడ మ్రోగించినారు.

గరుడవాహనారూఢుడై సత్యభామతో గూడి శ్రీకృష్ణమూర్తి ఊరిలోనికివచ్చినాడు. అప్పుడు ప్రజలు చేసిన మన్ననలు, పాడినభక్తిగీతాలు, అర్పించిన స్వాగతపత్రములు వర్ణింప శక్యముకాదు. ఆసంతోషసమయములోనే నరకుని కుమారుడును తనభక్తులలో శ్రేష్ఠుడును అగు భగదత్తునకు ప్రజల అనుమతిచొప్పున పట్టాభిషేక మహోత్సవము చేయించి శ్రీకృష్ణుడు సత్యభామతో తన నగరునకువెళ్లిపోయినాడు. భగదత్తుడు దేశభక్తులకు చేయించిన ప్రత్యేకపువిందులు, బహుమానములు, ఊరూర చేయించిన సంతర్పణలు, బీదలకు ఏర్పాటుచేసిన అన్నవస్త్రాదిదానములు మొదలగునవి మీరూహించుకొనవలసినదే.

ప్రజలఆనందానికి పరిమితి లేదు. అందఱు తమతమ గృహములు పెండ్లియిండ్లవలె కలకలలాడు లాగున అలంకరించినారు. ఇన్నాళ్లనుండియు ఉపవాసాలున్న బడలికంతా నడ్డితో కూడ తీరేలాగున జనులందఱు పిండివంటలతో భోజనాలుచేసినారు. పరిమళము వెదచల్లు తాంబూలాలు వేసికొన్నారు. క్రొత్తబట్టలు కట్టినారు. దేహమున సుగంధద్రవ్యాలు పూసుకొన్నారు. వారము దినములవరకు ప్రతివారు ఇండ్లలోను వాకిండ్లలోను లక్షలకొలది దీపములు పెట్టి రకరకాలవలుగులుగల బాణసంచులు కాల్చి తమ సంతోషము వెలిపుచ్చినారు.

ఆ సంతోషసమయము శాశ్వతముగా జ్ఞాపకముంచుకొని వచ్చే తమ సంతతవారికి పశుబలమును నాశనముచేసే సాధనము తెలియపర్చుటమునకే అప్పటి ప్రజలీ దీపావళిపండుగను ప్రతిసంవత్సరము చేయడమారంభించినారు.

౪

ఎంతో కాలమునుండి మఱువక కాపాడుకొనుచు వచ్చిన ఈపండుగయొక్క అంతరార్థము గ్రహించి ఆఫలితమును పొందవగిన మహాభాగ్యము మనకింకను లభించలేదు. దాదాభాయి, గోఖ్లే, తిలకు, దాసు, మొదలగు మహానుభావు లెందరో మనకు స్వరాజ్యమును సంపాదించుటకై కావలసినంత ప్రయత్నించి విఫలులై చనిపోయినారు. శ్రీకృష్ణుని అపరావతారము మహాత్మాగాంధిగారు త్వరగా స్వరాజ్యము కలిగించడము కోసమై విసుగు, విశ్రాంతి లేకుండ అనేక బాధలు పడుచున్నారు. ఇపుడు మనము నిరాడంబరముగ జీవించుచు స్వరాజ్యసంపాదనకై విడువకుండ కృషిచేయుచు భగవంతుని అను

గ్రహమునకై వేచియున్నాముకదా! ఆకోరినఫలముపొందనిదే ఆనందమును తెలియజేయు దీపావళి పండుగను ఏమార్పులేకుండ సౌఖ్యవంతమైన పూర్వ యుగములో వలెనే మనమిప్పుడుచేయుటయం దేమైన అర్థమున్నదా?

ప్రతిదినము దేహపరిశ్రమము ముఖ్యమని పెద్దలు చెప్పినారు కదాయని టైఫాయిడ్ జ్వరపీడితుడై నెల దినములనుండి లంకణములు చేయుచున్న రోగి కసరత్తు చేయుటకు సిద్ధపడిన మన మేమందుము? మన మిప్పుడు జయమును సూచించే ఫిరంగులవంటి టపాకాయలును, సౌఖ్యము కలిగినదని వెల్లడించు సంతోషకాంతి ప్రసరణము తెలియజేసే మతాబులు మొదలైనవియును కాల్చుటము ఎంత సిగ్గులచేటు!! దేవగణము మనలను జూచి యెంతనవ్వును? మన పితృదేవత లెంత పరితపింతురు?

వ్యాధి నిమ్మళించినవా డారోగ్యస్నానముచేయుట తగునుకాని తీవ్రమైన వ్యాధిచేత పీడింపబడి మూల్గుచుండే మందభాగ్యునికి ఆరోగ్యస్నాన మెందుకు? మంచముపట్టి ప్రక్కకు ఒత్తిగిలలేనిరోగి "ఆహా! నా జబ్బంతయు పోయినది. ఇప్పుడు నేనులేచి పరుగెత్తెద. ఓహో హో! నాకిప్పు డెంతసౌఖ్యముగా నున్నది?" అని రానినవ్వు నవ్వినంతమాత్రమున అతనిబంధువులు సంతోషింతురా? మందిచ్చు వైద్యునకు రోగి జీవించునను ఆశ కలుగునా?

మనకు స్వరాజ్యము వచ్చినట్లైతే మన మెన్ని టపాకాయలుకాల్చినను మనసంతోష మింకను ఎంత యెక్కువగ వెల్లడించినను మంచిదే. పూర్వ మెప్పుడో మనవారికి మంచిపరిపాలన మిచ్చినపని ఇప్పు డెవారికే చంకలు కొట్టుకొనుచు కూర్చుండుట మనకేమి లాభము? వారేలాగు తమఆపదలు అంతరింప జేసికొన్నారో తెలిసికొని అలాగే నడుచుకోవడము మనధర్మము కాదా?" అని ఇంకను ఎన్నో ఉపమానములు చెప్పుచు ఆయన ఈ దీపావళినాడు ప్రస్తుతస్థితిలో టపాకాయలు కాల్చుట ఎంత తెలివితక్కువో పరమమూర్ఖునికైన తెలిసిపోవులాగునను కఠినచిత్తుని మనస్సైనను కరిగిపోయి దేశభక్తి అంకురించేలాగునను ఇంకొకగంటసేపు అనేకసంగతులు బోధించి మా అందఱి సందేహాలు పోగొట్టినారు. మా మనస్సు లన్నియు పరిశుద్ధి పొందినవి. అప్పుడు ఎవరి యిండ్లకు వాళ్లము వెళ్లిపోయినాము.

ఇంటికిపోవునప్పుడు దారిలో నామనస్సు ఊరుకోలేదు. "ఆహా! మన దేశములో ఈబాణసంచా వ్యసనము ఎంత బలవత్తరముగా నాటుకొనిపోయినది! తుదకు పాకీవాడుకూడవచ్చి "బాబూ! మీగులాపోణ్ణి. మీపిల్లలు కాల్చగా మిగిలిన రెండుటపాకాయ లీలాగపారవేయండయ్యా; కామందులు!" అని అతిదీనత్వముతో అడిగిపుచ్చుకొని కాల్చి కొండెక్కినంత సంతోషము పొందుచున్నాడే! ఈ పనికిమాలిన టపాకాయలకు ఖర్చుపెట్టే డబ్బంతయు ప్రతివాడు తనవిధి అనుకొని ఆరోజున తిలకుస్వరాజ్యనిధికి ఇచ్చివేసిన ఎంతబాగుండును? ప్రతి సంవత్సరము మనబీదదేశములో ఈ టపాకాయలకోసము ఒకకోటి ఏబదిలక్షల రూపాయలకంటే ఎక్కువఖర్చు అగుచున్నదనిగదా విన్నాను. ఇంతడబ్బు వృథాగా ఖర్చుపెట్టుచున్న దీపావళిపండుగ, స్వరాజ్యముకోసము ఆ డబ్బంతయు సద్వినియోగము చేయునంత పరమపవిత్రముగా మారిపోయినట్లైతే మఱిసంవత్సరమునకు మనకోరికలు నెరవేరడమున కాశ్చర్య మేమున్నది? మనవారు గట్టికృషిచేసి యీదీపావళినాడు స్వరాజ్యనిధి జాతీయవిద్యాలయనిధి మొదలైన చందాలు వసూలుచేసి ప్రజలలో కార్యోత్సాహము వృద్ధిపొందించి దీపావళిని అర్థవంతముగా చేసిన బాగుండును. ప్రస్తుతము బందరు జాతీయకళాశాలవారుమాత్రము ప్రతిసంవత్సరము విడువక చందాలు వసూలుచేయుచున్నారు. ఏడాదికి ఎనిమిదివేలు మొదలు పదివేలవరకు వారికి దొరకుచున్నవట.

దీపావళికి నూటయేబదిలక్షల రూపాయలు దుర్వ్యయముచేసే మనదేశములో స్వరాజ్య సంపాదనకు ఆవశ్యకమైన జాతీయవిద్యను పాఠశాల ఒక్కంటికి పదివేల రూపాయల చొప్పున ఒకవేయి పాఠశాలలవారైన చందాలు సంపాదింపలేకపోతే — ఈమాత్రము దేశభక్తి ప్రజలలో పుట్టించడము మనకు చేతగాకపోతే — మనకు స్వరాజ్యము ఏలాగువచ్చును? స్వరాజ్యవాంఛ టపాకాయ సరదాపాటి లేకపోయెగదా మనవాళ్లకు" అనియేమేమో ఆలోచించుకొనుచు సంతుష్టహృదయముతోనే నేనిల్లుచేరినాను.

ఇంటికిపోయి చూచునప్పటికి మా అన్నయ్య అప్పుడే నాల్గురూపాయల బాణసంచా కొని తెప్పించి

యింట్లో ఉంచినాను. అదిమాడగానే నేనెంతో సంతోషించెదనని మా అన్నయ్య ఊహ. కాని చిత్తశుద్ధిగాంచిన నా కన్నులకవి మల్లుతౌనుల మడతలంత నీచముగా కనబడినవి. తొడుగుటకుకూడ నామనస్సు ఒప్పుకోలేదు. మా అన్నయ్యను బ్రతిమాలి ఏలాగైతేనేమి అవి మఱల బజారునకు పట్టించుకొనిపోయి పావలాతక్కువ నాల్గురూపాయలకు అమ్మివేసినాను.

మా అన్నయ్య అందులో రెండురూపాయలు మాత్రము స్వరాజ్యనిధి కిమ్మని నాచేతికిచ్చినాడు. అది అంతా స్వరాజ్యనిధికి యివ్వమని నావాదము. మాఅన్నయ్య ఒప్పుకోలేదు. "నీవు బాణసంచా మానిన లాభము కేవలము దేశమునకే కాకుండ నీ యింటి యజమానికికూడ కొంత గలుగనీయుము. నీకు సంతోషభంగము కలిగించవ మునకిష్టములేక ఇంక అభ్యోరించుటావనితప్పనిసరివచ్చి కొన్నాను కాని తిండికే సరిగా గడువక తంటాలు పడుచున్న మనము ఈపనికిమాలిన బాణసంచాకుకూడ దుర్వ్యయము చేయగలస్థితిలో ఉన్నామా"? అన్నాడు. నేను మఱల మాట్లాడలేదు.

దీపావళినాటి రాత్రి మా రెండు అరుగులమీద మంచినూనెతో పన్నెండు ప్రమిద దీపములు మాత్రము పెట్టించినాము. నేనును నామిత్రులు కలిసి కొంతసేపు హరిభజనము చేసినాము. తరువాత నేను యజ్ఞవరాహమూర్తి పుట్టుకగురించియు నరకాసురవధను గూర్చియు శ్రీమదాంధ్రభాగవతములో ఉన్న కథాభాగములుచదివి మాఉపాధ్యాయులుచెప్పిన విషయములనుబట్టివాని యంతరార్థములు గ్రహించిసంతోషించినాను.


బాణసంచులు మానిన ఎంతవిచారము కలుగునో అని నేను మొదట భయపడినాను. కాని నేనవి మాన కలుగునంత మనోనిగ్రహము సంపాదించినందుకే నా కా రాత్రి యెంతో సంతోషము కలిగినది.

మఱునాడు నేనుచేసిన స్వల్పత్యాగమునకు పాఠశాలయందు నాతో చదువుకొను పిల్లలును ముఖ్యముగా మా పంతులుగారును నన్నెంతో మెచ్చుకొని నన్నుగురించి ప్రశంసావాక్యములు పలికినప్పుడు నాకు కలిగిన ఆనందము నేను ఈజన్మములో మఱచిపోలేను. అప్పటినుండియే నాకు నిజముగ చిత్తసంశుద్ధి కలిగినది. మనోదార్ఢ్యమేర్పడినది. ఆచార్య జననీజనకులు చెప్పినట్లువిని వారిని సంతోషపెట్టుటవలన కలుగు ఆనందము వేయిరూపాయల బాణసంచా తగులబెట్టినప్పుడైన కలుగజాలదను సత్యమును నేనారోజుననే గ్రహించినాను. నాజీవితము ధన్యవంతముగుటకు అవకాశమున్నదని నాకప్పటినుండియే దృఢమైన మనోవిశ్వాసము కలిగినది.

పారాణి

ఉమర్ అలీషాకవి గారు

ముసుఁగుఁదీయవు రావు నాముందు కబల
యేల యడియాసఁబెట్టెదీలీల బాల
యేనొనర్చినయపరాధ మేమొ చెపుమ
హృదయమును జింపిపెట్టెద నిదిగో కొనుము
వేడిక్రొన్నెత్తురదిగో నీప్రేమగీత
ములఁ బఠించుచు బుసబుసఁ బొంగిపొరలి
వచ్చుచున్నది నీపాద పద్మమంట
వేరె పారాణి నీ విఁకఁ బెట్టుకొనకు.




తలకట్లు

జి. రామదాసు గారు
బి. యే., యం. ఆర్. ఏ. యస్.

హిందువులలో అనేక జాతు లున్నవి. మొదట సృష్టించబడినవి నాల్గుజాతులే. ఈ నాల్గుజాతులు బ్రహ్మయొక్క వేర్వేరంగముల నుండి పుట్టుటచే ఉచ్చనీచాది పదవుల నుంచ బడినవి. వీటి వ్యుత్పత్తిని స్థిరపరచుటకై 'బ్రాహ్మణో ఽస్య ముఖమాసీత్, బాహూ రాజన్యః కృతః, ఊరూ తదస్య యద్వైశ్యః, పద్భ్యాగ్ం శూద్రో అజాయత" అనే శ్రుతిని ఆధారముగా జెప్పుదురు. కొసనున్న 'అజాయత'అను క్రియాపదమునే గణన జేతురు గాని మొదటిపదమందున్న 'ఆసీత్' అను దాని నెంచరు; గాన ఈ శ్రుతికి సరియైన యర్థము జేయకున్నారు. ఇచ్చట ఈ శ్రుత్యర్థ మును సాధించుట మనపనిగాదు; కాన దాని విషయమై చర్చ చాలింతము.

ఈనాలుగుజాతులలో అనులోమ, విలో మములచే అనేకభేదములు గలుగుచున్నవి. ఇంతటితో చాలించక బ్రాహ్మణులలో యెన్నియో శాఖలు; క్షత్రియులలో అన్ని యున్నవి; వైశ్యులలో అన్నియు; శూద్రు లలో మితేలేదు. ఇట్లు ఈవిభజనకు అంతము లేదు.

బంట్రోతు, ముసద్దీ, నాయకుడు ఈ మొదలైన ఉద్యోగములవారికి వారి వారి



చిన్న బాలుడు




[illegible]



పోకముడి



ఎలకతోక




సంశిఖులు


పనుల కనుగుణ్యమై డవాలీ, దుస్తులు ఎట్లు
పైచిహ్నములో, ఈ హిందూజాతులకు గూడ
పై చిహ్నము లున్నవి. శరీరమంతటికి శిరస్సు
ప్రధానముగాన శిరోజములను గూర్చియుం
చుట యొక ముఖ్యమైన జాతిచిహ్నము. దీనికే
తలకట్టు అనబడును. అక్షరములు తలకట్టు
భేదములచే వివిధజాతులైనటుల, మనుష్యులు
గూడ తలకట్లవల్ల జాతిభేదములం జూపుచు
న్నారు. అశోకుని శాసనములం గన్నట్టు నక్క-
రములే ఇప్పటి తెలిసినవాటిలో ప్రథమములు.
ఇవియే దేశకాలపాత్రములవల్ల మార్పులు
జెంది ఈనాడు మన దేశములో వాడుభాష
లకు సంజ్ఞలైనవి. వీటి వీటిభేదముల దెల్పు
స్పష్టచిహ్నము తలకట్టే. ఇందుకు నిదర్శన
ముగా విశేషము మార్పుచెందని 'క'యను
సంజ్ఞను బరిశీలించిన నందలి యథార్థము
తేటపడును.


నాగరి, హిందీ, మహారాష్ట్రము क
బంగాళము...; బిహారి ...; ఓఢ్రము କ;
తెనుగు క; కన్నడము ಕ; అరవము க; ఈ
అక్షరముయొక్క తలకట్ల భేదమును గుర్తించ
వలెను. వీటివల్లనే ఏయక్షర మేభాషదో
తెలియుటకు అవకాశము గలుగును. దేశకాల
పాత్రత్వమువలన ఈభేద మెట్లుకలిగెనో మను
ష్యులకుగూడ నట్లే తలకట్లయందు భేదము
గలుగుచున్నది.

పుట్టినదిమొదలు కేశఖండనము వరకు
అన్నిజాతులలోనూ జుత్తుయొక్క ఒత్తు పల
చనలనుబట్టి దానిని గూర్చువిధము మారును.
కొందరు పోకముడులు వేతురు; కొందరు



కాకపక్షములు





గోష్పాదభేదములు



వాలుసిగ



గేరాజుట్టు

టోపీజడలు వేతురు. మరికొందరు ఎలక తోకలు మొదలైనవి వేతురు.

హిందూదేశమందు ఉదయమునిద్ర లేచినది మొదలు రాత్రి మంచముమీద పడునంత వరకూ ప్రతిజనుడు చేయు కర్మయావత్తూ శాస్త్రముచే గట్టబడియె. జుత్తును కత్తిరించుటగూడ శాస్త్రముచే విధింపబడియె. చౌలకర్మ బ్రాహ్మణునికి 8 వ ఏట, తదితరజాతులకు 16 వ ఏట, చేయవలెనని వేదమందు జెప్పబడెను. ఉపనయనమునాడు పంచశిఖలు (4) బ్రహ్మచర్యమందు (5) గృహస్థాశ్రమమందు (6, 7, 8, 9, 10, 11, 12) వేర్వేరు విధముగా నుంచబడును. బ్రాహ్మణేతరులు (13, 14, 15, 17, 18) శిరస్సంతటను జుత్తును బెంచికట్టుదురు. ఈ విధములనుబట్టిచూడగవారువారుచేయువృత్తులు, ఆచారములే తలకట్లను పాలించుచున్నట్లు గన్పించును.

తరుచు స్నానముచేయు వృత్తియందున్నవారుగాని దాని నవలంబించువారుగాని తలయందు విస్తారము జుట్టుఉంచిన నీరింకునన్నభీతిచే కొంచెము (గోష్పాదమంత) మాత్రమె కేశములనుంచి మిగిలినవి యావత్తు తీయుచుందురు. ఉన్న ఊళ్లోతినక, తినిన ఊళ్లోఉండక దేశాటనము చేయువారు (వర్తక వ్యాపారములవిషయమై నాటుకోట్లు, మతప్రచారము విషయమై సన్న్యాసులు) వివిధములైన జలములలో స్నానమాచరించవలెగాన తలయందు జట్టున్న నీ రింకి



గేరా



కొప్పుపెంచుట












యోధులు



సీకులు (పంజాబు)



మళయాళి



నాటుకోటి

శైత్యము మొదలైన రోగములు వచ్చునని శుభ్రముగా తల గొరిగింతురు. విశేషవర్షములు గురియు ప్రదేశమందున్న మళయాళీలు నడినెత్తిని, చలిప్రదేశమైన పంజాబునందు వారు తలయంతటను జుత్తు నుంచెదరు. యోధులు అనగా వీరులు, వస్తాదులు మొదలైనవారు వారియాకారము చేతనే శత్రువునకు భయము పుట్టించవలెను. ప్రకృతియందు భయంకరమైన జంతువులకు మూఖముచుట్టు జుత్తుమెండు. సింహము, పెద్దపులి మొదలైనవి. అటువలెనే మనుష్యులు సైతము, అస్త్రశస్త్రములచేత, బాహుబలముచేత జీవించు జాతులు, శిరస్సుపైని మొగముచుట్టు జుత్తుపెంచియుందురు. ఈజుత్తును వేర్వేరువిధములుగా గట్టుటకు కూడా కారణము వీరు చేయువృత్తికి జుత్తడ్డమురాకుండ ఉంచుటయే. కావున నిట్లు పరిశీలించి చూచిన తలకట్లు భేదములుగా ఉండుటకు దేశకాలపాత్రత్వమే యని స్పష్టపడుచున్నది.

భక్తుఁడు

కోట చెంచురామయ్య గారు

కన్నుల హర్షబాష్పములు గ్రమ్మగ మేను గగుర్పొడెంద, సౌ
ఖ్యోన్నతి విశ్వమున్ మఱచి యుల్లమునన్ హరిఁగాంచి పొంగు, "నీ
కన్న నొకండు దిక్కు కలఁడా? చలమూనఁగనేల? చేర్పవే
నన్నుదరిన్ శ్రితార్తిహరణా! యని చింతిలు భక్తుఁ డెప్పుడున్.

మ. తనలోఁ బాడుఁ, దనంత నాడు, దనలోఁ దానవ్వు, నన్నింటియం
దున గోవిందునిఁ గాంచి సంతసిలుఁ జేతుల్ మూర్ధమందూని "మ
న్ననసై స్వామి! దయాబ్ధి! కావు"మను "నీనామామృతాస్వాదనం
బున నన్ బెన్పు" మనున్! జలింపనిమనంబున్ గల్గి భక్తుం డొగిన్.

ఉ. కూడును భక్తకోటి, వినఁగోరు సదా హరికీర్తనావళుల్
వీడఁడు నిద్రయందయిన విష్ణుపదద్వయచింతనంబు, మా
రాడఁడు భక్తిఁజొక్కి, పరమార్థవిచారవిదూరుఁ జేరఁగాఁ
బోఁడు, శరీర మర్థిమెయిఁ బ్రోది యొనర్పఁ దలంపఁ డింతయున్.

చ. కరములు వైష్ణవార్చనలఁ గాళులు వైష్ణవమందిరంబులన్
దరియఁగ, మానసంబు రసనంబు హరిన్ స్తుతియింప, వీనులున్
హరివిన, నేత్రముల్ హరిఁగనన్ నియమించునుగాని యన్య మె
త్తఱిఁ జొనుపండు వానిని సతండు వినిర్మలభక్తియుక్తుఁడై.

బెంగాల్ కెమికల్ అండు ఫార్మస్యూటికల్ వర్క్సు

The Bengal Chemical and Pharmaceutical Works

పుల్లసురాజు వెంకటేశ్వరరాయడు గారు

భారతవర్షము పరోపాఖండవాసులకు బానిసయై యుండుటకు ఎన్నియో కారణములు గలవు. వానిలో మనదేశపరిశ్రమలన్ని నశింప మనము ఉపేక్ష చేసి, పారిశ్రామికవిద్యల నభ్యసించి పరిశ్రమాలయములను స్థాపించి వాణిజ్యము నభివృద్ధిచేయకపోవుట యొకటి. ఈ లోపమును గుర్తించినవారు పెక్కండ్రు గలరు; గాని దానిని తొలగించుటకు ప్రయత్నములు సలిపినవారు కొందరే! వీరిలో ఆచార్య ప్రఫుల్లచంద్రరాయ, డి.యస్.సి., పి. హెచ్. డి. గారగ్రగణ్యులు. రాసాయనికపరిశ్రమ (Chemical Industries)ల యభివృద్ధికై వీరెన్నియో పాటులుపడిరి. "బెంగాల్ కెమికల్ అండు ఫార్మస్యూటికల్ వర్క్సు" అను పేరుతో రసాయనములు (Chemicals)మరియు, ఫార్మస్యూటికల్సు(Pharmaceuticals) అనగా ఆంగ్లేయ వైద్యశాస్త్రానుసారముగ ఔషధములను జేయు ఒకగొప్పకర్మాలయమును స్థాపించి ఆచార్యరాయగారు ఇతరరాష్ట్రములకు మార్గదర్శకులైనారు. భారతవర్షములో నింతటి గొప్పకార్యాలయమింకెక్కడను లేదు. (చూ. చిత్రము ౧.) పరిశ్రమ, రసాయనశాస్త్రము మొదలగువాని నభ్యసించి వానిలో గొప్ప పాండిత్యమును సంపాదించి ప్రసిద్ధికెక్కిన పండితులు ఇతర రాష్ట్రములలో కంటె వంగదేశములోనే పెక్కండ్రుగలరు. వీరిలో కొందరు స్థాపించిన కర్మాలయములలో తయారుచేయబడువస్తువులు దేశములో ఏమూలనో దాగిపోవుచున్నవి. మొత్తముమీద ఈవంగదేశమునకు గావలసినంత సామగ్రియైనను దయారగుటలేదు.

ప్రతిరాష్ట్రములో ఎన్నిపరిశ్రమాలయములైనను స్థాపించుట కవకాశము గలదు. ఆంధ్రదేశములోనొకటియైనను పేరుగల రాసాయనిక పరిశ్రమాలయము లేకపోవుట పారిశ్రామికవిద్యలలో ఆంధ్రులకుగల యశ్రద్ధను వెల్లడిచేయుచున్నది. మఱియు ఆంధ్రులలో ప్రాకృతిక భౌతికశాస్త్రములలో ప్రజ్ఞగాంచి, పేరు వడసిన పండితు (Scientists) లరుదు! ఏ నాటకములో, పాటలో, రచియించు కవీశ్వరులు మనదేశములో ప్రతిమూలను గాన్పించెదరు గాని భౌతికశాస్త్రములకు సంబంధించిన వివిధ విషయముల (Scientific subjects)ను శ్రద్ధతో పఠించి, వ్యాసములు, పుస్తకములు రచియించి వాని నితరులకు బోధించువారు లేరనుట నిజము. ఇతరరాష్ట్రములలో, రసాయన, పదార్థవిజ్ఞాన, వృక్ష, భూగర్భాదిశాస్త్రములలో క్రొత్త పరిశోధనలు (researches) గావించి పేరువడసిన పండితోత్తములు పెక్కండ్రు గలరు. వంగదేశసోదరులు మాతృభాషలో పుస్తకములను, మాస పత్రికలలో వ్యాసములను వ్రాసి జనసామాన్యమునకు భౌతికవిజ్ఞానము (Scientific Knowledge) ను గలుగజేయు ప్రయత్నములు సలుపుచున్నారు. 'వసుమతి' 'ప్రవాసి' మరియు 'భారతవర్ష' యను వంగదేశమాసపత్రికల నొకింతచూచినచో ఈమాట స్పష్టపడును. ఆంధ్రు లీవిషయములో శ్రద్ధవుచ్చుకొనుటలేదని తెలుపుటకు చాలా సిగ్గుచున్నయది!

ప్రస్తుతము 'బెంగాల్ కెమికల్ అండు ఫార్మస్యూటికల్ వర్క్సు'ను గురించి కొన్ని పంక్తులు వ్రాయదలచితిని. సోదరాంధ్రులు వంగసోదరులు సల్పుచున్న కృషిచే పాఠమును గ్రహింతురుగాక!

ఈ కర్మాలయము ౧౮౯౨ క్రీ. శ.ములో ఆచార్యప్రఫుల్ల చంద్రరాయగారిచే ౨౫౦౦౦ రూపాయల మూలధనముతో స్థాపింపబడెను. ౧౯౦౧-వ సంవత్సరములో కంపెనీ ఆక్టుప్రకారము రిజిస్టరీ చేయబడి, లిమిటెడ్ కంపెనీగామారెను. (౨౫,౦౦,౦౦౧)ఇరువది

యైదులక్షల రూపాయలు రిజష్టరుకాబడిన మూలధనము; గాని, ౧౬ లక్షలుమాత్రమే ఉపయోగింపబడి, ఈ కర్మాలయము రాసాయనికపరిశ్రమ(Chemical Industries) లయం దెంతోయభివృద్ధిని గాంచియున్నది. గత సంవత్సరము రు. ౨౫౩౯౬౩ అ. ౯౧ లాభమును గడించినది.

ఈ కర్మాలయమును నిర్మించినపుడు, ఆచార్య ప్రఫుల్లచంద్రరాయగారు రాత్రింబవళ్లు శ్రమ యనక స్వయముగ బనిచేయుచుండిరి. రసాయనశాస్త్రములలో ప్రజ్ఞాశాలు రగు కొందరు శిష్యులకు వివిధరసాయనములను దయారుజేయు పద్ధతులు మొదలగునవి చక్కగా బోధించి వారినే ఇక్కడ పనిలో ప్రవేశపెట్టిరి. వీరే ప్రస్తుతము సర్వాధికారములను బొంది, కర్మాలయమును నడిపించుచున్న రసాయన శాస్త్రజ్ఞులు. వీరిలో నొకరు 'రాజశేఖరబోసు' అనువారు. వీరు కలకత్తా విశ్వవిద్యాలయపు యం. ఏ. పరీక్షలో పదార్థవిజ్ఞాన శాస్త్రమును అభిమానశాస్త్రముగా గ్రహించి కడతేరినారు. ఐనను రసాయనశాస్త్రములోగూడా వీరికిగొప్ప పాండిత్యము గలదు. గణిత, వాణిజ్య (Commerce) శాస్త్రములలోగూడా మేధావంతులగుటచే వీరు మేనేజరుపదవిని బొందియున్నారు. సర్వాధికారములు వీరికి గలవు. రూ. ౫౦౦ జీతముపుచ్చు కొందురు. మరియు లాభముపై నూటికి అయిదురూపాయల కమీషన్ దొరకును.

జగదీంద్రనాథలాహరీ, యం. యస్. సి. గారు, "రసాయనశాస్త్రవేత్త" (Chief-Chemist)పదవి నలంకరించియున్నారు. పారిశ్రామికరసాయన శాస్త్రము (Industrial Chemistry)లో ప్రజ్ఞావంతులు. రసాయనములు (Chemicals) తయారుచేయుశాఖ కాధిపత్యమును వహించియున్నవారు. సురేంద్రభూషణ సేను, యం. యస్. సి. గారు, ఔషధములు చేయుశాఖ (Pharmacy)కు అధికారులు. వీరే కర్మాలయాధికారి (Factory Superintendent)గా నున్నారు.

ఐరోపాఖండము మొదలైన విదేశములకు వెళ్లినవారొకరైనను లేరు. వీరందరును ఆచార్యరాయగారిచే శిక్షపొందినవారై, ఈకర్మాలయమును చక్కగా నడిపించు టెంతయు గణనీయముగ నున్నది!

కలకత్తా నగరముయొక్క తూర్పుదిశలో నున్న 'మానికతోలా మెయిన్ రోడు'లో నుండు ౯౦ వ నంబరుగల గృహమును, కర్మాగారముగా నెరుగవలయును. ఎటుచూచినను సుమారు 3 ఫర్లాంగుల వైశాల్యమును గలిగియుండును.

ఇక్కడ తయారుచేయు వస్తువులను రెండుశాఖలుగా విభజింపవచ్చును. రసాయనములు (Chemicals), మరియు ఔషధములు (Pharmaceuticals). ప్రస్తుతము రసాయనముల శాఖనుగూర్చి వ్రాసెదను.

ఆమ్లములు లేక ధృతములు (Acids)

గంధకికామ్లము, లేక గంధకధృతము.(Sulphuric Acid – సల్ఫ్యూరిక్ ఆసిడ్), ఉదజహరితామ్లము (Hydrochloric Acid--హైడ్రోక్లోరిక్ ఆసిడ్), మరియు నత్రికామ్లము (Nitric Acid–నైట్రిక్ ఆసిడ్), ధృతము లన్నిటిలో ముఖ్యమైనవి. గంధకికామ్లమువలన తక్కిన రెండు ఆమ్లములు (Acids) తయారుచేయబడును. గంధకధృతము రాసాయనికపరిశ్రమలకు ప్రాణము వంటిది.

ఈకర్మాలయములో ప్రతిదినము ౯ టన్నులు అనగా ౧౧౨౦ × ౯ = ౧౦౦౮౦ శేర్ల గంధకధృతము తయారుచేయబడుచున్నది. ఇది నిర్జలామ్లము (ఘాటుగలది–(Concentrated) గాక, నూటికి 3౨ పాళ్లు జలముతో మిశ్రమైయుండును. ఇట్టి ధృతమును కాచి, నీటిని ఆవిరిరూపముగా విడదీయునప్పటికి సుమారు ౭౦౦౦ సేర్ల నిర్జలామ్లము (Concentrated acid) తయారగును. ఇట్లు సిద్ధముచేయబడిన ధృతములోనుంచి కొంతభాగమును ఇతర రసాయనములను జేయుటలో ఉపయోగింతురు. మిగిలినదానిని ఇతరప్రదేశముల వర్తకులకు, మరియు కళాశాలల ఉపయోగార్థమై పంపుచుందురు.

భారతదేశములో గంధకపు గనులు లేవు. ఇటలీ దేశములోనున్న సిసిలీనుంచియు, జపానుదేశమునుంచియు గంధకమును దిగుమతి చేయుదురు. ఐనను గంధకము అంతప్రియము గానందున, ధృతమును జేయుటలో కంపెనీవారు చాలా లాభమును బొందుచున్నారు.

గంధకధృతమును చేయువిధానము

గంధకమును గాల్చినపుడు, అది పొగయై వెడలి పోవుట యందరకు దెలిసినవిషయమే కదా? ఈపొగల (వాయువు)కు, "గంధకద్వ్యమ్లజనిదము" (Sulphur dioxide—SO_2) యను రాసాయనికనామము గలదు. ఈవాయువు, గంధకము, మరియు వాతావరణములో నుండు ప్రాణవాయువు "ఆమ్లజని", (Atmospheric oxygen)యొక్క రాసాయనికసంయోగముచే జనించును. దీనితో మరికొంత ప్రాణవాయువు (ఆమ్లజని) సంయోగము చెందినచో 'గంధకత్ర్యమ్లజనిత' (Sulphur Trioxide) మేర్పడును. ఈ త్ర్యమ్లజనితమును నీటిలో విలీనము చేసినచో గంధకధృత మగును.

గంధకమును గొప్పబట్టీలలో గాల్చెదరు. పొటాసియానత్రితము (Potassium nitrate),అనగా పెట్లుప్పు లేక సోరుప్పును గొప్పమట్టిపాత్రలలో బెట్టి ఈ బట్టీలో నొకమూలనుంచి దానితలుపులు వేయుదురు. 'పెట్లుప్పు' లేక 'సోరుప్పు', పొటాసియ మనుధాతువు, నత్రజని (Nitrogen) యను వాయువు, మరియు ప్రాణవాయువు (Oxygen), ఈమూటియొక్క రాసాయనికసంయోగముచే గలిగిన పదార్థము. పెట్లుప్పును గాచినపుడు, మొదలు ద్రవరూపమును జెంది, తర్వాత వాయువై పోవును. రసాయనవియోగము (Decomposition)చే, నత్రజద్వ్యమ్లజని యను వాయువు పెట్లుప్పునుండి వెడలును. ఈవాయువు తనలోనున్న ప్రాణవాయువు (Oxygen) ను, గంధకద్వ్యమ్లజనిదముతో గలసినపుడు కొంత వదలివేయుటచే, దానిని గంధకద్వ్యమ్లజనిదము గ్రహించి "గంధకత్ర్యమ్లజనిదము" (SO_3)గా మారును. పెట్లుప్పును గాచినపుడు మరికొన్ని మార్పులు గలుగుచున్నవి; గాని వాటిని చర్చించుట కిది సమయముగాదు. ఫలితము మాత్రము పైనజెప్పినంతయే! బట్టీలో తయారగుచున్న గంధక, నత్రజనామ్లములను (వాయురూపములు) గొట్టములద్వారా గొప్పవైన సీసపుగదులలోనికి బంపుదురు. చిత్రములో నొకగదిని గనబరిచితిని. (చూ. చిత్రము ౨.) ఇట్టిగదులు ఈ కర్మాలయములో నాలుగు గలవు. కాని రెండుమాత్రమే ప్రస్తుతముపయోగింపబడుచున్నవి. ఒక్కొకగదివెడల్పు రమారమి 3౮ గజములు; పొడవు ౨౦; ఎత్తు 3 గజములు. ఈగదులు, దళమైన అచ్చుపుసీసపురేకులతో, ఇరువదివేలరూపాయలు వ్యయముచేసి నిర్మించబడినవి. ఇట్టి గదులలోనికి ఒకగొట్టముద్వారా ఆవిరిని బంపెదరు. మరియొకగొట్టముద్వారా బట్టీలోనుండి వెడలుచున్న ఉష్ణవాయువులు (గంధకత్ర్యమ్లజనిదము మొదలగునవి) గదిలోనికి ప్రవేశించును. గంధకత్ర్యమ్లజనిదముమాత్రము నీటి (ఆవిరి)లో విలీనమై గదిలో నుండిపోవును. ఈద్రవపదార్థమే గంధకధృతి. గంధకత్ర్యమ్లజనిదము నీటితో రసాయన సంయోగముచెందుటచే గంధకధృతమగును. ఈ ధృతములో ఉదజని (Hydrogen) యను వాయువు, ప్రాణవాయువు (Oxygen), మరియు గంధకము, ఈమూడును రాసాయనిక సంయోగస్థితిలో నున్నయవి—H_2SO_4. ఇట్లు సీసపుగదిలోకూడిన ధృతమును ఒకగొట్టము (Tap) ద్వారా వెలుపలకు దీసికొనెదరు. ఈధృతమును "చేంబర్ ఆసిడ్" (Chamber acid) అని యందురు. నూటికి ౬౭ భాగములు ధృతము, 33 భాగములు జలము గలిసియుండుటచే ఘాటుగలదిగా (Concentrated) నుండదు. ఇట్టి "చేంబర్ ఆసిడ్"ను గొప్ప సీసపుఘటములలో గాచినచో దానిలో నుండు జలమును ఆవిరియై వెడలిపోవును. ఇట్లు తయారుచేయబడిన ధృతము, జలరహితమై ఘాటుగలది (Strong)గా నుండును. దీనినే విక్రయించెదరు. చిత్రపటములు లభించనందున గంధకధృతమునుచేయు విధానమును సంపూర్ణముగా వ్రాయలేదు.

ఉదజహారితామ్లము— (Hydrochloric acid—హైడ్రోక్లోరిక్ ఆసిడ్)

'హైడ్రోక్లోరిక్ ఆసిడ్' అను ధృతి ఉదజని (Hydrogen) యను వాయువు, మరియు 'హరినము' అనగా క్లోరీన్ (Chlorine) అనబడు మరియొకవాయువు, ఈరెంటిసంయోగముచే జనించును. సాధారణముగా మనము వంటలలో వాడుకొను ఉప్పు, సోడియం, (Sodium)అనుధాతువు, మరియు పైనజెప్పిన హరిన మను వాయువుయొక్క సంయోగముచే జనించినలవణము. దీనికి "సోడియంక్లోరైడు" (Sodium Chloride) అనుశాస్త్రీయనామము గలదు. ఈ లవణమునే 'ఉదజహారితామ్లమును' జేయుటకు వాడుచుందురు.

ఉప్పును మరియు గంధకధృతి నొకచో జేర్చి ఒక యంత్రము (Retort)లో గాచినయెడల ఉదజహరితామ్లము (వాయువు) బయలుదేరును. ఇట్టివాయువు(gas) ఒక యంత్రముతో నిమిడియున్న యొక గొట్టముద్వారా ప్రవహించి, చల్లని నీటితో నింపబడియున్న గాజుబుడ్ల లోనికి ప్రవేశించి, ఆనీటిలో విలీనమైపోవును. ఈద్రవ పదార్థమే 'హైడ్రోక్లోరిక్ ఆసిడ్' అను ధృతము. ప్రతి దినము అరటన్ను, (౫౬౦) శేర్లు, ఈ కర్మాగారయము లో తయారగుచున్నది.

నత్రికామ్లము (Nitric acid-నైట్రిక్ ఆసిడ్)

పొటాసియానత్రితము (Potass nitrate) అను నామాంతరముగల పెట్లుప్పును గంధక ధృతముతో ఒక యంత్రములో గాచినచో నత్రికామ్లము వాయురూపమున వెలువడును. ఈవాయువును(gas) ఉదజహరితామ్లమును జేయునటులే, చల్లనినీటిగుండా పంపుదురు. అదినీటిలో విలీనమైపోవును. (dissolve) ఇదియే నైట్రిక్ ఆసిడ్, ప్రతిదిన మరటన్ను సిద్ధమగుచున్న యది.

పటిక (Alum)

మధ్యరాష్ట్రములోనున్న జబల్పురము ప్రాంతములో, తెలుపు, ఎరుపు వర్ణములతో మిశ్రితమైయున్న యొకవిధమైన మొరపునున్నగుట్టలు గలవు. ఈమంటిలో, అల్యూమినము, లోహముయొక్క ఆమ్లజనిదములు (oxides), ఇసుక(Silica) గలవు. గాని దీనిలో ముఖ్యమైనది అల్యూమినము. ఈ మట్టిని పృథక్కరింపగా (on analysis) క్రిందివిధముగా లోహము మొదలగు ధాతువులు నాకు లభించినవి.

100 భాగములలో:

54 భాగములు—అల్యూమినామ్లజనిదము (Aluminium oxide)

8 భాగములు—లోహము

$14\frac{1}{2}$ భాగములు—ఇసుక (Silica &c)


23 భాగములు—నీరు (moisture)

$99\frac{1}{2}$ మిగతఅర్ధభాగము చెత్త మొదలగునవి యేవియో యుండియుండును.

ఈ మట్టినే పటికను జేయుట కుపయోగింతురు. భూగర్భ శాస్త్రము (Geology) లో దీనికే 'బాక్సైటు' (Bauxite) అను నామాంతరము గలదు.

బాక్సైటును, యంత్రసహాయముచే సన్నగా పొడిచేసి, నీటిలో ఒకటిరెండు దినములవరకు నానబెట్టెదరు. అల్యూమిన, లోహామ్లజనిదములు నీటిలో విలీనమైపోవును. (Dissolve). ఇసుక (Silica) మొదలగు అవిలీన పదార్థములు (Insoluble matters), ద్రావకములో నడుగున స్థిమితమై (settled) యుండును. తేట ద్రావకమును వేరుచేసికొని, దానితో గంధకధృతిని జేర్చిన, రసాయనిక సంయోగముచే 'అల్యూమినా గంధకితము' (Aluminium sulphate) జనించును. ద్రావకములో లోహము విలీనమైయుండుటచే లోహగంధకితము, అనగా అన్నభేది (Ferrous sulphate)యు జనించును. ఇట్టి అల్యూమిన, లోహగంధకితముల ద్రావకముతో కొంత శుభ్రమైన "పొటాసియా గంధకితము" (Potassium Sulphate - పొటాసియం సల్ఫేటు) ను జేర్చి ద్రావకము నంతను బాగుగా కలుపవలయును. పొటాసియా గంధకితము, పొటాసియ మనుధాతువు, మరియు గంధకధృతముయొక్క సంయోగముచే గలుగుచున్నది. పెట్లుప్పును గంధకధృతితో కలిపి కాచినచో, పొటాసియా గంధకితము లభించును. పైనవ్రాసిన విధముగా "నత్రికామ్లము" (Nitric Acid) ను జేయునపుడు, పొటాసియాగంధకితము "As a by-product", లభించును. దీనినే పటికను జేయుటలో ఉపయోగింతురు. పొటాసియాగంధకితమును జేర్చి ఇట్లు తయారుచేసిన ద్రావకమును, సుమారు ౮ గజముల పొడవు, ౨ గజముల వెడల్పు, $1\frac{1}{2}$ గజముల లోతును గలిగియుండు సీసపు బాణలి (Concentration pan) లో బోసి, ఆవిరితో గాచెదరు. సన్నని సీసపుగొట్టములు, ఈ బాణలి గుండా వకకొననుండి రెండవకొనకు తీసుకపోబడి, వాని గొట్టముల గుండా ఆవిరి (Steam) ప్రవహించుటచే, ద్రావకముకాగి, దానిలోనుండు నీరంతయు ఆవిరియై వెడలిపోవును. ఈక్రిందిపటములో 'అ' యనునది సీసపు బాణలి. సూక్ష్మమైన చుక్కలు, ద్రావకమును దెల్పుచున్నవి. 'క, చ' గుర్తులుగలది యావిరిగొట్టము. 'క'

గుండా ఆవిరిగొట్టములోనికి ప్రవేశించి, 'చ' యను నైన చిక్కని (Hot and concentrated) ద్రావక



మును అచ్చులలో బోసియుంచు సరికి, ఒకటి రెండు దినములలో పటికయంతయు స్ఫటికములగును (crystallises). లోహగంధకిత ము మాత్రము ద్రవరూపమును దాల్చియే యుండును. ద్రవపదార్థమును, ఘనపదార్థములో విడదీయుట సులభమే కదా! ఇట్లు లభించిన పటికను సెంట్రిఫ్యూగల్ మెషిన్ (centrifugal

కొసనుండి వెడలిపోవును. ఇట్లు కొన్ని గంటలవరకు కాచు సరికి, ద్రావకము చిక్కనిదగును. ద్రవమాపక (Hydrometer) మను యంత్రముద్వారా, ఈ ద్రావకముయొక్క తారతమ్యగరిమ (Specific gravity) ను బరీక్షించి నియమిత గరిమను బొందినతోడనే 'ట' యను సుర్తుగల కొళాయిద్వారా బయటకు దీసికొని, యాద్రవము (Liquor) నంతను అచ్చులలో బోసియుంచుదురు. ప్రతియొక్క రసాయనము (Chemical) యొక ప్రత్యేకమైన ఉష్ణోగ్రత (Temperature), మరియు తారతమ్యగరిమ (Specific gravity) ను, బొందినచో దాని (రసాయనముయొక్క) స్ఫటికము (crystals) లేర్పడుట కారంభించును. (Different salts crystallise at different temperatures and specific gravities). గాన ఈసూత్రము ననుసరించియే పటికయొక్క ద్రావకమును, అచ్చులలో బోసినపిదప, స్ఫటికము లేర్పడుట కారంభించును. పటికయొక్క ద్రావకములో లోహము గూడా గలదని పైనజెప్పితినిగదా? దానిని విడదీయు టెట్లు? ద్రావకము ఏ "యుష్ణోగ్రత" మరియు "తారతమ్యగరిమ" బొందినపిమ్మట, పొటాసియం గంధకితము (Potassium sulphate), అల్యూమిన గంధకితము (Aluminium sulphate) యొక్క స్ఫటికము లేర్పడుట కారంభించునో, అట్టి ఉష్ణోగ్రత మరియు తారతమ్యగరిమను గలిగిన స్థితిలో (at that temperature and specific gravity), లోహగంధకితము (Ferrous sulphate) స్ఫటికములుగాక ద్రావకములోనుండి పోవును. కాన పైన వివరించినట్లు కాచబడిన వెచ్చ

machine) యను యంత్రములోనుంచి, యంత్రమును త్రిప్పుసరికి, పటిక కంటియున్న నీరంతయు విడదీయబడును. ఈ యంత్రమునుగూర్చి వ్రాయుట విస్తరభీతిచే మానితిని. ఈవిధముగా తయారుజేయబడిన వస్తువే జనసామాన్యమునకు దెలియుపటిక. ఈ మిశ్రలవణము (double salt) యొక్క "పరిమాణసంఘటనము" (quantitative composition) క్రింద జూపిన విధముగా నున్నయది.

నూటికి ౧౮.౩౫ భాగములు పొటాసియం గంధకితము (K_2SO_4)

౩౬.౦౮ అల్యూమినాగంధకితము (Al_2SO_4)

౪౫.౫౭ స్ఫటికార్జితజలము


(Water of crystallisation

౧౦౦.


లవణములు స్ఫటికీకరించునపుడు, యొక నియమిత ప్రమాణ జలమును స్ఫటికములు పీల్చుకొనును. ఈ ప్రమాణములో సాధారణముగా హెచ్చుతగ్గులు గానేరవు. ఇట్లు స్ఫటికములచే పీల్చుకోబడిన జలమునే స్ఫటికార్జితజల మనియెదరు.

ప్రతిదినము ఒకటన్ను (౧౧౨౦సేర్లు) పటిక ఈ కర్మాగారములో జేయబడుచున్నది; అపరిశుభ్రమైన పటిక(Alum cake) అయిదు టన్నులు. దీనిని కలకత్తా మ్యునిసిపాలిటీవారు, నీటిని శుభ్రపరచుటకై కొంపోవు

బెంగాల్ కెమికల్ అండు ఫార్మస్యూటికల్ వర్క్సు లిమిటెడ్




౧ కార్ఖానాయొక్క లోపలిభాగము




౨. కర్మాగారమున గంధకికామ్లమును తయారుచేయుగది

బెంగాల్ కెమికల్ అండు ఫార్మస్యూటికల్ వర్క్సు లిమిటెడ్




3. పరిశోధనశాల




౪. పరిశోధనశాల లోపలిభాగము


బెంగాల్ కెమికల్ అండు ఫార్మస్యూటికల్ వర్క్సు, లిమిటెడ్




౫. యంత్రములశాల



౬. యంత్రాలయమున తిరగనపట్టు ప్రదేశము



౭. సున్నితములైన పనిముట్లను తయారుచేయుట



౮. నిప్పనుఆర్పేయంత్రములు-వానిపరిశీలనము

చుందురు. కాగితములుజేయు పరిశ్రమలోగూడా దీని యుపయోగము గలదు.

మగ్నగంధకితము (Magnesium sulphate)

చెన్నపట్టణప్రాంతములనుండి "మగ్నకర్బనితము" (Magnesium carbonate)ను ఈ కర్మాగారమువారు దిగుమతిచేయుదురు. మగ్నకర్బనితము, మగ్నము లేక 'మ్యాగ్నీషియం' (Magnesium) యను ధాతువు, కర్బనము (Carbon—బొగ్గు), మరియు ప్రాణవాయువు (Oxygen)యొక్క రాసాయనికసంయోగముచే గలిగిన మిశ్రద్రవ్యము (Compound). ఇది సున్నపురాయివలె గట్టిగాను, శుభ్రమైన తెల్లనివర్ణమును గలిగియుండును. భూగర్భశాస్త్రములో "మ్యాగ్నసైట్" (Magnesite) అను నామాంతరము దీనికి గలదు. సున్నపురాతిని దీయునట్లే దీనినిగూడా భూమిలోనుండి త్రవ్వి తీయుదురు.

యంత్రసాధనముచే 'మ్యాగ్నసైట్' పెల్లలను సన్నగా పొడిచేసి శుభ్రమైననీటిలో జేర్చెదరు గంధకధృతి మట్టిద్రావకముతో జేర్చినకొలది, మగ్నకర్బనము యొక్క రాసాయనికవియోగము (decomposition) గలిగి, మగ్నగంధకము తయారగను. మగ్నకర్బన మెంతవరకు సంపూర్ణముగా రాసాయనికవియోగమును జెందదో (Does not completely decompose), అంతవరకు గంధకధృతమును చేర్చినకొలది, కర్బనద్వ్యామ్లజనిద మను వాయువు (Carbon dioxide) వెడలుచుండుటచే ద్రావకము (Liquor)లో నుండి బుద్బుదములు పైకి వచ్చుచుండును. అనగా ద్రావకము పొంగుచుండును. గాన ఈపొంగుట మానునంతవరకు ధృతమునుజేర్చి, ద్రావకము నంతను బాగా గలుపుచుందురు.

ఇట్లు సిద్ధమైయున్న 'మగ్నగంధకితము' యొక్క ద్రావకమును, పటికయొక్క ద్రావకమును కాచి నిర్జలీకరించిన విధముగానే, నిర్జలీకరించెదరు. సన్నని స్ఫటికము లేర్పడును. ఈ స్ఫటికములను మళ్లి నీటిలో విలీనము చేసి, కాచి, నిర్జలీకరించి, స్ఫటికీకరించినచో, మిక్కిలి శుభ్రమైన మగ్నగంధకితముయొక్క స్ఫటికము లేర్పడును. ఇట్లు పలుమారు స్ఫటికీకరించు విధానమును " Recrystallisation " అనియెదరు. ఇట్లు తయారు చేయబడిన లవణమును ' సెంట్రిఫ్యూగళ్ యంత్రము ' (Centrifugal Machine)లో నుంచి, యంత్రమును కొంతసేపు త్రిప్పిన, లవణములోనుండు నీరంతయు వెడలిపోవును. ఇప్పుడు ఇది విక్రయించుటకు దగినస్థితిలో నున్నదని చెప్పవచ్చును. ఇది తెల్లనిపొడిగా నుండును. దీనినే ఆంగ్లవైద్యులు "ఎప్సంసాల్టు" (Epsom salt) అనియెదరు. ఇది విరేచనకారి. ఈ కర్మాగారములో ప్రతిదినము $1\frac{1}{2}$ టన్నుల మగ్నగంధకితము తయారగుచున్నది.

లోహగంధకితము_అన్నభేది (Ferrous-sulphate)

సన్నని లోహపుదూరును ఘాటుగల గంధకధృతితో కొంచెముకాచిన యది ధృతములో విలీనమైపోవును. ఇట్టిద్రావకమును, పటికనుచేయు విధానములో జెప్పినట్లుల, యావిరితోగాచి స్ఫటికీకరించెదరు. పసరువర్ణముగల అన్నభేదియొక్క స్ఫటికము లేర్పడును. దీనిని, సిరాచేయుటలో, మరియు గుడ్డలకు రంగువేయుటలో ఉపయోగింతురు. మరెన్నియో యుపయోగములు గలవు. ప్రతిదినము (౨౬౦) సేర్ల అన్నభేది ఈ కర్మాగారములో దయారుచేయబడుచున్నది. ఇది, లోహము, గంధకము, మరియు ఆమ్లజని (ప్రాణవాయువు-Ozvgen) యొక్క సంయోగముచే గలిగిన మిశ్రపదార్థము.

అమ్మోనియా (Ammonia), మరియునింకెన్నియో లెక్కలేని రసాయనములు చేయబడుచున్నవి. విస్తరభీతిచే ప్రస్తుతము వాటినిగూర్చి వ్రాయలేదు. మరియొకపుడు వ్రాసెదను.

రసాయనికపరిశ్రమాలయములలో, పరీక్షణాలయము లేక "ప్రయోగశాల" (Laboratory-ల్యాబొరేటొరీ) యొక్క ప్రాముఖ్యము నింతని చెప్పవలసినది లేదు. రసాయనశాస్త్రజ్ఞుని (Chemist)చే పరీక్షింపబడని వస్తువొకటైనను విక్రయమునకు బంపబడదు. ప్రతిరసాయనముయొక్క మాదిరిని (Sample) తయారుకాగానే, పరీక్షాలయమునకు, పరీక్షార్థమై పంపెదరు. రసాయన శాస్త్రజ్ఞుడు పరీక్షించి యావస్తువుయొక్క పరిమాణసంఘటనము శాస్త్రానుసారముగా నున్నదనివ్రాసిన తరువాతనే దానిని విక్రయింతురు. కర్మాలయములోనికి తేబడు ఖనిజములు (Ores), నూనెలు, మొదలగునవి

కూడా, పరీక్షింపబడును. రెండుపటములు ప్రయోగశాలను జూపుచున్నవి. (చూ. చిత్రములు ౩, ౪). ఒక చక్కని యంత్రశాల (Work shop) కూడా గలదు. కర్మాలయములో చెడిపోయిన యంత్రములను బాగు చేయుటేకాక, సున్నితమైన త్రాసులను (Chemical balances) మరియు, కళాశాలల యుపయోగార్థమై యంత్రములను physical apparatus తయారుచేయు దురు. (చూ. చిత్రములు ౫, ౬, ౭.) అగ్ని ప్రమాదము చే కర్మాలయమును రక్షించుటకుగాను "Fire King" "ఫైరు కింగు" అను యంత్రములను జేసియుంచినారు. వీటిని విక్రయమునకు గూడా సిద్ధముగా నుంతురు. (చూ. చిత్రము ౮.) కర్మాలయముయొక్క కార్మికుల సౌకర్యార్థమై, కర్మాలయములోనే యొక వైద్యశాల గలదు. ఉచితముగా ఔషధము లీయబడును.

రెండవ వ్యాసములో ఔషధముల(Pharmaceutical preparations) ను జేయుపద్ధతులను గురించి వ్రాసెదను.

ఆంధ్రదేశమంతటిలో, నిటువంటి గొప్ప కర్మాలయ మొకటైనను లేకపోవుట,యాంధ్రులలో నీవిషయము లో నింకను సంచలనము గలుగలేదని తెల్పుచున్నది. మరియు వారి వెనుబాటునుగూడా వెల్లడిచేయుచున్నది!

సంసారసాగరము

జి. జాహ్నవ గారు

రాఘవుని మేలి వింటినారాచములకుఁ
దనివిదీరని కుంభజు దాహమునకు
జిక్కకేరీతి దాటివచ్చితివో నీవు
సంకటకదంబ, సంసార సాగరంబ!

త్రవ్వఁబడలేదు సగరనందనుల చేత
సంగమింపదు వాహినీ సముదయంబు
యేవిధి గభీరతం దాల్చినావో నీవు
సంకటకదంబ, సంసార సాగరంబ!

రంగదుత్తుంగభంగతిమింగిలాకు
లంబయిన వార్ధిదాటఁగలాఁడు నరుఁడు
నిన్నుఁ దరియింపఁజాలఁడు నిక్కవంబు
సంకటకదంబ, సంసార సాగరంబ!

నీ యుదంతం బెఱింగి గాంగేయుఁ డొకఁడె
మునిఁగి తేలఁడు నీయందు! మునిఁగి నీదు
వనటఁ గుందకవచ్చె నోడ్డున కెవండు
సంకటకదంబ, సంసారసాగరంబ!

భూమి భారంబు మాన్ప నుద్భూతుఁడైన
రాముననంతటివాఁడు నీ ప్రళయ గర్జ,
కాఁగఁ జాలక తలక్రిందు లయ్యెఁగాదె
సంకట కదంబ, సంసారసాగరంబ!

ఈశ్వరధ్యానదివ్య దమృతముఁ గ్రోల
నభిలషించు కుటుంబి హృదంబకమ్ము
తెరవుమూయున భేద్య భిత్తికవు గాదె?
సంకటకదంబ, సంసారసాగరంబ!

శమదమాద్యంత విమలగుణముల చేతఁ
దపముగావించు గాధినందనునిఁ ద్రోల్లి
మేనకామిషంబున నాక్రమించు కొనవె
సంకటకదంబ, సంసార సాగరంబ!

సాంద్ర నీలాంబుధరపరిచ్ఛన్నమైన
కృష్ణపక్షనిశీథమందేని దిక్కు
దోఁచెడింగాని నీయందు దోఁచదకట!
సంకటకదంబ, సంసార సాగరంబ!

ఉదధి, యొకసారి యుప్పొంగు నొక్కసారి
నిమ్మళించునుగాని శాంతింప వెపుడు,
గగనమంటుచుఁ గష్టభంగములతోడ
సంకటకదంబ, సంసార సాగరంబ!

చెన్నరాజధానియందు 1924సం. జులై మొదలు సెప్టంబరువఱకు ముద్రితములై ప్రచురింపబడిన

ఆంధ్రగ్రంథముల పట్టిక

పద్యకావ్యము—౧. పురాణము ఇతిహాసము

అజామిళచరిత్ర—వై. హనుమంతరావు

పట్టాభిరామాయణము—జి. వెంకటరామకృష్ణ

బాలభాగవతము—వి. ఆర్. హసబ్నిస్

రుక్మిణీకల్యాణము

సావిత్ర్యుపాఖ్యానము

పద్యకావ్యము—౨. మాహాత్మ్యము

భద్రాచలసంపూర్ణమాహాత్మ్యము, ప్రథమఖండము—కోడి
చేటి సీతారామానుజాచార్య

జగన్నాథమాహాత్మ్యము—కె. సూర్యనారాయణ

పద్యకావ్యము—౩. ప్రబంధము

పంచతంత్రము—బై. వెంకటనాథకవి

లక్ష్మీనారాయణపరిణయము—శివపల్లి సర్వోత్తమకవి

వీరమతి—డి. రాజశేఖరం

హైమవతీవిలాసము—పి. చిదంబరశాస్త్రి

పద్యకావ్యము—౪. శతకములు

అచలశతకరత్నావళి—పి. చిన్నయ్య

కోదండరామశతకము—మేడిసెట్టి నారాయణస్వామి

చంద్రమౌళీశ్వరశతకరాజము—దేవరపల్లి చంద్రయ్య

త్రిపురాంతకేశ్వరశతకము—పి. పాలంకయ్య

దాశరథీశతకము—కంచెర్ల గోపనకవి

బాలశతకము—కోణిదెన వెంకటనారాయణ

భాస్కరశతకము

రంగేశ్వరశతకము—వి. హనుమయ్య

రామగోపాలశతకము—చక్రవర్తుల శ్రీనివాసాచార్య

రామశతకము—యం. కమలమ్మ

విసనకర్రశతకము—జి. యస్. యె. నరహరిరావు,
[జి. యె. యె. యె. బ్రహ్మేశ్వరి

శ్రీహరిశతకము—పి. సూరయ్య

సూర్యనారాయణశతకము—వరాహ వెంకటనృసింహ కవి

పద్యకావ్యము—౫. ఇతరములు

అన్నదానఫలము—గుండాల వీరాస్వామి

ఆంజనేయసూర్యకృష్ణదండకములు

ఆశీర్వచనపద్యములు—చాగంటి వీరభద్రరావు

ఉద్యోగభోగము—మన్నవ నరసింహం

ఉన్నతతరగతులకు గద్యపద్యములు—కూచి నరసింహం

ఔదార్యం—కర్ణ వీరరాఘవరావు

కుమారకంఠము—కవికొండల వెంకటరావు

గోపికాస్త్రీల జలక్రీడలు, గోవ్యాఘ్రమైత్రి—కేతరాజు
వెంకటరామయ్య

నీతిభవనము—క్రొత్తపల్లి సూర్యారావు

పద్యరత్నావళి, ప్రేమలత—గోమఠము రామానుజాచార్యు

భారతి—జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి [లు

వీరమహిమ, విశ్వేశ్వర తారావళి—కె. చిన వీరభద్రయ్య
అయ్యవారు

శ్రీరామదండకము—నిష్ఠల విశ్వనాథము

శ్రీరామస్తుతి—తూము సీతారామయ్య [శాస్త్రి

హితోపదేశములు, మిత్రలాభము—నెంపటి కుటుంబయ్య

వచనకావ్యము—౧. కథలు

అనాథబాలిక—పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

ఇల్లాలు (మొదటిభాగము)—దంటు లక్ష్మీకాంతము

కళావతి—వంకాయల లక్ష్మణస్వామి

కొండడి చరిత్రము—కె. శ్రీరామశాస్త్రి

గడబిడగత్తర—కాళహస్తి సూర్యప్రకాశరావు

చమత్కారమంజరి—చిలకమర్తి లక్ష్మీనరసింహం

చమత్కారమంజరి (ద్వితీయభాగము)—చిలకమర్తి లక్ష్మీ
నరసింహం

చార్ దర్వేషుకథలు—వై. మల్లికార్జునుడు

తెనాలి రామకృష్ణునికథలు దొంగయెవరు? దొరయెవరు
నాజూకు పెళ్లికొడుకు—యస్. శ్రీహరిరావు
భార్యను దొంగిలించుట
శుకసప్తతికథలు
సురస
స్త్రీచమత్కారము—జె. ఆర్. సాలమన్

వచనకావ్యము—౨. నవలలు

కమల—ములుగు శివానందశాస్త్రి
,, ద్వితీయభాగము
కుముద్వతి—పులవర్తి కమలావతీదేవి
ఘోరప్రతిక్రియ—కేతవరపు రామకృష్ణశాస్త్రి
ఛద్మవేషి—చిల్లరిగె శ్రీనివాసరావు
జయాపజయములు—వేంకటపార్వతీశ్వర కవులు
ప్రేమలత—చెలికాని సూర్యారావు
ఫాస్టు, ద్వితీయభాగము—వెదురుమూడి శేషగిరిరావు
రసపుత్రజీవనసంధ్య—భాగవతుల లక్ష్మీనరసింహ శర్మ
లండనురహస్యములు—పింగళి నాగేంద్రరావు
వీరాబాయి—మహాకాళి వేంకటేశ్వరరావు
శ్రీధరవిజయము—సి. శ్రీనివాసరావు

వచనకావ్యము—3. చరిత్రలు

గ్రేటుబ్రిటను చరిత్ర, ప్రథమభాగము—ఎ. వి. రామదాసు
ప్లాసీయుద్ధము—మొసలికంటి సంజీవరావు
బాలురస్థానిక చరిత్రకథలు—జి. రత్నముపిళ్లె
హిందూదేశచరిత్రము—సి. నరసింహారావు
హిందూదేశచారిత్రకకథలు—యం. కె. సుందరవరదాచార్యులు
హిందూదేశచరిత్రకథలు—వి. సీతారామకృష్ణయ్య
హిందూదేశచరిత్రకథలు—కె. ఎ. వీరరాఘవాచార్య

వచనకావ్యము—౪. జీవితములు

అహల్యాబాయి—శొంఠి గంగాధరరామశాస్త్రి
గౌతమబుద్ధచరిత్రము—సీరిపి ఆంజనేయులు
పండిత యలమర్తి ఆంజనేయ శాస్త్రిగారి చరిత్రము—బి. కోటయ్య
బాజీరాయనిచరిత్ర—రాచకొండ అన్నయ్యశాస్త్రి
శతకకవులచరిత్రము—వంగూరి సుబ్బారావు
సబ్బారపు అప్పలస్వామిగారి జీవితము—కోలా అప్పలనరసింహదేవు

వచనకావ్యము—౫. రాజకీయము

కబ్ వెబ్ పబ్ గ్రామసభ—బిసెంటు

వచనకావ్యము—౬. ఇతరములు

అతిథిపూజ—పోలిశెట్టి ఆదినారాయణగుప్త
అగ్నికులక్షత్రియమహాసంఘము, ఆరవయేటిచరిత్ర
ఆంజనేయచరిత్రము—కొప్పరపు వెంకట్రమణయ్య
ఆంధ్రజాతీయ విద్యాపరిషత్తుయొక్క యుద్దేశములు నిబంధనలు
ఆంధ్రనాటకరంగము—గొల్లపూడి శ్రీరామశాస్త్రి
ఆంధ్రరాష్ట్ర జాతీయవిద్యావిధానము, కపటబంధుబహిష్కారము—వి. నారాయణమూర్తికవి
కార్యక్రమము—కృష్ణాజిల్లా కాంగ్రెస్ కమిటీ
కాశీ రామేశ్వరాది క్షేత్రప్రదర్శిని—మామిడిపర్తుల వెంకటకృష్ణశర్మ
కుమారవాచకము ఆరవతరగతి—యం. సుబ్రహ్మణ్యం, పి. వెంకటరామశాస్త్రి
కులాచారపరీక్ష—రివరెండ్ పురుషోత్తమనాదరి
గజేంద్రమోక్షం
గద్యపద్యకావ్య సంగ్రహము, ప్రథమభాగము
గద్యపద్యరత్నావళి
గ్రామకరణ పరీక్షాదర్శిని
జపానుప్రళయము—పి. రామమూర్తి
జైమినీ భారతవచనము—ధూళిపాల యజ్ఞనారాయణ
ట్రోజన్ యుద్ధము—దివిపాల వీరేశలింగము
తెలుగు టెక్స్టుబుక్కు—మొదటిభాగము
తెలుగు టెక్స్టుబుక్కు—రెండవభాగము
దమయంతి—అవసరాల శేషగిరిరావు
దస్తావేజులమతలబు
దీనపోషకసమాజము—పదునారవసంవత్సరచర్య
ధ్రువచరిత్ర—ద్రోణంరాజు సీతారామరావు
నాల్గవకథావాచకపుస్తకము—యం. సుబ్బారాయుడు, కె. వీరేశలింగము పంతులు
నానారాజ్యసంఘము—వెంపటి పురుషోత్తము

నిజాంరాష్ట్రాంధ్రోద్యమము—శిష్ట్లా నాగభూషణశర్మ
పతివ్రతలచరిత్రము—మంగిపూడి వెంకటశర్మ
పురగిరిక్షత్రియ చింతామణి
ప్రథమమయూఖము—ముత్తనేని వెంకటచెన్న కేశవులు
ప్రకృతిశాస్త్రవిషయములు, మొదటి భాగము—కె. సూర్యనారాయణశాస్త్రి
ప్రథమవార్షికమహాసభ
బాలభారతము—వి. ఆర్. హాసబ్నిస్
బాలరామాయణము—వి. ఆర్. హాసబ్నిస్
బుద్ధిహితము, ఇహపరసౌఖ్యము—సి. శరభయ్య
మయూరధ్వజచరిత్ర—కె. సంజీవమూర్తిరావు
రెండవతరగతిపుస్తకము
మేంద్రమహాజనవికాసము—పత్తూరు వెంకయ్య
యమలోకశిక్షలు—కొడాలి సత్యనారాయణ
లకోటా—ప్రొఫెసర్ కె. యస్. గిరిరావు
లక్ష్మీజగన్నాథసంవాదము
వాల్మీకిరామాయణసంగ్రహము
విదురుడు—నడకుదుటి వీరరాజుపంతులు
విజ్ఞానవల్లరి—టి. వెంకయ్య
విశాఖపట్టణముజిల్లా జాతీయోపసంఘతీర్మానములు
వృక్షశాస్త్రము, మొదటిభాగము— కె. సూర్యనారాయణశాస్త్రి
శాస్త్రవాచకపాఠములు, 3,౫,6 నెంబరులు—యం. సాంబశివరావు
సంచిత ప్రారబ్ధ ఆగామి కర్మలు—జె. శ్రీనివాసరావు
సంభాషణ
సంవత్సరపునివేదిక
సత్యహరిశ్చంద్ర—చంద్రగిరి చిన్నయ్యనాయుడు
సౌగంధికాహరణము—పి. వెంకటసుబ్రహ్మణ్య శర్మ
స్కూలుఫైనలు టెక్స్టుబుక్కునకు నోట్సు
శ్రీభక్తవిజయము
పతివ్రతామాహాత్మ్యము—చంద్రగిరి చిన్నయ్యనాయుడు

నాటకములు

అహల్యాసహస్రాక్షము— కల్లూరు యజమాన వెంకటనారాయణరావు
ఊర్వశీశాపవిమోచనము అను సువ్వాలి— అయినాపురపు సుందరరామయ్య
కృష్ణరాయవిజయము—సింగవరపు రాఘవశాస్త్రి
కృష్ణరాయవిజయము అను విద్యానగర సామ్రాజ్యము
చంద్రహాస—టి. శేషాచారి
జయప్రద—నల్లమిల్లి బసివిరెడ్డి
తారాబాయి అను పృథ్వీరాజవిజయము—దేవినేని వీరరాఘవయ్య
ద్రౌపదీకల్యాణనాటకము—జి. అబ్బయ్యదాసు
ప్రతిజ్ఞా చాణక్యము—భాగవతుల నరసింహ శర్మ
ప్రభాకర—జె. యల్. నరసింహం
ప్రహ్లాదచరిత్రము
మదనసుందరీ పరిణయము—పండితసూర్యప్రకాశశర్మ
మహానంద—కొడాలి సత్యనారాయణరావు
మహేంద్రజననము—తుమ్మల సీతారామమూర్తి చౌదరి
మారుతివిజయము—కోపల్లి వెంకటరత్నకవి
మారుతివిజయము అను లంకాదహనము—గూడూరు కోటీశ్వరరావు
మాళవికానాటకము—ములుగు చంద్రమౌళిశాస్త్రి
ముక్తికిల—ఆలూరి గోపాలరావు
మేధానిధినాటకము—దేవాద్రి కోటయ్య
విచిత్రవివాహము—వాడ్రేవు మల్లపరాజు
శశిరేఖాపరిణయనాటకము—రాజా జగన్నాథరావు
సంగీతఇంద్రసభ—బి. టి. రాఘవాచార్యులు
సంగీతశ్రీకృష్ణరాయబారము—చక్రావధానుల మాణిక్యశర్మ
సతీసావిత్రి—మునిపల్లి హనుమంతరాయశర్మ
సావిత్రి—యస్. వెంకటసుబ్బారావు, బి. వెంకటనరసరాజు

ప్రహసనములు

కలియుగకాంత—యస్. ఆర్. కె. మూర్తి
కీరవాణికిటుకు
కొండయాత్ర, మొదటి భాగము—గుండా సుబ్రహ్మణ్యశాస్త్రి
గమ్మత్తుచావు—పింగళి నాగేంద్రరావు
గర్భాధానము—శిష్ట్లా రాధాకృష్ణయ్య
చిన్నదానిచిటుకు—గరికిపాటి కామేశ్వరరావు

తమాషాఆచారము—ద్రోణంరాజు సీతారామ రావు
దొంగస్వాములవారు—యన్. రామమూర్తి
మిడిమేళము—పి. సూర్యప్రకాశరాయుడు
మేజువాణీ ప్రహసనము—సత్యవోలు అప్పారావు
మేరీమాధవము—వడ్డాది శేషగిరిరావు
మోహనాంగి—పి. వెంకటరమణ
రంగసాని—బద్దిరెడ్డి కోటీశ్వరరావు
వితంతు వివాహము—గరికిపాటి కామేశ్వరరావు
షోకిల్లా పెండ్లాము—తాటిపర్తి ఆదినారాయణ
షోకేలచిన్నది

వ్యాకరణము

ఆంధ్రచంద్రిక, ప్రథమభాగము—కేశవరపువెంకటశాస్త్రి
ఆంధ్రభాషాలక్షణశిక్షణము—పూతలపట్టు శ్రీరాములు రెడ్డి
తెలుగుగ్రామరు—పి. అబ్బాయినాయుడు
పరిమితవ్యాకరణము—ములుకుట్ల వెంకటకృష్ణశాస్త్రి

జ్యోతిషము

జాతక భాగము—చల్లా లక్ష్మీనృసింహశాస్త్రి
రెడ్డిమతశాస్త్రము

గణితము

అంకగణితము—సి. కోటీశ్వరరావు
కలపకొలతపట్టీలు
క్రొత్తచట్టపుగణితము (ఐదవతరగతి)
గణితసంగ్రహము—డి. రామమూర్తి
ప్రారంభగణితము, రెండవపుస్తకము—వి. వెంకటసుబ్బయ్య
 ,, మూడవపుస్తకము ,,

వైద్యము

జట్టుచికిత్స—కొండపర్తి వీరభద్రాచార్యులు
ముఖవైఖరీవిద్య—ఎ. బాలముకుందదాసు
క్షీరచికిత్స, క్షీరపద్యము—బి.టి. వరదాచారి; క. వెంకట కృష్ణారావు నాయుడు
నేను కాపురముండెడి అద్భుతగృహము
వైద్యమిత్ర—జి. సేతుమాధవరావు
శరీరశాస్త్రసంబంధమైన ప్రశ్నోత్తరములు
శారీరకధర్మబోధిని—చివుకుల లక్ష్మీనారాయణశాస్త్రి
సహదేవగొడ్లచికిత్స—నారాయణమంత్రి
సుఖాధారబోధిని—కె. యె. గణపతి అయ్యర్

మతము

అర్చ్యి భాగ్యప్పగారి చరిత్రము—జె. ఆర్. జె. ఆలెన్
అర్చ్యిశిష్టమార్కుగారువ్రాసిన పరిశుద్ధ విశేషము
క్రీస్తుమతము
దేవసహాయముగారిచరిత్ర—జె. ఆర్. జె. ఆలెన్
నవనిబంధన గ్రంథము
బాప్టిస్టుమిషనుయొక్క 1923 సం॥రపు రిపోర్టు
బాలప్రార్థన
బ్రహ్మధర్మవ్యాఖ్యానములు
బ్రహ్మోపాసన—పి. నరసింహం
యేసునిమార్గము
సత్యవేదసారసంగ్రహము—రివరెండు జె.బి. మాక్లారిన్
సుకృతమంత్రములు,జ్ఞానోపదేశము— జె.ఆర్.జె. ఆలెన్
హిందూమత దైవపరీక్ష

వేదాంతము

అద్వైతము—భాగవతుల లక్ష్మీపతిశాస్త్రి
ద్వైతాద్వైతరహితబోధిని- పి. సాంబశివరావు
పరమాత్మలక్షణబోధిని—వకుళాభరణపరదేశి
మర్మత్రయదీపిక—మామిడిపూడి వెంకటకృష్ణ శర్మ
రాజయోగ విరాజితము—కె. నరసింహదాసు
సాంబశివాతీతబోధిని—పి. సాంబశివరావు
సీతారామాంజనేయ సంవాదము—పరశురామలింగమూర్తి

నీతి

నీతిగీతావళి—వెలగపూడి దానయ్యచౌదరి
నీతిచంద్రిక—చిన్నయ్యసూరి
నీతిపద్యావళి
నీతిముక్తావళి—యం. వెంకటరత్నం
స్త్రీనీతిగీతములు—బలభద్రకోటయ్య

సంగీతము — ౧. హరికథ

అహల్యాశాపవిమోచనము

జానకీపరిణయము—టి. వెంకటాచలదాసు

మయూరధ్వజచరిత్ర—అయ్యగారి వీరభద్రరావు

రామాయణము, హనుమద్విజయము—మద్దిపాటి వీరరాఘవయ్య

శశిరేఖాపరిణయము—వి. కామేశ్వరరావు

సంగీతము — ౨. గేయము

అచలానందతత్త్వ రహస్యకీర్తనలు—వి. రామదాసు

అభినవరామాయణకీర్తనలు—బల్ల సీతారామరాజు

అష్టోత్తర భగవత్కీర్తనల శతకము—గుంటూరి రామమ్మ

ఊర్మిళాదేవినిద్ర

కామేశ్వరిపాట

కీచకవధ—యం. రామకోటయ్య

ఖద్దరుచీరపాట—పట్టిసపు శ్రీరామమూర్తి

గజేంద్రమోక్షం

గాంధీగోవిందనామములు—పట్టిసపు శ్రీరామమూర్తి

చిత్రకేతూపాఖ్యాననాటకము—నేలటూరి కళాపతిరాయలు

చిదానందలహరి—పి. వీరయాచార్యులు

జనపదములు—కవికొండల వెంకటరావు

దశావతారవర్ణనము

ధర్మరాజుజూదము

నరసింహోదయము—కె. మల్లికార్జునరావు

నారాయణభజనములు—ముక్కంటి నరసింహదాసు

నూతనవేడుకపాటలు

పాటలపుస్తకము—రావిపాటి కామేశ్వరరావు

పాటలరత్నావళి—అక్కపెద్ది లక్ష్మీనారాయణప్ప

భజనకీర్తనలు, ప్రథమభాగము—వారణాశి వెంకటేశ్వరశాస్త్రి

మహేశ్వరవిలాసము—మామునూరి వెంకటరమణమ్మ

మారుతిశతకము—కె. కోదండరామకవి

మోక్షసాధనము—పి. కొండయ్యదాసు

శాంతాకల్యాణము

శ్రావణమంగళవారములకథ, పాటలు—గుండు అచ్చమాంబ

శ్రావణమంగళవారములపాట (2)

శ్రీకృష్ణవిలాసము—పేరూరు మునిదాస

శ్రీకృష్ణుని చల్దులు

సిద్ధివినాయకపూజ—పి. లింగరాజశర్మ

స్త్రీల వేడుకపాటలు—రామకృష్ణసుబ్రహ్మణ్య కవులు

భూగోళము

ఆసియా యూరోపు బొమ్మలభూగోళము—ఏ. రత్నపిళ్లె

ప్రేమబలి

తెలికిచెర్ల కృష్ణమూర్తిగారు, బి. ఏ.

[విశాఖపట్నం సముద్ర తీరమున]

ఏ ప్రశాంత నిశీథమం దీపవిత్ర
    నిర్జన శిలాస్థలంబైన నిర్మలాను
రాగపులకిత హృదయవై ప్రాణనాథు
ప్రణయవికసిత సుందర వదనదర్శ
నోత్సుకతతోడ క్షణ మొకయుగమురీతి
వేచియుంటివో ప్రణయినీ!—
                    వేడియూర్పు
గాడ్పు వడకించు చిమ్మచీకట్ల తెరల
జీల్చి పరువెత్తు తరళదృష్టిని సిగుడ్చి
దెసల బరికించి వేసారి తీవ్రవిరహ
తాపహతి భగ్నహృదయవై నీపవిత్ర
జీవితము ప్రేమకై బలిచేసి, హాస
ఖా! యనుచుగూలితివో—
                    ఎపుడా గభీర
శోకమును వెలిగ్రక్కు నీచూపు జూచి
  తారకల్లని మేఘంపు కారుముసుగు
నందు వడకుచు డాగెనో—
                    ఆకఠోర
దృశ్యము సహించలేక నల్దెసలు నెపుడు
హా సఖా! యని యేడ్చి గాఢాంధకార
మందు మూతలువడెనో!—
                    అనంత దుఃఖ
తాపమున హోరుమని నిరంతరము నేడ్చు
నామహాంబుధి నీమృదులాంగకముల
శీతకరముల గౌగిటజేర్చి, నీదు
రంతశోకమ్ము తన హృదయాంత రాళ
మందెపుడు దాచెనో! కాని—
                    ఆశిలాస్థ
లమును నేటికి నర్ధరాత్ర ప్రశాంత
సమయముల దార లుష్ణాశ్రుజాలము గురియు
మినుకు కన్నులతో జూచు—
                    ప్రణయవహ్ని
శిఖల వేగిన నీమృదుచిత్తశోక
ధూమములదిక్కు లెగజిమ్ము—
                    నామహాబ్ధి
యాలపించును నీయమూల్యంపు ప్రణయ
యుత విభగ్నగీతి—



ఆంధ్రము-గణితశాస్త్రము

దర్భా యజ్ఞేశ్వర సోమయాజులు గారు, బి. ఏ.

(రెండవ సంపుటము-ఎనిమిదవ సంచిక తరువాయి)

1. అంకగణితము (Arithmetic)

ఉదా:—1. ద్రవ్యముల దశాంశీకరణము, చక్రవృద్ధి:—ఎంతసొమ్మైనను రూపాయియొక్క దశాంశములుగా ప్రకటించుట ద్రవ్యముల దశాంశీకరణ మనబడును.

రూపాయిల అణాల పైసల దశాంశీకరణము:—ఈదిగువసంబంధములను జ్ఞప్తియందుంచుకొనినచో అణాలను దశాంశవిధిని ప్రకటింపసాధ్యమగును.

8 అణాలు=0.5 రూపాయి

4 ,, =0.25 ,,

2 ,, =0.125 ,,

1 అణా =0.0625 ,,

1 పై $= \frac{1}{192}$ రు= $\frac{5}{960}$ రు= $\frac{5}{960} \times 1$ రు= $\frac{5\times1000}{960} \times \frac{1}{1000}$ రు $= 5 \times \frac{1000}{960} \times 0.001$ రు= $5 \times \frac{25}{24} \times 0.001$ రు $= 1\frac{1}{24} \times 0.005$ రు.

మన కొసగిన పైసలసంఖ్యను 5 చే గుణించి యాగుణిజమును వ్రాసి దానియందు మూడు దశాంశస్థానములను గుర్తించి దానిలో 1/24 వంతు కలిపినచో నాపైసలు రూపాయియొక్క దశాంశముగా ప్రకటమగును.

ఉదా:—2. చక్ర వృద్ధి. (Compound interest) రు 976—13—7 మీద 6°/₀ చొప్పున 3 ఏండ్ల కగు చక్రవృద్ధిని కనుగొనుడు.

13 అ. = (8 అ. + 4 అ. + 1 అ.)

= (0.5 + 0.25 + 0.0625)రు.

= 0.8125 రు.

7 పై. = $(7 \times 0.005) \times 1\frac{1}{24}$

$= 0.035 + 0.035 \times \frac{1}{24}$

$= 0.035 + 0.001458\dot{3}$

$= 0.036458\dot{3}$

13 అ. 7 పై. = $0.848958\dot{3}$

రు.	అ.	పై.	
976	13	7	= $976.848958\dot{3}$ రు.

రూపాయిల అణాల పైసలతోడి వ్యవహారములందు నాలుగు దశాంశముల పర్యంతము ఫలితములను సునిశ్చితముగా ప్రకటించిన చాలును.

రు.	
976.84896	ప్రథమసంవత్సరమునకు అసలు
58.61088	,, వడ్డీ
1035.45984	ద్వితీయసంవత్సరమునకు అసలు
62.12754	,, వడ్డీ
1097.58738	తృతీయసంవత్సరమునకు అసలు
65.85522	,, వడ్డీ
1163.44260	తృతీయసంవత్సరాంతపుమొత్తము
976.84896	అసలు
186.59364	మూడేండ్లచక్రవృద్ధి (వడ్డీ)

[ప్రతిసంవత్సరమునందలి అసలులో చివర రెండంకెలను విడిచిపెట్టి 6 చే మనస్సున గుణించుము గుణిజ

మును కుడిచేతి చివరసంఖ్యక్రింద మొదలు యొడమనైపున కంకెక్రింద యంకెనువ్రాసిన నాసంవత్సరము వడ్డీ లభించును. ఆయేటియసలువడ్డీలను కలిపినచో తరువాతసంవత్సరమున కసలువచ్చును.]

186.5936	
16	రూపాయిల భిన్నమునుమాత్రము 16 చే గుణింపగా నణాలు లభించును; అణాల లోని భిన్నమును 12 చే గుణింప పైసలు లభించును.
9.4976	
12	
5.9712	

మూడేండ్లయనంతరపు చక్రవృద్ధి రు. 186-9-6 అగును.

2. బీజగణితము (Algebra)

ఉదా. ౩. ద్విపాదసిద్ధాంతము. (Binomial Theorem) (క + చ) వంటివి 'స' గుణాంకము లున్నవనుము. (క + చ) (క + చ) (క + చ ......

దీనియందలి ప్రతిగుణావయవమునుండియు నొక్కొకబీజమునే గ్రహించి వానినెల్ల గుణించినచో, వీనిపరంపరిత గుణిజమునందలి (continued product) యొకపదము (term) లభించును; సాధ్యమగు నన్నివిధముల నిట్లొనర్చితిమేని యీ పరంపరితగుణిజమునందలి యన్నిపదములును మనకు లభించును.

వీనిలోనుండి ప్రతిపర్యాయమును 'క' బీజమునే కైకొనవచ్చును. ఇయ్యది ఒక్కొక్కవిధముగా మాత్రమే కైకొన నణువగుచున్నది. దీనంజేసి '$క^{స}$' యీగుణిజమునందలి యొకపదమైనట్లు తెలియుచున్నది.

'చ' బీజను నొకసారి తీసికొని 'క'ను మిగిలిన 'స-1' పర్యాయములు తీసికొనవచ్చును. 'చ' నిట్లుతీసికొన సాధ్యమగువిధములసంఖ్య, 'స' వస్తువులనుండి 1 దానిని యెన్నిపర్యాయములు తీసికొన సాధ్యమగునో యాసంఖ్యకుసమానము; అనగా $^{స}C_{1}$ * యగును. దీనంజేసి

'$^{స}C_{1}క^{స-1}చ$' మనకు లభించుచున్నది.

మఱియు, 'చ' బీజమును రెండుపర్యాయములును 'క'ను తక్కిన 'స-2' పర్యాయములును గ్రహింపవచ్చును. ఇట్లు రెండేసి 'చ'ల నెన్నిసారులు గ్రహింప సాధ్యమగునో యాసంఖ్య, 'స' వస్తువులనుండి 2 డేసి వస్తువుల నెన్నిసారులు గ్రహింపగలమో యాసంఖ్యకు సమానము; అనఁగా '$^{స}C_{2}$' అగుచున్నది. దీనంజేసి

'$^{స}C_{2}క^{స-2}చ^{2}$' మనకు లభించుచున్నది.

పదపడి, సాధారణముగ 'చ'ను 'ప' పర్యాయములు ('ప' యన్నది 'స' కంటె చిన్నదియగు ధనపూర్ణాంకము.) గైకొని 'క'ను మిగిలిన 'స-ప' పర్యాయములు గైకొనవచ్చును. 'ప' సంఖ్య 'క' లను గైకొనువిధముల సంఖ్య 'స' వస్తువులనుండి 'ప' వస్తువుల చొప్పున నెన్నుకొన సాధ్యమగు విధములసంఖ్యకు సమానమగును. అనగా నిది '$^{స}C_{ప}$' యగుచున్నది. దీనంజేసి

'$^{స}C_{ప}క^{స-ప}చ^{ప}$' మనకు లభించుచున్నది.

అన్నిసారులునుగూడ 'చ' బీజమునే కైకొనుట యొక్కసారి మాత్రమే సాధ్యమగును. దీనంజేసి '$చ^{స}$' యనుపదములభించుచున్నది. '$^{స}C_{స}=1$' యగుటు నియ్యది '$^{స}C_{ప}క^{స-ప}చ^{ప}$' యందు 'ప=స' యగునట్లొనర్చుటచే గల్గు ఫలితమునకు సమానమగుచున్నది. ఇట్లగుడు,

'(క + చ) (క + చ) (క + చ)'...'స'

గుణావయవములకు

$$= క^{స} + {}^{స}C_{1}క^{స-1}చ + {}^{స}C_{2}క^{స-2}చ^{2} + \cdots + {}^{స}C_{ప}క^{స-ప}చ^{ప} + \cdots + చ^{స}$$

దీనంజేసి 'స' యేదేని ధనపూర్ణాంకమైనపుడు

$$(క+చ)^{స} = క^{స} + {}^{స}C_{1}క^{స-1}చ + {}^{స}C_{2}క^{స-2}చ^{2} + \cdots + {}^{స}C_{ప}క^{స-ప}చ^{ప} + \cdots + చ^{స}$$

యని తేటపడుచున్నది.

---

* ఆంగ్లమున 'C' యని 'Combination' అను పదముయొక్క ప్రథమాక్షరమును వాడుచున్నారు. 'అంకమీమాంస'యొక్క మొదటి యక్షరము 'అ' కు బదులు 'C' అనుస్వారమును ప్రయోగించి చిహ్న సామ్యమును కల్పించితిని.


ఈపైసిద్ధాంతమే ద్విపాదసిద్ధాంతమనుపేర బరగుచున్నది. కుడివైపున్న శ్రేఢిని '$(క+చ)^{స}$' యొక్క విస్తృతమూల్యమందురు. కుడివైపున్న శ్రేఢియందు '$^{స}C_{1},\ ^{స}C_{2}, \ldots\ldots$' మున్నగు సంకేతల మూల్యములను స్థానాపన్నములుగజేసినచో ద్విపాదసిద్ధాంతమును సాధారణముగాబ్రకటించెడి యాకారమున నిది సంప్రాప్తించును.

$$`(క+చ)^{స} = క^{స} + సక^{స-1}చ + \frac{స(స-1)}{1.2}క^{స-2}చ^{2} + \cdots + \frac{\lfloor స}{\lfloor ప \ \lfloor స-ప}క^{స-ప}చ^{ప} + \cdots + చ^{ప}'$$

ఇది, 'స' యేదేని ధనసంపూర్ణాంకమైనపుడు, ద్విపాదసిద్ధాంతముయొక్క యుపపత్తి యగుచున్నది.

3. రేఖాగణితము (Geometry)

త్రిభుజముయొక్క మూడుకోణములును గలిసి రెండు సమకోణములగును.



"కచట" త్రిభుజము నొసగిరనుము.

ఇప్పుడు '∠లు కచట, చటక, టకచ" మూడును గలిసి రెండు సమకోణములని నిరూపింపవలెను.

"చట" భుజమును "త" పర్యంతము దీర్ఘీకరించి "ట" నుండ "కచ"కు సమానాంతరముగానుండు "టప" రేఖను గీయుము.

ఉపపత్తి:—

∵ "చక, టప" సమానాంతరరేఖలు "కట" చే సంపాతీకరింపబడుడు,

∴ "∠కటప"=అన్యతర"∠టకచ". మఱియు,

∵ "చక, టప" సమానాంతరరేఖలు "చత" చే సంపాతీకరింపబడుడు.

∴ బాహిర"∠పటత"=సన్ముఖాంతర"∠కచట".

∴ త్రిభుజముయొక్క బాహిర "∠కటత" =సన్ముఖాంతర"∠టకచ + ∠కచట"

ఈ సమానరాసులకు "చకట" కోణమును కలిపినచో అప్పుడు "∠కటత + ∠చటక= ∠టకచ + ∠కచట + ∠చటక" కాని సంసక్త"∠కటత + ∠చటక"=2 సమ∠లు.

∴ "∠టకచ + ∠కచట + ∠చటక" = 2 సమ∠లు. ఇ. అ. ఇ.

4. బీజజ్యామితి (Analytical Geometry)

ఏదేని దత్తరేఖయందండవృత్తమును సంపాతీకరించు బిందువులను కనుగొని, యాదత్తరేఖ యండవృత్తమునకు స్పర్శరేఖయగుటకు వలయు నియమమును కనుగొనుట.

అండవృత్తముయొక్క సమీకరణము,

$$"\frac{నీ^{2}}{క^{2}} + \frac{య^{2}}{చ^{2}} = 1" \ldots\ldots (I)$$ యు

దత్తసరళరేఖయొక్క సమీకరణము,

$$"య = టనీ + త" \ldots\ldots (II)$$ యు అనుము.

అండవృత్తమునకును సరళరేఖకును నుభయసామాన్యముగానున్న బిందువులకడ నీ రెండు సంబంధములునుగూడ వర్తించును. ఉభయసామాన్య బిందువులకడ,

$$`\frac{నీ^{2}}{క^{2}} + \frac{(టనీ+త)^{2}}{చ^{2}} = 1'$$

లేక $`(చ^{2}+క^{2}ట^{2})నీ^{2} + 2టతక^{2}నీ + క^{2}(త^{2}-చ^{2}) = 0 \cdots$ … (III).

ఇదియొకవర్గాత్మకసమీకరణము; వర్గాత్మకసమీకరణములకు యథార్థ, సమ, ఊహ్యాగుణములు గల మూల్యములు (Roots) రెండుండును.

కావున 'నీ'కి రెండుమూల్యము లుండును; వీనికి తాదృశముగా 'య' కుండు రెండుమూల్యములను (I!) సమీకరణమువలన చేకూరును.

సమీకరణము (III)యొక్క మూల్యములు సమానము గావలెననినచో నీ దిగువనియమము వర్తింపవలెను.

$$క^{2}(త^{2}-చ^{2})(చ^{2}+క^{2}ట^{2}) = ట^{2}త^{2}క^{4},$$

అనగా $త^{2} = క^{2}ట^{2} + చ^{2}$ కావలెను.

'నీ' యొక్క మూల్యములు రెండును సమానములైనచో, 'య' యొక్క రెండుమూల్యములును గూడ సమానములే కావలెనని (II) నుండి తేటపడుచున్నది.

'$\text{త}=\sqrt{\text{క}^2\text{ట}^2+\text{చ}^2}$' అయినప్పుడు దత్త సరళరేఖ యండవృత్తమును సంపాతీకరించు రెండుబిందువులు నొకదానితోనొకటి లీనమగును.

దీనంజేసి '$\text{య}=\text{టనీ}+\sqrt{\text{క}^2\text{ట}^2+\text{చ}^2}$...(IV) యను సమీకరణముచే ప్రకటితమగు రేఖ యండవృత్తముయొక్క స్పర్శరేఖ యగును.

(IV) నందు వర్గమూలచిహ్నమునకు బూర్వము స్వఋణచిహ్నములను రెంటినిగూడ నెలకొలుపవచ్చును. 'ట' యొక్క ప్రతిమూల్యములకును నా యండవృత్తమునకు రెండేసిస్పర్శరేఖ లుండును. అనగా ప్రతిదత్తరేఖకును సమానాంతరముగా నుండు స్పర్శరేఖలు రెండుండును. ఈ రెండుస్పర్శరేఖలును నాయండవృత్తము యొక్క కేంద్రమునుండి సమానదూరమున నుండును.

5. త్రికోణమితి (Trigonometry)

* గ్రిగరీయశ్రేఢి:—'బ' యొక్క పరిమాణము $\frac{\pi}{4}$ కంటె న్యూనమును $\frac{\pi}{4}$ కంటె యధికమును గానిచో

$\text{బ}=\text{స్పబ}-\frac{1}{3}\text{స్ప}^3\text{బ}+\frac{1}{5}\text{స్ప}^5\text{బ}-\ldots$ అనంతము అగునని నిరూపించుట.

$1+\text{ఉస్పబ}=\text{కుబ}(\text{కోజ్యబ}+\text{ఉజ్యబ})$ యనిస్పష్టము.

$=\text{కుబ}.\ e^{\text{బఉ}}$

ఘాతాంక c (కుబ) + బఉ = ఘాతాంక (1 + ఉస్పబ)......అని తెలియుచున్నది.

$=\text{ఉస్పబ}-\frac{1}{2}\text{ఉ}^2\text{స్ప}^2\text{బ}+\frac{1}{3}\text{ఉ}^3\text{స్ప}^3\text{బ}\ldots\ldots$

$=\text{ఉస్పబ}+\frac{1}{2}\text{స్ప}^2\text{బ}-\frac{1}{3}\text{ఉబ}-\frac{1}{4}\text{స్ప}^4\text{బ}+\ldots\ldots$ అనంతము.

ఈ సమీకరణమునం దిరుపార్శ్వములందునుగల యూహ్యభాగములను సమీకరించినచో ....

$\text{బ}=\text{స్పబ}-\frac{1}{3}\text{స్ప}^3\text{బ}+\frac{1}{5}\text{స్ప}^5\text{బ}-\frac{1}{7}\text{స్ప}^7\text{బ}+\ldots$ అనంతము.

ఈశ్రేఢి, స్పర్శపరిమాణము 1 కంటె నెక్కువ కాని యన్నిన్యూనకోణములపట్ల నిక్కమగుచు, నియ్యది $-\frac{\pi}{4}$నకును $\frac{\pi}{4}$నకును, మధ్యనుండెడి యన్ని కోణములకును, వీని యవధు లగు $-\frac{\pi}{4}, \frac{\pi}{4}$ పరిమాణములుగల కోణములకును గూడ వర్తించును.

6. చలకలనము (Calculus)

లిబినిజీయ సిద్ధాంతము. 'నీ' యుతేములగు రెండు ఫలల (Functions) 'స' యనచలీయ గుణకలు మనకు దెలిసినచో నీ సిద్ధాంతముయొక్క సహాయమున నా రెండిటి గుణజముయొక్క చలీయగుణకను కనుగొనవచ్చును.

'$\text{శ}_0, \text{ష}_0$,'లు 'నీ' యొక్క ఫలలై, '$\text{య}_0=\text{శ}_0\text{ష}_0$' యైనచో, నప్పుడు "$\text{య}_{\text{స}}=\text{శ}_{\text{స}}\text{ష}_0+{}^{\text{స}}C_1\text{శ}_{\text{స}-1}\text{ష}_1+\ldots+{}^{\text{స}}C_{\text{ప}}\text{శ}_{\text{స}-\text{ప}}\text{ష}_{\text{ప}}+\ldots+\text{శ}_0\text{ష}_{\text{స}}$" యగును.

ఈ దిగువ ఫలితములను సులువుగా ప్రమాణీకరింపవచ్చును.

'$\text{య}_1=\text{శ}_1\text{ష}_0+\text{శ}_0\text{ష}_1$.'

'$\text{య}_2=\text{శ}_2\text{ష}_0+2\text{శ}_1\text{ష}_1+\text{శ}_0\text{ష}_2$.'

'$\text{య}_3=\text{శ}_3\text{ష}_0+3\text{శ}_2\text{ష}_1+3\text{శ}_1\text{ష}_2+\text{శ}_0\text{ష}_3$.'

ఇవి, 'స'=1,2,3, లైనపు డీసిద్ధాంతము వాస్తవమని ప్రకటించుచున్నవి. '$\text{య}_{\text{స}}$' కీసిద్ధాంతము వాస్తవమని యనుకొని యీ సమీకరణముయొక్క యిరుపార్శ్వములను 'నీ'కి సంబంధించి చలీకరించి యనుగమవిధి (Induction) యుపపత్తికి గడంగుదము. అనగా

'$\text{య}_{\text{స}}=\text{శ}_{\text{స}}\text{ష}_0+{}^{\text{స}}C_1\text{శ}_{\text{స}-1}\text{ష}_1+\ldots$

$+{}^{\text{స}}C_{\text{ప}}\text{శ}_{\text{స}-\text{ప}}\text{ష}_{\text{ప}}+\ldots+\text{శ}_0\text{ష}_{\text{స}}$'

'$\text{య}_{\text{స}+1}=(\text{శ}_{\text{స}+1}\text{ష}_0+\text{శ}_{\text{స}}\text{ష}_1)+{}^{\text{స}}C_1$

$(\text{శ}_{\text{స}}\text{ష}_1+\text{శ}_{\text{స}-1}\text{ష}_2)+\ldots+$

* ఇందు ఊహ్యగుణముగల రాసులకు బూర్వము 'ఉ' వర్ణ సుస్త్రగు 'ఉ' కొమ్మును ప్రయోగించి యాంగ్ల **(Imaginary)** చిహ్నముగు (*i*) తో సామ్యమును ప్రకటించి ప్రయోగించితిని.

$$^{\text{స}}C_{\text{ప}}(\text{శ}_{\text{స}-\text{ప}+1}\text{ష}_{\text{ప}} + \text{శ}_{\text{స}-\text{ప}}\text{ష}_{\text{ప}+1}) + \dots + (\text{శ}_1\text{ష}_{\text{స}} + \text{శ}_0\text{ష}_{\text{స}+1}).\text{'}$$

$$\text{'}\text{శ}_{\text{స}}\text{ష}_1 + {}^{\text{స}}C_1\text{శ}_{\text{స}}\text{ష}_1 = (\text{స}+1)\text{శ}_{\text{స}}\text{ష}_1 = {}^{\text{స}+1}C_1\text{శ}_{\text{స}}\text{ష}_1\text{'}$$

యగుచుండగా దీనిసాధారణపదము

$$\text{'}({}^{\text{స}}C_{\text{ప}-1} + {}^{\text{స}}C_{\text{ప}})\text{శ}_{\text{స}-\text{ప}+1}\text{ష}_{\text{ప}}\text{'}; \text{ అనగా } \text{'}{}^{\text{స}+1}C_{\text{ప}}\text{శ}_{\text{స}+1-\text{ప}}\text{ష}_{\text{ప}}\text{'} \text{ యగుచున్నది.}$$

$$\therefore \text{'}\text{య}_{\text{స}+1} = \text{శ}_{\text{స}+1}\text{ష}_0 + {}^{\text{స}+1}C_1\text{శ}_{\text{స}}\text{ష}_1 + \dots + {}^{\text{స}+1}C_{\text{ప}}\text{శ}_{\text{స}+1-\text{ప}}\text{ష}_{\text{ప}} + \dots + \text{శ}_0\text{ష}_{\text{ప}+1}\text{'}$$

ఇది దత్తసమీకరణమున 'స'ను 'స + 1' గామార్చుటచే మనకు లభింపవలసినఫలితమే. దీనంజేసి యీసిద్ధాంతము '$\text{య}_{\text{స}}$' పట్ల వర్తించినచో '$\text{య}_{\text{స}+1}$' పట్లకూడ వర్తింపవలెనని ధ్రువపడినది. ఇయ్యది 'య_1, య_2, య_3' లపట్ల వాస్తవముకావున 'య_4' పట్లకూడ వాస్తవముగా వర్తించును; మఱియు నిది 'య_4' పట్లవాస్తవము గావున 'య_5' పట్ల వాస్తవముగావర్తించును. ఇట్లే తక్కిన 'య_6, య_7, .. $\text{య}_{\text{ప}}$,... $\text{య}_{\text{స}-1}$' ల పట్లకూడ వాస్తవముగా వర్తించును. కావున నీసిద్ధాంత మెల్లయెడలను వాస్తవముగా వర్తించును.

7. గతివిద్య=(Dynamics)

ప్రక్షేపణీయముల (Projectiles) యధికతరసమరంగస్థాన పరిమాణము:-ప్రక్షేపణీయముయొక్క యాదిమవేగము "య" నొసగినచో, నేవిక్షేపణీయకోణ మధికతరరంగస్థానము నొసగునో నిర్ణయించుట.

రంగస్థాన పరిమాణము 'య^2. జ్య 2అ/గ *' 'అ= 45°' అయినచో 'జ్య 2 అ=1' యగును గనుక యీమాన యధికతరమగును; తక్కటివిషయములందు 'జ్య 2అ < 1. 'య' యాదిమవేగముతో సుసాధ్యమగు నధికతరరంగస్థానము '$\frac{\text{య}^2}{\text{గ}}$' యగను. ఇది 'య' వేగముతో నద్దాని నూర్ధ్వగతికి విక్షేపింప నది యెగసెడి '$\frac{\text{య}^2}{2\text{గ}}$' యెత్తునకు, రెట్టింపుపరిమాణ మగుచున్నది.

అధికతరసమరంగస్థాన ప్రాప్తికై ప్రక్షేపణీయమును '45°' కోణమున విక్షేపించినచో, నది పోయెడి యధికతరపుటెత్తు 'య^2 జ్య^2 45°/2గ' లేక '$\frac{\text{య}^2}{4\text{గ}}$' యగును. ఇది రంగస్థలపరిమాణమున $\frac{1}{4}$ వంతగును.

* ఈ సంకేతలందు 'గ' = గురుత్వాకర్షణ ప్రేరణము.

8. స్థితివిద్య (Statics)

సమతపవలయు నావశ్యకోచితనియమములు:—

ఆకాంక్ష I. ఏవేని యేకరైఖికములుగాని మూడు బిందువులలో నొక్కొకదాని నాధారముగా జేసికొనిన, యేకతలస్థములగు ప్రేరణసరణియొక్క భ్రమక లొక్కొకటే శూన్యమైనచో నాసరణి సమతగలది యగును.

ఈసరణి యొక్క ప్రేరణయుగ్మము కాజాలదు. అట్లైయైనచో నేదేని యొకబిందువు నాధారముగా జేసికొని నిర్ణయించిన యాసరణియొక్క భ్రమక యాప్రేరణయుగ్మభ్రమకకు సమానము కావలెను.

సాధ్యమైనచో దానినొక్క ప్రేరణముగా ప్రకటింపవచ్చునమడు. అప్పు డేవేని మూడు బిందువులలో నొక్కొకదాని నాధారముగా జేసికొని నిర్ణయించిన యాప్రేరణముయొక్క భ్రమక లొక్కొకటే ప్రత్యేకముగా శూన్యము కావలెను. కావున నీప్రేరణము యొక్క క్రియాఘాతరేఖ యొక్కొక బిందువుగుండా (అనగా నేకరైఖికములుగాని మూడుబిందువులగుండా) పోవలెను. ఇది యసంభవము.

ఆకాంక్ష II. ఏవేని రెండు దత్తవివిభదిశలలో నొక్కొకదానియం దాసరణియొక్క విశ్లిష్టాంశముల మొత్తము శూన్యమై, యేదేని యొకదత్తబిందువు నాధారముగ జేసికొని నిర్ణయించిన భ్రమకల బీజగణితీయ యోగముకూడ శూన్యమైనచో నాసరణి సమతగలది యగును.


ఈసరణి యొక్క ప్రేరణయుగ్మము కాజాలదు. అట్లైయైనచో దత్తబిందువు నాధారముగా జేసికొని నిర్ణ

యించిన యాప్రేరణముల భ్రమక యా ప్రేరణయుగ్మ భ్రమకకు సమానమగును.

సాధ్యమైనచో నాసరణి నొక్క ప్రేరణముగా బ్రకటింపవచ్చుననుడు. ప్రేరణప్రాఘాతరేఖ దత్తరేఖకు లంబమానముగా నుండనిచో నాదత్తరేఖమీదఁగల్గు నా ప్రేరణముయొక్క విశ్లిష్టాంశము శూన్యము కాజాలదు.

దీనంజేసి లబ్ధప్రేరణము (Resultant) యొక్క ప్రాఘాతరేఖ దత్తరేఖ లొకొక్కదానికి లంబమానమగుచున్నది. దత్తరేఖలు సమానాంతరములు గామింజేసి యియ్యది యసంభవము.

ప్రేరణసరణియొక్క సమతకు వలయు నియమముల బీజీయమానలు:— దత్తదిశలు రెండును నొకదాని కొకటి లంబమానముగా నున్నచో పై యాకాంక్షను మిక్కిలి యుపయుక్తమైన మానచే బ్రకటింపవచ్చును. 'హ' బిందువు నాధారముగాజేసికొని ప్రేరణముల భ్రమకలను కనుగొనవలెననియు, 'హష, హయ'లును దత్త



దిశలకుగీచిరనియు ననుకొనుము. అప్పుడు '∟షహయ' యొక సమకోణ మగును.

సరణియొక్క 'ష1, ష$_2$, ష3,......' ప్రేరణములయొక్క ప్రాఘాతబిందువులు 'క$_1$, క2, క3, ...' యనుడు. 'హయ' కడనుండి యీబిందువులు క్రమముగా 'ష$_1$,ష$_2$,ష$_3$, ...' దూరములందును, 'హష' కడనుండి క్రమముగా 'య1, య2, య3, . ' దూరములందును, నున్నవనుము. 'హష'కు సమానాంతరముగా నుండు నాప్రేరణముల విశ్లిష్టాంశములు 'य$_1$, य2, य$_3$, ...' అనియు, 'హయ'కు సమానాంతరముగా నుండునవి 'ष$_1$, ष$_2$, ष$_3$, ...' అనియు,ననుము.

'హ' నాధారపఱచుకొని 'ప$_1$' యొక్క భ్రమక

= 'హ' నాధారపఱచుకొని 'ष$_1$, य$_1$,'ల యొక్క భ్రమకలబీజగణితీయయోగము,

= 'ష$_1$य$_1$–య1ष$_1$';

'హ' నాధారపఱచికొని యీసరణియొక్క భ్రమకల బీజగణితీయ యోగము,

= (ష$_1$य$_1$–య$_1$ष$_1$) + (ష$_2$य$_2$ + య$_2$ ष$_2$) + ... + ...

म(చ) యన్నది 'చ' యాదర్శముగాగల రాసులయోగమును ప్రకటించునని భావించినచో, నీమానను म (షय–యष) చే మిక్కిలి సులభముగా బ్రకటింపవచ్చును.

ఇక 'హష'కు సమానాంతరముగానుండు నావిశ్లిష్టాంశముల బీజగణితీయ యోగము.

ष$_1$ + ष$_2$ + ष$_3$ + ... + ...=म (ष); మఱియు 'హయ'కు సమానాంతరముగానుండు విశ్లిష్టాంశములయోగము.

य$_1$ + य$_2$ + य$_3$ + ... + ... = म (य).

(ii) యాకాంక్షలోని సరణియొక్క సమతకు వలయు నావశ్యకోచిత నియమముల నీదిగువ సమీకరణములు ప్రకటించుచున్నవి.

म (షय– య ष) = 0 . . (I)

म (ष) = 0 . . (II)

म (य) = 0 . . (III).

9. జలస్థితివిద్య (Hydrostatics)

ప్లవమానపిండము (Floating Body) యొక్క సమతకు వలయు నియమములు:—ఏదేని యొక పిండము (పడవ) నీటిమీద సమత గలిగి తేలుచున్నపుడు దాని గరిమ నాభికడ వర్తించు బరువు, ప్లవనకేంద్రముగుండ వర్తించు పార్శ్వస్థ జలముయొక్క లబ్ధహారము, నను రెండు ప్రేరణములకు వశమగు చున్నది. ఈరెండే యద్దానికి సమత నాపాదించుచుండినచో నవి సమానములై భిన్నగుణములు గలవియునై యుండి, యేకరేఖాగణితములు కావలెను.

దీనంజేసి సమతకు వలయు నీదిగువ నియమములు చేకురుచున్నవి:—

(1) విచలిత ద్రవపదార్థముయొక్క బరువు ఘన పదార్థముయొక్క బరువునకు సమానము కావలెను.

(2) ఘనపదార్థముయొక్క గరిమనాభియు, విచలితద్రవముయొక్క గరిమనాభియు, నొకే లంబరేఖయందుండవలెను.

నీట మునిగియున్న పదార్థముయొక్క బరువు 'బ' యును, దానిచే విచలితమగు నీటియొక్క బరువు 'భ'యు నగును.

(I) 'బ=భ'యైనపుడు, 'బ–భ' పటిమగలత్రాటితో దానిని పైకిలాగియుంచనిచో, నది నీటిలో మునుగును.

(II) 'బ=భ'యైనపుడావస్తువు నీటిలో నేస్థానమునందుంచిన యచ్చటనే నిలిచియుండును.

(III) 'బ<భ' యైనపుడావస్తువు నీట తేలు పర్యంతము నీటి యుపరిభాగము పైకి లేచును. అప్పుడావస్తువు నీటిలో మునిగియున్నప్పటికంటె తక్కువనీటినే విచలింపజేయును. ఆవస్తువు 'భ–బ' పటిమగల త్రాటితో క్రిందికి లాగియుంచనిచో నయ్యది నీటిపైన దేలుచునే యుండును.

10. ఖగోళశాస్త్రము

చాంద్రమాసమునకును నక్షత్రమాసమునకును గల సంబంధము:— ఏదేని యొక గ్రహముయొక్కయు, సూర్యునియొక్కయు రేఖాంశముల వ్యత్యాసము 'ప్రతాన' మనబడును. ఆగ్రహము క్రాంతివృత్తముమీదనే సంచరించుచుండినచో సూర్యునుండి దానికిగల కోణీయదూరమే ప్రతానమగును. ఏదేని యొకగ్రహమును సూర్యుడును నొకేరేఖాంశముమీద నున్నపుడవి సంగమమున నున్నవందురు. రెండువరుససంగమముల కాలావధిని ఆగ్రహముయొక్క 'గ్రహావధి' యందురు. చంద్రునియొక్క గ్రహావధిని 'చాంద్రమాస' మందురు.

నక్షత్రములకు సంబంధించిన యాయాగ్రహముల భ్రమణకాలమును 'నక్షత్రావధి' యందురు. చంద్రుని నక్షత్రావధిని 'నక్షత్రమాస'మందురు.

ఒక సంవత్సరమునందలి దినములసంఖ్య 'స' యనియు, నక్షత్రమాసమునందలి దినములసంఖ్య 'న'యనియు, చాంద్రమాసమునందలి దినములసంఖ్య 'చ' యనియు, ననుడు.

'న' దినములలో చంద్రునిరేఖాంశవృద్ధి '360°'

1 దినములో చంద్రునిరేఖాంశవృద్ధి '360°/న'

ఇట్లే 1 దినములో సూర్యునిరేఖాంశవృద్ధి '360°/స'

మఱియు చంద్రునిప్రతానవృద్ధి ...'360°/చ'

నిర్వచనమునుండి,

(చంద్రునిప్రతానము) = (చంద్రునిరేఖాంశము)–(సూర్యుని రేఖాంశము), వీని యనుదినవృద్ధిమానము (rate of increase) కూడ నీసంబంధమునే గల్గియుండును.

$$\therefore \text{‘}\frac{360}{చ}=\frac{360}{న}-\frac{360}{స}.\text{’}$$

$$\therefore \text{‘}\frac{1}{చ}=\frac{1}{న}-\frac{1}{స}\text{’ లేక ‘}\frac{1}{న}=\frac{1}{చ}+\frac{1}{స}\text{’}$$

అనగా

$$\text{‘}\frac{1}{\text{నక్షత్రమాసము}}=\frac{1}{\text{చాంద్రమాసము}}+\frac{1}{\text{సంవత్సరము}}\text{’}$$

అగును.



జీవితాదర్శము

సంగనామముల రామచంద్ర రావు గారు

(వెనుకటి సంచిక తరువాయి)

గీ. జనకుఁ డొక్కఁడు దివి కేగె జననిమాట, మాఱి ధరియించు టెప్పుడు నామతము గాదు.
నీతి యిది యని యిద్ది దుర్నీతి యనుచు, దవిలి కట్టఁగ నెవరు నాదారి కడ్డి?

క. లోకైక కంటకుండగు, నేకచ్ఛత్రాధినాధు నేల్బడి గతి న
వ్యాకులమానా మానస, మేకట్టును లేకపోవ నెంచె యథేచ్ఛన్.

సీ. ఆదరించితిని బూర్వాచారములఁ జొఁపి, యవిహితాబ్రాహ్మణాభ్యాసములను
అట్టాడ నేర్చితి నాందోళనంపడి, శీతలస్మితచంద్రాతపములఁ
గోఱచూపులఁ దొట్టఁ గోపగించితి నన్ను, సాఁకిన యాంధ్రభాషా సవిత్రి
నాశ్రయించితి భౌతికానందమిచ్చు పా, శ్చాత్యదుర్మోహ వేశ్యాలతాఁగి
విడఁచియుంటిని వర్ణవిభేదబుద్ధి, పురమువీథులఁ దిరుగు పోకిరులతోడఁ
బరువటంచును స్నేహవైభవముఁ గొంటి, బాహ్యవేషంపుఁబీవికై పాటువడితి.

సీ. పాత్రోచితీజ్ఞాన పరిణతి వెలితియై, నీరసకీర్తనానీకములను
నిలువెల్లఁ దగిలింపఁ గలఁచు గ్రంథంబులు, ఘటితానురూప దుర్ఘటచయంబు
అన్యోన్య సంబంధ మనరాని తెరచాలు, మేరమీఱిన వేషధారణంబు
సంగీతధిక్కృత సరసాభినయపుష్టి, యరయ విద్యార్థులయాగడంబు
పాడువాసన వెదచల్లు బందిఖాన, పలుకరా దట్టి నాటకాభాసములకు
జాలుమూల యొఱుంగకే చని ధనంబు, పాఱవైచితిఁ గద తృణప్రాయముగను.

మ. జనకాభ్యాసముఁ బాయవెట్టక మతాశన్ నాశ మొందించి ప్రొ
ద్దున గాల్యంబులఁ దీర్పకుండ నసువుల్ దూఁగాడుచున్నట్లు స
హ్యానికృష్టాగ్రజ శూద్రజారవనితా వ్యాపారమానల్ప భో
జనశాలాంతర వాటికేగి ధనవిస్తారంబు జల్లించితిన్.

మ. ఇది నేఁ జేసితిఁ జేయలే దిదియటం చే మాత్రముం బల్కఁ బో
లదు వేపోకల ద్రవ్యనాశనవిధా లక్ష్యం బనారోగ్యసం

పదపైఁబడ్డ దినంబులందు—నుభయ భ్రష్టుండనై యుండినం
బ్రదిలంగాలకయుండె మానసమదోద్వేగం బవక్రంబుగన్.

గీ. ఘోరకష్టంబులం దుద్దు గుడుచుచున్నఁ, జిఱునగవుతేట లోకవేళఁ జిందునట్లు
సాగుచుండెను నేనెంత యోగునైన, నతులదీక్షాంచితాంగ్లవిద్యాభివృద్ధి.

మ. చెడుగుంబోకలు వోయి వేవిధుల గాసింజెంది తేజోవిహీ
నుఁడనై యున్నను "నీతఁ డాంగలకళా నూనాభిలాషుండు తా
నెడలే కింక మహాధనార్జనుఁడు కాఁడే?" యంచుఁ బూఁబోఁడి నా
క్కేడ నీయంగ "శుభస్యశీఘ్ర" మని దోయిం బొందితిం గన్నియన్.

సీ. దూరస్థు లయ్యును దొలితొలి గుంటూరు, కార్యాంతరాపేక్ష కతనవచ్చి
విధివశంబున నాంగ్లవిద్యార్థి ననుఁగోర, మామగారి కటు సమ్మతి నొసంగి
వేయినూటపదా ఱభీప్సితశుల్కంబు, వైవాహికానేకవస్తుచయము
నాసహోదరికిని నవ్యపట్టాంశుక, రజతపాత్రలు నాదరణము సొబగు
గీ. హెచ్చరించితి నీదృశాభీష్టములకుఁ, దలఁచి కలఁగి విసిగి యొప్పుదలకు వచ్చెఁ
గొనకుఁ గన్యకాప్రాయ సంక్షుభ్యమాన, మానసంబునఁ బాప మామానవుండు.

ఉ. తిండికిలేకపోయినను దేఁకువఁదూలక తాతదత్తభూ
ఖండము విక్రయించి బహుకష్టములం బడి సర్వవైభవో
ద్దండ విలాసభాసుర విధానములన్ సవరించి యాతఁ డీ
పెండిలిసేసె నెంతయును వియ్యము నెయ్యము పిచ్చలింపఁగన్.

శా. ప్రాచీనంబగు భారతావని మునుల్ బ్రహ్మర్షు లుద్యద్యశః
ప్రాచుర్యాచ్ఛ సుధావలేపనము దిగ్భాగంబులన్ నింపఁగా
నీచత్వంబున కేవగింపక యిటుల్ నింద్యక్రియాబుద్ధి దీ
క్షాచాతుర్య మషీమలీమసములం గావించితిన్ దుర్మతిన్.

ఉ. ఇతటి పాపకార్యమున కేగతిఁ జిత్తముఁగూడఁబట్టి యొ
క్కింతయు నానలేక యవహేళన పాశములన్ విదిల్చి ధీ
మంతుని శ్వశ్రువుం గడునమాయికు లేని దరిద్రుఁ గట్నపుం
గొంతెమకోర్కిఁ గోరితినొకో యొడ లిప్పుడు కంపమెత్తెడున్.

సీ. రేయుంబవళ్లు శారీరకశ్రమ మోర్చి, కాలికి బలపంబుగట్టి తిరిగి
చటుల నాడీపరీక్షాజ్ఞాన హీనుఁడై, డాబుగా బాస మాటాడనేర్చి
దేశీయవైద్య విద్యాశాత్రవం బొంది, కేరడంబులు వల్కి యీరసమున
వ్యాధిఁ బెంచుచు డించి యనదల వేధించి, పాశ్చాత్యవైద్య విద్వద్వరుండు

గీ. నాదుపితరుండు దోఁచిన బీదవారి, ధనము ప్రోవుండె నింటిలోఁ దనివి సనక
శ్వశ్రు కష్టార్జితమున కాసను వహించి, పెండిలికతాన జోలె నిప్పించినాను.

గీ. వేయినూటపదార్లుకై బిడియపడక, సేకరించితిఁగాని యోచింపనైతిఁ
ఒరిణ యార్థోపయుక్త సర్వస్వనాశ, నావిల శ్వశ్రు కరణీయ జీవయాత్ర.

క. కలిమియొకింతయె యున్నను, గులకీర్తియు గౌరవంబు గోటు విలాసో
జ్జ్వల జీవిత మావహిలెన్, దొలుదొలుత నవెల్ల యిపుడు త్రుంగె జనమునన్.

ఉ. గౌరవముం గులీనతయు గాటపులేమికి ధారవోసి యా
చ్ఞారమణీయ దీనవచనంబులఁ బల్కుచు వాడవాడలం
దోరిమి బిచ్చమెత్తుచు యథోచితరీతి ననున్ దరిద్రతా
కారణభూతు నెంచి తొలికాలపు మామ కలంగె నెవ్వగన్.

మ. బాటబాట కన్నుదోయి దిగిపొల్లెడు బాష్పకణప్రసారమొ
క్కటఁ గొనగోటఁ జిమ్ముచు సగమ్మయి యాత్మశరీరయష్టి యూఁ
కటఁ గృశియించుచుండఁ దనకర్మముఁ దాను శపించుకొంచు వే
సటపడె నయ్యమాయికుఁడు శ్వశ్రువు సారెకు నుమ్మలించుచున్.

శా. "కూఁతుం గాంచిన పాతకంబువలనం గోల్పోయితిన్ భూమి నా
కేతాదృగ్గురవాపసంతతిని నింకేజన్మ వందీకుమా
నాతండ్రీ! పడలేను బాధలను నాంగ్లగ్రాహసమ్మోహజా
మాతం దెచ్చి యొసంగలేను ధనసామగ్రీపరీవారముల్"

గీ. అనుచు ననిశంబు దురవస్థలందు మునఁగు, బాష్పపర్యాకులేక్షణు శ్వశ్రుఁ గని
నామనంబు కలఁగక మ్రాన్పడెఁగరంబు, సంగృహీత శుల్కాసవా స్వాదనమున.

వ. అంతియకాక వెండియు,

శా. శంకాతంకము లేకయే పరుషవాచాయుక్త దుష్కార్యదో
షాంకుల్ జాల్ముల దుండగీండ్రఁగని రథ్యన్ దుర్విలాసంబుతో
లంకాకుం బొగచుట్టలం బెదవిమూలం జేర్చి పల్మాఱు ధూ
మాంకూరం బెగజిమ్ముచుం దిరుగు నభ్యాసంబుఁ జేపట్టితిన్.

వ. దినక్రమంబున — నాంగ్లవిద్యాభిలాషంబు సన్నగిల్లకుండుటయే కాక—పైపెచ్చు నే
నొక్కస్నేహితుని ప్రోత్సాహంబున వసుచరిత్రంబుఁ జదివి శృంగారరసోన్మాదంబునం
బడి పద్యరచనంబునకుఁగూడఁ బాటుపడితి. ఏదియెట్లున్నను ధూమపానాభిరతియొక్కిం
తయుఁ దగ్గకుండెఁ. ధనం బెంతయో వమ్మగుచుండె; మఱియును.

[సశేషము]



నాట్యరంగ ప్రయోజనము

ఆంధ్రుల నాట్యరంగము

(భారతి రెండవసంపుటము – యెనిమిదవసంచిక తరువాయి)

దీనినిఁగూర్చి యెంతయో చర్చించి యున్నాము. రసోచితరంగనిర్మాణవిధానమునుగూడ నొక్కింతగఁ బర్యాలోచించి యిఁక నీభాగము నింతటితో విరమింతము. కథోచిత ప్రకృత్యుద్బోధనమ్ముగ రంగమ్మును నెలయించుకొనుటకుఁ బలువు రవలంబించియుండిన మార్గములన్నియుఁ దెలిసికొనియున్నాము. ద్రవ్యార్జనము విజాత్యనుకరణముమాత్రమే యీ మార్గములవలనఁ బొడగట్టెను గాని రసోచిత సామరస్యము దృశ్యముకాలేదని గ్రహించినాము. పై సందర్భములనుబట్టి ప్రస్తుతము మన మవలంబింపఁ దగినట్టులు నాకుందోఁచెడు నంతలో రంగ నిర్మాణోపాయములఁ గొన్నిఁటి నుదాహరించెదను. నాటకాభిమానుల కియ్యవి యేమాత్రమేని యాచరణార్హములుగఁ దోఁచినచో నప్పటికదియే నా యీ ప్రకటనమ్మునకుఁ దగిన ప్రయోజనముగ భావించి యానందించెదను.

(1) నాట్యరంగమ్మును నెత్తిమొత్తిరంగులతోడనో, పార్శ్వవైచిత్ర్యములతోడనో, పాశ్చాత్య క్రీడాంగనలయసభ్యవిలాసములతోడనో నింపక, రంగమ్మునుజూచునప్పటి ప్రథమ సందర్శనముననే, యనగఁ దొలుతొల్త నమర్పఁబడెడు యవనికయందే రాష్ట్రరూపమ్మునో, నాట్యాధినేతయగు నటరాజపుంగవుని పవిత్రమూర్తి రాజమ్మునో, భరతాచార్యుని ప్రతిరూపమ్మునో, విద్యాధిదేవత యగు వాణీమతల్లినో, రసోపాసకుండగు సమర్థ చిత్రలేఖకునిచేఁ జిత్రింపించి ప్రేక్షకబృందమ్మునకు నాట్యకళాభిమానమునుగాని దైవభక్తివిశేషమ్మునుగాని పెంపొందించుట.

(2) మనము ప్రదర్శించు రంగప్రసాధనములన్నిఁటియందును గాలమానభేద ప్రవృత్తులను గణించుచు నధునాతన జాతీయరూపాంతరోన్నత్యముల నుపదేశించుచుఁ గథోచితప్రకృత్యంతరములకుఁదారంగమములై యొప్పెడు పట్టుల నుల్లేఖింపించుట.

(3) రాజవీథి, రాజనగరము, రాజాంతఃపురము, రాజాస్థానము, రాజమందిరము, మున్నగువాని నాయా రాజులనాఁటి చరిత్రాభివర్ణనముల నాదర్శముగాఁ గొనియో, యూహాప్రాపంచిక మర్యాదల ననుసరించియో, కాక యాధునికపాశ్చాత్య పార్శ్వత్యాద్యన్యానుకరణమ్ములుగ మాత్రము ప్రదర్శింపకుండుట.

(4) కృష్ణ, గోదావరి, కావేరి, తుంగభద్ర, గంగ, బ్రహ్మపుత్ర, సింధు మున్నగునదీనదమ్ములను బ్రదర్శింపవలసియున్నప్పుడు సాధ్యమగునంతవరకు యానదీనదభేదాభేద ప్రవృత్తులను బాటించుచుఁ గథాకాల పరిస్థితులకుఁ జెందని యిప్పటినద్యుపరి లోహాదిక నిర్మాణములు(వంతెనలు) పొగయోడలు తెప్పాపడవలతో మాత్రము నింపక యథోచిత ప్రాచీనసంప్రదాయాభిరూప ప్రతిపాదనమ్ములుగఁ జేసి చూపరల నలరించుట.

(5) అంగ వంగ కళింగ కాశ్మీరాది దేశమ్ములను జరిత్రసిద్ధమ్ములుగను యథోచిత రూపాంతరోద్గ్ ప్రతిపన్నములుగను సహజసౌందర్య సంభాసితమ్ములుగను, జాతీయ స్వస్వరూపాత్మకమ్ములుగనుగనఁబఱచుచు నాంధ్రులకు స్వదేశానురాగము నభివృద్ధి సేయుట.

(6) దేవ మానవ దానవ నాగలోకమ్ము లందలి సముచిత రూపభేదమ్ముల నాత్మీయచిత్ర నిర్మాణైకనైదుష్యమ్ము మెఱయఁ జిత్రకళోపాసనమ్మున గ్రాపారీణు లగువారు తెలుపించినచో నట్టివి లోకోపకృతి కేర్పఱచి నాట్యరంగమ్మున కనన్యయశమ్ము సంపాదించుట.

(7) నాట్యరాంగిక బాహ్యాలంకరణములుదక్క కడమ ప్రసాధనములన్నియుఁ నాయా నాటక సందర్భానుగుణ్యములుగ నెప్పటికప్పుడు విధిగా సిద్ధపఱపించుకొని ఆయా ప్రదర్శనోచిత ప్రసాధనముల నాయా సందర్భములయందే ప్రదర్శించు నియమముల నేర్పఱచుకొనుట.

(8) నాట్యరాంగిక పార్శ్వాలంకరణములం దంతట (Side wings) వీలున్నంతవఱకు వ్యాస వాల్మీకి కాళిదాస బుద్ధ శంకర త్యాగరాయాద్యవతార మహాపురుషావతంసులనో దాదాభాయి నౌరోజి, తిలక్, ఘోకేల్, మహాత్మగాంధీత్యాద్యఖిల భారత జాతీయ మహానాయకాగ్రేసరులనో చిత్రింపించి దేశీయులయందలి దైవిక నైతిక సాంఘిక భక్త్యనురాగముల నుద్దీపింపఁ జేయుట.

(9) నాట్యరంగాంతరమునందలి యేదో యొక ప్రదేశమున నాట్యాధిదేవతస్థానముగనో, విద్యాధిదేవతానిలయముగనో, యొకింత స్థానమును బ్రత్యేకింపించి సామాజికులకు నాట్యకళాధిదేవతా ప్రసన్నమున విద్యావినోదమును రసాస్వాదనవైదుష్యమును బెంపొందించుట.

(10) ఇటులే మరియొకచో నాటకీయసారస్వత భాండారమునుగూడ జతపఱచి సాంఘికుల విజ్ఞానాభివృద్ధికి మార్గము లేర్పఱచుట.

(11) వేషధారణమున కుద్దేశింపఁబడిన భాగమునందంతట భారతీయపురాణప్రసిద్ధనాయికా నాయకులయొక్కయు, మునిజనములయొక్కయు, వివిధ దేశీయచారిత్రక మహాపురుషులయొక్కయు, ఛాయా పటములనుగాని చిత్రములనుగాని జతపఱచి యేతన్ములమున నటులకు పాత్రానుకరణాభిజ్ఞత ననుభవమునకుఁ దెచ్చుట.

(12) నాట్యకళాపరిశ్రమమునకత్యావశ్యకము లగు సాధనపరికరము లన్నియు నందుబాటునం దుండి నటు లొకపాటి సాధనాశ్రమమును గూడ రంగాంతరమునందే యొక్కెడఁ బ్రత్యేకముగ నెలకొల్పుట.

నే నీపైనిచ్చిన సలహాలన్నియుఁ జాలవఱకుఁ గథోచితరంగ ప్రదర్శనోత్సాహుల కుచితాచరణ భాజనములు గాకపోకనియే నమ్మెదను. ఇదిగాక ద్రవ్యార్జన పరులకేని తమ యాదర్శముల కియ్యవి ప్రతిబంధకములు గాక సహాయకారులే యగునని యూహించి నిర్వచించితిని. ఇయ్యవి రసోచితప్రదర్శనాభిమానులను సంతృప్తి పఱుపఁజాలవనియు నే నెఱుంగుదును. ఏలయన యథారూపానుకరణమునకు చిత్రలేఖకు లిప్పుడిప్పుడే నవీనపద్ధతులతో భావములతో పెక్కుచిత్రములను జిత్రించుచు నందందుఁ బ్రకాశించుచున్నారు. నవీనచిత్రలేఖనము బహుళతరవ్యాప్తినంది సర్వతోముఖప్రయోజనమునకు సమీపించెడు కాలము తటస్థించినఁగాని యేతన్మాత్రముగ నైన నాంధ్రుల నాట్యరంగము ప్రత్యేకాంధ్ర ప్రతిభాప్రకటనమునకు సమర్థమైన యథారూపానుకరణమునను గథోచిత కాలోచితముగ నైనను రూపింపఁ బడనేరదు. ప్రస్తుతమున కాంధ్రదేశమునం దెందేని యొకటి రెండు, మూఁడు, మహాపట్టణములయం దొకవేళ నిట్టి నాటకరంగము లుల్లేఖింపఁబడుట కవకాశమున్నను మఱి కొంతకాలమునకుఁగాని యాంధ్రదేశమునం దంతట సమగ్రస్వరూప ప్రతిపాదనములగు రంగరాజములు వెలయనేరవు. కావున "రసోపాసకుల కేమార్గమున నేని తరుణోపాయము కన్పట్టనేరదు" అను సమాధానమును గొందఱు చెప్పకమానరు. రసాస్వాదనపరులకు నిట్టి నాటకమహాశయులకును నా నేర్చినంతలో నొకపాటి జ్ఞప్తి నిందే చేసుకొనియెదను.

రసాస్వాదనపరులను వర్తకమర్యాదలతో వ్యవహరించునటులతోఁగాని సంఘాన్యత్వులతోఁగాని పోల్చుట కొంతమాత్రమును వలనుపడదు. వర్తక సంఘాన్యత్వుల యాదర్శము ద్రవ్యార్జనము గాక మఱియొండు గాదని పలుతెఱఁగుల నీవఱకే వివరించి యున్నాఁడను. వారు చేయు ప్రదర్శనములు సామాజికనిష్ఠములై సర్వథా జనాకర్షణము నందుచుండుననుటకు సందియము లేదు. రసాస్వాదనపరులు కేవలము రసము కావ్యనిష్ఠమను తలంపున నిరంతరము నాట్యకళ నుపాసించుచుందురు. వీరియందు కావ్యనాటక మీమాంస, రసవిచారము, కళాపరిశ్రమము, ఉచితాభినయాభ్యసనము, నిరాడంబర జీవనము, ప్రకృత్యారాధనము మున్నగునవి తాండవించుచుండును. వీరలకు నాట్యమును వృత్తిగాఁ బెట్టుకొనుట

యందుఁగాని కైతవకీర్తి ఉపార్జనమునందుఁగాని సామాన్య జనాభిప్రాయానుసరణమునందుఁగాని కోరిక యుండదు. ఇట్టిచో రసాత్మక నాటకప్రదర్శనోత్సాహులకు జన బాహుళ్యమునుండి సమగ్రాదరాతిశయ మెక్కడ పర్యాయమే తటాలున రానేరదు. రసేతర నాట్య సారస్వతముగాని, నాటకప్రయోగముగాని, నాట్యరంగాలంకరణమ్ములుగాని, రంగప్రసాధనమ్ములుగాని, చిల్లరమల్లర పార్శీపాట పసందులుగాని, హార్మోని తబలాల యఱపు మొఱపులుగాని, చెమికిదుస్తుల తళుకుబెళుకులుగాని, శబ్దాడంబర గద్యపద్యపటాటోపములుగాని, నవనాగరిక నిరర్థక రూపానుకరణమ్ములు గాని, తలత్రిప్పుడుల దీర్ఘరాగాలాపములుగాని, జిలేబిమట్టల జిలుగుసంగతులుగాని రసోపాసకుల హృదయమ్ముల నేమాత్రమును రంజింపఁజేయనేరవు. ముద్దురంగుల గద్దరిచిత్రములు, తలకుమించిన బొంబాయిచిత్రములు, అర్థము లేని యాడంబరచిత్రములు, భావమునందని బండచిత్రములుగలిగి తెరలతో మరలతోఁ, జిప్పలతోఁ, దొప్పలతో, నుమ్ములతోఁ దుమ్ములతోఁ, దప్పెట్లతోఁ దాళాలుతోఁ గూర్లబజారులవలెఁ, గల్లుదుకాణములవలెఁ, జిల్లరగుడి సెలవలెఁ, గాఫీక్లబ్బులవలె గడియకొకరకముగా రాణించు నీ నాటకరంగములు రసాస్వాదనపరులకు నిజముగ నెంతటివిరోధమైనను బుట్టించి నాట్యప్రదర్శనమునకుఁ గాదుగదా, చివరకుఁ బ్రాలుమాలి పరికించుటకేని యర్హములుగఁ గానిపింపవు. రంగములే కాదు; వట్టిమొట్టికిలి నాటకములు, అల్లిబిల్లియల్లిక నాటకములు, అవకతవక యను కరణ నాటకములు, తప్పులతడికల చప్పిడి నాటకములు, దంపుడుసుద్దుల తెంపరి నాటకములు, ఆటవెలఁదు. అల్లరి నాటకములు, అపరిపక్వానువర్తిత నాటకములు, పోకిరీ పోలుపుల యాకతాయి నాటకములు, రసాస్వాదనపరులకుఁ జదివించుటకుఁ గాదుకదా యుబుసుపోకను, కొట్టుటకేని యుత్సాహము నింపవు. నాటకములే కాదు, భాషాప్రవేశము లేక, లోకానుభవము లేక, యభినయాభ్యసనము లేక; యుక్తాయుక్తవివేచనము లేక గురుజనాదరము లేక యహమహమికాలాపప్రవృత్తులై, యత్యధిక కైతవకీర్తి ఉపార్జనాయత్తచిత్తులై, తమ్ముఁదా మెఱుంగక ప్రవర్తించు నీనాఁటి మహానటులతో రసాస్వాదనపరులకు సామరస్యము కాదు గదా సహవాసమైనను సంతృప్తి నింపనేరదు. నటులే కాదు, నాటక సాంప్రదాయము తెలియఁగక కథాసందర్భమునుగణింపక, పాత్రౌచిత్యమును బరికింపక, యభినయవైదుష్యము నర్థముచేసికొనక, రసభావముల ననుభవింపలేక, బాహ్యతాబాహ్యతలను బర్యాలోచింపక, కష్టసుఖములను నటగౌరవాగౌరవములను గ్రహింపక ప్రదర్శనములందంతట నోటికివచ్చినటులు ప్రసంగింపుచుఁ, జేతికివచ్చినటులు వ్రాయుచుఁ, బ్రేక్షకులమనియు విమర్శకుల మనియు విఱ్ఱవీగు విలాసపురుషులన్ననో, పండితమ్మన్యులన్ననో రసాస్వాదన పరులకు రాగముగాని ద్వేషముగాని కాదుగదా తలఁచుటకుఁగాని పలుకుటకుఁగాని బుద్ధిపోడము సేరదు.

రవీంద్రుని నాట్యరంగము

పవిత్రమైన నాట్యకళను బజారునడవడి తెలుఁగులకు దింపక క్రమశిక్షణము నిరంతరపరిశ్రమము నిరాడంబరజీవనములు కలిగి యనవరతానందము నించు నిజానేకఛాత్రప్రవరులంగూడి వంగదేశీయశాంతినికేతనము నుండి యఖిలభారత కవిసార్వభౌముండగు రవీంద్ర చంద్రుఁడు నేఁటికిని నిఖిలప్రపంచమునకు నిష్కళంకమైన, నిరుపమానమైన, నిరతిశయానందప్రదంబైన, రసాత్మకమైన భారతీయనాట్యకళా ప్రాశస్త్యనామకచంద్రికా రాజమ్ములను బరపుచు నీడులేక వెలుంగుచున్నాఁడు. నాట్యసారస్వతమును సైతము వెలయించుచున్నాఁడు. నాటకకళాభిమానులకు రసప్రపంచప్రసన్నతను కలిగించియనన్యపూజ్యత నందుచున్నాఁడు.

వంగదేశీయులు చక్కని లౌకికపరిజ్ఞానము, వివిధభాషావైదుష్యములనే కాక స్వీయజాత్యుద్ధరణప్రయోజనములందును నారితేరిన ప్రత్యేకప్రతిభావిశేషముల నంది జాతీయవిద్యాప్రచారమునందేమి భావ కవితావైదగ్ధ్యమునందేమి, నిఖిలరసాయన పరిశోధనయందేమి, సాంఘిక సంస్కరణాద్యనేక సాహసక్రియా పరత్వములందేమి, శాస్త్రమీమాంసాదిక బహుళతరవ్యాసంగములయందేమి, నాగరిక నాటకేతిహాస భాసుర నిర్మాణైకశేముషీవిశేషములందేమి, యధునాతన చిత్రశిల్పాభినయాంతరానేకకళామర్మోపదేశకప్రశస్తప్రజ్ఞా ధురంధరత్వములయందేమి, విశ్వభారతి విమర్శకోప దేశవిస్తృతత్వమునందేమి, యీడులేని పోడిమినిగల్గి నెగడు

చున్నారు. అఖిలభారతప్రపంచమునకును నాదర్శప్రాయము లగుచున్నారు. వంగజాతీయవాఙ్మయ మన్నిజాతులవారిచేతను బరివర్తింపబడి యిప్పట్టునఁ బూజింపఁబడుచున్నయది. సదానందసనాట్య యోగీశ్వరుఁడనం దగు రవీంద్రనాథునిచే హైందవనాట్యకళాస్వరూపముగూడ బహుభంగులఁ బ్రస్ఫుటమగుచున్నది. ఏతత్ప్రాశస్త్యము హృద్యానవద్యరసార్ణవతరంగ డోలికాలాళితంబై నిఖిల నాట్యప్రపంచమునకు వెలలేని యాభరణ మగుచున్నది. తెలుఁగుబాసయందలి తియ్యందనముగాని, తెలుఁగుపలుకుల తేటతెల్వులుగాని, వంగభాషయందు లేవు. కర్ణాటక గానవైఖరులందలి సహస్రాధికగమక గమనమ్ములు, స్వరప్రస్తార ప్రాచీన్యమ్ములు భావానుగత విన్యాసమ్ములు బంగాళీ గానమునఁ గానిపింపవు. తెలుఁగుదేశపువేషస్వరోచ్చరణ సారళ్యములుగాని, తెలుఁగుజాతుల సరస జాతీయ గేయాలాపములుగాని, బెంగాలీ పెద్దలయందుఁ జూడ సూపవు. వ్యాస వాల్మీకి కాళిదాస భవభూతులఁ బోలు కవిబ్రహ్మలుగాని, శంకర మధ్వ రామానుజ త్యాగరాయాది దేశికోత్తములుగాని వంగదేశమ్మున జన్మించి యుండలేదు. ఎట్లున్నను వంగదేశము అశేష భూవలయమ్మున నిజప్రతిభాజాలమ్ములఁ బ్రసరించుచు ననన్య కీర్తి నందుచున్నది. నాట్యకళోపాసనము నందును నాయకమణియై నాటకాభిమానులకు రసాత్మక నాటకప్రయోగ విధానము ననుగ్రహించుచున్నది. రవీంద్రుఁడే యిందును నిఖిలప్రపంచముచేతను నాకర్షింపఁబడుచున్నాఁడు.

ఆంధ్రదేశమైనను నిర్జీవమైయున్నదనుట కవకాశము లేదు. రాజకీయావకాశములనుబట్టి కొంచెముమందగమన మందిన నందియుండ వచ్చును. పూర్వాచారాభిమానమ్మున నొక్కింతకాలము తెల్లబోయినఁ బోవచ్చును. విదేశ సంచారము, సాంఘిక సంస్కరణోద్యమము, నవ్యభావ ప్రచారము లనినసాహసించివెంటనే ముందంజవేయలేకపోయినఁ బోవచ్చును. బంగాళా విభజనాందోళనానంతరమునుండియేని యాంధ్రదేశమ్మునందు సర్వతోముఖముగ వెలయసాగిన జాతీయభావవికాసము వంగదేశమును సహితము దద్దరిల్లఁజేసినదనవచ్చును. అనేక ప్రతిష్ఠాపనలు జరిగినవి. ఆంధ్రదేశీయ మహానాయకోపన్యాసములు ఘంటానినాదములవలె నిఖిల ప్రపంచమునందును బ్రతిధ్వను లీనినవి. గ్రంథాలయములు, పత్రికాప్రచారములు, చిత్రకళానిలయములు, జాతీయకళాశాలలు, నవ్య కవితాస్థానములు తండోపతండములుగ బయలుదేరినవి. రాజకీయ సాంఘిక నైతిక పారిశ్రామిక చారిత్రకాద్యఖిల వ్యాసంగములయందును నాంధ్రదేశము ప్రాచీనౌన్నత్యానుసార్యముగ, నవీననాగరికతాను రూపముగ నిజౌన్నత్యమును జాటుచున్నది.

నాట్యకళమాత్ర మదేమిపాపమో కాని యక్కడక్కడ నొంటిప్రాణముతోఁ దక్క సహజ సమగ్ర రసోత్పాదనమ్మున దిప్పత్తులఁ దనియించుటలేదు. రసాస్వాదనపరులగు నాంధ్రమహాశయుల ప్రయత్నలోపమిందులకుఁ బ్రబలకారణ మగుచున్నయది. వర్తక సంఘములు నానాఁటికిఁ బ్రబలుచున్నవి. విజాత్యను కరణమ్ములు ప్రవ్యార్జనోపాయములు వెల్లివిరియుచున్నవి. ఇవన్నియుఁగాక యాత్మానుభవసిద్ధమైన సాత్త్వికన్యభిచారప్రవర్తిత స్థాయీభావభవంబైన, రసప్రవాహ రూపమైన, నిర్వ్యాజానంద ప్రదమ్మైన పవిత్ర 'నాట్యకళ'కు సహితము పెక్కు నిరంకుశ విమర్శకుల చండశాసన ప్రతిబంధకములు తటస్థపడుచున్నవి. ఒకరు నటునకుఁ దాదాత్మ్యము వలయునన్న మఱియొకరు వలదనుచున్నారు. ఒకరు నాటకములు నీతిబోధకములుగా నుండఁదగు ననిన నొకరు రసాత్మకములు గాఁగూడుననుచున్నారు. ఒకరు పరివర్తిత గీర్వాణనాటకములే యోగ్యము లనిన వేఱొకరు చారిత్రకరూపకము లావశ్యకము లనుచున్నారు. ఒకరుపద్యము లుండఁ దగుననిన నింకొకరు తగదనుచున్నారు. ఒకరు షేక్స్పియరు నాటకములనిన నొకరు ద్విజేంద్రలాలుని ననుచున్నారు. ఒక రుపన్యసించుచున్నారు. ఒకరు గ్రంథములపై గ్రంథములను గుప్పుచున్నారు. ఒకరు కళోద్ధారకుల మనుచున్నారు. ఒకరు కళాసంస్కారుల మనుచున్నారు. ఇట్లెన్నియో వ్యాసంగములను దినమేదే నొకయూర నెవరో యొకరినుండి వినుచున్నాము.

"ఊరుమీద నూరుపడినను గరణముమీద గాకి వ్రాల" దనునట్లు నాటకీయ మీమాంసలు సర్వసాధారణముగ నేయపరిచితాభిధేయు లగు తటస్థపురుషుల నుండియే బయలువెడలుచున్నవి. నాటక సంఘాధ్యక్షులు

గాని, ప్రసిద్ధనటావతంసులుగాని యుండుఁ బ్రవేశము గలి గించుకొను నవకాశ మేర్పడకున్నయది. ఇదియొక విచిత్రమైన విషయముగామాత్రము చూచువారికి విగ్భ్రమ మొదవించుచున్నది. రసాత్మక మహానాటక రచయితలు, ప్రదర్శకులు, కళోపాసకులు మాత్ర మీయర్థములేనిసమావేశములకు వ్యాసంగములకును, జెవియొగ్గక తమ నిలయములనుండియే మందహాసముతో వినోదించుచున్నారు. ఇన్ని చేసినను ప్రేక్షకజనసముదాయమునందు రసాత్మక మహానాటక సారస్వతానురాగము, నాట్యకళాస్వరూప విజ్ఞానము వేళ్ళూనించువనుక 'నాట్యకళ' నిజకాంతితో వెలుగ నేరదని తేలుచున్నది.

వంగజాతీయ నాట్యాదర్శము సహితము బందరు పూరిజనుల నాకర్షించియుండకపోలేదు. వంగ జాతీయ ప్రబోధము, వంగదేశీయ నవీనవాఙ్మయ విలాసము, వంగ నాయక దేశసేవాపరత్వము, వంగీయ చిత్రకళా ప్రావీణ్యము, వంగదేశ రాజకీయ పత్రికా ద్యనేకనిస్తుల ప్రచారకప్రక్రమము, బందరులోని సుప్రసిద్ధ కృష్ణాపత్రిక రాజమ్మ నాదినుండియు బ్రతిబింబింపఁ బడు చుండెను. నవీనభావములలో, సంఘసంస్కరణాదిక ప్రక్రియలలో, గవితలలోఁ,గళలలో, ధైర్యములో సాహసములో నైతికముగ భౌతికముగ బిన్నలును, పెద్దలును, దేశసేవాపరతంత్రులుగను, ఋజుమార్గానుగాములుగను జేయఁజాలుచుండెను. నాటకకళను గూర్చియు గృష్ణా పత్రిక యనేకసందర్భములలో ననేక మహోపదేశముల నొసంగి యనేకులను రసజ్ఞులను జేయఁజాలి యుండెను. ప్రస్తుత నాట్యనామకాడంబర ప్రయోజనా ప్రయోజనములఁ దీర్చి దిద్దినట్టులు విన్పించియుండెను. **1919** సం. జనవరి 6 వ తేదీని బందరులోని నటరాజసభా ప్రారంభోత్సవ సందర్భమున శ్రీయుత ముట్నూరు కృష్ణరావు పంతులుగారు 'నాట్యకళ'నుగూర్చి యొసంగియుండిన యమూల్యోపన్యాసమిందులకుఁ బ్రబలప్రమాణము కాఁగలదు.

ఆ దినములలో నాట్యకళయం దంతటి యభిమానమున్నట్టులు తోఁపదు. శ్రీమాన్ బి.టి. నరసింహాచార్యులు బి. ఏ. ప్రభృతు లొకకొందఱు యథాశక్తి ప్రయత్నించుచు 'నటరాజ' సభయను పేరునఁ గొన్ని ప్రదర్శనము లిచ్చియుండిరి. కాని ఫలము లేకపోయెను.

దైవానుగ్రహమ్మునఁ బ్రస్తుత మనేకచోటులను నాట్యకళా మీమాంసలు నలుమొగంబుల వెడలుచున్నవి. ప్రజాసామాన్యమునకును నిజకళాస్వరూపము ప్రమోద మిచ్చుచున్నయది. పలువురు విద్యాధికు లక్కడక్కడ రంగస్థలము నలంకరించుచుఁ బాత్రస్వరూపాభినయ వ్యాఖ్యానములతోఁ బ్రేక్షకుల కమందానంద మొసఁగుచున్నారు. ఇట్టితరుణమున నాట్యకళోపాసనమునఁ బ్రాజ్ఞసముదాయమున కానందము నించు పూజ్యులకును నాకుఁ దోఁచినంతలోఁ గొన్ని సందర్భములు మనవి చేసికొనెదను.

(1) నాట్యకళ నొకవిద్యగా నభ్యసించి యుపాసింపఁదలఁచెడు నొకరుగాని పెక్కుఱుగాని వీలున్నంతలో నొక ప్రత్యేకావాసమును సంపాదించుట.

(2) సాంఘికపవిత్రాదర్శము నామోదించు పెద్దలను రసజ్ఞులను సభ్యులుగాఁ జేర్చికొనుట.

(3) నాట్యతత్త్వోపదేశకుండగు నొకదేశికుని భక్తిమెయి సేవించుచు దినక్రమమ్మున నాట్యవిజ్ఞానోపార్జనమునకై పరిశ్రమ మొనర్చుట.

(4) ప్రసిద్ధకవికృతరసాత్మకనాటకములను గ్రమశిక్షణమున సిద్ధపఱచి ప్రాజ్ఞజనసమక్షమున స్వీయాశ్రమముననె ప్రదర్శించుట.

(5) పవిత్రమగు నాట్యరంగమున బార్సీ యవనికాదులకుఁ దావీయక స్వచ్ఛములగునొకటి రెండుధవళాంబరములతోడనో, రసోచితైక వర్ణాత్మక విస్తృతాంబరములతోడనో, యథాశక్తి నిరాడంబరముగ రంగము నలంకరించి వీలున్నంతలో జాతీయస్వరూప మొదవించి ప్రేక్షకుల నాకర్షించుట.

(6) అభినయ మవస్థావబోధకముగను, సంగీతము భావప్రబోధకముగను నుపయోగించు నైపుణ్యములవరచుకొనుట.

(7) సంగీతము, వేషధారణ విధానము, భరతశాస్త్రము, అలంకారశాస్త్రము మున్నగునవియు యథావిధిగ నభ్యసించుట.

(8) అప్పుడప్పుడు కళానిధుల నాహ్వానించి వారి యమూల్యోపదేశముల నందుచుండుట.

(9) జాతీయములును, శాస్త్రోపదిష్టమ్ములునునగు వీణియ, చితార్, తంబుర, ఫిడేలు, సారంగ్, మృదంగా

ద్యుపాంగములకు మాత్రమే సాధనాశ్రమాంత రమ్మునం దలంకరించి యుపయోగించుట.

(10) నిరాడంబరజీవనము, దైవభక్తి, గురుభక్తి, శాస్త్రావలోకనములను గలిగి నాట్యకళ నుపాసించుచు నైహికాముష్మిక ఫలమ్ము లందనేర్చుట.

(11) ఆత్మీయకళాపరిశ్రమము, అనుభవము మున్నగు నన్ని విషయములను గూర్చియు సమగ్రముగఁ దెలుపు గ్రంథములనో, పత్రికలనో, లోకోపకృతిని గోరి వీలువెంబడిని బ్రచురించుట.

(12) దేశికోపదిష్టమ్ముగ నవకాశ మొదవినపు డంత ప్రశస్తరసాత్మక నాటకప్రయోగమ్మునఁ గలుగు నిర్వ్యాజానందమును బ్రజాబాహుళ్యమున కుచితముగ ననుభవమునకుఁ దెచ్చుట.

(13) కళాభిమానులను నుదార హృదయుల సహాయసంపదలఁ బెంపొందు నిట్టి నిరాడంబర నాట్యాశ్రమములను దేశమంతట నెలకొల్పు ప్రయత్నము లొనర్చుచు నేతన్మూలమున నాట్యసారస్వత సంపోషణమును చిత్రకళావ్యాపనమును నొనర్చుట.

(14) ప్రస్తుతాడంబర నిరర్థక నాటక సందర్శన వ్యామోహమునఁ గలుగు నిద్రాభంగము ధనవ్యయములు నటులు ప్రదర్శనము లుదయముననో, సాయంతనముననో యొకటిరెండుగంటలకాలములో ముగియునటుల చేర్పఱచుట

చిత్తూరు బలి

చిల్లరిగె శ్రీనివాసరావు గారు

చిత్తూరుపురి చుట్టి శత్రుల్ మూగి
ముట్టడి సలుపంగ మోహరింపంగ
నాశలు విఫలమై యరిగె నావలకు
లక్ష్మణసింహుండు లక్షించె దిశల
కుప్పలు తెప్పలై కూలెడు భటుల
లక్ష్మి దొరగునట్లు లక్షణంబాయె
రాజదండము తుర్కరాజు వశమాౌనె?
అరిసేన కోటకు దరి సేరవచ్చె
నరె యారె యెంతటి యన్యాయ మహహ!
జననాథు డారాత్రి కనుమూయ లేదు
ఝామములు రెండాయె చప్పుడుల్ మాసె
కోటనేలెడు దేవి భేటిచ్చి నిలిచె
నేమి కోరికయంచు నెఱిగె నారాజు
దేవి భవానమ్మ తెలియంగఁ జెప్పె
గళమెత్తి ఈరీతి గంభీరముగను
ఆకలి కేనోర్వ కడలుచున్నాన
భక్ష్యేదు లెన్నెన్నొ భద్రమైయుండె
బంగారుపీఠముల్ పదమూడు గలవు
భారతవీరులు పట్టభద్రులును
పండ్రెండుగురు వచ్చి పంక్తిగూర్చుండ
కే నెల్ల భుజియింప నీవేళ విందు
వారల నిచ్చిన వరమిత్తు నీకు
రాజదండము నీదు రాజవంశమున
స్థిరముగా నిల్వంగ చిరకీర్తి కాము!
అందు కాతఁడు పొంగె నానందమునను
తనయు లందఱ బిల్చె ధరణీవిభుండు
వినిపించె కథనెల్ల విశదంబుగాను
'నేముందు నేముందు సామీప్యముగను
కూర్చుందు'నని వారు పోరాడి రపుడు
పంతంబులను సద్ది పదకొండ్రుసుతుల
పట్టభద్రుల జేసి పంపి యావెనుక
పయనమై తానేగె పండ్రెండువరుస
చివర నిల్చినవాడు చిరకాల మేలె
వారికిచ్చెద నిష్ఠ నీరాజనములు.

సాభిప్రాయ విశేషములు

సామ్రాజ్యశాసనసభ

భారతరాజ్యాంగ స్వరూప స్వభావములు భారతీయుల నిస్సహాయస్థితిని సహా ప్రముఖములను దెలుపుచున్న విధమును సిమ్లాసమావేశము విశదము చేయుచున్నది. రాష్ట్రీయశాసనసభలయందును, సామ్రాజ్య శాసనసభయందును ప్రజాప్రతినిధులు చేసిన తీర్మానములను నిరంకుశప్రభుత్వము నిర్లక్ష్యము చేయుచున్నవిధమును సిమ్లావ్యవహారములు విశదముచేసినవి. పెద్దలసభ నిరంకుశప్రభుత్వమున కొసంగుచున్న పోషణము రాజ్యాంగముల దుర్విపాకమును విశదము చేయుచున్నది. భారత రాజ్యాంగవిధాన మాపాదమస్తకము నిరంకుశాధికారాయత్తమై యున్న విధమును నిత్యానుభవము విశదము చేయుచున్నపుడు నిరంకుశాధికారుల బాసలందు విశ్వాసమెట్లు గలుగగలదో దురూహ్యముగనున్నది. తియ్యనిమాటలను జెప్పుటయందు నిరంకుశవర్గమున కసామాన్యమైన ప్రజ్ఞగలదు. కానిమాటలతో గాలయాపనము జేయగలకాలము గతించినది. కార్యరూపమునను విశ్వాసమును గలుగజేయవలసినసమయ మాసన్నమైనది.

మడ్డిమన్ కమిటి నివేదిక విషయమై సామ్రాజ్యశాసనసభయందు జరిగిన చర్చలు ప్రజాప్రతినిధుల దౌర్బల్యమును అధికారుల నిర్లక్ష్యభావమును సువ్యక్తము చేయుచున్నవి. స్వదేశమంత్రి మడ్డిమన్‌గారు అధికసంఖ్యాకుల యభిప్రాయముల సారాంశమును సామ్రాజ్యశాసనసభ శిరసావహించుట వివేకమని చేసినహితోపదేశము చక్కగ నున్నను సభ్యులను సంభ్రమింపజేయజాలకపోయినది. రీడింగుప్రభువు ధీశాలియైనను వారిబుద్ధి నిరంకుశప్రభుత్వ సంరక్షణమున కుపయోగపడుచున్న విధమునను భారతీయరాజ్యాంగవికాసమునకు వినియోగపడుటలేదు. బర్కెన్‌హెడ్ రీడింగు ప్రభువుల సంప్రతింపులు, వారిధిక్కారములు, ప్రగల్భములు తెలిసియున్న సభ్యులను మడ్డిమెన్‌గారి సాంత్వనవాక్యములు సంభ్రమింపజేయజాలవు. భారతీయులకు నిరంకుశాధికారుల మాటలయందు విశ్వాసము పోయినది. నిరంకుశాధికారవర్గము వారివారియధికార వివేకబలములను స్వార్థసంరక్షణమునకువినియోగించుచున్నట్లు భరతవర్షాభ్యుదయమునకు వినియోగించుట లేదని ఆబాలగోపాలమునకు తెలిసినవిషయము. సామ్రాజ్యశాసనసభయందలి అన్నిపక్షములవారును కలిసి చేసిన తీర్మానము భారతీయుల సంకల్పమును విశదము చేయుచున్నది. మడ్డిమన్‌గారి తీర్మానమును ప్రతిఘటించుచు పండిత

మోతీలాలు నెహ్రూగారు ప్రతిపాదించిన తీర్మానము భారతీయుల నిశ్చితాభిప్రాయమును విశదముచేయుచున్నది. సామ్రాజ్యశాసనసభ యంగీకరించిన తీర్మానము మితవాదుల, స్వతంత్రవాదుల, స్వరాజ్యవాదులయామోదమును గలిగియున్నను ప్రభుత్వావలంబకులు ప్రభుత్వాభిమానులు ప్రతిఘటించి ప్రభుత్వహృదయమును విశదముచేసిరి

తీ ర్మా న ము

గత **1924** సం. ఫిబ్రవరినెల **18**-వ తేదిని యీ సభవారు భారతాశయములను గూర్చి గావించిన తీర్మానమందు గాఢవిశ్వాసము ప్రకటించుచు, దానినే పునర్వచించుచు రాజప్రతినిధిని పార్లమెంటులో భారతపాలనక్రమమం దీక్రింది సూచనలు ప్రధానములు నత్యవసరములు కాన వెంటనే సామ్రాజ్యప్రభుత్వ నిర్వాహకవర్గమీదిగున నిర్వచించినట్లు మార్చుచు, ప్రకటించుటకు దెలుపగోరుచున్నారు.

కేంద్రప్రభుత్వమందలి మార్పులు

(అ) **1858**-వ సం. భారతపాలన శాసనము ననుసరించిగాని, ప్రస్తుతశాసనము ననుసరించిగాని మరేవిధముగ శాసనానుసారముగా గాని చక్రవర్తి పేరున భారతమంత్రి యధీనమందుండిన యావదాస్తి, యిక ముందు రాజప్రతినిధి యధీనమందుండి, భారత ప్రభుత్వమునకే వినియోగించుచుండును.

(ఆ) రాజప్రతినిధి శాసనసభలకు బాధ్యుడుగా నుండి పైన వివరింపబడిన భారతదేశపు టాస్తినుండి ఖర్చుపెట్టుటకు రాబడిని వసూలుచేయుటకు, విరాళముల నిచ్చుట మొదలగు నవసరముల గడుపవచ్చును. కాని యీక్రింది వివరింపబడిన విషయములందు మాత్రము నిర్ణయకాల మొకటి దాటువఱకు భారతమంత్రికి ఖర్చుచేయుట కధికారముండును. (1) కొంతహద్దు దాటకుండ సైనికవ్యయమును జేయుట, (**2**) విదేశ, రాజకీయ సంస్థలకగువ్యయము (3) ఇంతవఱకు న్యాయముగ భారతమంత్రిచే చేయబడినయప్పులు, తదితరవిధముగ తీర్చవలసిన ఋణములను దీర్చుట కగువ్యయము.

(ఇ) భారతమంత్రి పదవి, తత్సంస్థను దీసివేసి, వలసరాష్ట్రముల కార్యదర్శిపదవిలో గలపి వేయవలెను.

'ఆ' లో సర్ణయించిన ప్రత్యేకాధికారములు మాత్ర మతనికుండును.

(ఈ) న్యాయమైనట్టియు తక్కువైనట్టియు నిర్ణీతకాలములో భారతసైన్యము భారతీయము కాబడవలయును. వెంటనే సైనిక సంస్థలన్నిటిలోను భారతీయులను జేర్చుకొనుట ప్రారంభింపబడవలయును. ఈవిషయమున రాజప్రతినిధియును, సైన్యాధిపతియు, నొక ప్రత్యేకమంత్రిచే సహాయము చేయబడుదురు.

(ఉ) కేంద్ర, రాష్ట్రశాసనసభ లన్నియుగూడ సంపూర్ణముగ ప్రతినిధి సభ్యులచేతనే నిండియుండవలయును. నియోజన పద్ధతులు వీలైనంత ధారాళ మొనర్పబడవలయును.

(ఊ) సైన్య, విదేశ, రాజకీయ విషయములందు దక్కయతర విషయము లన్నిటియందు శాసనసభకు బాధ్యులుగనే రాజప్రతినిధియు, కార్యనిర్వాహకవర్గము నుండవలయును. పైన వివరించిన మూడు విషయములు నొక నిర్ణీతకాలమువరకు రాజప్రతినిధి యధికారమందే యుండును. ఈ ప్రత్యేకాధికారము గలవాటిలోకూడ స్వసంరక్షణము అనుదానిక్రిందవచ్చు వ్యయమును సభవారి యామోదమున కుంచబడవలయును; కాని రాజప్రతినిధి యవసరమని తలంచునో నిర్ణయింపబడిన యొక మొత్తమును మించకుండ సభను ధిక్కరించి వ్యయపరచవచ్చును. యుద్ధసమయమం దవసరమని తోచినంతవర కా నిర్ణీత మొత్తము నతిక్రమించిగూడ వ్యయపరుపవచ్చును.

రాష్ట్రప్రభుత్వములందు మార్పులు

(ఎ) రాష్ట్రములందు ప్రస్తుతమున్న ద్వంద్వప్రభుత్వము సంపూర్ణముగ నెత్తివేయబడవలెను. దానిస్థానమున సంపూర్ణ స్వపరిపాలనా విధాన మేర్పడవలయును. కాని రాష్ట్రాంతర విషయములందు, అఖిలభారత సమస్యలందు కేంద్ర ప్రభుత్వాధీనములై యుండవలయును.

(ఏ) 'ఆ, ఊ' లలో నకార్ణింపబడిన నిర్ణీత కాలము దాటినతోడనే, పైన వివరింపబడిన ప్రత్యేక సంస్థల ననుసరించి, భారతపరిపాలన పద్ధతులం దవసరమని తోచిన మార్పులను జేసుకొనుటకు శాసనసభలకు సంపూర్ణాధికారముండును.

ఇంకను (1) నిఖిల భారత ప్రతినిధులు, అల్పసంఖ్యాకులగు యూరపియనులు ఆంగ్లో హైందవులు మొదలగువారి ప్రతినిధులు ప్రత్యేకసంస్థలు, ప్రజాహిత సంఘముల ప్రతినిధులు కలిసిన సంపూర్ణ ప్రాతినిధ్యముతో గూడిన సభను, శాసనసభతో సంప్రతించి యేర్పాటు చేయుటకును, భారతదేశమునకు కావలసిన పాలనక్రమముపై సూచనల ననుసరించి వారు చేయుటకును, (2) అట్లువారు తయారుచేసిన ప్రణాళికను భారతశాసనసభ యామోదమున కుంచి దానిని పార్లమెంటులో నంగీకరించి శాసనముగా ప్రకటింపగోరుటకును యీసభవారు రాజప్రతినిధికి సూచించుచు, వెంటనే దానికి తగు ప్రయత్నములను సలుపగోరుచున్నారు.

నాలుగేండ్ల స్వరాజ్యాందోళనానంతరము ప్రజలదుఃఖానుభవానంతరము సామ్రాజ్యశాసనసభయందు ప్రజాప్రతినిధులు సామాన్యమైన తీర్మానమును ప్రతిపాదించుట స్వరాజ్యప్రియుల కాశాభంగమును గలుగజేయుట సహజము. స్వరాజ్యపక్ష మితరపక్షములతో సంప్రతించి ప్రస్తావమును ప్రతిపాదించినను రాజ్యాంగాధికారము నొసంగిన కాంగ్రెసుతో సంప్రతించి ప్రస్తావమును ప్రసాదించుట యుక్తమై యుండెడిది. స్వరాజ్యపక్షము మితవాదపక్షపు దృక్పథమునే స్వీకరించుట యసంగతముగ గనుపడుచున్నది. ఈ ప్రస్తావన బర్కెనుహెడ్డు రీడింగు ప్రభువులు కోరిన సహకారాభినయమునకును, రాజ్యాంగవిధానమునకును ప్రత్యభినయమై యుండినను కాంగ్రెసునిర్ణయానుసారమైన స్వరాజ్యాశయమును దెలిపియుండుట పరమధర్మము. భిన్నపక్షాభిప్రాయములను సమన్వయముచేసి సంయుక్తాభిప్రాయమును విశదము చేయుటయందు గల సాధకబాధకములను సామ్రాజ్యశాసనసభ యంగీకరించిన ప్రస్తావము విశదము చేసినది. సంయుక్తాభిప్రాయమును ప్రతిపాదించుట కన్నిపక్షములవారును భావచ్యుతినిజేయుట శాసనసభా వాతావరణప్రభావమై యున్నది. సర్వ సంపన్నమైన నిరంకుశాధికారవ్యామోహము మహామహులను సయితమధికారావలంబకులను జేయుచున్నది. ఉద్యోగములు, సంపదలు, పదవులు, ప్రాపకములు, గౌరవము, సన్మానము, సుఖానుభవము, అధికారలాభము శాసనసభలను సమ్మోహనమందిరములను జేయుచున్నవి. అన్నిపక్షముల వారును నేకగ్రీవముగను జేసిన ప్రస్తావమును సయితము ప్రభుత్వము ప్రతిఘటించి నిరంకుశహృదయమును విశదముచేసినది. పెద్దలసభ సామ్రాజ్యశాసనసభ చేసిన తీర్మానమును నిరాకరించి మడ్డిమనుగారు ప్రతిపాదించినతీర్మానము నామోదించి పెద్దలకు సహజమైన బుద్ధిమాంద్యమును విశదము చేసినది.

సామ్రాజ్యశాసనసభయందు మితవాదనాయకులు శివస్వామయ్యరు గారు స్వతంత్రపక్షనాయకులు జిన్నాగారును స్వరాజ్యపక్షనాయకులు మోతీలాలు నెహ్రూగారు నుద్రేకపూరితములైన సంభాషణలనుజేసి స్వరాజ్యాభిలాషను విశదముచేసిరి. నాయకుల సంభాషణలు బధిరశంఖారావములైనవి. సామ్రాజ్య

శాసనసభా సమావేశ మంతము నొందినది. సభ్యులు స్వగృహములను జేరిరి. సభ్యులు తలపెట్టిన రాజీనామాలు కారణము లెవ్వి యైనను వెనుకబడినవి. మిత్రభేద మెవరి దైనను ఫలము సమానముగ నున్నది. మాటలు కోటలు దాటవు. తీవ్రమైన సంభాషణలు నిరంకుశాధికారవర్గమును చలింప జేయజాలవు. నిరంకుశ రాజ్యాంగము యథాప్రకారము సాగుచున్నది. అధికారులును అధికారాభిమానులును ఆనందముగను సిమ్లా కొండలందు కాలమును గడుపుచున్నారు. రీడింగుప్రభువు సర్ నరసింహేశ్వర శర్మగారి విందుసందర్భమునను జేసిన ప్రసంగమును శర్మగారి ప్రత్యుత్తరమును అధికారహృదయమును విశదము చేయుచున్నవి. ప్రజాప్రతినిధులందు సిమ్లాకొండలందు గనుపడని కార్యశూరత్వము పాట్నా క్షేత్రము నందు గనుపడజాలదు.

* * * *

పాట్నా సమావేశము

గాంధిమహాత్ముడు పాట్నా పట్టణమునందు స్వరాజ్యపక్షమున కనుకూలమైన వాతావరణమును సిద్ధముచేసి స్వరాజ్యపక్షమునకు స్వాగతము నొసంగెను. దేశబంధు దాసుగారి నిర్యాణము, మహారాష్ట్రుల ప్రతిఘటనము, బర్కెను హెడు రీడింగుప్రభువుల ప్రసంగములు, సామ్రాజ్యశాసనసభా వ్యవహారములు, నూలుచందాకు ప్రతిఘటనము, దేశావృతమైనవిభేదములు, గాంధిమహాత్మునకు విద్యావంతుల లక్ష్యము రాజ్యాంగరంగమునందు లగ్నమైనవిధమును విశదము చేసినవి. విద్యావంతుల లక్ష్యము రాజ్యాంగాందోళనమునందు లగ్నమైనటులు నిర్మాణవిధానమునందు లగ్నము గాజాలదని మహాత్మున కనుభవమువలన విశదమైనది స్వరాజ్యపక్షమువారు కోరినటులు కాంగ్రెసుసభ్యత్వమునకు బెల్గాంచేసిన నిర్ణయములు తొలగింప బడినవి. సభ్యత్వమునకుసంవత్సరమునకు 2000 గజముల నూలుగాని నాలుగణాల చందాగాని సరిపోవునని నిర్ణయింపబడినది. ఈ మార్పువలనను నూలుచందాకు గల ప్రముఖత పోయినను భిన్నపక్షములవారికి సంయోగ మేర్పడునని నమ్ముట కవకాశములు గనుపింపవు. స్వరాజ్యపక్షమువారి పటాటోపమును పండిత మోతీలాలు నెహ్రుగారి ధిక్కారమును విభేదస్థితిని వెల్లడిచేయుచున్నవి. ఇతరు లెటులు ప్రవర్తించినను గాంధిమహాత్ముడు స్వధర్మనిర్వహణమునుజేసి స్వరాజ్యపక్షమును నితరపక్షములును గోరిన ప్రతిబంధకమును తొలగించి కృతార్థు డయ్యెను. గాంధిమహాత్ముడు స్వరాజ్యపక్షమును ప్రధాన రాజ్యాంగపక్షముగను నంగీకరించి కాంగ్రెసు ప్రతిభను సంరక్షించెను.

(పాట్నాలో జరిగిన తీర్మానములు)

(ఏ) చందాపద్ధతిని మార్చవలెనని కాంగ్రెసు సభ్యులలో మిక్కిలి హెచ్చుమంది కోరుటవలనను, ప్రస్తుతస్థితినిబట్టి కాంగ్రెసులో చేరుటకు హెచ్చుమందికి అవకాశము కలుగునటుల చేయవలెనని దేశీయులలో చాలమంది కోరుచుండుటవలనను, కాంగ్రెసు నిబంధనలలో ఏడవ నిబంధనను రద్దుచేసి యీదిగువ నిబంధనను చేర్చవలెనని యీసంఘమువారు తీర్మానించిరి.

7 వ నిబంధన (1) 4 వ నిబంధన ప్రకారము అర్హులు కాని వారును, సాలుకు నాలు గణాలుగాని స్వయముగా వడికిన తిన్నని నూలు 2000 గజములుగాని చెల్లించువారునగు స్త్రీలును పురుషులును గూడ ఒక రాష్ట్రీయ కాంగ్రెసు సంఘమునకు చేరిన ఏకాంగ్రెసు సంఘమునందైనను సభ్యులగుటకర్హులగుదురు. ఏకకాలమందు ఎవరును రెండు కాంగ్రెసు సంఘములలో సభ్యులుగా నుండ గూడదు.

(2) పైని ఉదహరింపబడిన. (1 వ ఉపనిబంధన) నూలు చందాను భారత తంతుకారక సంఘ కార్యదర్శికిగాని అతనిచే నియమింపబడినవారికి గాని పంపించవలెను. అటుల స్వయముగా వడికిన తిన్నని 2000 గజముల నూలును పంపినటుల భారత తంతుకారక సంఘ కార్యదర్శి పంపిన సర్టిఫికేటును చూపించిన స్త్రీలును పురుషులును గూడ కాంగ్రెసు సంఘములో సభ్యులుగా నుండుట కర్హులగుదురు. భా. తం. కా. సంఘము వారుగాని, అనుబంధ సంఘము వారుగాని యీచందానుగూర్చి వ్రాయించిన లెక్కలను, నూలును,రసీదులను భా. కాం. సంఘము వారుగాని, రా. కాం. సంఘమువారుగాని పరీక్షించుటకు హక్కుగలదు. అటుల పరీక్షించుటలో ఏసభ్యుల చందాను గూర్చియైన అక్రమము కనబడిన యెడల ఆసభ్యులనుగూర్చి యియ్యబడిన సర్టిఫికేటులు రద్దుచేయబడును. అటులు జరిగినపుడు భా. తం. కా. సంఘము వారుగాని, ఆసభ్యులుగాని భారత కాంగ్రెసు కార్య సంఘమునకు అపీలు చేయుటకు హక్కు గలిగియుందురు. కాంగ్రెసు సభ్యత కొరకు నూలువడుక గోరునట్టి స్త్రీలుగాని, పురుషులుగాని హామీయిచ్చినచో వారికి ప్రత్తి నియ్యవచ్చును.

(3) సభ్యుని చందా క్రింద నూలు యియ్యబడినపుడు జనవరి నెల 1 వ తేదీతో ప్రారంభమై డిశంబరు నెల 31 వ తేదీతో అంతమైన సంవత్సరమునకు చందా యియ్యబడినటుల జమకట్టవలెను. సంవత్సరము మధ్యలో చేరగోరువారు గూడ 2000 గజములును చెల్లించవలెను.

(4) ఒకటవ ఉపనిబంధనలో తెలుపబడినరీతిని చందాను చెల్లింపనివారును, కాంగ్రెసు సభలును, రాజకీయ సభలును జరిగినపుడు, కాంగ్రెసుపనిచేయుచున్నపుడును, ఖద్దరు ధరింపనివారును, ఏసంఘముయొక్కగాని, ఉపసంఘముయొక్కగాని, ఏ కాంగ్రెసు శాఖయొక్కగాని, ప్రతినిధులను ఎన్నుకొనుటకు ఓటు యిచ్చుటకుగాని, ప్రతినిధిగా ఎన్నుకొనబడుటకుగాని, అట్టి కాంగ్రెసుసంఘ ఉపసంఘసభల కార్యక్రమమున పాలుపుచ్చుకొనుటకుగాని అర్హులు కాజాలరు. కాంగ్రెసువారు ఎల్లప్పుడును గూడ ఖద్దరు ధరింపవలెననియే మేము కోరెదము. ఎటులైనను వారెన్నడును విదేశీబట్టలను మాత్రము కట్టగూడదు.

(5) ఇపుడు ఈ సంవత్సరాంతమునకు సభ్యులుగా నుండువారందరును క్రొత్తసంవత్సరమునకు చందా చెల్లింపకపోయినను జనవరి నెల 31 వ తేదీవరకును సభ్యులుగా నుండుట కర్హులగుదురు.

మినహాయింపుషరతు-ఎ. ఇపుడు రద్దుపరచబడిన 7 వ నిబంధన ప్రకారము యిదివరకే సభ్యులుగా నమోదుచేయబడినవారి విషయములో యితరవిషయములలో లోపమేమియును లేనియెడలను స్వయముగా వడికిగాని యితరులచే వడికించిగాని 1925 సెప్టెంబరు వరకును నూలుచందాను చెల్లించినయెడలను యీమార్పు ఏమియును పనిచేయదు. వారిటుపైని చందాను చెల్లించకపోయినను యీ సంవత్సరాంతమువరకును సభ్యులుగానే యుందురు. బి. "కాంగ్రెసువారు నిర్మాణ విధానమును మాత్రమే సాగింపవలెను. స్వరాజ్యపక్షమువారు కాంగ్రెసులో ముఖ్యభాగముగానుండి, శాసనసభలలో కాంగ్రెసు ప్రతినిధులుగా పనిజరుపవలెను. ఆపనినిగూర్చి స్వరాజ్యపక్షమువారే నిబంధనలను చేయవలెను. ఆ పక్షము ఆదాయ వ్యయములను గూర్చి గూడ స్వరాజ్యపక్షమువారే ఏర్పాటుచేయవలెను" అని ఒకపక్షమున గాంధిమహాత్మునకును రెండవపక్షమున స్వరాజ్యపక్ష ప్రతినిధులగు దేశబంధుదాసు,పండితమోతీలాలునెహ్రూగార్లకును జరిగిన ఒడంబడికను బెల్గాంలో జరిగిన 39 వ మహాసభలో కాంగ్రెసువారు స్థిరపరచిరి.

గాని ప్రస్తుత పరిస్థితులలో యీ నిర్బంధము పనికిరాదు యిటుపైని కాంగ్రెసు ప్రధానముగ రాజ

కీయ సంఘముగానే యుండవలెనని యిటీవల జరిగిన సంగతులవలన స్పష్టమైనది.

కావున దేశహితమున కవసరమైన రాజకీయముల నన్నిటిని కాంగ్రెసువారు వశపరుచుకొని నెరవేర్చవలెను. అందులకు ప్రత్యేకకార్యములకని నిర్ణయింపబడినట్టియు భారతరాష్ట్రీయ ఖద్దరు సంఘములకు సంబంధించినట్టియు ధనమును తప్ప తక్కిన కాంగ్రెసుధనము నంతయును కాంగ్రెసు సంఘముల నన్నిటినిగూడ కాంగ్రెసువారు ఉపయోగించు కొనవలెను.

కాంగ్రెసులో ముఖ్యభాగముగా నుండియు ధన పరిపాలనము మున్నగు స్వతంత్రాధికారమును స్వతంత్ర వ్యక్తిత్వమును కలిగియుండునట్టి భారత తంతుకారక సంఘమును గాంధిమహాత్ముడు ఏర్పాటు చేయదలచెను గాన ఖద్దరుసంఘముల ధన ఋణముల నన్నిటిని ఆసంఘమునకు వశపరుపవలెను.

స్వరాజ్యపక్షమువారేర్పరచిన సాంప్రదాయమునకును నియమములకును అనుగుణ్యముగా వారు ఏర్పరచెడు పద్ధతిని విధానమును కాంగ్రెసువారు పరిశీలించి కాలానుగుణ్యముగా చేయు సవరణల ననుసరించి భారత రాష్ట్రీయ శాసనసభలలో పని జరుగుచుండవలెను.

చీనా దేశస్థితి

చీనాలో విదేశీయుల అక్రమణమును తొలగించుటకు చీనావారు ప్రారంభించిన సంఘర్షణమున యీసంఘమువారు చీనావారిపట్ల సానుభూతిని తెలుపుచున్నారు. చీనావారు స్వాతంత్ర్యము కొరకు ప్రారంభించిన జాతీయోద్యమము నడంచుటకు యిండియా దొరతనము వారు చీనా దేశమునకు భారతీయ సేనలను పంపుట మిగుల అక్రమమని యీసభవారు గట్టిగా ఆక్షేపించుచున్నారు.”

* * * *

స్వరాజ్యపక్షము

కాంగ్రెసుపక్షమునను స్వరాజ్యపక్షము రాజ్యాంగాందోళన నిర్వహణమును జేయవలయునను భావము బెల్గాముననిర్ణయములకు సహజఫలమైనను ఇతర పక్షముల నాయకుల కసంగతముగనుండుట సహజము. శాసనసభా వ్యవహారములందు విశ్వాసములేనివారి పక్షమునను శాసనసభలయందు స్వరాజ్యపక్షము రాజ్యాంగాందోళనమును జేయుట యసంభవము. దేశమునందు కాంగ్రెసునకుగల ప్రతిభ స్వరాజ్యపక్షమునకులేదు. స్వరాజ్యసంస్థలును శాఖోపశాఖలుగ కాంగ్రెసు సంస్థలవలెను వ్యాపించియుండలేదు. అట్టి సందర్భములందు రాజ్యాంగాందోళనమును కాంగ్రెసుపక్షమునను స్వరాజ్యపక్షమునడుపుటకంటెను కాంగ్రెసు యాజమాన్యమునను నడుపుట యుక్తముగ నుండియుండును. ముఖ్యముగ నీనిర్ణయ మెన్నికలసందర్భములం దవసరమని గత కాలానుభవమువిశదముచేసినది. కాని కాంగ్రెసునందు గల రెండుపక్షములకును పరస్పర విశ్వాసము గలుగకుండుటయె ఈనిర్ణయమునకు ప్రతిబంధముగ నున్నది. కాన్పూరు కాంగ్రెసు సమావేశమునందు రెండుపక్షములకును అన్యోన్య విశ్వాసము గలిగి శ్రీమతి సరోజినిదేవిగారి యాధిపత్యము క్రిందను రెండుపక్షములవారును గలిసి రాజ్యాంగాందోళనమును జేయుటకు బూనుకొనుట శ్రేయస్కరము. సరోజిని దేవికి గల సంకల్పమును సఫలము చేయుటకు భగవంతుడనుగ్రహించుననినమ్ముచున్నాము.

* * * *

చరకాసంఘము

గాంధిమహాత్ముడుచిరకాలమునుండి సంకల్పించుచున్న వడుకువారల సంఘముపాట్నాయందు నామరూపములను దాల్చినది. ఆసం

ఘమునకుస్పిన్నర్సుఅసోసియేషను నామమును వదిలి చరకాసంఘముపేరును పెట్టుట యుక్తముగ నుండును. వడుకునూలు సంఘమునకు స్వరాజ్యపక్షము స్వస్తివాచకములు చెప్పినను నా పక్షమువలనను విశేషమైన పోషణము గలుగుననినమ్ముట కవకాశములుగనుపించవు. వర్తమాన నిద్రావస్థయందు చరకాసంఘమునకు ప్రజాపోషణమైనను విశేషము గలుగుట సంభవము గాదు. గాంధిమహాత్ముడు చరకాసంఘమునందు విశేషముగను సభ్యులు చేరవలయునని కోరుటలేదు. ఈసంఘనిర్మాణమునందు స్వరాజ్యపక్షమువారి యవిశ్వాసమును బోగొట్టుటయును బహిష్కారవాదుల దృష్టిని రాటమునందు లగ్నము చేయుటయును మహాత్ముని సంకల్పము. ఆసంకల్పముసఫలమగుటకు నిండువిశ్వాసముగలవారు కొందరీసంఘమునందు జేరిపనిచేసినను చాలును. చరకాసంఘము వృద్ధినొందుటకు శుభ లక్షణములు గలవు. కాంగ్రెసునకు గల ఖద్దరు ద్రవ్యము చరకాసంఘము వశమైనది. చరకాసంఘమునకు మహాత్ముడు కోటిరూప్యములు వసూలు చేయ సంకల్పించినాడు. మహాత్ముని లక్ష్యము రాగల సంవత్సరమునందీ సంఘమునందు నిలుపబడును. రాజ్యాంగవాసనావిరహితమైన యీ సంఘమునందన్ని పక్షములవారును జేరుట కవకాశములు గలవు. చరకాసంఘనియమములును సుబోధముగ నున్నవి. ప్రతినెల 1000 గజములు స్వీయముగను వడికిన నూలు నిచ్చెడివారు (ఏ) తరగతి సభ్యులుగను, సంవత్సరమునకు 2000 గజముల నూలు నిచ్చెడివారు (బి) తరగతి సభ్యులుగను బరిగణింపబడుదురు

(అఖిలభారత తంతుకారకసంఘ నియమావళి)

[ఆల్ ఇండియా స్పిన్నర్సు అసోసియేషను]

నూలు వడుకుటను ఖద్దరును వృద్ధినొందించుటకు ప్రత్యేకముగా ప్రవీణుల సంఘమును ఏర్పరుపదగిన కాలము ప్రాప్తించినది రాజకీయములు, రాజకీయ పరివర్తనములు, రాజకీయ సంఘములు, వానిశాఖలు, మున్నగు వానివలన వ్యాకులము కానట్టి శాశ్వతసంఘ మొకటియుండిననే కాని అట్టి అభివృద్ధి కలుగజాలదని యిపుడు స్పష్టమైనది గాన భారత కాంగ్రెసు సంఘమువారి అనుమతితో భారత తంతుకారకసంఘ మనబడు నీసంఘ మేర్పరుపబడెను. ఈసంఘము కాంగ్రెసులో ముఖ్యాంగమే యైనను స్వతంత్రమగు అధికారమును ఏర్పాటును కలిగియుండును.

ఈసంఘమున సభ్యులు, సహాయులు, పోషకులు, అను మూడు తరగతులవా రుందురు. కార్యనిర్వాహకసంఘమున నీదిగువ వివరింపబడిన 9 మందియును ఐదేండ్ల వరకును సభ్యులుగా నుందురు.

1. గాంధి మహాత్ముడు
2. మౌలానా షౌకతాలీగారు
3. శ్రీయుత రాజేంద్రప్రసాదుగారు
4. శ్రీయుత సతీశచంద్రదాసు గుప్తగారు
5. శ్రీయుత మగనలాలు కే. గాంధీగారు
6. సేటు యమునాలాలు బజాజుగారు
7. సాహేబు ఖురేషీగారు.
8. శ్రీయుత శంకరలాలు బాంకరుగారు
9. పండిత జవహరలాలు నెహ్రూగారు

వీరిలో నెహ్రూ, బాంకరుగార్లిద్దరును కార్యదర్శులు.

కార్యనిర్వాహక సంఘాధికారము

అఖిలభారత ఖద్దరు సంఘము చెంతను రాష్ట్రీయ ఖద్దరు సంఘముల చెంతను గల ధనమునంతను యీసంఘమువారు వశపరుచుకొనవలెను. ఇపుడున్న బాధ్యతల

నన్నిటిని తీర్చివేయుటకును యీఘనమును, యిటుపైని రాగల ధనమును పరిపాలించుటకును యీసంఘమునకు సంపూర్ణాధికారము కలదు.

ఋణములు పుచ్చుకొనుటకును, చందాలను వసూలుచేయుటకును, స్థిరాస్తిని కొనుటకును, తగిన హామీమీద బదులు యిచ్చుటకును, తంతుకరణమును ఖద్దరును వ్యాపింప జేయుటకుగాను తనఖాపెట్టుటకును తణఖా పట్టుటకును, ఖద్దరు సంఘముల సహాయార్థము బదుళ్లు, విరాళములు ముజరాలు మున్నగువాని నిచ్చుటకును, తంతునిర్మాణమును నేర్పెడు పాఠశాలలకు సహాయము చేయుటకును లేక అట్టి పాఠశాలల నేర్పరచుటకును, ఖద్దరు దుకాణములను పెట్టినవారికి సహాయము చేయుటకును, లేక ఖద్దరు దుకాణములను పెట్టించుటకును, ఖద్దరు ఉద్యోగుల శాఖ నేర్పరుచుటకును, కాంగ్రెసుకు ప్రతినిధిగా నుండు కాంగ్రెసు సభ్యులు చెల్లింపవలసిన నూలు చందాను వసూలుచేసి వారికి రసీదుల (సర్టిఫికెటులు) నిచ్చుటకును, సంకల్పసిద్ధికవసరమగు పనుల నన్నిటిని చేయుటకును, సంఘముయొక్కయు కార్యనిర్వాహక సంఘముయొక్కయు పని సరిగా జరుగుటకు కావలసిన నిబంధనలను చేయుటకును, వానిని సవరించుటకును, ఇప్పుడు చేయబడిన నియమములలో గూడ నికముందవసరములగు మార్పులను చేయుటకును గూడ కార్యనిర్వాహకసంఘమున కధికారము కలదు.

కార్యనిర్వాహక సంఘ సభ్యులలో నెవరైన చనిపోవుట, రాజీనామానిచ్చుట మున్నగు కారణములవలన ఖాళీలు కలిగినచో మిగతా కార్యనిర్వాహకసంఘసభ్యులే యితరుల నాస్థానములకు నియమింపవలెను.

కార్యనిర్వాహకసంఘమునకు మొత్తము 12 మందికి మించకుండ నితరులనుగూడ చేర్చుకొనవచ్చును. నలుగురు సభ్యులు హాజరైనగాని కార్యనిర్వాహకసంఘ సభను జరుపగూడదు.

వచ్చినవారిలో హెచ్చుమందివోట్లనుబట్టియే వ్యవహారములను పరిష్కరించు చుండవలెను.

ధనరూపమున గాని వస్తురూపమున గాని వచ్చెడు చందాలు, విరాళములు, రుసుములు, మున్నగు ఆదాయమున కంతకును వ్యయమున కంతకునుగూడ సరియైన లెక్కలను వ్రాయించవలెను. మూడు నెలల కొకసారి సమర్థులగు ఆడిటరులచే లెక్కలను పరీక్ష చేయించుచుండవలెను. దేశీయులలో ఎవరైన లెక్కలను చూడగోరినచో నిరభ్యంతరముగా చూపించవలెను.

భారత కార్యనిర్వాహక సంఘ కార్యాలయము సబర్మతీ సత్యాగ్రహాశ్రమమునం దుండవలెను. కాంగ్రెసు సభ్యులుగా నుండి నూలుచందాను చెల్లింపగోరువారు యీక్రింది వివరములతో నూలును భారతసంఘ కార్యాలయమునకే పంపవలెను.

భారత తంతుకారక సంఘ కార్యదర్శికి, సబర్మతి, అయ్యా,

నే నిందుతో నాకాంగ్రెసుచందాక్రింద నాచే వడుకబడిన...తూకముగల...గజములనూలును పంపితిని. నేను...కాంగ్రెసు సంఘమున [ఇచట సంఘము పేరు వ్రాయవలెను.] సభ్యుడను లేక సభ్యుడనుగా చేరగోరెదను. నావయసు...నావృత్తి...నావిలాసము.

చిత్తగించవలెను.

(సంతకము స్పష్టముగా నుండవలెను. స్త్రీయైనచో వివాహితయో కన్యయో కూడ వ్రాయవలెను.)

నూలు చందా చేరగానే కార్యదర్శి నూలు నాణ్యమును, తూకమును పరీక్షించి తృప్తిగా నున్నచో, యీదిగువ వివరింపబడిన రసీదును కాంగ్రెసుసభ్యుడు తెలిపిన కాంగ్రెసుసంఘమునకు పంపవలెను.

"............గారు భారత తంతుకారకసంఘమునకు .... రాష్ట్రీయ సంఘమునకు చేరిన .... కాంగ్రెసుసంఘమున సభ్యుడుగా నుండుటకు .... సంవత్సరమునకు చందాగా ...... గజముల నూలును పంపించెనని యిందుమూలముగా ధ్రువపరచడమైనది."

దీని నకలును నూలు పంపిన సభ్యునకుగూడ కార్యదర్శి సంతకముతో పంపవలెను.

కాంగ్రెసు సభ్యులు భారత తంతుకారకసంఘమునకు కాంగ్రెసు చందా క్రింద పంపిన నూలు వివరములను తెలిపెడు అర్జీను భారత తంతుకారక సంఘము వారు ప్రత్యేకముగా వ్రాయించవలెను.